ంధ్రసాహిత్య పరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౧. | ఆంగీరసనామసంవత్సరము చైత్రవైశాఖమాసములు. | సంచిక ౧.

విజ్ఞాపనము.

భగవదనుగ్రహమువలనను భాషాభిమానుల దయవలనను బండితుల సహాయమునను బరిషత్పత్రిక తనయిరువదియవసంవత్సరమును బూర్తిచేసినది. ఇరువదియొకటవ సంవత్సరము ప్రారంభమైనది. పరిషత్తు భాషావిషయమై చేయఁదలఁచుకొనిన కార్యములను శక్తివంచనలేక యొనర్చుచున్నది. పరిషదభిప్రాయముల నెఱిఁగినవారును దానికిఁ దగుసహాయము నొనర్చుచున్నందుకు, పరిషత్తెంతయుఁ గృతజ్ఞత చూపుచున్నది. అనేకులు భాషావిదులు, పండితులు, విద్యార్థులు పరిషత్పత్రికకు వ్యాసరూపమున విశేషసహాయముం గావించుచున్నా రని పరిషత్తు వారియెడలఁ బ్రశ్రయభావముం జూపుచున్నది. ఎప్పటిరీతి నెల్లవారును, దమతమతోడ్పాటును జేయుచున్నచో ముందుముందును బరిషత్పత్రిక భాషాసేవ చేయఁగలదు. వ్యాసములు వ్రాసి పంపుచున్నవారిలోఁ జాలమంది విశేషము సంస్కృతభాషను దద్గ్రంథములం గూర్చియే వ్రాయుచున్నారు. దయతో నాంధ్రసాహిత్యవిషయమునఁగూడఁ గొంతశ్రద్ధ పుచ్చుకొని విశేషభాగ మాంధ్రసాహిత్యమును గూర్చియే వ్యాసములను బంపుచుండవలయు నని పరిషత్తు కోరుచున్నది. స్పష్టముగను, నిర్దుష్టముగను, వ్యాసములను, వ్రాయకుండుటచే మరల మే మిక్కడఁ గొంత శ్రమపడి ముద్రాక్షరశాలవారితోఁ జిక్కు పడవలసి వచ్చుచున్నది. కావున మున్ముం దట్టిశ్రమమాకుఁ గలుగకుండఁ జేయఁగోరుచున్నాము.

పరిషత్ప్రకటితగ్రంథములనుగొనియుఁ, బత్రికాగ్రాహకు లయియు నాంధ్రమహనీయులు స్వహస్తపరహస్తముల నీపరిషత్తును వృద్ధిచేయుచుండఁ బారించుచున్నాము. పత్రికాపాఠకులు తమతమ చందాలను వెంటనే పంపఁగోరుచున్నారము.

ప॥ అ॥

మృచ్ఛకటికము.

—(కనకదండి గోపాలకృష్ణశాస్త్రిగారు-విజయనగరము)—

ఇది చాలఁ బ్రాచీన మైన పదియంకములు కల రూపకము. శైలి చాల సులభ మైనది. వర్ణనలు స్వాభావిక మైనవిగ నుండును. ఈరూపకమందలి ప్రస్తావనను బరిశీలింప ఋగ్వేదము, సామవేదము, గణితశాస్త్రము, అశ్వశాస్త్రము మొదలగు వానిని జక్కగ నధ్యయన మొనరించిన శూద్రకుఁ డను క్షత్రియుఁడు దీనిని రచించె నని తెలియుచున్నది. ప్రస్తావనలోని శ్లోకముల నీక్రింద నుదాహరించుచున్నాఁడను.

"ఏతత్కవిః కిల:—

ద్విరదేంద్రగతి శ్చకోరనేత్రః పరిపూర్ణేందుముఖ స్సువిగ్రహాశ్చ
ద్విజముఖ్యతమః కవి ర్బభూవ ప్రథితః శూద్రక ఇ త్యగాధసత్వః॥
ఋగ్వేదం సామవేదం గణిత మథ కలాం వైశికీం హస్తిశిక్షాం
జ్ఞాత్వా శర్వప్రభావా ద్వ్యపగతతిమిరే చక్షుషీ చోపలభ్య
రాజానం వీక్ష్య పుత్రం పరమసముదయే నాశ్వమేధేన చేష్ట్వా
లబ్ధ్వా చాయుః శతాబ్దం దశదినసహితం శూద్రకో గ్నిం ప్రవిష్టః"

పైశ్లోకములోని చివరిరెండుపాదములలోను దానెంతకాలముజీవించెనో చెప్పినాఁడు.

కొంద ఱీతఁ డెట్లు భావి యైన తనమృత్యువును జెప్పఁగలిగినాఁడు? అది యసందర్భము కాదా? కనుక, ఎవఁడో యీగ్రంథమును వ్రాసి యాతని ప్రతిష్ఠకొఱకయి ప్రస్తావనలో నతఁడు వ్రాసినట్లు చేర్చినాఁ డని యభిప్రాయపడిరి- కాని యట్లు వ్రాయుట విరుద్ధము గాదు. జ్యోతిష్కులద్వారా తనమృత్యువును దెలిసికొని వ్రాసి యుండవచ్చును. ఇప్పటికిని జ్యోతిష మనిన నెంత నమ్మకమో హిందువుల కందఱికిఁ దెలిసినవిషయమే.

ఇందలి నాయకుఁడు చారుదత్తుఁడు; ఇతఁడు చాలదరిద్రుఁడు, ధర్మపరుఁడును. వసంతసేన యనువేశ్యను బెండ్లియాడెను. ఈతనిదారిద్ర్యమును గవి చాల సారులు చక్కగ వర్ణించినాఁడు. వానిలో రెండుశ్లోకముల నీక్రింద నుదాహరించుచున్నాఁడను:—

"దారిద్ర్యా త్పురుషస్య బాంధవజనో వాక్యే న సంతిష్ఠతే
సుస్నిగ్ధా విముఖీ భవంతి సుహృదః స్ఫారీభవం త్యాపదః
సత్వం హ్రాస ముపైతి శీలశశినః కాంతిః పరిమ్లాయతే
పాపం కర్మచ యఃపరై రపి కృతం త త్తస్య సంభావ్యతే"

"సత్యం నమే విభవనాశకృతా స్తి చింతా
భాగ్యక్రమేణ హి ధనాని భవన్తి యాన్తి
ఏతత్తు మాం దహతి నష్టధనాశ్రయస్య
య త్సౌహృదాదపి జనా శ్శిథిలీభవంతి"

శర్విలకునకు దొంగతనమం దున్న ప్రావీణ్యమును జక్కఁగఁ జూపినాఁడు-

"దేశః కోను జలావసేకశిథిలః యస్మి న్నశబ్దో భవేత్
భిత్తీనాంచ నదర్శనాంతరగతః సంధిః కరాలో భవేత్
క్షారక్షీణతయాచ లోష్టకకృశం జీర్ణం క్వ హర్మ్యం భవేత్
కస్మిన్ స్త్రీజనదర్శనం చ న భవేత్ స్యాదర్థసిద్ధిశ్చ మే"

ఇంకను వర్షర్తువు మొదలగునవి బాగుగ వర్ణింపఁబడినవి. తత్తత్పాత్రములకుఁగూడ నాతఁడు చాల నుచితముగఁ బోషించినాఁడు. మూర్ఖుఁడగు శకారుని పాత్రము నెంతచక్కఁగఁ బోషించినాఁడో చూడుఁడు:—

"ఝణఝణామితి బహుభూషణశబ్దమిశ్రం కిం ద్రౌపదీవపలాయసే రామభీతా
ఏష హరామి సహసేతి యథా హనూమాన్ విశ్వావసో ర్భగినీ మివతాం
సుభద్రామ్."

"శృణోమి మాల్యగంధం అంధకారపూరితయా పునర్నాసికయా నసువ్యక్త ముత్పశ్యామి భూషణశబ్దం"

"కథం సృగాలా ఉడ్డీయంతే వాయసా వ్రజంతి తద్యావ ద్వ్యాఘ్రోక్షిభ్యాం భక్ష్యతే ప్రేక్ష్యతే తావ దహం పలాయిష్యే."

ఈమృచ్ఛకటికమును గూర్చి యున్న యభిప్రాయభేదమును గొంతవఱకు విమర్శించుట యప్రస్తుతము కాఁజాలదు.

మహామహోపాధ్యాయ త. గణపతిశాస్త్రిగారి కొకప్పుడు కేరళదేశమందు, పది యొకసముదాయముగను మూఁడు విడిగను మొత్తము పదుమూఁడు రూపకములు దొరికినవి. అవన్నియు గ్రంథకర్తనామముతో శూన్యములై యున్నవి కాని శ్రీశాస్త్రిగారు కొన్ని హేతువాభాసలచే వానిలో రెండుమూఁ

డింటిని భాసునివిగ నిశ్చయించిరి. వానితోఁ గూడ దొరుకుటచే వానినిగూడ భాసునికే యంటఁగట్టిరి, కాని, యవి యన్నియుఁ గూడ వేడుకసమయములం దుఁ జూపఁబడు చిన్నచిన్న కృతు లనియు, ఆయానాటకములనుండి తీయఁబడిన శ్లోకములచేతను, వాక్యములచేతను, భావములచేతను గూర్పఁబడిన వనియు వాని నామూలాగ్రముగఁ జదివినవారికిఁ దట్టక మానదు. ఇప్పటికీ కేరళదేశములో నట్టియాచార మెక్కుడుగ నున్న దఁట.

ఇట్టి యాకృతులలోఁ జారుదత్త మను నాలుగంకములు గల కృతి యొకటి గలదు. అది మృచ్ఛకటికములోని మొదటి నాలుగంకములతో సరిపోవు చున్నది. ఒక్కయానుపూర్వియే గలశ్లోకములు వాక్యములు కూడ రెండింటిలోను సరిగ నున్నవి. చారుదత్తములో మాత్రము కొన్ని మృచ్ఛకటికములో నున్నశ్లోకములు విషయము మాత్రము కానరావు. మొత్తముమీఁద రెండింటికి నొకఁడే కర్త యనుట కేమియు సందేహము లేదు. ఇది చూచి శ్రీశాస్త్రి గారు భాసుఁడు వ్రాసిన చారుదత్తమును జూచి శూద్రకుఁడు దానినే యూఁతగాఁ గొని కొన్నివర్ణనలఁ బెంచి యింకొకయాఱంకములు గల్పించినాఁడని నిరూపించిరి. "కీతు" మహాశయుఁడు కూడ శ్రీ శాస్త్రిగా రుపపాదించిన విషయమునే యనువదించినాఁడు. కాని బాగుగ మృచ్ఛకటికమును, చారుదత్తమును విమర్శించి చూచిన మహాశయుల కీవిషయము సత్యేతర మని తోఁపక మానదు. ఈక్రింద నుదహరింపఁబడిన యుభయగ్రంథసందర్భములచేతను మృచ్ఛకటికములోని భాగమే చారుదత్త మనియు, చారుదత్తము నూఁతగాఁ గొని మృచ్ఛకటికము వ్రాయఁబడ లే దనియుఁ జారుదతము భాసునికృతిగాదనియు స్పష్టపడఁగలదు.

i భాసునికృతు లని శ్రీశాస్త్రిగారు ప్రకటించిన వాని కన్నింటికిని మొదట "నాంద్యంతే సూత్రధారః" అను తరువాత మంగళశ్లోకము వ్రాయఁబడియుండుటయుఁ జివర భరతవాక్యము వ్రాయఁబడి యుండుట యు లక్షణమై యున్నది. చారుదత్తము మాత్ర మట్లు లేదు. మొదలును, జివరయు లేకుండఁగ నున్నది. మంగళవాక్యము లేదు మధ్యగ; సమాప్తి పొందింపఁబడినటుల భరతవాక్యముకూడఁ జివర లేదు. దీనినిబట్టి చూడ దేనిలోనుండియో తీయఁబడిన యొకభాగ మని యూహ ప్రతివారికిని గలుగకమానదు. కనుక మృచ్ఛకటికలోనిభాగమే చారుదత్తము,

ii అన్నికృతులకుఁగూడఁ బ్రస్తావన చాలఁ జిన్నదిగ నుండుట కూడ నొకలక్షణము. చారుదత్తములో మాత్ర మట్లు గాక యితర మైన పండ్రెండు కృతులలో నున్న ప్రస్తావనకన్న రెట్టిం పున్నది. ఇతరకృతుల ప్రస్తావనలకంటె నిందు వివిధవిషయములు గూడఁ బ్రస్తావింపఁబడినవి. ఈపండ్రెండుకృతులలోఁ గొన్నిటిలో, చారుదత్తమందలి ప్రస్తావనలో నాల్గవవంతు కూడ లేదు. దీనిని బట్టి చూచినను భాసకృతులకన్న భిన్న మగుచున్నది. మృచ్ఛకటికములోని ప్రస్తావనయే గ్రంథకర్తృనామాదులుతీసివేయఁబడి క్లుప్తపఱుపఁబడినట్లు తోఁచు చున్నది.

iii వామనుఁడు కావ్యాలంకారసూత్రవృత్తిలో

"శరచ్చంద్రాంశుగౌరేణ వాతావిద్ధేన భామిని
కాశపుష్పలవేనేదం సాశ్రుపాతం ముఖం కృతమ్".

ఈశ్లోకమును స్వప్నవాసవదత్తమునుండియు

"యోభర్తృపిండస్య కృతే నయుధ్యేత్"

ఈపాదమును ప్రతిజ్ఞాయౌగంధరాయణమునుండియు నుదాహరించుచు చారుదత్తము భాసునిదే యైనచో దానిలోని శ్లోకమునేయుదాహరింపక శూద్రకుని మృచ్ఛకటికలోనుండి యెత్తి యేలవ్రాయును.

"యాసాం బలి ర్భవతి మద్గృహదేహలీనాం
హంసైశ్చ సారసగణైశ్చ విలుప్తపూర్వః
తాస్వేవ పూర్వబలిరూఢయవాంకురాసు
బీజాంజలిః పతతి కీటముఖావలీఢః"

ఈశ్లోకము కొంతవఱకుఁ జారుదత్తమును గూడ ననుసరించుచున్నను శూద్రకునిదే యనవలయును. ఏలన:— వామనుఁడు మఱొకచోట:—

"ద్యూతంహినామ పురుషస్య అసింహాసనం రాజ్యం"

ఈవాక్యము నుదాహరించినాఁడు. ఇది మృచ్ఛకటికమందు మాత్రమే యున్నది. చారుదత్తమందుఁ గానరాదు, మఱియు వామనుఁడు—

"ఘటనాశ్లేషః"; 4 సూత్రము 3 అధికరణం 2 అధ్యాయం.

ఈసూత్రమును వ్యాఖ్యానముచేయుచు

"శూద్రకాదిరచితేషు ప్రబంధేషు అస్య భూయాన్ ప్రపంచో దృశ్యతే"

అని యెక్కువగ శూద్రకునే స్తుతించియున్నాఁడు. కనుక వామనుఁడు

చారుదత్తము ప్రమాణముగాఁ గొని దానిలోని శ్లోకము నుదాహరింపఁబోవుటచే నాతనియాశయము చారుదత్తము మృచ్ఛకటికలోనుండి తీసి వ్రాయఁబడినయదియే యని మన మూహింపవలయును. కనుక మృచ్ఛకటికమునుండి చారుదత్త మెత్తి వ్రాయఁబడె ననుట కేమియు సందేహము లేదు.

iv మఱియు మృచ్ఛకటికములో నున్న యన్ని భాగములును చారుదత్తమునఁ గానరావు. కాని చారుదత్తములో నుండి మృచ్ఛకటికములో లేనివిషయము లేమియును లేవు. దీనికిఁ గారణ మేమో విచారింతము. మృచ్ఛకటికములోని మొదటినాలుగంకములను వేడుకగా నుత్సవసమయములందుఁ జూపుటకుఁ దీయఁబడినవై యందలి ముందుకథాసందర్భమున కుపయోగించెడి విషయము లెక్కువగా నున్నవర్ణనశ్లోకములు, మొదలగునవి కూడ విడిచిపెట్టఁబడినవి. అందు ముందుకథ కుపయోగించెడునట్టివియు, చారుదత్తమున లేనట్టివియు విషయము లీక్రిందివి:—

i "రోహసేనవృత్తాంతము" ఈపాత్ర ముందంకములలో ముఖ్యముగ నుపయోగించునది.

ii "ఆర్యకవృత్తాంతము" ఇదియు ముం దుపయోగించెడిదే"

iii సంవాహకుఁడు శ్రమణకుఁడనగుదు నని వసంతసేనతోఁ జెప్పి యట్లగుట-ఈశ్రమణకుఁడు శకారుఁడు వసంతసేనను జంపినప్పు డుపయోగించును.

ఇంకను గొన్ని ముందుకథ కుపయోగింపకపోయినను దీసివేయఁబడినవి. క్లుప్తముగనుండుటకొఱకుఁ గొన్నిటి నిట నుదాహరించుచున్నాఁడను.

మాథురద్యూతకరదర్దురకాదిప్రవేశము వారిజూదము మొదలగునవి.

అంకములలో మృచ్ఛకటికములోకంటెఁ జారుదత్తములోఁ గొన్నిశ్లోకములు తగ్గింపఁబడినట్లు చెప్పియుంటిమి. ఏయంకమున కెన్ని తగ్గింపఁబడిన వన మొదటి యంకములో 29, రెండవయంకములోఁ బూర్తిగను, మూఁడవయంకమున 11, నాల్గవయంకమున 26 విడిచిపెట్టఁబడినవి.

v మఱియుఁ జారుదత్తమునందలి యీచివరిభాగ మసంపూర్తిగ నెటులున్నదో చూడుఁడు:—

గణికా:—ఏహి ఇమ మలంకరణం గృహీత్వా ఆర్యచారుదత్త మే వాభిసరిష్యావః

చేటీ:—అజ్జుకే తథా! ఏతత్పున రభిసారికా సహాయభూతం దుర్దినమున్నమితం

గణికా:—మాఖలు వర్జయ
చేటీ:—ఏ త్వేత్వజ్జుకా(నిష్క్రాంతే)

చతుర్థోంకః అవసితం చారుదత్తం.

వసంతసేన చారుదత్తుని దగ్గఱకు వెళ్లుటకుఁ బ్రయాణ మగుచున్నటుల ఆకాశము మేఘాచ్ఛాదితమయినటుల సూచింపఁబడినది. ఈవిషయము ముందు గ్రంథమున నెక్కడు సందర్భించియున్నది. స్వతంత్రగ్రంథమే యైనచో నిట్లుండదు. చివర నిట్లసంపూర్తిగ నుండి ముందుకథకు ద్యోతకముగ నుండుటచేతను మొదట మంగళవాక్యము లేకపోవుటచేతను చారుదత్తము మృచ్ఛకటికములోని భాగమనుట కేమియు సందేహము లేదు. చారుదత్త మింకను నున్నదనుటకుఁ గూడ వీలులేదు. ‘‘అవసితం చారుదత్తం” అని చివర నున్నది.

vi ఈపదుమూఁడుకృతులలో నార్షప్రయోగములుండుకతననివన్నియుఁ బాణినికన్న పూర్వము రచింపఁబడిన వనియుఁ గొన్ని భాసుని వగుటచేత వానితో సమ మున్నవానినిగూడ భాసుఁడే రచించె నని చెప్పినవారి హేతువు లాభాసములే. ఏలన, వానిలోఁ బ్రయోగము లార్షములు కావు. అవి యన్నియు విమర్శించి చూచిన వ్యాకరణజ్ఞానము లేనివారిచే వ్రాయఁబడినట్లు తోఁచును. అట్లు వ్యాకరణజ్ఞానము లేకుండుటచేత వ్రాయఁబడిన తప్పులన్నియు నార్షప్రయోగము లైనచోఁ గాళిదాసాదులు కూడఁ బాణినికన్నఁ బ్రాచీనులు కావలసివత్తురు, తరువాత నట్టియార్షప్రయోగము కూడ నీచారుదత్తమున నొక్కటే యున్నది. వ్యాకరణజ్ఞానహీనులచేఁ గూర్పఁబడినను జాలవఱకు మృచ్ఛకటికము ననుసరించుటచేఁ దప్పు లెక్కువ లేకపోయినవి.

vii శైలికూడ రెండిటియందు సమముగనే యున్నది. కొంచెము భేదము మార్పుచేసిన వానియజ్ఞతచే మాత్రము కలిగియున్నను విశేషము లేదు.

ప్రాకృతమునుబట్టి చూచినను దేలుటలేదు. ప్రాకృతము దెలిసినపండితులు ప్రాచీనమైన దని కొందఱు నవీనమైన దని కొందఱు ననేకవిధములుగఁ జెప్పుచున్నారు, గాన, ప్రాకృత మీవిషయమున నంత యుపయోగింపదు.

viii మొదటియంకమందలి చెప్పఁబడిన యీ-

“పాపంకర్మచ యత్పరైరపి కృతం తత్తస్య సంభావ్యతే”.

అనువాక్యముచే ముందు చారుదత్తునకు రాఁబోవు వసంతసేనావధవిషయకమయిన యుపవాదము సూచింపఁబడుచున్నది. కనుక, చారుదత్తము

గణికా:—మాఖలు వర్జయ

చేటీ:—ఏత్వేత్వజ్జుకా(నిష్క్రాంతే)

చతుర్థోంకః అవసితం చారుదత్తం.

వసంతసేన చారుదత్తుని దగ్గఱకు వెళ్లుటకుఁ బ్రయాణ మగుచున్నటుల ఆకాశము మేఘాచ్ఛాదితమయినటుల సూచింపఁబడినది. ఈవిషయము ముందు గ్రంథమున కెక్కుడు సందర్భించియున్నది. స్వతంత్రగ్రంథమే యైనచో నిట్లుండదు. చివర నిట్లసంపూర్తిగ నుండి ముందుకథకు ద్యోతకముగ నుండుటచేతను మొదట మంగళవాక్యము లేకపోవుటచేతను చారుదత్తము మృచ్ఛకటికము లోని భాగమనుట కేమియు సందేహము లేదు. చారుదత్త మింకను నున్నద నుటకుఁ గూడ వీలులేదు. ''అవసితం చారుదత్తం'' అని చివర నున్నది.

vi ఈపదుమూఁడుకృతులలో నార్షప్రయోగములుండుకతననివన్నియుఁ బాణినికన్న పూర్వము రచింపఁబడిన వనియుఁ గొన్ని భాసుని వగుటచేత వానితో సమ మున్నవానినిగూడ భాసుఁడే రచించె నని చెప్పినవారిహేతువు లాభాసములే. ఏలన, వానిలోఁ బ్రయోగము లార్షములు కావు. అవి యన్నియు విమర్శించి చూచిన వ్యాకరణజ్ఞానము లేనివారిచే వ్రాయఁబడినట్లు తోఁచును. అట్లు వ్యాకరణజ్ఞానము లేకుండుటచేత వ్రాయఁబడిన తప్పులన్నియు నార్షప్రయోగము లైనచోఁ గాళిదాసాదులు కూడఁ బాణినికన్నఁ బ్రాచీనులు కావలసివత్తురు, తరువాత నట్టియార్షప్రయోగము కూడ నీచారుదత్తమున నొక్కటే యున్నది. వ్యాకరణజ్ఞానహీనులచేఁ గూర్పఁబడినను జాలవఱకు మృచ్ఛకటికము ననుసరించుటచేఁ దప్పు లెక్కువ లేకపోయినవి.

vii శైలికూడ రెండిటియందు సమముగనే యున్నది. కొంచెము భేదము మార్పుచేసిన వానియజ్ఞతచే మాత్రము కలిగియున్నను విశేషము లేదు.

ప్రాకృతమునుబట్టి చూచినను దేలుటలేదు. ప్రాకృతము దెలిసినపండితులు ప్రాచీనమైన దని కొందఱు నవీనమైన దని కొందఱు ననేకవిధములుగఁ జెప్పుచున్నారు, గాన, ప్రాకృత మీవిషయమున నంత యుపయోగింపదు.

viii మొదటియంకమందలి చెప్పఁబడిన యీ-

"పాపంకర్మచ యత్పరైరపి కృతం తత్తస్య సంభావ్యతే".

అనువాక్యముచే ముందు చారుదత్తునకు రాఁబోవు వసంతసేనావధవిషయకమయిన యపవాదము సూచింపఁబడుచున్నది. కనుక, చారుదత్తము

పూర్తియయిన గ్రంథ మనుటకు వీలులేదు. ఇది తప్పక మృచ్ఛకటికనుండి యుద్ధృతమయిన దనుటసాహసము కాఁజాలదు. శ్రీశాస్త్రిగారి కెట్లు స్వతంత్ర గ్రంథమని తట్టెనో తెలియకున్నది.

ఈమహాకవికాలమును సరిగఁ దెలిసికొనుటకుఁ దగినప్రమాణములు కానరావు. ఐనను లభించినవానిలోఁ గొంతవఱకు విమర్శింతము.

తొమ్మిదవ శతాబ్దపువాఁడైనకులశేఖరవర్మ తన తపతీసంవరణములో "శూద్రక కాళిదాస హర్షదండి ప్రభృతీనామ్" అని చెప్పియున్నాఁడు. కనుక శూద్రకుఁడు కాళిదాసుకన్న పూర్వుఁడని తోఁచుచున్నది. ప్రాకృతము, సంస్కృతము కూడ శూద్రకునిది కాళిదాసుకన్న ప్రాచీనుఁ డని సూచించుచున్నవి.

మఱియు, కాళిదాసు 4 వ శతాబ్దపు వాఁడు-అతఁడు తనమాలవికాగ్నిమిత్రమందు సౌమిల్లకుని గీర్తించినాఁడు. కనుక సౌమిల్లకుఁడు 3 వ శతాబ్దపువాఁ డయి యుండవచ్చును. అట్టి సౌమిల్లకుఁడు శూద్రకుని గీరించియున్నాఁడు. కావున శూద్రకుఁడు 2 వ శతాబ్దమునకు జీవించియుండవచ్చును.

ఈశూద్రకుఁడు, కాదంబరిలోను, దశకుమారచరితములోను కథాపురుషుఁడుగ వర్ణింపఁబడియున్నాఁడు-మఱియు నీతఁడు నూఱేండ్లమీఁదఁ బదిదినములు జీవించి నట్లు తన ప్రస్తావనలోఁ జెప్పినాఁడు. ఇవన్నియుఁ జూ కీతు మహాశయుఁడు-శూద్రకుఁ డనువాఁడు లేఁడు, ఇతఁడు కథాపురుషుఁడు, ఎవరో గ్రంథమును వ్రాసి యాపేరు నటఁ జేర్చినా రని యభిప్రాయపడినాఁడు.

కాని యీవిషయ మెంతయు విశ్వసనీయము కాదు. ఏలన, వామనుఁడు "ఘటనాశ్లేషాః" అనుసూత్రమునకు వృత్తి వ్రాయుచు శ్లేషలో శూద్రకుఁడు నిపుణుఁ డని చెప్పినాఁడు.

మఱియు 9వ శతాబ్దపు కులశేఖరవర్మకూడ శూద్రకుని గవిగాఁ గీర్తించినాఁడు.

"శూద్రకకాళిదాసహర్షదండిప్రభృతీనామ్" అని, కనుక కథాపురుషుఁడు గాని వాస్తవిక మైన శూద్రకుఁడు లేఁ డనిన కీతుమహాశయునిమాట యెంతయు విశ్వసనీయము కాఁజాలదు.

అనర్ఘరాఘవము.

— చేబోలు సుబ్రహ్మణ్యశర్మగారు-కొవ్వూరు. —

ఈ గ్రంథము రచించినవాఁడు భట్టమురారి యను కవితల్లజుఁడు. ఇందలి కథ రామాయణకథ. ఇది దృశ్యకావ్యము. రాముని బాల్యము మొదలు పట్టాభిషేకాంతమువఱకు నిం దితివృత్త మున్నది. ఈతనితండ్రి శ్రీభట్టవర్ధనుఁడు. తల్లి తన్తుమతీదేవి. గోత్రము మౌద్గల్యాయనగోత్రము. ఇతనికి బాలవాల్మీకి యనుబిరుదు గలదు.

గ్రంథాంతమందు "భట్టమురారేః కృతిష్వనర్ఘరాఘవం నామ నాటకం సమాప్తం" అనుటవలన మురారిచే నితరగ్రంథములు కొన్ని చేయఁబడిన వని తెలియుచున్నది. అవి యేవియో కానరాకున్నవి.

కాని మీమాంసశాస్త్రములో భాట్టప్రాభాకరమతములకంటె భిన్న మగుమతమును మురారి స్థాపనచేసె నను లోకోక్తినిబట్టి చూడ మీమాంసశాస్త్రములో నొక గ్రంథమును జేసె నని యూహింప వీలగు.

మఱియు నాలంకారికులు "వైదర్భి, గౌడీ" అని రెండురీతులనే యొప్పి రని యు లోకోక్తిగలదు. ఇతఁడు "పాంచాలీ"రీతిని స్థాపనచేసె నను లోకోక్తియుం గలదు. వీనిని బరీక్షింపఁ నితఁడు, అలంకారశాస్త్రమున నొక గ్రంథము రచించినట్లు తోఁచుచున్నది.

ఈతనికవనమం దుండు కొన్నిచమత్కారములను మాత్రము వివరించెదను. ఈతనిదృశ్యకావ్యమును బండితులు గొప్పగ నెన్నుదురు. ఎందు కనిన శాస్త్రములను గొన్నింటిని జదివినవారికే కాని యితరుల కన్వయించుట కష్టముకాన-వ్యాకరణాదిశాస్త్రముల మర్యాదలతోఁ గవనముఁ జెప్పెనుగాన— ఈకవితల్లజుఁ డనేకశాస్త్రములయందుఁ బండితుఁడని చెప్పవచ్చును.

పరిహాసభావ:—

ప్రథమాంకము । విశ్వామిత్రః సోత్ప్రాసమ్ ।
"కిం చాజస్రమఖార్పితేన హవిషా సంఫుల్లమాంసోల్లస
త్సర్వాంగీణవలీవిలుప్తనయనవ్యూహాః కథంవర్తతే"

ఇందలిభావము నవ్వును బుట్టించుచున్నది- కావునఁ బరిహాసభావ మనవచ్చును.

చతు- అం. 14 శ్లో. తరువాతగద్యలో "అహో స్థవిరభల్లూకస్య పరిహాసకుశలతా" అని కలదు. ఇదియుఁ బరిహాసభాషయనఁదగును.

ద్వి. అం. 7 శ్లో. ఉక్షారథో భూషణమస్థిమాలా భస్మాంగరాగో గజచర్మవాసః।
ఏకాలయస్థేపి ధనాధినాథే సఖ్యా దశేయం త్రిపురాన్తకస్య.

ఇట్టియీశ్వరున కిట్టిదశవచ్చిన దనిచెప్పుటచే నిక్కడఁ గొంత యాశ్చర్యము కలుగుచున్నది. ఇది వేళాకోళముగా మాటలాడుటచేఁ బరిహాసభాషయనవచ్చును.

ద్వి. అం. 14 శ్లో. తత్తాదృక్తృణపూలకోపనయనక్లేశా చ్చిరద్వేషిభిః
శ్రేధ్యావత్సతరీ విహాస్య వటుభిః సోల్లుంఠ మాలభ్యతే.

ఇక్కడ విద్యార్థులభావము కవిచేఁ జక్కగ వర్ణింపఁబడుటచేఁ బరిహాసభాషయనఁదగియున్నది. ఇటువంటివి చాలఁగలవు. కొన్ని మాదిరికిఁజూపితిని.

శాస్త్రపరిభాషలు:—

చతు. అం. 42 శ్లో. క్రిందున. క్రియాసమభిహారస్య.
చతు. అం. 44 శ్లో. ఆకృతిగణః. సాధకతమం.
తృ. అం. 57 శ్లో. క్రిందున విద్యావృద్ధసయోగాద్బహిరంగాని.
చతు. అం. 11 శ్లో. క్రిందున-బ్రాహ్మణాదేశోపి స్థానివద్భావేన క్షత్త్రధర్మం"

ఈ పైనాల్గుచోట్ల వ్యాకరణశాస్త్రపరిభాషలు. ఇట్టివి చాలఁ గలవు. దిఙ్మాత్రము చూపఁబడినవి.

ద్వి. అం 62 శ్లో. యదధికరణం_మీమాంస.
ద్వి. అం. 8 శ్లో. క్రిందిగద్య. చతురక్షరోపిరాక్షసశిక్షాసిద్ధమంత్రః—
మంత్రశాస్త్రపరిభాష.

ఇట్లనేకశాస్త్రపరిభాషలను వాడుటగలదు. విస్తరభీతిచే విరమింతును.

ఇతరకవిచ్ఛాయలు:—

కష్టా వేధవ్యథా కష్టో	శ్లో॥ ఔత్సుక్యమాత్ర మవసాదయతి ప్రతిష్ఠా
నిత్యం చ వహనక్లమః	క్లిశ్నాతి లబ్ధపరిపాలనవృత్తి రేవ
శ్రవణానా మలంకారః	నాతిశ్రమాపనయనాయ నచశ్రమాయ రాజ్యంస్వ
కపోలస్యతుకుండలమ్.	హస్తధృతదండమివాతపత్రమ్. శాకుంతలము.
అనర్ఘరాఘవము.	

ఉత్తరచరితలో వసిష్ఠుఁ డెట్లష్టావక్రుని చేత రామునకు సందేశ మంపెనో

యట్లే యనర్ఘరాఘవములోను వసిష్ఠుఁడు వామదేవునిచే దశరథునకు సందేశ మంపెను.

అనర్ఘరాఘవము. ధర్మశ్చాయంకులస్యతే గృహాత్ప్రతినివర్తన్తే పూర్ణకామాయదర్థినః॥	శ్లో॥ జామాతృయజ్ఞేన వయం నిరుద్ధాః త్వం బాలవానసి నవంచ రాజ్యం। యుక్తః ప్రజానా మనురంజనే స్యాః స్వస్మాద్యశో యత్పరమం ధనంవః. ఉత్తర-
వాచమేషా మృషీణాంహి శాస్త్రమేవానువర్తతే అనర్ఘరాఘవము.	శ్లో॥ ఋషీణాం పునరాద్యానాంవాచ మర్థోనువర్తతే. ఉత్తరరామ.
	ప్ర. అం. 39 శ్లో॥ క్రిందుగద్య.
తృ. అం. 16 శ్లో॥ నిర్తా...మమార్థవాదః	రామః- అర్థవాదపమః.
తృ. అం. 14 శ్లో॥ మేధ్యావత్సతరీ విహస్యవటుభిస్సోల్లుంఠ మాలభ్యతే.	చతు. అం. 1 వ శ్లో॥ క్రిందుగద్య. "తేనహ్యాగచ్ఛత్రైవసావరాకీకపిలాబలా త్కృత్యమడమడాయితా"

ఇట్లనేకమైన యితరకవిచ్ఛాయలు గలవు. కొన్నిమాత్రము చూపఁబడినవి.

మురారి మూఁడవత్రోవను ద్రొక్కెను:—

ఈలోకోక్తి ననేకవిధములుగ సాధింపవచ్చును. కొన్నివిధములు చూపుచున్నాఁడను.

(1) భాష- లోకములోఁ గావ్యభాష, నాటకభాష, యని రెండుతెఱంగులుగఁ గన్పట్టుచున్నది. నైషధము, ఉత్తరరామచరితము, ఈ రెంటియందు భాషలను గావ్యనాటకభాష లని వాడుదురు. నాటకభాష యన దృశ్యమునకు యోగ్యమైన దనియుఁ గావ్యభాష యన శ్రవ్యమునకు యోగ్యమైన దనియుఁ జెప్పఁబడుచున్నది. ఈయనర్ఘరాఘవమునం దున్నభాష పైఁజెప్పిన రెండువిధములుగ నున్నది. దృశ్యకావ్య మని పేరిడి శ్రవ్యభాషను, దృశ్యభాషను, కలిపి చెప్పుటచే నితనియనర్ఘరాఘవమునకు మఱొక పేరు పెట్టవలసియుండుటచే నీలోకోక్తి పుట్టె నని యందురు.

(2) మీమాంసశాస్త్రములో భాట్టప్రాభాకరమతములు రెండు గలవని యు వానికంటె భిన్న మగుమతమును మురారి స్థాపన చేసె ననియుఁ గను కనే యీలోకోక్తి పుట్టె ననియుం జెప్పుదురు.

(3) లోకమున "వైదర్భి, గౌడి" యను నీరెండురీతులే యున్న వని యు, మురారికవి "పాంచాలి" యను మఱొకరీతి నొప్పె ననియుఁ గాన నీలోకోక్తి పుట్టె ననియుఁ జెప్పుదురు.

(4) తృతీయఃపంథ-యనుదాని యర్థము పెడత్రోవ త్రొక్కుట యని చెప్ప వలసియున్న దని తోఁచుచున్నది.

"నిష్ప్రత్యూహ ముపాస్మహే భగవతః కౌమోదకీలక్ష్మణః
కోకప్రీతిచకోరపారణపటుజ్యోతిష్మతీలోచనే"

ఇచ్చటఁ గవి గ్రంథాదిని నేత్రములకు నమస్కారము చేసెను.

కవులు సాధారణముగఁ బాదములకు, వ్యక్తికి నమస్కరించుట చూచు చుంటిమి. కాని, యిట్లు నేత్రనమస్కారము చేయుటచేఁ గవి స్వతంత్రతతోఁ బెడత్రోవను ద్రొక్కెను గాన నీలోకోక్తి పుట్టె నన వచ్చును. మఱియు "జాతాః లూతాతన్తువితానవర్తుల మితో బింబం దధచ్చంద్రమాః (ద్వి 2 శ్లో॥) ఇక్కడ సాలిగూడుతోఁ బోల్చి చంద్రబింబమును జెప్పుటచే నిదికూడఁ బెడత్రోవయే.

"అయ మపి ఖరయోషిత్కర్ణకాషాయమీషత్" (ద్వి-44) ఇక్కడ నాఁడుగాడిద చెవివలె నని చెప్పుటయుఁ బెడత్రోవ త్రొక్కుటయే.

రఘురాముఁడు:—

"త్రయస్త్రింశత్కోటిత్రిదశమయమూర్తే ర్భగవత
స్సహస్రాంశో ర్వంశే జయతి జగదీశో దశరథః" (తృ. 2)

ఈశ్లోకమువలనను,

యేచత్వారో దినకరకులక్షత్రసంతానమల్లీ
మాలామ్లానస్తబకమధుపా జజ్ఞిరేరాజపుత్రాః" (తృ. 21)

దీనిచేతను మహాకులీనత, (ఆభిజాత్యము) అను మహానాయకగుణము కన్పించుచున్నది.

రామః- శ్రుత్వా సరోమసంభ్రమ ముత్థాయ సవినయ మంజలిం బద్ధ్వా జగద్గురో గాధినందన—

శ్లో॥ దశరథకులే సంభూతం మా మవాప్య ధనుర్ధరం
　　దినకరకులాస్కందీ కోయం కళంకనవాంకురః
　　ఇతి హి వనితా మేనాం హన్తుం మనో విచికిత్సతే
యదధికరణాం ధర్మస్థేయం తదైవ వచాంసి నః'' ఇతి ప్రణిపత్య మాం భైష్ట తపోధనాః!" అని రాముఁ డనియెను. ఇట్టి రామవచనములం బట్టి చూచిన రాముని యొక్క ధర్మకార్యాలోచన స్పష్ట మగుచున్నది. స్త్రీవధయం దిష్టము లేనివానికిఁ జూపించుటచే ధర్మకాష్ఠ, దయ మొదలగునవి స్పష్టమగుచున్నవి. మఱియు గురువగు విశ్వామిత్రునియందు భక్తి వ్యక్తము.

చతు. అం. 46 శ్లో॥ క్రిందిగద్య. ''రామః-సవైలక్ష్య స్మితం ప్రసీద భగవన్ సమేవాయం యావనా దర్వాచీనే నిరపరాధమధురవయసి వర్తమానో యాని కాని చి దక్షరాణి ప్రలపతి''- ఇట్లనుటచేఁ బరశురామునియందు భక్తి, లక్ష్మణునితప్పు తెలిసికొనఁగల శక్తి, రామునియందుఁ గన్పట్టుచున్నవి. లోకములోఁ దమపిల్లలు వీథులలో నల్లరిచేసినప్పుడు తాము వెళ్ళి మాపిల్లలు తెలియక చేసిరి కోపపడకుండీ యన్నట్లు రామునిచే ముద్దుగఁ బల్కించెను.

చతు. అం. 74 వ శ్లో॥ క్రిందిగద్య. రామః- సరోషం నేపథ్యాభిముఖః- ఆః కోయం వత్స! అద్యతనస్తే దుర్వినయప్రరోహః య గురూ నపి క్షేత్రీకరోషి'' అని రాముఁ డనును. దీనిచే రాముఁడు గురుతిరస్కారము నొప్పనివాఁ డని స్పష్టము. పునర్నేపథ్యే, ఆర్య తూష్ణీమస్మి క్షమస్వ, జామదగ్న్య నియన్త్రితోహ మార్యేణ—లక్ష్మణుఁ డిట్లనుటచే రాముని గొప్ప కన్పించుచున్నది.

పం. అం. 32. శ్లో॥ గద్య. లక్ష్మ—సాధుదర్శినీ బుద్ధి రార్యస్య—ఇట్లనుటచే రాముని బుద్ధికుశలత కన్పించుచున్నది.

ష. అం. 5 శ్లో॥ గద్య. మాల్య—సహస్రం, కిముచ్యతే యావద్దివ్యభావాహి గుణో విజిగీషూణా ముదాత్తతా విశేషేణ పునరయం రామభద్రః॥ ఇట్లనుటచే రామునిగుణవిశేషములు సువ్యక్తములు.

స. అ. 10 శ్లో॥ రా- దేవి, త్వన్నే నిశాచరపతౌ రవిబింబవర్తీ తాతా మయా దశరథస్స్వయమేవదృష్టః। తస్యాజ్ఞయా రఘుపురీం ప్రహితః పురైవ రాజ్యాభిషేకవిధిసంభృతయే హనూమాన్॥ ఇట్లనుటచే రాముఁడు

కేవలము దశరథాజ్ఞానుసారిగనే కన్పట్టుచున్నాఁడు, కాని, స్వార్థపరుఁడుగ నున్నాఁడని చెప్పవీలు లేదు.

స. అం. 122 శ్లో॥ గద్య. సుగ్రీవవిభీషణౌ సానురాగం, అత్ర భగవతః పార్వతీజీవితేశ్వరస్య ధను రన్తేవాసినా వజగవభార్గవా భవతో భంజత స్సహాపాంశుక్రీడాదీర్ఘసఖీయంవీరలక్ష్మ్యాః॥ అని వారిద్ద అనిన తరువాత—

రామః—సలజ్జస్మితం—అన్యతోదర్శయన్, అని రామునిచేతఁ గవి పల్కించెను. ఇట్లు పల్కించుటచే ననాత్మశ్లాఘపరాయణుఁడుగఁ గన్పించుచున్నాఁడు రాముఁడు. (స శే)

శ్రీ

త్రిశిరగిరీశశతకము.

తి. సు. మురుగేశన్ పిళ్లెగారు-వడగరై—

కందపద్యములు.

శ్రీమాతృభూత శంకర, కామిత ఫల దోర్ధ్వకామ కామవిరామా
సోమార్ధమౌళి సోమా, శ్రీమహితామృతనిధాన త్రిశిరగిరీశా! ౧
భూమీరథ చాపీకృత, హేమాద్రి సుగంధికుంతలేశ తవాంఘ్రిన్
నేమమునఁ గొలిచి నీపయి, దీమసమునఁ గృతియొనర్తుఁ ద్రిశిరగిరీశా! ౨
గంగాధర! కొలుతున్ మా, తంగాస్యున్ వీరభద్రు ధరణీధరపు
త్రిం గార్తికేయు శైలా, దిం గామితఫలము వడయఁ ద్రిశిరగిరీశా! 3
సురుచిర సుకుమారామృత, సరసోక్తిపు కవితరచన చతురతకును మ
ద్గురువీరరాఘవార్యునిఁ, దిరముగ నేఁ దెలతు భక్తిఁ ద్రిశిరగిరీశా! ౪
నవరస భావాలంకృత, కవితా ధుర్యుల కటాక్ష కారుణ్యము మత్
కవితకు భావుక మని ప్రతి, దివసంబును దలఁతు భక్తిఁ ద్రిశిరగిరీశా! ౫
పరమేశ్వర పదచింతా, పరుఁడనుఁ గారాళవంశ భవుఁడను ద్రిశిరః
పురిమురుగేశుఁడ ముక్తికిఁ, దెరువుగ శతకం బొనర్తుఁ ద్రిశిరగిరీశా! ౬
మురహరపద్మజ ముఖ్యా, మర బృందము నీదుపాద మహిమలఁబొగడన్
దరతర లాడుదు రన న, స్థిరమతి నాకెంత తెగువ త్రిశిరగిరీశా! ౭
వరశబ్దాలంకార చ, తురకల్పనలకు నలభ్యదూర మహాద్గో
చరమగు నీమహిమల న, స్థిరమతి నెటు వొగడనేర్తుఁ ద్రిశిరగిరీశా! ౮
తనయుల శైశవభాషల, జననీ జనకులు వినంగ సంతస మొదలం
దనియుదురటు నానోడువులఁ, ద్రినయన మదిఁ దనిసిమనుపు త్రిశిరగిరీశా!
వందితజన మందారా, కందాధిపసేవ్య గరళకంధర వృషభ
స్యందన సుమనసబృందేం, దిందిర సుందరపదాబ్జ త్రిశిరగిరీశా! ౧౦
కావేరీ రోధస్థిత, గ్రావవిహారణ సుగంధికబరీకుచయు
గ్మావేశితహృత్పంకజ, శ్రీ వాక్సంపత్ప్రదాన త్రిశిరగిరీశా! ౧౧
దురితాటోప విదారణ, పరతాప నివారణచణ భంజితశమనా
కరుణారస భరలోచన, ద్విరదాసన సేవ్యమాన త్రిశిరగిరీశా! ౧౨

నీపదములఁ జింతించుచు, నీపంచాక్షర జపంబు నిర్మలమతి నే
  నేపొద్దుఁ జేయు భాగ్యము, శ్రీపతినుత కరుణ నిమ్ము త్రిశిరగిరీశా! ౧౩
పావనభర్గాక్షంబుల, ధావళ్యవిభూతి మేనఁ దాల్చుచు మదినిన్
  భావించి పూజ సేసెడి, ధీవర మీవలెను నాకుఁ ద్రిశిరగిరీశా! ౧౪
శరధీకృతశరధీ వృష, భరథీ ధుతదంత కరధి ప్రశమిత చక్రాం
  గరథీ దాశరథి వినుత, స్థిరధీప్రద మాతృభూత త్రిశిరగిరీశా! ౧౫
శివభక్తులఁ దలిదండ్రుల, శివయోగుల యతుల గురులఁ జేకొని భక్తిన్
  దవిలి పదపూజసేయక, దివిరెదు నాకెద్ది కెలకు త్రిశిరగిరీశా! ౧౬
వినయవివేకము శౌర్యము, కనకము గేహములు జీవకారుణ్యము వా
  హన మంగన యశ మలవడుఁ, ద్రినయన నీభూరికృపను ద్రిశిరగిరీశా! ౧౭
తనుకరణ భువనభోగము, లను జీవుల కొసఁగి వారి లయకర్మములన్
  దనివోవ భుజించిన ము, క్తినిఁ జేర్చెడి పతియునీవ త్రిశిరగిరీశా! ౧౮
పతికన్యమైన జీవము, పతి పశువను భేదముడిగి పతితోఁదానున్
  మతిఁ గలసియున్న తత్త్వ, స్థితిఁ బాశమువీడి ముక్తి త్రిశిరగిరీశా! ౧౯
కరుహాకర కంకపత్రా, కరుహాధిప కరుహమిత్ర కరుహ త్రినేత్రా
  కరుహాక్షిసహితగాత్రా, ద్విరసననాథాంక శ్రోత్ర త్రిశిరగిరీశా! ౨౦
డెందెము నింద్రియ వశగతి, నందించుచు నాత్మబోధ మరయక గాలం
  బిందనుకఁ జెరిపితి న్నను, గ్రిందికిఁ ద్రోయక నె మనుపు త్రిశిరగిరీశా! ౨౧
భావజుబారికి లోఁబడి, కావరమున నన్యసతులఁ గామించిన నే
  నేవగగతిఁ జెందుదు నిఁకఁ, దీవరమునఁ బ్రోవుమయ్య త్రిశిరగిరీశా! ౨౨
కోపంబునఁ గామంబునఁ, బాపంబుల మిగులఁ జేసి పతితుఁడయిన నా
  పాపధ్వాంతము బోధపు, దీపంబిడి యపనయింపు త్రిశిరగిరీశా! ౨౩
కావేరితోయ మాడకఁ, గావేరీతోయమాడి గాసిల్లితి నో
  దేవా నామనవిని విని, దేవానాంప్రియుని మనుపు త్రిశిరగిరీశా! ౨౪
నాగారిదురితమోచన, నాగారితురంగవరద నాకధునీకా
  నాగారిచర్మధరణా, శ్రీగౌరీహృన్నివాస త్రిశిరగిరీశా! ౨౫
శివజంగములకు మృణ్మయ, నవపాత్రము లొసఁగి జవ్వనముగెల్చిన ప్రా
  భవు నీలకంఠ కుమ్మరిఁ, దివురఁగ నినుఁ బెనచినట్టి త్రిశిరగిరీశా! ౨౬
గందపుఁజెక్కయు దొరకమి, కం దన కేల్రాచి నీదు కృపచే మధురన్
  బొంది భువినేలు మూర్తినిఁ, గ్రిందొందకఁ బ్రోచినట్టి త్రిశిరగిరీశా! ౨౭

పాలించిన వెసలం దన, కాలం ద్రోయించు తంత్రి కాల్దునిమిన యా
  లీలంగని చండిం గృపఁ, దేలించుచుఁ బదమొసఁగిన త్రిశిరగిరీశా! ౨౮

తరణిక్షపణాకు లిడఁగాఁ, దరణిగ నా చట్టునెక్కి తరణింపఁడె నీ
  కరుణన్ వాగీశుఁడు మదిఁ, దిరపడు శివభక్తికలిమిఁ ద్రిశిరగిరీశా! ౨౯

రాజీవాప్తాంబక శివ, రాజీవాంబకవిదార రాజకపర్ది
  రాజీవాంచితకర నీ, తేజము నాకింత చూపు త్రిశిరగిరీశా! ౩౦

కావేరి తోయ ముండఁగ, బావిని నీరాడువారి పగిదిని నిన్నున్
  సేవింపక పెఱ దయ్యము, దేవునిగాఁ గొలువనీకు త్రిశిరగిరీశా! ౩౧

హరభక్తులు నేనన్ మది, గరఁగుటయుం దొక్కశేవ గలవారము గిం
  కరులు శివ చింతయుండును, దెఱవలకూటమిని నేను ద్రిశిరగిరీశా! ౩౨

తనువుల కడరెడి యడజడి, పనుపడ నొకకోటియైన బ్రహ్మజ్ఞానుల్
  వనరరు నెలజింకయు మే, దిని పులికిని వెరవఁ గలదె త్రిశిరగిరీశా! ౩౩

ఏను న్మతిమంతులుఁ దుల, మైనన్ వందురుటయందు నన్యులు దొసఁగుల్
  పూనిన నార్యులు నేనన్, దీనత నాకెగ్గు లడరఁ ద్రిశిరగిరీశా! ౩౪

సారంగాజినవసనా, సారంగజ్యావలేపశమన వృషాంకా
  సారంగాంకవతంసా, శ్రీరంగాధీశ వరద త్రిశిరగిరీశా! ౩౫

కాలముఁగ ర్మముఁ దలఁగిన, మూలమ చెవ్వందిలింగ మోహాధ్వాంతో
  న్మూలమ మద్దుష్కృతకు, త్క్రీలమహోద్భేదకులిశ త్రిశిరగిరీశా! ౩౬

విశదంబుగ సవనంబునఁ, ద్రిశిరంబుల వేల్చి వేఁడఁ దృప్తిగఁ బురికిన్
  ద్రిశిరఃపురమను పేరిడి, త్రిశిరాసురవాంఛ లొసఁగు త్రిశిరగిరీశా!

నినుఁగాక కదల దణువును, నను పెట్లన నీవు యోగ మందఁగ లోకం
  బును భోగమందలేక మ, దిని యోగముఁగొనదె మహినిఁ ద్రిశిరగిరీశా!

మనుజులు దనకర్మచయం, బును మంత్రము పదము వర్ణ భువనము దత్వం
  బును కలలున్ శక్తియు మ్రం, దినఁ బొందెడు పతియునీవ త్రిశిరగిరీశా!

శూలిన్ విధుమౌలి దయా, శాలిన్ రక్షిత బుధాలి సరసిజబాణో
  న్మూలిం గపాలి వృజినము, ప్రేలన్ నినుదెలతునోలిఁ ద్రిశిరగిరీశా! ౪౦

ఫలమున రసమున్ బాటలొ, నలికిడిగతి సర్వజీవ వ్యాపినిఁ బ్రాఁబ
  జ్ఞులు నిన్ను నేకమనకం, దెలుపవె యద్వైతమనుచుఁ ద్రిశిరగిరీశా!

దేహపు పేరిట నేమను, దేహిగ ననువంది నీవు దేహియుఁ గావా
దేహి నినుఁ బోలదైనం, దేహియు వేఱగుదువీవు త్రిశిరగిరీశా ! ౪౨
కలుగుం బరమున మిను గరు, వలి కిత్తియు నీరు మన్ను బైరుం గుడుపం
దలిపంచకోశధాతువుఁ, దెలివొందు నొకంట నొకటి త్రిశిరగిరీశా! ౪౩
తనవలన నుద్భవించిన, యనిలానలవారిపృథ్వి నాకసమువిధం
బునఁ గోశములం బ్రహ్మము, ద్రినయన లో వెలిగవిజ్జఁ ద్రిశిరగిరీశా! ౪౪
రంగత్తరంగమాలిని,షంగ శిరోన్యస్తగంగ స్మరమదభంగా
రంగాయితగిరిశృంగా, శృంగారకురంగహస్త త్రిశిరగిరీశా ! ౪౫
ఘటజలమున రవిబింబం, బెటు చలియించినను రవికి నెట్లది లేదో
అటువలెఁ బ్రపంచచలనము, దిటముగ తేనట్టిపతివి త్రిశిరగిరీశా ! ౪౬
తనడెందెములోఁ దలఁచిన, పనులే ప్రారబ్ధముగను పాకంబగువా
నిని ననుభవింపవలెను మ, దిని నిన్నే తలఁప ముక్తి త్రిశిరగిరీశా ! ౪౭
పాయని యాణవమలముఁ, మాయాకర్మములచేత మాన్పి కరుణచే
నాయిత పశువుల నీలో, శ్రేయముగాఁ జేర్చుపతివి త్రిశిరగిరీశా ! ౪౮
పరివర్తి* వార మయనము, నరయ † దయా, కల, కరాంశ మందున‡ బర్హి
శరదము, మృగరవి నొసఁగితిఁ, దిరముగ నీ శతకమీకు త్రిశిరగిరీశా !౪౯
నారదనీరదదారద, శారద ఘనసారహారశారదశశి సీ
హారదరహీరవారిణ, శ్రీరాజితకాంతిదేహ త్రిశిరగిరీశా ! ౫౦

—। అచ్చతెనుఁగు ।—

పలమురిదాలుపు నలువయు, వెలిగారువజీరు లిబ్బిప్రేపుఁడు లెలమిం
గొలువ మునిమాపు వుత్తడి, దెలిడాలోలగము గునియుఁ ద్రిశిరగిరీశా!
జగము దొర యనక నిన్నుం, దెగడుచుఁ బెఱ బాసవాల తెగఁగొని దక్షుం
డెగపునఁ జేసిన వెలిమిఁ, దెగటార్చిన మితిగొంగ త్రిశిరగిరీశా ! ౫౨
నలువతలపునుకచేతం, బొలయం బిత్తలిగ వెదురుపొలము నిరాబా
రుల గరితలఁ బరికించిన, తెలిడాల్ దిరిపరిపిగావె త్రిశిరగిరీశా ! ౫౩
గట్టెత్తు పొలసుదిండిని, బొట్టనవ్రేలదుమ జాలిఁబొగడఁగఁ గోర్కుల్
వెట్టుచు మన్నించిననీ, దిట్టతనముఁ బొగడఁదరమె త్రిశిరగిరీశా ! ౫౪

*పరివర్తి 24. †అయనాంశము భాగలు 21, కలలు 31, వికలలు 18, ‡అనలసంవత్సరము, చైత్రెనెల.

ఉక్కరి రక్కసు లిక్కన, ముక్కొటికలు మ్రొక్కనొక్క సొలుగిఁ గ్రక్కున వి
ల్లెక్కిడి మిక్కిలికంటు, గ్రిక్కిరియంగాల్చి నిక్కుఁ ద్రిశిరగిరీశా! ౫౫
తిగతలల నల్లద్రావుఁడు, జగముల దొర నీవయనుచు సరగునఁజూడన్
తిగతలలవ్రేసి వేల్చిన, తెగువం గని కోర్కులిడిన త్రిశిరగిరీశా! ౫౬
ననుపున నీవే నను గ్రై, కొనవలయుంగాక నిన్నుఁ గూడుటకే నొ
క్కనిగరపుచెయిదమొనరుపఁ, *దెరుగానని కసటుఁడైతిఁ ద్రిశిరగిరీశా!
పెఱతెఱవల నేలగలపయి, నెఱతమకముపూని రవళి నిక్కుచు నిన్నున్
గుఱిగొని తలఁపని నన్నే, తెఱఁగున మన్నింపఁ గలవొ త్రిశిరగిరీశా! ౫౮
నిను గా కన్యులునొరులే, దని తలఁచుచు డింగరీండ్రు లందిరి నిన్నే
ననదుస్థ జగమెనేటని, దినుమం గూర్చొనుచుఁజెడితిఁ ద్రిశిరగిరీశా! ౫౯
కొందలిరు టజ్జు డొందెను, నొందిరహిం గందళించి యూఱట నొందుం
జెందకఁ గొందలమందకఁ, గ్రిందొందకఁ దలఁపఁజేయు త్రిశిరగిరీశా! ౬౦
వారువ మెక్కుడుమెకముం, గారవముం గీము నాలు గలిమియు నిసువుల్
దారికిఁ దోడగునో తుదఁ, దేరుటకీ యజ్జుగాక త్రిశిరగిరీశా! ౬౧
పెఱవారికెగ్గొనర్చుచుఁ, గొఱ మాటలఁ దూలనాడి కొఱగామికి లో
వెఱవక పీఁగెడు నాకున్, దెఱకువమెత్తెఱఁగు గలుగుఁ ద్రిశిరగిరీశా!
ఆలుం బైకము బిడ్డలె, మేలంచును నీదు తమ్మి మెట్టలఁ దలఁపం
జాలనినన్ బెంద్రోవం, దేలఁగ నెటుసేయఁగలవొ త్రిశిరగిరీశా! ౬౩
పలుగాకులఁ గూడుక చెడి, పలుగాఁకల డస్సి బోటుఁ బొలసుఁడైతిన్
వెలివాఁడని వెలిఁద్రోయకఁ, దెలిజాల్ జడదాల్ప మనుపు త్రిశిరగిరీశా!
కలిమిగల యలవి నులిపులు, మెలకువ నెలకొలిపి తెలిసి మెలఁగిరుబలిమిన్
నెలగలు దలఁగిన నలమరి, తెలియఁగలరు తెలివినెలమిఁ ద్రిశిరగిరీశా!
నను నెగ్గాడిన సైచుట, యును గా కలవారు గొడిమె నొడఁగూడెడి బి
త్తను బడుదురొకో యనుచుము, దినివగ చెడికఱదయొసఁగు త్రిశిరగిరీశా!
వెన్నుని తలపూసల చా, లెన్నికగా నఱుతఁదాల్చి యింపుగునియునిన్
వెన్నుఁడు నలువయు నుండఁగఁ, దిన్నం డెదఁ జక్కనెఱఁగెఁ ద్రిశిరగిరీశా!
నిను గని వలచుచుఁ బొలసుం, దిన నిడి నీ కంటఁ జెవుల తెగఁగని తన కం
డ్లను బెఱికి యిడిన కన్నప, దిన మాఱిట నిన్నుఁగలసెఁ ద్రిశిరగిరీశా! ౬౮

* తెన=తెన్ను=మార్గము.

తనపాపని సిరియాలుని, వనరకఁ దలిదండ్రి గోసి వండిడఁ దినక్
గను మొఱఁగుచుఁ జిఱుతొండనిఁ, దినుమనఁ బెం దెరువుఁ జేర్చు త్రిశరగిరీశా!
నిక్కముగ నక్కటిక మీ, యక్కున మక్కువయుఁ దక్కు నననాసుక్త్వుల్
నక్కాడి మనుపు మక్కటఁ, ద్రిక్కులు నెద్దడియు మ్రుక్కఁ ద్రిశరగిరీశా! ౭౦
ప్రేముడి సుందరుఁ గోరికఁ, బ్రామిడి గోసంగి వగిది వచ్చినసీకున్
సోమాసి మారుఁ డిగిరిక, దీమసమున నిడఁడె యరితిఁ ద్రిశరగిరీశా! ౭౧
సిగఁ జూచితి నని బొంకిన, దుగినునిఁ దిట్టఁగను మదిని దురపిలి వేఁడక్
డాగరడఁచి మచుపవే యీ, తిగతలగట్టునను బెట్టి త్రిశరగిరీశా! ౭౨
కావరమునఁ గావించిన, కావలముం గాలిచి కనికరమున నన్నున్
గావుము కావిరి కుత్తుక, దేవర దేవుడు సడల్చి త్రిశరగిరీశా! ౭౩
తుప్పటిల న్నినుఁ బూజల, మెప్పింపఁగ లే నసైన మిసిమింతునినా
నిప్పచ్చరములఁ దోర్చుచుఁ, దెప్పునఁ బాతఱలనిమ్ము త్రిశరగిరీశా! ౭౪
అన్నులమిన్నల నెన్నుచుఁ, బన్నుగ నన్నొనఁగియున్న బన్నము వడితిన్
గన్నడ పన్నకఁ గన్నటి, దిన్నగ మన్నింపు మన్న త్రిశరగిరీశా! ౭౫
సాఁకుట కీవుండఁగఁ బెఱ, సోఁకుల వేల్పులుగఁ గొలిచి సొలపొందిమదిన్
జీకాకు వడయనీక నె, తేఁకువ ననుఁ బ్రోవుమయ్య త్రిశరగిరీశా! ౭౬
నెల ప్రొద్దు గేస్తునేలయుఁ, జలినట్టుం డిగ్గి గాడ్పుఁ జదలగు నీ ని
ల్వ్వల దచ్చి మదినిఁ గనుఁగొను, దెలివిం గనికరము నొసఁగు త్రిశరగిరీశా!
తనయాలి కనరు మానుప, నిను గుంటెన వోవఁ బనిచి నీరింకిన గుం
టను మొసలినోట నిసువం, దిన సుందరుఁ బాటనలరు త్రిశరగిరీశా! ౭౮
తీవంచమోము గ్రుడ్డులఁ, గావించుచు మనిపి దోర్చి కప్పుచుఁ జేర్చుం
జావంచమోముఁ దమ్ముల, క్రేవన్ మదినుపఁ జేయు త్రిశరగిరీశా! ౭౯
తెగులన్ వగవకఁ దగనన్, దుగమొగముల వేల్పుకంటి తొగ చెలిదాల్పా
నగమేన మగువ బిగిచిన, తిగమొగములజోగి మనుపు త్రిశరగిరీశా! ౮౦
సరివడు దొరమ్రుందిన వం, దురి యచటు దొరంగ లేక నొగులుట తనతీ
పురమనుచు నిన్నెతలఁచెడి, తెరు వొసఁగుము పదిలముగను త్రిశరగిరీశా!
తరమెఱుఁగని దొర లందఱిఁ, బరికించుచు లేచి కొలిచి బ్రతుకుగనక వే
సరి వనటకడలిమునుఁగకఁ, దిరముగ నిన్ దలఁపఁ జేయు త్రిశరగిరీశా! ౮౨

కొండెముఁ జెవిఁగొని చదువరి, తండంబుల కెగ్గొనర్చు తగవరినోముపుల్
మెండుగ వినియెడి దొరలను, దిండికిఁగాఁ గొలువనీకు త్రిశిరగిరీశా! ౪౩

జానుగుకర్ణదొరలకుఁ గను, జానుగుమే లోకనిఁగ ఆది చక్కాఁకు దొరల్
పూని పలుకొంపముంతురు, దీనన్నను గొలువనీకు త్రిశిరగిరీశా! ౪౪

చిచ్చుం జొచ్చునె చెద లీ, దచ్చియొకల్ మెచ్చుమదినిఁ దలఁచిన వారిన్
వ్రచ్చునె నిచ్చలు గాములు, దిచ్చమొగం బచ్చువడక త్రిశిరగిరీశా! ౪౫

జగములఁ దుదిరేయినిఁ దన, సెగకంటం గాల్చి మగుడఁ జేయుచుఁ గూల్చున్
జగజెట్టియగుచు నిక్కెడి, తెగుదారియు నొక్కఁడీవ త్రిశిరగిరీశా! ౪౬

అన్నిట నుండుచు నెఱుఁగుదు, వన్నియు ననుమాటనిక్క మన నాయెదలో
నున్నవి నేల యొనర్పవు, తిన్నగ నీవెఱిఁగి జోకఁ ద్రిశిరగిరీశా! ౪౭

వలపిలు ములుచేమంతుల, నలముచుఁ దెక్కలినిఁ బరాంతకచోరున్
దొలుకించి మంటివానలఁ, దెలియం బ్రోలడఁచిదోర్చు త్రిశిరగిరీశా! ౪౮

సారముని పాపజగముం, జేరి పొదల్ దెచ్చిపెంచి చేమంతినసల్
గూరిచి నినుఁ బూజించిన, తీరుంగని ముత్తియిడిన త్రిశిరగిరీశా! ౪౯

కనికనకఁ గనులు నలసటఁ, కనికరములఁ బెనఁగు నదను గని కరమునన్
గని కరమున ననుసుదుప మ, దినిఁ దలఁచుచుఁ దెలతునిపుడె త్రిశిరగిరీశా!

కూరిమి నిను మ్రొక్కెడి చను, బేరులకొమ బిడ్డకుట్టు పెనఁగొనసీఛ్రన్
జేరి తలిఁ బోలి ప్రోచిన, తీరెన్నఁగ నాదుతరమె త్రిశిరగిరీశా! ౫౧

రమ్మన్నరావు రానివి, పొమ్మనరాఁ గలవి యెందుఁ బోనేరవనన్
ఇమ్ముగనీ యరు లలవడఁ, ద్రిమ్మరి యెవియేనివచ్చుఁ ద్రిశిరగిరీశా! ౫౨

తెలివిచెడిమందు నదనున, నలసట నిన్నెదను దలఁప నగుమనోలేనో
వలపున నిపుడేతలఁచుచుఁ, దెలతును బెంద్రోవఁజెందఁ ద్రిశిరగిరీశా! ౫౩

తెగులం బడి వగవఁగఁ జముఁ, డెగపునఁ బట్టీడ్చునప్పు డీవెనసి ననున్
దిగుచుచు నీలోఁ జేర్పుము, తెగడక నామనవి నింత త్రిశిరగిరీశా! ౫౪

చెడుగడు గుడిచెడి యడజడిఁ, గనవడి నీయడుగు లెడఁదఁ గడలెడిబెడఁగుల్
గొడవసుడివడఁగఁ దడయునె, దిఢమని కడకెడలలేక ద్రిశిరగిరీశా! ౫౫

నిన్నొక్కటివేఁడెద మఱి, నన్నిఁకఁ బుట్టంగఁ జేసి నలియింపక నీ
హొన్నజ్జదమ్మిగెలపునఁ, దిన్నగ ననుఁ జేర్చిమనుపు త్రిశిరగిరీశా! ౫౬

పొట్టకును జెనఁటి దొరలను, నిట్టూర్పనఁ గొలువనీక నీయజ్ఞటసల్
పుట్టువుల మదినిఁ దలఁచుచు, దిట్టత నినుఁ గొలువఁజేయు త్రిశిరగిరీశా!
చెలిమిని యలుకం గూటమి, నలసట మెయిమఱచియరితి నైనను దలఁపం
గలవారి జముఁడు సెనకునె, తెలియఁడె నీయజ్ఞబలిమిఁ ద్రిశిరగిరీశా! ౯౮
మిసిక వెన్నెలు *తలమల,యునికిజొహా †రుడ్డమోమును త్తరిడింగి
ళ్లన దుక్కణ టెంకణమిడి, తిని మనుపుము చెంగనాలు త్రిశిరగిరీశా ౯౯
చిన్నిదపు గట్టువిలుతుఁడ, చిన్నిపువుల్ గూర్చినిఋచుఁజివురుటఋగులన్
జిన్నిపువుల్ వెట్టెద నసుఁ, దిన్నగమన్నింపుమన్న త్రిశిరగిరీశా! ౧౦౦

అష్టవిధకందము.

గర్భప్రథమకందము.

తలఁతును నెలడాల్ నిలువుర్, దలనెల నిలుపుని వెలిమల తలగలు నెలవుర్
నిలుపునిఁదలజాల్ బలియుని, నెలగలుగలుగను బలుకుల నెలవుర్ గలయర్.

గర్భద్వితీయకందము.

నెలడాల్ నిలువుర్ దలనెల, నిలుపుర్ వెలిమల తలగలు నెలవుర్ నిలుపుర్
దలజాల్ బలియుని నెలగలు, గలుగర్ బలుకుల నెలవునిఁగలయర్ దలఁతుర్.

గర్భతృతీయకందము.

తలనెల నిలుపుని వెలిమల, తలగలు నెలవుని నిలుపునిఁ దలజాల్ బలియున్
నెలగలుగలుగనుబలుకుల, నెలవునిఁగలయర్ దలఁతును నెలడాల్ నిలువుర్.

గర్భచతుర్థకందము.

వెలిమల తలగలు నెలవున్, నిలుపునిఁ దలజాల్ బలియుని నెలగలుగలుగర్
బలుకుల నెలవున్ గలయర్, దలఁతును నెలడాల్ నిలువునిఁదల నెలనిలుపుర్.

గర్భపంచమకందము.

నిలుపునిఁ దలజాల్ బలియుని, నెలగలు గలుగను బలుకుల నెలవున్ గలయన్
దలఁతును నెలడాల్ నిలువున్, దలనెలనిలుపుని వెలిమలతలగలు నెలవున్.

గర్భషష్ఠకందము.

తలజాల్ బలియుని నెలగలు, గలుగను బలుకుల నెలవునిఁ గలయన్ దలఁతున్
నెలడాల్ నిలువున్ దలనెల, నిలుపున్ వెలిమలతలగలు నెలవున్ నిలుపున్.

---

* తలమల=శిరగిరి=త్రిశిరగిరి, † రుడ్డమోము=నాలుగుమోములుగల నలువ.

గర్భసప్తమకందము.

నెలగలు గలుగను బలుకుల, నెలవున్ గలయన్ దలఁతును నెలడాల్ నిలువున్
దలనెల నిలుపుని వెలిమల, తలగలు నెలవుని నిలుపునిఁ దలజాల్ బలియున్.

గర్భాష్టమకందము.

పలుకుల నెలవున్ గలయున్, దలఁతును నెలడాల్ నిలువునిఁ దలనెలనిలుపున్
వెలిమల తలగలు నెలవుని, నిలుపున్ దలజాల్ బలియుని నెలగలుగలుగన్.

నెలడాల్	చంద్రజ్యోతివంటి కాంతిగల
నిలువున్	ఒడలుగలవానిని
తల	తన శిరస్సునందు
నెల	అర్ధచంద్రుని
నిలుపున్	దక్షప్రజాపతియొక్క శాపపీడితుఁడై రూపఱకుండునట్లు తన జటామకుటమందు స్థిరముగాఁ జెక్కి నిలిపిపెట్టుకొనినవానిని,
వెలిమల	శ్వేతవర్ణమైన రజతాద్రియొక్క
తలకలు	శిఖరమును
నెలవున్	తనకు వాసస్థానముగాఁ గలవానిని
నిలుపుని	బ్రహ్మవిష్ణురుద్రాదులును సకలచరాచరప్రపంచములును మహాప్రళయకాలమందు రూపఱి నశింపఁగాఁ దానొక్కఁడే కాలముఁ గర్మములుఁ దలఁగి స్థిరముగా నిలుచువానిని
తల	శిరస్సునందు
జాలు	గంగానదిని ధరించుకొన్న
బలియుని	లోకైకవీరుని
పలుకుల	సకలభాషలకును
నెలవున్	వాసస్థానముగా నుండువాఁడైన పరశివమును
నెలగలుగలుగన్	ఇహమందు ధర్మాచరణమునకుఁ దోడుగానుండు సంపదలు నాకు సిద్ధించుటకును
కలయున్	పరమందు పశు పతి యనుభేద ముడిగి యద్వైతముగాఁ గలసికొనుటకును
తలఁతున్	హృదయమందు సదాధ్యానించెదను.

EPILOGUE.

శ్రీచిల్లవారి కులజల, ధీచంద్రసుధీవిశాలు దీనార్తిహరున్
యాచకజనకల్పకు గృ, ధ్రాచలషణ్ముఖపదస్థితాంతఃకరణున్.

అతిరుద్ర సోమసవనము, నతులిత వస్తు ప్రదర్శ నాదులచే నీ
క్షితి 'రాజ' బిరుదమందిన, హితభాషణు వేంకటేశ్వరెట్టమహీశున్.

వ్రంతలఁ బాపుచు మానిసి, బంతుల యొద్దడిని దోర్చి మన్నించుచు వే
ఱంతుల కూటమిఁ గోరఁ డో, కింతయు శ్రీవేంకటేశ్వ రెట్ట బిడౌజున్.

మనుపఁదగు మేరగలఁడని, వనటంబడనీక నాదు మనవియొకింతం
గొనికోర్కులొసఁగి మదిఁ జన, వెనసిన శ్రీవేంకటేశ్వ రెట్టక్షితిపున్.

మును *నల్లద్రావుఁడేటన్, మినుమణి విల్లందునాఁడు వింటికినేగన్
గనివనరి పొగలుచుండు మ, దిని దీమస మొదవఁ దలఁచి తేజితినిటులన్.

నాకున్ జననస్థలము పి, నాకియుఁ ద్రిశిరాఖ్యదనుజనాథుని కోర్కుల్
వీక నిడి గ్రావరంగముఁ, జేకొని త్రిశిరఃపురంబుఁ జేరివసించున్.

ప్రేమను మాతృనిధానుం, డై మాతృసురూప మొంది యంగనఁబ్రోవన్
దా మహి సుగంధికబరీ,వాముండౌ మాతృభూతపరమున్ మదిలో.

స్తవ మొనరించుచు భక్తిం, దవిలి శివున్ సంతతంబుఁ దలఁచిన హృదికిన్
శివబోధము దృఢశుద్ధియు, భవబంధవిముక్తి గలుగుఁ బరమునటంచున్.

అవివేకతమస్తరణిన్, భవసాగరతరణు శమనభంజకరణుఁ గై
రవపతిధరణుఁ జతుర్దశ, భువనైకశరణ్యు శేషభుజగాభరణున్.

కర్మత్రయపీడితతను, ధర్మత్రయ మణఁచి పరము దానను దెలివిన్
నిర్మలనిత్యానందవి, నిర్మాతునిఁ బొగడనైతి నిష్కలపరమున్.

మును నాకలోకనాథుం, డనువుగ సేనాని సాయ మందినవిధ మే
ననుపమకవివర్యులదయఁ, గొనిపొగడితినిందుగొనముగొందురువిబుధుల్.

సారగ్రాహరసజ్ఞులు, ధీరమతిం బరులతప్పుఁ దేఱరు కుకవుల్
క్రూరమతి లాతినేరము, లేటితమచిరాకుగుప్ప లెఱుఁగరొకింతన్.

శ్రీసోమాస్కందమూర్తయేనమః.

---

* రాక్షససంవత్సరము, ధనుర్మాసము మొదటితేది.

శృంగారరసము

కనకదండి గోపాలకృష్ణశాస్త్రిగారు—విజయనగరము.

రసశబ్దమునకు "రస్యతే ఆస్వాద్యత ఇతి రసః" అని వ్యుత్పత్తి. ఆస్వాదింపఁబడునదిగాన రస మని పిలువఁబడుచున్నది. ఈరసము విభావాదులచే స్థాయి చక్కగఁ బరిపుష్ట మైనపుడే స్ఫూర్తిని జెంది సర్వజన హృదయాహ్లాదక మగును. ఈవిషయమే ప్రతాపరుద్రీయమున నిట్లు స్పష్టపఱుపఁబడినది.

"విభావానుభావసాత్త్వికవ్యభిచారిసామగ్రీసముల్లాసిత స్థాయిభావోరసః—"

ఇట్టిరసమే కావ్యమునకుఁ బ్రధానభూతమైనది. కనుక కవి తనకావ్యమున సర్వప్రయత్నములచేతను రసమునే ముఖ్యముగఁ బోషింపవలయును. ధ్వనికారుఁడు మన కీవిషయమునఁ బ్రమాణము.

కావ్యస్యాత్మా సఏవార్థః తథా చ దికవేః పురా
క్రౌంచద్వంద్వవియోగోత్థః శోక శ్శ్లోకత్వమాగతః. 1 ఉ. 5 కా.
"వాచ్యానాం వాచకానాంచ యదౌచిత్యేన యోజనమ్
రసాదివిషయేణైతత్ కర్మముఖ్యం మహాకవేః" 3 ఉ. 32 కా.

వృత్తికారుఁడుకూడ నీకారికావృత్తిలో స్పష్టముగఁ జెప్పియున్నాఁడు.
"అయమేవహిమహాకవే ర్ముఖ్యవ్యాపారో యద్రసాదీనేవ ముఖ్యతయా కావ్యార్థకృత్య తద్వ్యక్త్యనుగుణత్వేన శబ్దానా మర్థానాం చోపనిబంధనమ్"

ఇట్లు కావ్యమునకుఁ బ్రధానభూతమైన రస మాలంకారికులచే శృంగారము, హాస్యము, కరుణము, రౌద్రము, వీరము, భయానకము, బీభత్సము, అద్భుతము, శాంతము, నని తొమ్మిదివిధములుగ విభజింపఁబడినది. విద్యానాథునిశ్లోకము నిటఁ బ్రమాణముగ నిత్తును.

"శృంగారహాస్యకరుణాః రౌద్రవీరభయానకాః
బీభత్సాద్భుతశాంతాశ్చ రసాః పూర్వై రుదాహృతాః" రసప్రకరణము.

ఈ తొమ్మిది రసములలోను శృంగారరసము ప్రధానభూత మయిన దని చెప్పవచ్చును. ఏలన-నిది చాలసుకుమార మైనదయి సర్వజనహృదయాకర్షకముగ నున్నదిగనుక-సర్వప్రాణులకు శృంగార మనుభవమునం దుండుటచేతను నదియె సర్వజనులహృదయముల నాకర్షించుటకు సమర్థమై యున్నది. వీరాదు లన్ననో సర్వజనసామాన్యములు కావు. ఆయాయి పురుషులకే యనుభవవిషయము

లగును అందుచే సర్వజనసామాన్యము లనుటకు వీలులేదు. శృంగార మన్ననో నిత్యము నందఱకు ననుభవ విషయ మగుటచే నందఱకు నది యాహ్లాదకర మగుచున్నది. కాన శృంగార మితరములైనరసములలోను బ్రధానమైన దనుటకు సందేహము లేదు. యీవిషయమునే ధ్వనికారుఁ డిట్లు చాటుచున్నాఁడు.

"శృంగారఏవ మధురః పరః ప్రహ్లాదనోరసః
తన్మయం కావ్యమాశ్రిత్య మాధుర్యం ప్రతితిష్ఠతి" 2 ఉ. 8 కా.

* వృత్తికారుఁడు కూడ నీవిషయమును దృఢపఱిచినాఁడు.

"శృంగారరసోహి సంసారిణాం నియమే నానుభవవిషయత్వాత్ సర్వరసేభ్యః కమనీయతయా ప్రధానభూతః"

రసవిరోధచర్చలోఁ జాల సుకుమారమైన దీరస మని చెప్పియున్నాఁడు. మఱియునిది యితరరసములకంటె మిక్కిలి కావ్యమునకు శోభాదాయక మనియు సర్వజనాకర్షక మనియుఁ గవి దానియందు శ్రద్ధకలవాఁడై యుండవలయు ననియుఁ జెప్పినాఁడు.

"విరోధ మవిరోధం చ సర్వత్రేత్థం నిరూపయేత్
విశేషతస్తు శృంగారే సుకుమారతరోహ్యసౌ" 3 ఉ. 28 కా.

"జ్ఞేయా నున్ముఖీకర్తుం కావ్యశోభార్థమేవవా
తద్విరుద్ధరసస్పర్శ స్తదంగానాం నదుష్యతి." 3 ఉ. 30 కా.

"అవధానాతిశయవాన్ రసే తత్రైవసత్కవిః" 3 ఉ. 29 కా.

సాధారణముగ నొకనిని సన్మార్గమునకుఁ ద్రిప్పవలయు నన్న వానిహృదయమున కాహ్లాదకరము లగువాక్యములచేఁ గదా వానికి నీతి గఱపవలయును. కాని టగువాక్యములచే వానికిఁ బ్రవృత్తి కలుగదు కనుకనే భాసశూద్రకకాళిదాసాదిమహాకవులు సర్వజనహృదయానందకము లగువాక్యములచే నీతి నుపదేశింపఁ బూని తమప్రబంధములు సర్వజనమనోరంజకములుగ నుండుటకుఁ గాను వానిలో సర్వజనసాధారణమైన శృంగారమునే చొన్పినారు.

ఇప్పటికి సంస్కృతప్రబంధములు నూటికి నెనుబది పైఁగా శృంగారరసపూరితము లగుటకుఁ గారణ మేమి? శృంగారరసము సర్వరసములకంటెను సర్వజనహృదయాహ్లాదకరమగుటయే. కనుక శృంగారరసమురసములలోని కెల్ల రాజ మని చెప్పుట యెంతమాత్రము నతిశయోక్తి కాఁజాలదు.

---

* ధ్వనికారుఁడు, వృత్తికారుఁడు వేఱని వఱొకవ్యాసమున నిరూపింపనున్నాను.

భోజుఁడు కూడఁ దన సరస్వతీకంఠాభరణమున శృంగారమునకే ప్రాధాన్య మిచ్చియున్నాఁడు. శృంగారమే యభిమత మైనరస మఁట. అట్టి శృంగారమందు కవి మగ్నుఁడైననాఁడే కావ్యము మనోరంజకముగనుండు నఁట లేనిచోఁ గావ్యము నీరసమేనఁట.

"రసాభిమానో హంకారః శృంగార ఇతి నీయతే
యోర్థః తస్యాన్వయాత్కావ్యం నీరసం సర్వమేవతత్."
"శృంగారీచేత్కవిః కావ్యే జాతం రసమయంజగత్
సఏవచే దశృంగారీ నీరసం సర్వమేవతత్."

మఱియు నాలంకారికులందఱుఁగూడ దీనికే యగ్రస్థానము నిచ్చియున్నారు. శృంగారరసమునకుఁ బూర్తిగ విభావానుభావాదులను సోదాహరణముగ వివరించుచు వీరాదులకు వానిని వివరించియుండలేదు. ఊహ్యాము లనిరి. ఏలన నిదియే సర్వజనాదరణీయముగాన దీనిని బాగుగ వివరించి యితరరసములకు వారె యూహించుకొనఁగల రని కనుక శృంగారమే ప్రధాన మైన దనుటకు సందియము లేదు.

రసముఁ జెప్పునప్పుడు గూడ "శృంగారహాస్యకరుణాః" అని మొదటనే చెప్పఁబడిన దీశృంగారము కనుక దీనికే ప్రాధాన్య మిచ్చిరి యాలంకారికు లనుటకు సందియము లేదు:

కనుక సుకుమార మైన యీశృంగారరసము సర్వజనహృదయాహ్లాదకర మగుటచేతను అన్నిరూపకములందుఁ జొప్పఁబడుటచేతను నాలంకారికులచే నగ్రస్థాన మీయఁబడియుండుటచేతను వీరము మొదలగు నితరరసములకన్న నిది యందఱికి ననుభవవిషయ మగుటచేతను రసములలో నిది రాజ మని యనుట యతిశయోక్తి కాఁజాలదు.

గ్రంథస్వీకారము.

---

(1) బ్రహ్మపురాణము:—ఇయ్యది యష్టాదశ పురాణములలో మొదటి పురాణమున కాంధ్రానువాదము. బ్రహ్మాండపురాణము, వాల్మీకిరామాయణాది మహాగ్రంథముల రచించి ప్రసిద్ధి నొందియున్న కావ్యస్మృతితీర్థ బిరుదాంచితులు బ్ర॥ జనమంచి శేషాద్రిశర్మగారు రచియించినది. ఇతర పురాణములలో నుండు విషయములు పెక్కు లిందును గానవచ్చుచున్నవి. శ్రీ కృష్ణావతారకథన మిందు విపులముగా నున్నది. ఓఢ్రదేశము తద్దేశమున నుండు కోణార్క పురుషోత్తమక్షేత్రముల మహాత్మ్య మిందు విశేషముగ వర్ణింపఁబడినది. 718 పుటల మూలము నైదాశ్వాసములును గలది. ప్రథమాశ్వాసము 33 అధ్యాయముల కథ 1562 పద్యములు. ద్వితీయాశ్వాసము 30 అధ్యాయముల కథ 1299 పద్యములు. తృతీయాశ్వాసము 27 అధ్యాయములకథ 1197 పద్యములు. చతుర్థాశ్వాసము 27 అధ్యాయముల కథ 1288 పద్యములు. పంచమాశ్వాసము 18 అధ్యాయముల కథ 772 పద్యములు. శర్మగారి కవితాధారయనర్గళమైనది. శైలి సుప్రసన్నము. మృదుపాకము. ఈపురాణము నిజముగాఁ బురాణశైలిం జదివి యానందించుట కెంతయు ననుకూలముగానున్నది. మచ్చునకుఁ బద్యములు.

చ. పరశివ సంశయంబు మదిఁ బాటిలు నేని మనుక్తియం దదే
వరుసను నిన్ను నీక్షణమె భర్తగ నే వరియించుదాన నా
దరమున నన్గ్రహింపుము సతంబును నిన్ మది నిల్పియున్న యీ
తరుణిని బ్రోవఁగాఁ దగదె దర్పకభంజన సోమశేఖరా! పుట180.ప.1519.

చ అనుపమతీర్థరాజమునయం దోగి స్నానము చేసి శ్రీహరిం
గనిన నరుల్ సువర్వపురకన్యతరస్థలుల న్వసింతు రా
మనుజుల కాయమాలయముమాట వినంబడకుండు; నుత్కలం
బునఁదగుక్షేత్రవర్యమునఁబుణ్యదమైతగుదానియందునన్.232.పుట401ప.

ఈ పురాణము వెల రు 4-0-0. కడప మునిసిపల్ హైస్కూలునందుఁ బ్రధాన పండితులుగా నున్న శర్మగారి యొద్ద దొరకును.

---

(2) కావ్యామృతము:—అల్లంసెట్టి అప్పయ్య కవిగారు రచించినది. రెండు భాగములు ఇందు ధ్యానము, కవి, రాఘవప్రశంస, ప్రబోధము, జన్మము, కోకిలగానము- ఇట్లు ముప్పది విషయములగు పద్యములు 69 పుటలలోఁ జక్కని కాగితముల మీఁద ముద్రింపఁబడినవి. ప్రసిద్ధులగు ననేకులు పండితులుఁ గవులు దీనిపై నిచ్చిన సదభిప్రాయములు గూడ నిం దాదిని ముద్రింపఁబడియున్నవి. అప్పయ్య కవిగారు రచించిన యీదలి పద్యములు చక్కఁగా నున్నవి. చాలవఱకు లోకానుభవమున వ్రాసినవి. కొన్ని యందందు వాడుకలో నున్న విషయములుం గలవు. విషయమునకుఁ దగిన రీతిని బద్యములు పదప్రయోగాదుల నొప్పుచున్నవి. వకుళమాలికలో (శ్రీ) రామకృష్ణ పరమహంసగారి సూక్తులు కొన్ని గలవు. ఆ పద్యములు చదువం దగినవి. కొన్ని పద్యములు మచ్చు చూపఁబడును.

గీ. అఖిల జగదంతరాత్మకుఁ డగు మహేశు, నర్థిఁ బ్రార్థింపు మెచ్చోట నైననీవు
చీమ ప్రాకుడు సొద నైనఁ జెవిని దార్చు,నట్టిదేవుండు వినఁడె నీయార్తరవము.

గీ. పొలము కడులోఁతుగా దున్నుకొలఁది సస్య
సమితి ఫలియించుచుండు విస్తారముగను
బుద్ధి వికసించునంతకుఁ బూతమగుచుఁ
దివ్యతరమై జ్ఞానంబు తేజరిల్లు.

దీని వెల రు. 0-8-0 విశాఖపట్టణము జిల్లాలోని పొందూరులో విద్యాసద్వాక్ చదువుల నందికేశ్వరరావుగారి యొద్ద దొరకును.

---

(3) జ్యోతిర్వినోదిని:—కన్నడము. శ్రీ కంఠీరవ నరసింహరాజ పరిపోషిత కర్ణాటక వైజ్ఞానిక గ్రంథమాల కిది ప్రథమపుష్పము. మైసూరు దొరతనమువారి పవనశాస్త్రశాలాధ్యక్షులగు శ్రీయుతులు నంగపురం వేంకటేశ అయ్యంగారు బి. ఏ. గారు దీని యనువాదకులు. కర్ణాటక సాహిత్యపరిషద్గౌరవ కార్యదర్శులచే నాదరపూర్వకముగాఁ బంపఁబడినది. నామముచేతనే యీపొత్తమున నేమి యుండునో తెల్లమగుచున్నది. 287 పుటలు క్రౌను సైజు. ఆంగ్లగ్రంథము నుండి యనువదింపఁబడినను, ముక్కకు ముక్క చేర్పక కన్నడములో నే రీతిని రచించినఁ బరివర్తన మని తోఁచునో యారీతిని రచియింపఁబడినది.

సంతోషవిషయము:—కర్ణాటక సాహిత్యపరిషదధ్యక్షు లయిన సర్ శ్రీ కంఠీరవ నరసింహరాజ ఒడయర్ బహద్దరు వారు కర్ణాటకులలోఁ బెక్కురలోఁ గల మూఢవిశ్వాసమును నజ్ఞానమును దొలఁగించి వారికిఁ బ్రకృతినియమముల విషయములలోఁ దెలివిని గలిగించుటకయి సులభగ్రాహ్యము లగు వైజ్ఞానికపుస్తకములను వ్రాయించి ముద్రించి ప్రకటించుటకయి 2500 రూపాయలు పరిషత్తునకు దయచేసి రఁట. ఆ ధనములో నుండి పరిషదుపాధ్యక్షు లయిన రాజసభాభూషణ కర్పూర శ్రీనివాసరావుగారు, అనువాదకు లగు వేంకటేశ అయ్యంగారి యొద్దనుండి యీ జ్యోతిర్వినోదిని దీసికొని పరిషత్సభ్యులతో నాలోచించి 500 రూపాయలు బహుమాన మొసఁగి యీ రీతిం బరిషత్పక్షమునఁ బ్రకటించిరి. ఇట్టి గ్రంథములు మన యాంధ్రమునను వెలసి విజ్ఞానమును వెలయించుటకయి యాంధ్రులలో నుదారు లగు విత్తాధికులు భాషా సంస్థలకుఁ దోడ్పడుదురుగాక. ఆంధ్ర సాహిత్యపరిషత్తు వెనుక నిట్టిదొక జ్యోతిశ్శాస్త్రసారమును బ్రకటించినది గాని యది జనాదరమును గోరుచున్నది.

ఈ జ్యోతిర్వినోదిని, జ్యోతిశ్శాస్త్రసంబంధము లగు సమస్త విషయములను దెలుపుచున్నది. దీని వెల రెండు రూపాయలు. బెంగుళూరు కర్ణాటక సాహిత్య పరిషత్కార్యాలయమున దొరకును.

---

(4) కష్టజీవి:—శ్రీయుత తంగిరాల రామనాథశర్మగారిచే రచియింపఁబడినది. నెల్లూరు, ఆంధ్రసాహితీగ్రంథాలయమున వెలువడిన మొదటి గ్రంథము. 500 పద్యములు.

క. శృంగారము వేదాంతము, సంగద్వితయంబుగాఁగ నమిత ప్రౌఢిన్
రంగారఁ గష్టజీవిన్, సంగడికాండ్రకు మిగుల సంతస మొదవన్.

గీ. రసికులకు రమ్యమై యించురసము బోల్లు
పోల్కి ప్రతిపద్యమున మేల్మిఁ బొలుచునటుల
రసికురాండ్రకు రమ్యమై రసన జుంటి
తేనె చందాన నంత వర్ధిల్లునటుల.

గీ. యోగులకుఁ బుణ్యపాప మిశ్రోగ్రకర్మ
కాష్ఠములు గాల్ప శుచియాచుఁ గ్రాలునటుల
యోగినుల కపవిత్ర సంభోగమోహ
జలధి గడవంగ నావయై వెలయునటుల,

క. కవితాకంఠాభరణుఁడఁ, బ్రవిమలమతి రామనాథ ప్రఖ్యాతాఖ్యుం
డవు నే విరచించితి మా,ధవగురు కరుణాకటాక్ష ధన్యాత్ముఁడ నై.

అని కవిగారు గ్రంథములోని సారమును దుదను దెల్పినటులుగా నీపద్యకావ్యము తనరుచున్నది. ప్రతిపద్యమును రసాస్పదముగ నున్నది. తఱచుగఁ బద్యంబుల ననుగుణము లగు ననేక లోకోక్తు లు గలిగి విడువక చదువ మనసు పుట్టించుచున్నది. ధారగల కవిత్వము. ఉచితపదయుత రచనగలది. స్త్రీపురుషోపయోగము లగు నీతివాక్యములిందుఁ బెక్కులు గలవు. పద్యోపేతమైన యీగ్రంథమునఁ గవిగారి నవీన మార్గము మెచ్చఁదగియున్నది. పాఠకులు చదివి యానందింతురు గాక. వెల రు 1. మచ్చు చూడుఁడు.

మ. తరుణీ వందురఁ బోకు మింటిపులకుఁ జిత్తంబందు నెవ్వారికిం
జిరకాలంబును నుండఁబోవు తలఁపఁ శ్రీసంపదల్ వానిచే
గరువం బొందినవారు మూఢు లిది నిక్కంబై నఁ గానిమ్ము స
త్వర మీచోటును బాసి పోవుదము కాంతారంబులం జేరఁగన్. 165

చ. ఘనకవితా ప్రతీతుఁ డగుఁ గావునఁ గమ్మని పల్కుఁదేనియల్
చినుక నుదాహరించి తను చెప్పిన దంతయు వారు భక్తితో
విన మతబోధ సేసె నట వేలకువేల్గుమిగూడఁ జొచ్చి రో
య్యన నిజభక్తి మార్గగుల కబ్బవె శిష్యపరంపరల్ ధరన్. 347

నెల్లూరు ఆంధ్రసాహితీ గ్రంథాలయము మేనేజరుగారియొద్ద దొరకును.

---

(5) సీమంతిని:—ఆంధ్రప్రచారిణి గ్రంథమాల-౭౧ పుష్పము. శ్రీవేంకటపార్వతీశ్వరకవులలో నొకరగు పార్వతీశ్వరకవిగారిచే వంగభాషలో, పాంచఖడీదేవుగారిచే రచియింపఁబడిన సతీసీమంతిని యనునవలనుండి తెనుఁగు చేయఁబడినది. ౨౦3 పుటలును 34 ప్రకరణములును గలది. వెల రు 1-8-౦. పిఠాపురములో నాంగ్రప్రచారిణీ కార్యాలయమున దొరకును.

---

(6) విష్ణుపురాణము:—కలిదిండి భావనారాయణ ప్రణీతము. నాలుగంశములు. చెన్నపురి విశ్వకళాపరిషత్ప్రాచ్యపరిశోధనాలయ ప్రచురణములలో నాంధ్ర గ్రంథమాలలో నిది మొదటిది. తెనుఁగుపురాణములలో నింతయథామాతృక మయినరచనయే కన్పట్ట దని ప్రకాశకులు తెల్పుచున్నారు. ఆంగ్రకవులలో మొదటనుండి వచ్చు నాచారమునే యీకవియు ననుసరించి

నాఁడు. తనకాలము నెచ్చటను దెలిసికొనుట కాధారములను గనఁబఱుప లేదు. ఇతర గ్రంథములలో నొకయాధార మున్నను దానినిబట్టి యైనను బ్రకాశకులు కాలనిర్ణయము చేయుటకు సాహసింపఁజాల రైరి. వీరు, "కొన్ని వ్యాకరణములను ప్రమాణముగా గైకొని యీ గ్రంథమును బరీక్షించినచోఁ దప్పు లని చెప్పఁదగిన ప్రయోగములు కొన్ని పొడగట్టును, కాని మేము వానిని దప్పులనక ప్రయోగవిశేషము లందుము. ఏమన స్వతంత్రుఁడును బహుగ్రంథకర్తయునగు కవిని నసమగ్రలక్షణమునకు విధేయుని జేయుట శాస్త్రవిరుద్ధము" అని వ్రాసిరి. కేశవ! అచ్యుత! అనుటకు కేశవాచ్యుత యనుట తప్పుగాక విశేషమేమై, సతులవేయిమందని అనుటకు సతులవెయ్యుంటిఁ గనియెఁ ననునది తప్పుగాక విశేషమే యైనచోఁ బండితులు, విద్యార్థులు, స్వతంత్రులు, బహుగ్రంథపరిశీలకులుఁ గూడఁ జివరతప్పొప్పులపట్టిక వేయ నక్కఱయే లేదు. అవియును విశేషములే యనవచ్చును. విశ్వకళాపరిషత్తులోని పండితులుగూడ నసమగ్రలక్షణములకు విధేయులు గావలయునా! దీని వెలరు 2-8-0. మద్రాసు యూనివర్సిటీ ఓరియంటల్ రిసర్చి ఆఫీసులో దొరకును.

మచ్చునకుఁగొన్ని పద్యములు.

ఉ. సాగిలిమ్రొక్కి హస్తజలజంబుల మోడ్చి నృపాలసూనుఁ డ
య్యోగులఁ జూచి యిట్లనియె నోమహనీయతరప్రభావభ
వ్యాగమవేదులార! ధ్రువుఁ డందురు నన్ను, మదీయపూర్వపు
ణ్యాగమనంబున న్మిము మహాత్ములఁ గంటి ఫలించెఁ గోరికల్. (ప్రథమ 272)

చ. ముసలహలాభిశోభితసమున్నతదోర్యుగుఁ డేకకుండలో
ల్లసనలసత్కపోలుఁ డచలస్వఫణాగ్రమణీగణ ప్రభా
ప్రసరణరంజితాఖిలధరావలయుండు లయుం డనంతుఁ డు
ష్పసముగఁ దాల్చునీభువనపంక్తులతోడి యజాండభాండముల్. (ద్వితీ.72)

చ. వనజదళాక్ష భక్తజనవర్గము డగ్గరఁ బోవరాదు, పో
యినయపుడే మదాంధదనుజేభఘటావిఘటీకృతప్రచం
డనిబిడరోషకేసరి భటా! హరిచక్రము విక్రమించినన్
మనతల లెల్లఁ బోవు ననుమానము లేదిది నీకుఁ జెప్పితిన్. (తృతీ. 103)

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక.

కాకినాడ.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౧.	ఆంగీరసనామసంవత్సరము జ్యేష్ఠాషాఢమాసములు.	సంచిక ౨.

ఆంగీరసగౌతమీపుష్కరము.

(1-7-1932)

—వడ్డాది సుబ్బారాయఁడుగారు, రాజమహేంద్రవరము.—

మ. భువనక్షేమవిధాయి! పుష్కరజనంబుల్ వేనవేల్ గౌతమీ
సవనం బాదిగ రాజ్మహేంద్రనగరీ సర్వాశలందుండి తీ
ర్థవిధుల్ సల్పికొనంగ మూఁగెదరు; చోరవ్యాధిబాధాదివి
ప్లవ మాంగీరస నొందనీకు ప్రజ; దేవా! భక్తచింతామణీ. 1

శా. ఓయాంగీరస! యర్వదేండ్ల కొహహో యుష్మత్ప్రవర్ధ్యనం
బాయెన్ రాజమహేంద్రమందు, వ-సు- రాయస్వాగతం బందుకో;
నాయం బౌజరమార్పు నీయెడలఁ గానన్, గౌతమీపుష్కర
శ్రీయుక్తాబ్దమ! పౌరతైర్థికసుఖక్షేమార్థ మర్గింతు నిన్. 2

తే. అరుదు, క్రిందటి యాంగీరసాబ్దమందు, వాడపల్లి గోదావరివారినుండి
పుష్కరదినంబులను ధూమపుంజము సుర,గాలిపైవడి మింటికెగయుట గంటి.

తే. పుష్కరాద్యదినము ప్రొద్దుట నాంగీర,సాబ్దమునను బుష్కరాధిపతిని
బుష్కరంబునుండి బుధు లభిషిక్తుఁ గా,వించి రనఁగఁ గుంభవృష్టి గురిసె. 4
(జ్యేష్ఠ బ ౧౩ శుక్రవారము.)

ఉ. వేగురు తోటివాండ్రఁ బురవీథుల నూడిచి స్వచ్ఛరంబునం
బా గొనరింపఁ గూరిచిరి పాలకవర్గము వారు; వారిచే
సాగనిశుద్ధికార్య మొకజామునఁ జక్కగ నెగ్గె, హోరునన్
వాఁగులు వాఱఁగాఁ గురియువారిధరంబులనీరధారలన్. 5

ఉ. తెల్లనివాఁడు నల్లనయి, త్రిప్రభ లొక్కటఁ దోఁప గట్లఁతే
నల్లఁడు చీఁకటిం దెఱచి యక్షులు పుష్కరశోభ గన్గొనన్,
జల్లనిదాన జల్లును, బ్రచండములన్ బిడుగుల్ మెఱుంగులుం
బెల్లుగ నుప్పతిల్లెఁ బ్రజ భీతిల రెండవనాఁటిరేయిటన్. 6

చ. శివునకు మాత్రమే నుదుటఁ జిచ్చఱకన్నొకఁ డుగ్రముండు న
న్ను వినుదుఁ గాని, యిప్పుడు గనుంగొనుదున్, బహుళాశనిస్ఫులిం
గవిసరవిద్యుదక్షితతి కాయమునంతటఁ గల్గి నేఁటిరే
భువనము లెల్ల రౌద్రరసపూరితముం బొనరించునన్ ఘనా? 7

చ. అమరులు తెప్పవా ల్పెఱుఁగ రందురు; మేఘుఁడ! నీవు వారివ
ర్గమునకుఁ జెందినట్టిఁడవె గా; యమృతంబును గ్రోలి వ్యోమమా
ర్గమునను సంచరించెదవు, గావున నీబహుళత్రియామ బ
త్తిమిరమునందుఁ గన్ను చికిలించునినుం గనుదున్ వెఱంగునన్. 8

చ. దినమును వేనవేల్ ప్రజలు దేపకుఁ బాపముఁ బాపికో, జలా
వనిఁగన త్రియానముల వచ్చుట, హెచ్చుగ రాణ్మహేంద్రప
త్తనమునఁ బుష్కరాన బహుధా ఘటియిల్లెడుమైల సర్వమున్
మనుజులు మాప నోప రని నాక మహర్నిశ మూనె నాపనిన్. 9

మ. అరుదారం జదలన్ విమానములు పూర్వాహ్ణాపరాహ్ణంబులం
దిరుగుం బుష్కరమధ్యమందు; బురినల్దిక్కుల్ త్రుటిన్ వేడుకన్
దరిసింపన్ దరిసించి మైదులు పదుల్ దార్కొక్కి, పైనుండి ని
ర్జరులుం బోలెను డిగ్గెద ర్జనులు రాజద్రాణ్మహేంద్రమునన్. 10

మ. ఒకకాల్ ప్రేలఁగ మోడ్పుఁగా లడుగుపై, నుయ్యాలఁ గూర్చుండి, పు
త్త్రకుఁ డంకంబునఁ గూర్కఁ నూఁచును యశోదాదేవి తక్తోల; యా
త్రికు లాయంత్రపుఁబుత్రికం బణమునన్ దేశీయవస్తుప్రద
ర్శకశాలం గని కాఁతు రెంతయు భ్రమాశ్చర్యాదు లాంగీరసన్. 11

ఉ. ఆరసి *కీలకం జరిపినట్టులె పాలకు లేరు పాటు లాం
గీరస పుష్కరాన జరిగించిరి వీటను దైర్ఘికాళికిన్;
బాఱులు నాల్గువందలకు బ్రత్యహ మిర్మఱు దుర్భసత్రముం
దారఁగ నారగింపు లిడి రంద్రది స్వామిప్రసాద మిత్తఱిన్. 12

మ. అరయం గీలక †బ్రాగ్రెటుంబలె ఘనుం డాంగీరసన్ సబ్ కలె
క్టరు కృష్ణయ్యరు పుష్కరప్రజకు సౌకర్యంబులున్ రక్షయున్
జరిగెన్, దత్పటుశాసనంబునను రాజద్రాజ్మహేంద్రాఖ్యపుం
బురి, సప్తాదశవారముల్ సుమహితామోదంబు సంధిల్లఁగన్. 13

క. పూరుషయత్నమునకు సహ,కారిగ దైవంబుతలఁపు గలుగుట నీయాం
గీరసపుష్కరమున ము,య్యాఱు దినంబులును గడచె ననపాయముగన్. 14

చ. పితరులవిందు, వైదికపు విపులవిత్తపుఁబంటచేను, దే
వతలయు సర్వతీర్థముల వాసము, భిక్షుకధర్మసత్రమున్
వితరణు లీవు లాఱుపది విత్తెడుకార్తె, యలంకరించె న
ద్భుతమహిమన్ సగౌతమిని బుష్కరపర్వము రాజ్మహేంద్రమున్. 15

మ. "నరు లా ముప్పదిమూఁడుకోట్లసురలున్, సార్ధత్రికోటుల్ మహా
త్తరతీర్థంబులుఁ, దీర్థరాజు, నిట సిద్ధశ్రేణితో నిల్చి యుం
దురు పండ్రెండుదినాలు, పుణ్య"మని వత్తుర్ దూరమందుండి పు
ష్కరపర్వాన నఖండగౌతమిని దోఁగన్ రాజ్మహేంద్రానకున్. 16

తే. అమరరాజమహేంద్రపురాధిపత్య,మునకు నుచితంబుగా వేయికనులతోడ
నబుకలెక్టరు బాలకృష్ణయ్య రాత్మ,శాసనంబునఁ బుష్కరజనులసాఁకె. 17

ఉ. పట్టెను నాగవల్లికళ పౌరగృహాళికి; రాజవీథిఁ జూ
పట్టెను జక్రయానములు; బాడిగ తగ్గెను బండ్ల కిండ్లకున్;
ఘట్టములందు నొత్తడి బికారులగోల యడంగె; నంగడుల్
గట్టిరి వర్తకుల్ రకరకాలవి; పుష్కర మేగె బాగుగన్. 18

---

* కీలక పుష్కరసన్నాహాదిప్రశంస మదీయ మగుముద్రితచాటుప్రబంధమునఁ జూడఁ దగ్గది. ఇటఁ దద్వర్ణనము చర్వితచర్వణమని తలంచితిని.

† కీలక పుష్కరమున బ్రాగ్రెట్టుద్వార సబుకలెక్టరు.

ఊఱడింపు.

— తి. వ. నారాయణస్వామిగారు—ఋషిగిరి అగ్రహారము. —

ఉ. తమ్ములతేని వంగడపుఁ దమ్ములసూడయి వేడ్క నజ్జపా
న్దమ్ములప్రాపుఁ జేరు మెయితాల్పుల నేదెను రాముఁ డెంతో నే
మమ్మునఁ దండ్రి యానతిని మానక నొందలఁ దాల్చి కానకుం
దమ్ముఁడుఁ గూర్మితొయ్యలియుఁ దన్వెనుకోఁ జని యందు నిల్వఁగన్. ౧

ఉ. నాఁగలిచాల్పుపేరి యెలనాఁగ కడానియొడల్వెలుంగ నం
దేగెడు జింకఁ గన్గొనుచు నేకట నన్మొకము న్గడింపఁగా
నేగు మటంచు రాముఁ గడు నెచ్చరియించి తలంచె నిట్లు లో
న్వేఁగయి క్రచ్చుఁ దెమ్మెరలు వేచుఱు దెందపుఁదీవ నూఁపఁగన్. ౨

క. గొంగబలుమత్తుగొరుల, సింగంబయి యులరు నాదు చెలువుఁ డెలమితో
బంగరురంగున నెంతో హొం,రంగుగ జింక న్గడించిరా; నటుపిదపన్. ౩

శా. మావీట న్ననదోఁట వాటమగు కేమన్నినితా మేడ కా
క్రేవన్ జాదికురాళపున్నెవలకున్ గ్రిందై చొకాటంపు నె
త్తావుల్ జిమ్మెడి తమ్మిపూడిగియచెంత న్జింకఁ గట్టించి యెం
తో వేడ్క న్గమికాఁడు చూడ మనిపింతు న్గ్రచ్చు దైవాఱఁగన్. ౪

ఉ. ఆమనిరేల వెన్నెలల నాదటఁ జెల్వునిఁ గూడి చల్వకుం
గీమగు నాటతోఁటఁ దమిగ్రాన దాఁగురుమూఁత లాడు నో
బూమెకుఁ బూవుటీరములఁ బొంచిన నన్గనిపించు నెంతయున్
దీమసమొప్ప బంగరువుతెమ్మెర తేజి మొడంద జేనికిన్. ౫

క. రాచతెఱవా మెకం బగు, నా చెలువుఁడు కూర్మి మీఱ ననుఁ గూడి రహిన్
బాచికల నాడ మెకమెద, నేఁచిన తమి నత్తమిల్లు నెకిమీనికడన్. ౬

చ. అని తలపోయుచున్నతఱి నాపెనుఁగానలనుండి "లక్ష్మణా
ననుఁ గను" మన్న సవ్వడి వినంబడఁగాఁ గడ గానరాని జం
కెనకడలి న్మునింగి తనక్రేవలఁ దోడుగ నున్న లక్ష్మణుం
గని యిటులాడె నెమ్మదిని గన్గిన యంజిక చిమ్మిరేఁగఁగన్. ౭

క. బేరజపుటిఱ్ఱిఁ జేకొనఁ, గోరి యనిపి బెడఁదఁ దెచ్చికొంటిని చాల్పుం
దేరులదొరకూరిమికొడు, కారాటంపడెడు నట్టి యంగద గనెనో?" ౮

ఉ. ఈరువుఁబోనపుద్దులువ లీపెనుఁగానల నుండ్రు; వారితో
వేరమిఁ గొన్న జోదనుచు విన్రతనంపుకొలంపువింకుసిం
గారపురేవెలుంగుఁ గని కచ్చెకుఁ బిల్చిన నోహటించి యీ
తీరున నిన్నుఁ బేరుకొని తేఁకువ నేదెనొ చూడు లక్ష్మణా. ౯

క. అగిసినచెన్ను నెన్నెడి, సొగసగు మేనెండ నెంత సొక్కెనొ? కానన్
దగఁ గొనెనో పగఁగొని వ,చ్చుగరాసులపాలఁ బడుచు స్రుక్కెనొ? మఱఁదీ.

క. అని పల్కుచు వాలాయం గనుఁగొనలం జిలుపచిలుప గ్రమ్మెడు తడినొ
త్తి నెగులుఁ గొనెడు మనుమూ,లిని గని లక్ష్మణుఁడువల్కు లేనవ్వొలయన్.

చ. అడలకుమన్న యింత దనయన్నఁ గదల్ప జగమ్ములెల్లఁ దుం
దుడుకు వడంగఁ జేయఁగల తోరఁపుబీరమువం జెలంగు నీ
యొడయని కించుకంతయిన నోటమి గల్గిన గుండు లుర్ల వే!
కడలియు నెండదే! యడలి గాములుఁ దొల్లిఁటిజాడ వీడవే. ౧౨

ఉ. తాలిమి యిక్కనై యలరు తల్లికిఁ బట్టిని గాఁగఁ బుట్టి పే
రాలములందుఁ గీడ్వడని యయ్యయుఁ బెన్పఁగఁ బెద్దవొచు మా
న్వీలకు మేలుబంతియగు చెల్వునిఁ జేకొని మించునీకు నే
డేల వితాకునంది వగసీగఁగఁ; జాగుకె వింత యమ్మెడిన్. ౧౩

క. కొలఁది యిడరాని మగఁటిమిఁ,జెలువారెడు రాముఁగలనఁజెనకినిలువఁగాఁ
గలజెట్టి బిడుదు పుడమిని, గలనే గ్గలఁడనుట వెట్టి కాదె వెలందీ! ౧౪

సీ. చెలువంపుజిఱుతూఁకటులనాడెతులువయాపొలది‑డితాగనుబిలుకుమారెఁ
నలవోక స్మైిలేఁత నెలతాల్పు లలిఁదాల్చు బలువిల్లుతునియలై వెలయఁజేస్చె
బలుగాకిరేది న్నరులమొత్తములఁ దప్పిచెలి చీఁకటులరేవఁ దలఁగనేసెఁ
బలువరక్కసితెమ్మెరలదిండులకుఁ గ్రిడిచెలితేరివగ నెంతొ యుశుకు గూర్చెఁ

తే.గీ. గలనఁ గలితన మెఱయఁగ నలఁతి నగవు
చెలువమున మోము వెలయఁగ ములుచగముల
నలఁగఁ జేయుచు వలఁతియై యలరునతని
నులుకఁజేయఁగఁ దలకొను ములుచ గలఁడె? ౧౫

క. విల్లెక్కిడ జగమంతయు, నల్లాడెడి కడిమిగల్గు నాతనిఁ జెనకన్
మల్లచఱచు పోటరి యిం,దెల్లెడ వెదకినను గలఁడె యింతీ చెపుమా? ౧౬

ఆ. వె. అగ్గిత త్తడి కడు నడరి కలనఁ గట్టుఁ, జెనకి దొరయ లేక చనినమాత్రి
రాముఁ గలనఁ బొమవు రక్కసిమొనలెల్ల, జమునయన్న వీటి జాడఁ గనవె ?

చ. చలిపగవాఁడు గ్రుంకుముల చాయలఁ దోఁచిన జంటదోయి క
న్నులదొర వేఁడిమి న్విడచి నూల్కొను నే నివమట్లు బంతి తే
రులయొకిమీని పున్నెములప్రో వగురాముని కెందు నైన సి
ల్గు లగునటన్న పెట్టిపలుకుల్ విని నమ్మకు మమ్ము నెమ్మదిన్. 18

ఉ. ముంతపాలుమావజీరు గుడెలో నెనయాచును మిత్తికోటకో
క్కింతయు లొచ్చుఁగానకను గిత్తిసెకం గడుమీఱి యెంతయున్
వింతలఁ గూర్చెదున్ రసుల వేలుపుఁజెట్టగు రాముఁ డెంతయున్
బంతమెనంగఁగా విడుచువాఁడిజిరా నెఱపోరితమ్ములన్. 19

చ. కడిమి నొకింతయు న్గొఱఁత గానని గామిడులెల్లఁ దీసియె
క్కిడఁగఁ దలంతు మిన్వఱఁతకీల్జడవానికడింది విల్లు లే
వడి యగునించువ్రుం గొనుచు వంచెను మత్తిలు హత్తితేనికై
వడి వడి వంచి పేర్వడిన వాఁడిమగం డతఁ డొల్ల కళ్ళునే. 20

మ. కనలేదే మును? కూళరక్కసులు పెక్కండ్రొక్కఁడై రేసి యే
చినకీక్ష న్గదు న్ఖలి డాయునెడ నొచ్చెం బింతయున్లేని తెం
పునఁ దానొక్కటి యాచు లేటిబలుగుంపు న్గిడ్డిదిండీనిచా
డ్పునఁ జక్కాడుచు సంగరించుటలు వేల్పు ల్మాచి మేత్మేలనన్. 21

మ. పొలదిండుల్ బలుగుండులం గొనుచుఁ బెంపుద్దెంపున న్జాపుచుం
గలనన్ధాయ వితాకుఁ జెందక తలకంబోక నెమ్మోముపై
నెలనవ్వొప్పఁగ రాముఁ డావలుపల న్నిల్గించుకయ్యంబు క
న్నులఁగన్గొన్న వలంతి నై పిడికితెన్ను ల్మానడ వింతయ్యెడిన్. 22

చ. తలఁకఁగఁబోకు మమ్ము యెడఁదన్ విను మన్నయెలుంగుతో మముం
దలఁకఁగఁజేయ నిట్లన కతంబగు నెవ్వరో? కాక యాతనిన్
దలకడవంగఁబూను నెఱదంట జగమ్ముల లేకయుండ ని
ట్లలుకఁగ నేల ? రామునకె యంజిక ? నమ్మఁగఁబోకు నెమ్మదిన్. 23

సీ. గాలిబోనపుమేటి మేలిపానుపుపయిం బండువాఁ డసురులఁ జెండువాఁడు
నొడికారపుఁగటారి యొడయుల యెడఁదలు నెలవువాఁడు కడానివలువవాఁడు

తొలికారుమబ్బుల చెలువెన్నఁదగువన్నె మేనివాఁ డెద నింతి నూనువాఁడు
గుడుసువా ల్వలకేల వెడఁదజాల్వలకాలఁదనరువాఁడును నెనరెనయువాఁడు
తే.గీ. నయిన వెన్నుఁడు పుడమి వ్రేఁగడఁచుపొంటె
వేడబము నూని మానిసి వితము దోఁపఁ
బుడమిఁ బొడమినవాఁ డౌటఁ బొలఁతి యతని
కంగద మొసంగ దొక యిసుసుంతయైన. 24

చ. అదియునుగాక కాన నిను నాద వడంకగ డించి యన్నకై
కదలినఁ గూళరక్కసులు కంటున నెంతయు మచ్చరించి నిన్
బొదివిన బాసకై నిలుచు పోటరిఁ గానకఁ గాసిఁజెందె దో
వదినియ! యన్నకున్ సిలుగు వచ్చుట దబ్బఱ యంచు నమ్ముమా. 25

చ. అని యిటు పల్కి యుల్కి కడు నాఁగక నెమ్మది నుమ్మలించు న
మ్మనువిరిబోఁడికూఁతుఁ గని మచ్చెపుడా ల్గలయట్టిజెట్టిత
ల్లిని బురుడించి మించఁగల లేమరో! తెల్పితి నింతవట్టు నన్
బనిగొను మెట్లొ లెంక" నని పల్కి యడంకువదోఁప నిల్చినన్. 26

ఆంధ్రధ్వని.

— కనకదండి గోపాలకృష్ణశాస్త్రిగారు, పర్ణశాల —

ఇప్పటిదినములలో భాషాంతరీకరణములు చాలఁ బ్రబలముగ నున్నవి. కొంచెము ప్రసిద్ధిఁజెందిన ప్రతిసంస్కృతగ్రంథమున కథమ మైదాఱు భాషాంతరీకరణము లున్నవి. బాగుగఁ బ్రసిద్ధిఁజెందిన గ్రంథములకు (శాకుంతలము మొదలగునవి) ముప్పది నలువది భాషాంతరీకరణము లున్నటుల మన మెఱుఁగుదుము. భాషాంతరీకరణ మన్న మూలగ్రంథము ననుసరించి వ్రాయుటయే గాన నెంతమంది భాషాంతరీకరించినను విశేషము లంతగ నుండవు, కనుక, నొక పుస్తకమునకు నిన్ని భాషాంతరీకరణము లనవసరములు. ఇంతమంది వ్యర్థముగ నిన్నిగ్రంథముల భాషాంతరీకరించుటకన్నఁ దమపాండిత్యము నుపయోగించి యంతగ్రంథము వ్రాయలేకపోయినను జిన్నదియగు నొక కావ్యమునో నాటకమునో వ్రాసికొనిన నెంతయొ బాగుగ నుండెడిది.

మఱొకవిషయము. ఈభాషాంతరీకరణమునకుఁ బ్రతివారు సిద్ధమగుట యుచితము గాదు. అట్లయినచో లోకమున కాభాషాంతరీకరణము వలన నెక్కువ యుపకారము లభింపదు. సమర్థు లయినవారు మూలమునకు సరిగ భాషాంతరీకరించి పండితులకుఁ గూడఁ జూపి ముద్రింపించినచో దేశమునకుఁ గొంత యుపకారము గలుగును.

ఇప్పుడు మనకు దొరకుచున్న భాషాంతరీకరణము లన్నిటినిఁ దిరుగ వేసినచో నెన్నియైనను దప్పులతడకలు దొరకుచున్నవి. ఇటువంటి భాషాంతరీకరణములు చక్కని గ్లేజు కాగితములమీఁద నచ్చొత్తించి కాలికో బైండు వేయించి ప్రకటించుట తా మానందించుటకో, దేశమున కుపకరించుటకో తెలియకున్నది.

ఓ భాషాంతరీకరణముచేయు భాషాభిమానులారా! వినయపూర్వకముగ నమస్కరించి చేసికొనుమనవి. మీ భాషాంతరీకరణములు లోకమున కుపయోగించి చిరకాలము వర్ధిల్లుట కిదివఱకు భాషాంతరీకరింపఁబడని గ్రంథముల భాషాంతరీకరించుటకుఁ బ్రయత్నింపుఁడు. మీరు వ్రాసినది కూడఁ బండితులకుఁ జూపి యచ్చొత్తింపించినచో మిక్కిలి లోకోపకారముగ నుండును.

నేను నాంధ్రధ్వని యను నొకభాషాంతరీకరణ మీమధ్యఁ జూచితిని. అది బ్రహ్మశ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారిది. లఘువివరణముతోఁ గలిపి యేఁబదిరెండు పేజీల గ్రంథము. తప్పొప్పులపట్టిక గూడఁ జివర సమృద్ధిగనే కూర్పఁబడినది. అయినను నక్షరముల తప్పులు మిగిలియే యున్నవి. అచ్చు పరిచూచువారి యజ్ఞతచేఁ గలిగె ననుకొందము. విషయములలోఁ గూడఁ జాల చోట్లఁ బొరపాట్లు గనఁబడుచున్నవి. ఇటువంటి గ్రంథమును దొందరగా నచ్చొత్తించి యాంధ్రలోకమున కేవిధముగ మేలుచేయుదమనుకొనిరో తెలియకున్నది. మచ్చునకు రెండుమూఁడువిషయముల నీక్రిందనుదాహరించుచున్నాఁడను.

(1) "కావ్యస్యాత్మా సఏవార్థ స్తథాచాదికవేః పురా
క్రౌంచద్వంద్వవియోగోత్థః శోకఃశ్లోకత్వమాగతః" 1. ఉ. 5. శ్లో.

దీనికి వారియాంధ్రీకరణము.

'' అర్థమదియ కావ్యంబున కాత్మయగును
అట్లగుటఁ బూర్వకాలమం దాదికవికిఁ
గ్రౌంచవిహగయుగళవియోగమున నాత్మ
లోజనించినశోకంబు శ్లోకమయ్యె. '' 10

ఇచ్చట-క్రౌంచవిహగయుగళవియోగమువలన నాదికవికి నాత్మలో జనించిన శోకము శ్లోకమయిన దని శ్రీ శాస్త్రిగారియభిప్రాయ మైనట్లు స్పష్టమగుచున్నది. కాని యది యుచితముగఁ దోఁపదు. ఆదికవియాత్మలోఁ బుట్టిన శోక మనినచో విరోధమున్నట్లు లోచనకారుఁ డభిప్రాయపడియున్నాఁడు. ఆతని మాటల నీక్రింద నుదాహరింతును.

''నతు మునే శ్శోక ఇతి మన్తవ్యమ్. ఏవం హి సతి తద్దుఃఖేన సోఽపి దుఃఖిత ఇతి కృత్వా రసస్యాత్మతేతి నిరవకాశం భవేత్. నతు దుఃఖసంతప్తస్యైషా దశా.'' ... ... 27-పుట.

(2). "శషౌ సరేఫసంయుక్తౌ ఢకారశ్చాపి భూయసా
విరోధినస్స్యుశ్శృంగారే తేన వర్ణా రసచ్యుతః" 3. ఉ. 3 శ్లో.

దీనికి శ్రీ శాస్త్రిగారి యాంధ్రీకరణము :—

'' శషలు రేఫసంయుక్తముల్ చాలఁ గలిగి
బహుళముగ ఢకారంబులు వాడఁబడియు
వైరము వహించుచుండు శృంగారమందు
నట్లగుట వర్ణములు రసవ్యంజకములు." 3. 3

ఇచ్చట " తేన వర్ణా రసచ్యుతః " అను పాదమునకు "నట్లగుట వర్ణములు రసవ్యంజకములు " అని యాంధ్రీకరించిరి. కాని లోచనకారుఁ డట్లభిప్రాయపడుటలేదని యీక్రింది యాతనివాక్యములఁ జూడ స్పష్టమగుచున్నది.

" యతః తేవర్ణా భూయసా ప్రయుజ్యమానా న రసాం శ్చ్యోతయంతి స్రవంతి యది వా తేన శృంగారవిరోధిత్వేన హేతునా వర్ణా శ్శసాదయో రసాత్ శృంగారాత్ చ్యవంతే తం న వ్యంజయం తీతి వ్యతిరేక ఉక్తః"130పు.

వృత్తికారుఁడు గూడ లోచనకారుని యభిప్రాయమునే బలపఱుచుచున్న ట్లాతనివాక్యములవలనఁ దెలియుచున్నది.

" శ్లోకద్వయే నాన్వయవ్యతిరేకాభ్యాం వర్ణానాం ద్యోతకత్వం దర్శితం భవతి." ... ... 130 పు.

కనుక నట్లగుట వర్ణములు రసవ్యంజకములు కావని యుండుట యుచితము.

(3) " అర్థాంతరగతిః కాక్వా యాచైషా పరిదృశ్యతే
సా వ్యంగ్యస్య గుణీభావే ప్రకార మిమ మాశ్రితా." 3. ఉ. 39శ్లో.

దీనికాంధ్రీకరణము:—

"కాకువున నితరార్థావగమన మెద్ది, కలుగుచుండెడినో మంచికావ్యమందు అయ్యదియునీప్రకారంబునందుఁజేరు,వ్యంగ్య మప్రధానీకృతమగునుగాన.

"ఇచటఁ గాకువుచే నర్థాంతరావగమన మయినపు డాయర్థాంతర మప్రధాన మగును గాన గుణీభూతవ్యంగ్య మగును" అని యభిప్రాయమును సూచించిరి. కాని యాయభిప్రాయము సరి గాదు. కాకువుచేత నర్థాంతరావగమన మయినపు డాయర్థాంతర మప్రధాన మయిన యెడల గుణీభూతవ్యంగ్యమగును. అని గ్రంథకారుని యాశయము. ప్రధాన మైనచో వ్యంగ్యమే యగును. వృత్తిలోఁ గూడ నీవిషయము స్పష్టపఱుపఁబడినది.

"యాచైషా కాక్వాక్వచి దర్థాన్తరప్రతీతి ర్దృశ్యతే సా వ్యంగ్య స్యార్థస్య గుణీభావేసతి గుణీభూతవ్యంగ్యలక్షణం కావ్యభేద మాశ్రయతే" 212 పు.

కనుక "వ్యంగ్య మప్రధానీకృత మయినయెడల" అని సవరించిన బాగుగ నుండును.

ఇంకను నిటువంటి చిన్నతప్పు లచ్చటచ్చటఁ గలవు. గ్రంథవిస్తరభీతిచే నీమూఁటినే యుదాహరించితిని. పండితు లగు శ్రీశాస్త్రిగారిని దిరస్కరించుట నాయాశయము గా దని వినయపూర్వకముగ మనవి చేసికొనుచున్నాఁను. తప్పులు క్షమింతురుగాక.

ఆంధ్రవ్యాకరణములధోరణి విమర్శనా పరిశీలనము.

—(ఎండమూరి వేంకటరమణగారు, బి. ఏ.)—

శ్రీప్రజోత్పత్తినామసంవత్సరము మాఘఫాల్గునమాసములందున వెలువడిన "ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక" యందు మ॥ రా॥ శ్రీ నుఖ్ఖు సర్వేశ్వరరావుగారు, "ఆంధ్రవ్యాకరణములధోరణి విమర్శన" మనుపేరిట మదుక్తవ్యాసమునందలి కొన్ని యభిప్రాయభేదములు వెలిపుచ్చుటం జేసి వానికి నాశక్తికొలంది సదుత్తరముల నొసంగుటకై యీవ్యాసరచనకుం గడంగితిని. ఇందలి యాథార్థ్యాయాథార్థ్యములు పరసులును గుణగ్రహణపారీణులు నగుపత్రికాపాఠకులే గుర్తింతురుగాత.

ఇట్టివిమర్శనలకుం బూనుట కిట్టివారలో యనువిషయమున విమర్శకులు సూచించినవిధమున మాకిద్దఱకు నేకాభిప్రాయంబులే యుండుటచే మరల వ్రాయుట నిరర్థక మని విడుచుచున్నాను.

శ్రీవిమర్శకుల విమర్శన మెంతసహేతుకమో విచారించి, తద్గతాభిప్రాయభేదము లెంతసప్రమాణంబులో విమర్శించి యందలిసత్యము వివరించుటయే యీవ్యాసస్వరూపము.

౧. వారివ్యాసమున విమర్శకులు ప్రథమమున విమర్శించిన దొక లేఖనస్ఖాలిత్యమై యున్నది. అందు నాయుద్దేశము మ॥ చిన సీతారామశాస్త్రిగారి వ్రాఁతయు "ఆంధ్రశబ్దచింతామణిలో లేని విశేషము" లని కాని "ఆంధ్రశబ్దచింతామణిలోని" యని కాదు. ఈవిషయము సత్యసముద్యోతక మగు విమర్శనము వ్రాయఁగడంగిన శ్రీరావుగారు- ఇట లే యను వర్ణము లేకుండుట ప్రమాద మని గ్రహింపఁగల్గియు "నాంధ్రశబ్దచింతామణిలోని" యన్నపాఠము వారి కెచట లభించినదో యని దీర్ఘసందేహార్థక చిహ్నముతోఁ బ్రశ్నించుట వారితత్త్వజిజ్ఞాస చెప్పకచెప్పుచున్నది. అది యటు లుండనిండు. "ఆంధ్రశబ్దచింతామణిలో లేని లక్షణవిశేషములు మాత్ర మథర్వణకారికలలో నగపడుచున్న" వనుశాస్త్రిగారి వ్రాఁత ప్రమాద మగుటసత్యము. దీని నిదివఱకే సోదాహరణముగా వివరించితిని. కావలయు నేని మఱికొన్ని యుదాహరణము లిచ్చుచున్నాను.

ఆం. శ. చింతామణి—తిర్యగ్జడేషు కర్తృషు బహువచనం చైకవచనమేవస్యా
ద్భూతేతద్ధర్మేచ.

అ. కారికావళి—తుదీతిర్యగ్జడస్త్రీషు తేష్వర్థేష్వేకతాంగతౌ.

అ. శ. చి—ఋ ఇతౌ తు నప్లుతస్స్యాత్సంబుద్ధా విత్యుశాం విదుః కేచిత్.

అ. కా—సంబోధనేప్లుతః ప్రాహుః కేచిత్.

ఆ. శ. చి—నచదేశ్యపదే నచైకవర్ణేఽపి.

అ. కా—నైకవర్ణేన దేశ్యేఽపిహ్రస్వః.

ఇట్టి వింక ననేకములు గలవు. విస్తరభీతిచే విడిచితిని, కావున, రావుగారు శాస్త్రిగారి వ్రాఁత ప్రమాదయుతము కా దని ఋజువుచేయుట న్యాయ్యము గాని, ముద్రణలోపము లెన్నుట విమర్శన మనిపించుకొనునా ?

౨. విశ్వకర్ముఁడను రూపము నీతఁడే (విన్నకోట పెద్దన్న) స్పష్టపఱిచి యుండలేదు...... ఈవిషయ మపూర్వము కానేర" దని విమర్శకులువ్రాసిరి.

ఈవిషయ మపూర్వ మని కాని, వి. పెద్దన్న సృష్టించినాఁడని కాని నేను వ్రాయను లేదు, నాభావమును గాదు, నాయభిప్రాయము నేఁటివఱకు వివాదాంశ మైన విషయము స్పష్టపఱిచినాఁ డనియే. ఈవిషయ మింతవఱకు వివాదాంశ మైనటుల ముందు వాక్యములే తెలుపును.

వైయాకరణ సమ్మత మైనవిశ్వకర్ముఁ డనుశబ్దము నసాధువుగా నెంచి సవరించిన గుప్తార్థప్రకాశికాకారులమత మేవిధముగా ననూహ్యమో పరిశీలింత మని ప్రారంభించిన విమర్శకులు ''నేఁటివఱ కీప్రయోగంబునెడ నున్న వివాదంబును గోచరింపకున్న" దని ముగించిరి. వే ఱొకచో శ్రీ రావుగారు "ఆంధ్రశబ్దచింతామణి యథర్వణకారికలచే నీరూపము సాధు వగుచునేయున్న" దని యంగీకరించిరి. ఇందు వీరి యభిప్రాయ మిదమిత్థ మని నిర్ణయించుటయే కష్టము. ఈరూపము సాధు వగుచున్న దని యొప్పికొనుచు నీరూప మసాధువుగా నెంచి సవరింపఁ గడఁగిన మత మనూహ్యము కా దని సమర్థింపఁబూనుట యెంత సందర్భమో సహృదయు లగుపాఠకు లూహింతురుగాక. గుప్తార్థప్రకాశికాకారులు బాలవ్యాకరణమతానుసారముగ దానిని సవరింపఁ గడఁగిరని వారు వ్రాసిరి. బాలవ్యాకరణమునకు లొంగనిమాత్రమున నెల్లపద్యములందలి విశేషరూపములను సవరింపవలసినదేనా? ఒకవేళ లొంగకపోయినను బాలవ్యాకరణమునకు విశేషవిపులవ్యాఖ్య వ్రాయుచు విశ్వకర్ముఁ డను రూ

పము కూడ సాధువే యని యభ్యుపగమముగ నైనఁ జెప్పరాదా? ద్వంద్వం బున ఋకారమునకు రవర్ణం బగు నను సూత్రమునొద్ద నీ రుభయపక్షము లనుఁ జెప్పనలేదా? ఇప్పుడు గుప్తార్థప్రకాశికాకారులు నవరింపఁ గడఁగుట కేవల మనూహ్యము గాక, సాహసము కూడను. విశ్వకర్మఁ డనురూపము సాధు వగుటకు నభినవదండినుండి రెండుపద్యము లిచ్చెదను.

క. తుదియుకారమ్ము లుడిపిన, గదిసినఋత్వాంతపద మొకండును వెలిగా
ముదమున డులుతల మోడను, విదితపుఁబురుషాఖ్యయందు వివరింపంగన్.

గీ. హోత జాత యనఁగ నేత దాత యనంగ
బ్రహ్మ వేత్త యనఁగఁ బరఁగుచుండుఁ
బూరితాత్ముఁ డనఁగఁ బుణ్యకర్ముఁ డనంగఁ
బుష్పధన్వుఁ డనఁగఁ బొలుచు జగతి.

... ...

శర్వవర్మనాఁగ శర్ముఁడనఁగ, వర్మఁడనఁగఁజెల్లు ...

3. "రామమాంధాతృరఘుక్షితీశులు" అను ద్వంద్వసమాసమునం దలి ఋకారంబునకు రేఫము రా''దని విమర్శకులు వ్రాయుచు నీవిషయమున గుప్తార్థప్రకాశికయందు సమాసపరిచ్ఛేదమునందు విమర్శించిన విషయము లెల్ల వివరించియున్నారు. కాని, అహోబలపతి తరువాతివాఁ డగు ద్వితింత్రిణీ సీతా రామకవి "అనజస్స్యా న్మృతో ద్వంద్వే రేఫ శ్చారిక వేర్థతః'' యను నథర్వణ కారికకుఁ టీక వ్రాయుచు "నేష్ట్రోద్గాత" లని యుదాహరణ మిచ్చి తత్సూత్ర మును సమర్థించినాఁడు.

ఈవిషయమున, అడిదము సూరకవి-

గీ. ధరఋకారాంతశబ్దంబు ద్వంద్వమైన
రేఫయగుచుఁ బ్రవర్తిల్లు ధృవముగాను
పక్షివరహయవాగ్వధూనేత్రముఖసు
రాభివందితపాదాబ్జ యన్నయల్లు.

అని వ్రాసి "క్షత్రియవంశ్యులై'' యనుపద్యము నుదాహరణముగా నిచ్చి రామమాంధాతృరఘుక్షితీశు లన్నద్వంద్వసమాసము సరేఫ యనియే వెల్లడించినాఁడు. ఈవిషయ మంతయు గుప్తార్థప్రకాశికయందే గుప్తార్థప్రకా శికాకారులు ప్రకీర్ణకపరిచ్ఛేదమునందు వ్రాయుచు వారి పూర్వాభిప్రాయము

మార్చికొని "ఈపద్యము రేఫశ్లిష్టమునొద్ద నుదాహరించుట కేవలము ప్రమాదాయత్త" మనియు, నచటనే "కావునఁ మాంధాత్రరఘుక్షితీశులు ముదంబునఁగాచిరి యేయుగంబునన్' అను రేఫయుక్తమే పద్యలక్షణానుకూలంబుగాన ప్రశస్తం"బనియు (పుటలు-498-499) నంగీకరించిరి.

విమర్శకు లిది పూర్తిగ గమనింపకయే యప్పకవిది ప్రమాదము కాదని వ్రాయుట నప్రమాణికముగాక సాభిమానమగును. "హరికారికావళీ కర్తృత్వనిర్ణయము సూరిచౌర్యముం దొలఁగించుట" కని విమర్శకులు భావించి, దాని కిదియ మార్గముగాఁ దలంచుట న్యాయ్యముకాదు. హరికారికావళీకర్తృత్వనిర్ణయమున సూరిచౌర్యప్రతీతి తొలఁగుటయును దొలఁగకుండుటయుఁ గాకతాళీయన్యాయమే. ఇఁక హరికారికలు హరికృతములు గావనుటకు వీరిఖండనోక్తులను బరిశీలింతము.

"హరికారికామతమును దెల్పె నని వ్యవహరించిన కారికల కర్థము తుల్యము కా" దని విమర్శకు లాక్షేపించిరి. "దంద్వే పదోపరిస్థానాం పరుషాణాం భవం త్యమీ" అను హరికారికకును "స్యు ర్భిన్నాదేవ తస్మాత్తే వినా ద్వంద్వే హ రేఫ్మతే" యను కారికకును భేద మేమి? అప్రయుక్తదోషము హరిమతమున విరుద్ధము కా దని యథర్వణుఁడు "శాస్త్రప్రయుక్తవచసో శాస్త్రం బలవ దుచ్యతే, అనిష్పన్నే పదే తేన ప్రయోగాశ్రయణాం హితమ్" అను తనమతము నిలువఁబెట్టుటకుఁ జేర్చొని ప్రయోగప్రాధాన్యమును దెల్పుటచేఁ "బెద్దలు వ్యవహరించిన మాట గ్రామ్యం బైనను గ్రహింపఁదగు" నను హరికారికయొక్క భావము నొక్కచే. కావున నీయుక్తి పొసఁగ దనుట సరియైన విమర్శనము కానేరదు.

అథర్వణుఁడు హరిమతమును దెలియఁజేయఁ దలఁచినచో నేవ్యాకరణమునందును లేని లక్షణవిశేషము లీహరికారికలయం దుండఁగా వానిని విడిచి యుండె నని, విమర్శనకారుల యభిప్రాయము. విమర్శనకారు లుదాహరించిన చేయక మొదలగు వ్యతిరేకక్త్వార్థకరూపము, నథర్వణుఁడే సాధించియుండుటచే వేఱే హరిమతము నుదాహరింప లేదు. ఉ. చేయక యనురూపమునకు—

"భవే త్త్రీ స్త్రీసమా న్నామ్న ఉత్వం తస్మి న్న రేభ వేత్ ।
క్త్వార్థేచ వ్యతిరేకార్థే ధాతో స్తత్రైవ మిర్భవేత్ ॥

మఱియు, "నిష్ఠ లేని పోని నామములు దమసూత్రములందు నేదియో ఘనతకై పేర్కొనుట మనవారి యాచారము. బృహస్పతి, కణ్వుఁడు,

శౌరి మున్నగువార లాంధ్రమునకు లక్షణగ్రంథములు వ్రాసిన లాక్షణికులు లేరా ? వారు వ్రాసినగ్రంథములు లభించునా ?" యని శ్రీరావుగారు వ్రాసిరి. అట్టిలాక్షణికులును గలరు. అందుఁ బేర్కొనిన కొన్నిగ్రంథములు లభించినవి. కొన్ని లభింపవచ్చును. కాని, తెలియకయె యిట్టినామములు ఘనతకుఁ బేర్కొందు రనుకొనుట భ్రమయే. వ్యాసకర్తగారి దృష్టిలో లేనంతమాత్రమున బృహస్పతి రచించిన సూత్రగ్రంథము లేదా? ఈబార్హస్పత్యసూత్రములను గ్రంథరూపమున నేను గనులారఁ జూచితిని. వానిని బరిశీలింపఁగా నవి కేవల మాంధ్రభాషాశబ్దవిషయములఁ గూర్చి ప్రస్తావించుచున్న వని తోఁచినది. మఱియు నవి కేవల ప్రాథమికవిషయములనే తెల్పుచున్నవి. సాధారణముగా మనము వాడుకయందుఁ గాంచు నట్టియు గ్రంథములందుఁ (దఱచు) గన్పట్టనట్టియు "అమ్మణ్ణి" మొదలగు రూపముల కిందు సూత్రములు గలవు. మచ్చున కొకటి యుదాహరించెదను.

"దయావాచకార్థే అమ్మ మామాదిశబ్దేభ్యః పరతః అణ్ణిఅల్లాద్యాస్స్యుః। అమ్మణ్ణి, అమ్మల్ల, మామణ్ణి, మామల్ల, ఇత్యాది"- బార్హస్పత్యసూత్రాణి. ఇటులనే కణ్వాదుల వ్యాకరణములంగూడ లభ్యము కానగును. లేకయేతాళపత్రగ్రంథములందో జీర్ణించుచుండవచ్చును. కావున మనకుఁ దెలియనంతమాత్రమున నాగ్రంథములు లేవనుకొనుట పొరపాటు. వ్యాకరణవిషయమున, నేకృషియు నొనర్పని వానికి బాలవ్యాకరణము గూడ నలభ్యమే కావచ్చును. అంతమాత్రమున గ్రంథము లేదనుట తగవా ?

అదియుం గాక కీ. శే. కం. వీరేశలింగకవిగారు సయుక్తికముగా వారికారికలు నవ్వ్యఁడు వ్రాసిన వని నుడివిన మాత్రమున నది వేదముగా గ్రహింపవలసినదేనా ? వీరేశలింగకవిగారు నిర్ధారించిన విషయము లెన్ని, నవీన పరిశోధనములందు మార్పుఁజెంది వేఱువిధమున ఋజువుకాలేదు. సమంజసములు, సహేతుకములు నగు ప్రమాణములను రావుగారు చూపి యీ విషయనిర్ధారణ యొనర్పఁగలిగినచో వారియెడ నెంతయుఁ గృతజ్ఞులము.

"వృత్తిం నాన్నవ సూత్రాణాం కృష్ణమూర్తి రిహ కుర్వే" యనుశ్లోకభాగము నుదాహరించి "కృష్ణమూర్తి రిహ కుర్వే" యని వ్రాసినతర్వాత నెవ్వరైననాతఁడు వ్రాయలే దందురా ?" యని విమర్శకుల యాక్షేపణము. పైశ్లోకము కృష్ణమూర్తికవియే రచించినచో నాతఁడు వ్రాయలే దని యెవ్వరు ననలేరని

నాసమాధానము. కాని తద్గ్రంథప్రకాశకులు, "నాన్నవ" యను పదముఁ జొనుపుటకుఁ బైశ్లోకము సృష్టించి,

శ్లో॥ శ్రీకృష్ణమూర్తిరచితా వృత్తి ర్హరికారికావళీ రేషా
నికటేనివస త్యవనా వాచంద్రార్కం కవీంద్రరింఛోళేః॥

అను కృష్ణమూర్తికవిగారి శ్లోకమును—

శ్లో॥ శ్రీకృష్ణమూర్తిరచితా వృత్తిరియం నన్ననార్యసూత్రాణామ్।
జ్యోత్స్నా సతతం వసతా దాచంద్రార్కం కవీంద్రరసనాసు॥

అని మార్చి ప్రకటించిరి. ఇట్టి మార్పు గల్పింపఁగలిగిన ధీశక్తి ప్రభావ మెంత యాశ్చర్యకరమో, యెంత సాహసయుక్తమో, యంతహేయ మనుటకు, లేఖిని వెనుదీయకున్నది. నేను జూచిన హరికారికావళి వ్రాఁతప్రతియందు "వృత్తిం నాన్నవసూత్రాణాం" అను శ్లోకము గన్పింపకపోవుటయే కాక యీ చిత్రసంఘటనము కూడఁ గన్పట్టినపుడు కలిగిన యాశ్చర్యమునకు మేర లేదు. ఆవ్రాఁతప్రతి నాయొద్ద లేకున్నను మీరు కోరినపుడు చూపఁగలను. ఇట్టి యభూతకల్పనలతో విమర్శనములకుఁ గడంగి వారి వాదములను నిలువఁ బెట్టుకొను నాంధ్రభాషాయోషాసుతులం గూర్చి సంతసింపవలెను. ఇందలి సత్యాసత్యముల నిపుడు నిష్పక్షపాతహృదయులును బండితశేఖరులు నగు పాఠకులే యెఱుంగుదురుగాక.

౫. వాక్యపదీయకారుఁడును, అధర్వణునిచేఁ బేర్కొనఁబడిన హరియు, నొక్కఁడు గాఁ డనుటకు సంస్కృతమున లేని గసడదవాదేశమును జెప్పినవాఁడు గనుక నాభర్తృహరి కానేరఁ డనుయుక్తి సరిపడునా?……………సంస్కృతప్రాకృతములయందు వైదుష్యము కలవారికిఁ దెలుఁగున నుండఁగూడదా?" అని వ్యాసకర్తలు వ్రాసిరి.

ఇచ్చటి వీరి విమర్శనము పూర్వాపరసందర్భరహితమై స్వోక్తిఖండనముతో నొప్పుచున్నది. వీరిట హరికారికావళి కృష్ణమూర్తిప్రణీత మని తెల్పుటకుఁ బూని పరస్పరసంబంధము గలయుక్తులను విడిగా సందర్భరహితముగా విమర్శించిరి. వారి యభిప్రాయము ప్రకారము కారికలు హరిరచితములు కావేని హరియే లేఁడు. అట్టియెడ నీహరి భర్తృహరియా వేఱొకహరియా యను ప్రసక్తి లేనేలేదు. అటుగాకుండ నీతఁడు భర్తృహరియా వేఱొకహరియా యని విమర్శించు నపుడు తెనుఁగు వ్యాకృతి వ్రాసిన హరి యొకఁ డున్నాఁ డని వి

రంగీకరింపవలసివచ్చును. వీ రటు లంగీకరింతురా? ఐనను హరికారికావళీ కారుఁ డగుహరి భర్తృహరి యెటుల కానేరఁడో విమర్శింతము.

1. హరివ్రాసినది తెలుఁగునకు వ్యాకరణము. భర్తృహరి కాంధ్రమున (వ్యాకరణము వ్రాయఁగల) వైదుష్యము లేదు. ఏలయన:- నాంధ్రభాషకుఁ బ్రథమవైయాకరణుఁడు నన్నయభట్టు. నన్నయభట్టు పదియవ శతాబ్దములోని వాఁడు. భర్తృహరియేడవశతాబ్దమువాఁ డని చరిత్రకారులునిశ్చయించినారు. అదియుఁ గాక నన్నయకుఁ బూర్వము వ్యాకరణమే లే దని లోకప్రసిద్ధి. ఇట్టి సందర్భములో నాంధ్రభాషకు సరియైన స్వరూపమే యేర్పడని దినములలో భర్తృహరి తెనుఁగునకు వ్యాకరణము వ్రాసె ననుట యపూర్వము.

2. సంస్కృతప్రాకృతములందు వైదుష్యము కలవారికిఁ దెలుఁగున నుండఁ గూడదా? సంస్కృతప్రాకృతములందు వైదుష్య మున్నంత మాత్రమునఁ దెలుఁగున నుండవలె నని నియమమా? అటులేని సంస్కృతభాషలో మహాకవి యగు కాళిదాసు తెలుఁగునఁగూడ నొక మహాకవి యై యుండఁగూడదా యని వాదించిన నింకను బాగుగ నుండెడిది.

వెండియు విమర్శకులు “కావున వ్యాసకర్తగారు నా కాదేశముగా నన్ను రాలేదు. నన్నులోనిది విభక్తి యుకారమే కాని వేఱు కాదని నిరూపించుట యుక్త” మని వ్రాసిరి. ఇచ్చట నన్ను శబ్దమునందలి యుత్వసమేతద్రుతము ద్వితీయావిభక్తిప్రత్యయము కావునఁ బూర్వ ముదాహరించిన సూత్రము లిచట వర్తించును. కూర్చి, కంటె నితరము లగుద్వితీయావిభక్తిప్రత్యయములు ద్రుతప్రకృతికము లగుటంజేసి ద్రుతము కలుగును. కావున, “నన్ను + ఏలు=నన్నేలు, నన్నునేలు” అని రెండురూపములు చాల్చును. దీనికిఁ జింతామణి సూత్రము “అనాదిషువిభక్తిషూతోవా” అని. దీనిపై బాలసరస్వతి టీక “అనాదిషు=ప్రథమావ్యతిరిక్తమైన, విభక్తిషు=విభక్తులయందు, ఉతః=ఉకారమునకు, వా=వికల్పమున, సంధికలదు. మమ్మునేలు, మాకొలకునిచ్చు, నీకు నారోగ్యము.

.........ద్రుతప్రకృతులు గనుక నకారము నిలిచినది. మమ్మేలు నిత్యాది. కేతనయు నిటులే వ్రాసినాఁడు.

క. నన్నును నిన్నునుఁ దన్నును, నన్నందుల కునులకినులయందును మునుపై
నున్ననకారపుఁబొల్లులు, పన్నుగఁ బోఁజూపు నచ్చుపై నున్నయెడన్.

క. నన్నెఱుఁగు నన్ను నెఱుఁగుర్, దన్నెఱుఁగును దన్ను నెఱుఁగుఁ దత్వజ్ఞుఁడిలన్
నిన్నెఱుఁగు నిన్ను నెఱుఁగును, నన్నం బరువడిగ నివియుదాహరణంబుల్."

ఆంధ్ర భాషాభూషణము.

'వృద్ధిఁ బొందిననాఁడు భాషకు వర్ణములఁ జేర్చుట వెనుకటి భాషకు న్యూనత్వాపాదకము కానేర' దని వ్యాసకర్తగారి యభిప్రాయము. భాషాభివృద్ధిని సూచించునది వర్ణములసంఖ్య గాదు. భాషాభివృద్ధి సూచించునది నవవిద్వత్కవిశ్రేష్ఠుల యుద్గ్రంథములందు వెలుఁగు సారస్వతజ్యోతి. ఉత్తమమగుబుద్ధివికాస మెక్కుడగు కొలఁది ప్రతిమానవునకు నాలుగుచేతులు, నాలుగుకాళ్లు నావశ్యకమా? ఇట్లు వృద్ధిఁబొందుట జీవభాషకు సహజ మని వ్రాసిన నేజీవభాషయం దిది గన్పట్టుచున్నది.

ప్రస్తుతవ్యాస మితరుల వ్రాఁతలను ఖండించుటకుఁ గాక విమర్శకులు వెలిపుచ్చిన యభిప్రాయభేదములకు నాకుఁ దెలిసినంతవఱకు సదుత్తరముల నొసఁగుటయే యని మరల మనవిచేయుచున్నాఁడను. ఇందలి నా ప్రమాదములను మన్నించి గుణలేశములను గ్రహించి సత్యాసత్యము లెఱుంగుదురు గాత మని సరసు లగువిద్వజ్జనులను బ్రార్థించుచున్నాఁడను.

అనర్ఘరాఘవము.

— చేబోలు సుబ్రహ్మణ్యశర్మగారు, కొవ్వూరు. —

(వెనుకటి సంచిక తరువాయి)

లక్ష్మణుఁడు—వీనియసహనము.

తృ. అం. 38 శ్లో. క్రిందున "ల-(సామర్షం జనాన్తికం) ఆర్య కథ మసౌ సహస్రార్జునవాలిభ్యా మవలీఢశౌర్యసారో దురాత్మా రావణః ప్రస్తూయతే" రావణుని గుణములను సహింపనివాఁ డని తెలియుచున్నది.

సోదరభక్తి.

చతు. అ. 47 శ్లో. క్రిందున "రా- సరోషం నేపథ్యాభిముఖం ఆః వత్స కోయ మద్యతనస్తే దుర్వినయప్రరోహో యద్గురూనపి క్షేత్రీకరోషి." అని రాముఁ డనినపిమ్మట- లక్ష్మ- (నేపథ్యే) ఆర్య తూష్ణీ మయనుష్మి క్షమస్వ జామదగ్న్య నియ త్రిలోహ మార్యేణ'' అని లక్ష్మణుఁడు పల్కుటవలన సోదరభక్తి వ్యక్తము.

సౌందర్యాదికము.

షం. అ. 39. శ్లో.

"ఏకో వేషపరిగ్రహః పరికరః సాధారణః కర్మణా
మాకృత్యో ర్మధురత్వ మేవ సదృశం తుల్యైవ గంభీరతా
తం ద్రష్టుం చిర ముత్సుకోస్మి కతరో వాం రామభద్రః పునః
సర్వక్షత్రవధవ్రతీ భృగుపతి ర్యేనావకీర్ణీకృతః."

రాముఁడు సర్వలోకైకసౌందర్యుఁ డనియు సర్వలోకైకవీరుఁ డనియు నింతకుఁ బూర్వము వర్ణింపఁబడియెను. అట్టిరాముఁడు లక్ష్మణుఁడు నొక్కచో నిలిచియున్న రాముఁ డెవరో లక్ష్మణుఁ డెవరో తెలియుట లే దని చెప్పుటవలన నీలక్ష్మణుఁడును రామున కుండుసౌందర్యాదికములను గలిగియున్నాఁ డని తెలియనగును.

దశరథుఁడు—వీనిగురుభక్తి.

"తస్యాజ్ఞయైవ పరిపాలయతః ప్రజాం మే, "అహో బహుధా శ్రుత మపి భగవతో వసిష్ఠస్యానుశాసనం నవం నవ మివ ప్రమోదయతి మాం"

"వామదేవ మమహి గురువచనశ్రవణతృష్ణా మంకుశీకరోతి శ్రోత్ర వృత్తి రింద్రియాన్తరానుసారిణో హృదయమహాగజస్య త న్నకించి దపర మవ శిష్యతే" "సహార్షం సుష్ఠుశిరసికృతం ఆచార్యవచనం" ఈవాక్యములవలన దశరథునికి గురువగు నవ్యసిష్ఠునియందుండు భక్తివ్యక్తము.

పరాక్రమము.

ప్ర. అం. 2౹ "జనయతి త్వయి వీర దిశాంపతీ నపి గృహాంగనమాత్ర కుటుంబినః। రిపు రితి శ్రుతిరేవ నవాస్తవీ ప్రతిభయోన్నతి రస్తు కుతస్తు నః"

అపిచ. ప్ర. అం. 27 శ్లో. "దత్తేంద్రాభయదక్షిణాద్భుతభుజాసంభార గంభీరయా। త్వద్వృత్త్యాశిథిలీకృతత్రిభువనత్రాణాయ నారాయణః। అన్తస్తోష తుషారసౌరభమయశ్వాసానిలాపూరణ। ప్రాణోత్తుంగభుజంగతల్ప మధునా భద్రేణ నిద్రాయతే" దిక్పతులు త్వదాయత్తు లనుటచేతను నింద్రాదులకు నభయమిచ్చువాఁడ వనుటవలనను నీభుజపరాక్రమమువలన రక్షావ్యాకులరహితుఁడై నారాయణుఁడు నిద్రించుచున్నాఁ డనుటవలనను దశరథునిపరాక్రమ మనిర్వర్ణనీయము.

అవికత్థనత్వము.

ప్ర. అం. 26, 27 శ్లో. లను విశ్వామిత్రుఁడు చదివినపిమ్మట-

"దశరథః-సవైలక్షస్మితం భగవన్ విశ్వామిత్ర అభ్యమిత్రీణస్య తత్ర భవతః సునాసీరస్య నాసీరపూరకేణ పదాతిపరమాణునా మయాపి కదాచి దుద్ధృతం ధనుః యస్మాలోయ మలీకలోకప్రవాదో భవన్త మప్యాప్యాయయతి" అని దశరథుఁ డనుటవలన నాత్మశ్లాఘాపరాయణత్వమందు విముఖుఁ డని తెలియుచున్నది.

పుత్త్రవాత్సల్యము.

"దశ-భగవన్ పర మనుగృహీతా వయ మేవం తత్రభవతా సంభావ్యమానాః కింపున రగృహీతాస్త్రః క్షీరకంఠో వత్సోయ మితి ప్రముగ్ధోస్మి"

"దశ-సవిషాద మాత్మగతం-కథ మిద మస్మాకం సకలలోకశోకశంకూద్ధరణశీలశీతలేభ్యః కౌశికప్రసాదేభ్యో రామభద్రప్రవాసవైమనస్య ముత్పద్యతే" "దశ-తౌ సస్నేహ మాదాయ భగవన్ కౌశిక ఇత్యర్థోక్తే మన్యూత్పీడ నిగృహ్యమాణకంఠో వామదేవస్య ముఖ మీక్షతే" ఈమూఁడువాక్యములవలనను దశరథుని పుత్త్రవాత్సల్యము తెలియుచున్నది.

ధర్మతత్పరత.

"దృష్టం వా నిఃశేషానన్దనిఃస్యన్దినీనా మహీన్ద్రకరకన్దలీనాం కమలవనీమీలనం కలంకస్థానం (విహస్య) కాగతిః-

ప్ర. అం. 39 శ్లో. "కూర్మరాజభుజగాధిపగోత్రగ్రావదిక్కరిభిరేకధురీణః। మాం ప్రసూయ కథమస్తు విగీతో హాపరార్థవిముఖో రఘువంశః" రఘువంశము పరోపకారవిషయమై విముఖమైనది కాఁగూడదని యెంచి పిన్నవయస్సుగలవాఁడైనప్పటికిని రాముని యాగరక్షణార్థము పంపుటయే యుక్తమని తలంచుట ధర్మతత్పరతను సూచించుచున్నది.

చ. అం. 35 శ్లో. క్రిందన, దశ-నిర్వర్ణ్య సస్నేహం సఖే సీరధ్వజ రఘురాజధర్మాధికారసర్వధురీణః శిశురపి వత్సోయం తదస్మిన్వరసా దుర్వహాం వర్ణాశ్రమభార మారోప్య వయమపి క్వాపి తపోవనే దిలీపకులోచితేన విధినా శేషమాయు రుపబుభుఞ్జామహే" గృహస్థాశ్రమమును విడనాడి తమపూర్వులవలెనే వానప్రస్థము మొదలగు ధర్మమార్గముల ననుసరించుటయందు కుతూహలము కన్పట్టుటచే ధర్మతత్పరత తెలియుచున్నది.

జనకుఁడు—అవికత్థనత్వము.

తృ. అం. 15 శ్లో. విశ్వా-భో మహాయోగిన్ "కిం యాజ్ఞవల్క్యో జనకః కిమేవం న వః స్వరూపం కవయోపి విద్యుః। ప్రవాహనిత్యా నధికృత్య యుష్మాన్ సహ స్వశాఖాః శ్రుతయః ప్రథన్తే'' అని జనకుని స్తోత్రముచేసిన వెంటనే-శతానన్దః-భగవన్ కౌశిక ఏవమీదృశాః ఖల్వమీ త్రిభువనమహనీయమహిమానో మనీషిణః'' అని శతానన్దుఁడనును. తరువాత జనకః-సవైలక్ష్యస్మితం. తృ. అం. 16 శ్లో.

నిర్మాయ కార్మణమృచామసుమన్దణీనా। మున్మార్జనీర్జగదఘానితవాద్యవాచః
శ్రోతుం చిరప్రణయికౌతుకమస్తి చేతో। దుఃఖాకరోతి పునరేషమమార్థవాదః"

తద్విరమ, ఇతి శిర స్యంజలిం ఘటయతి,-ఇట్లనుటచే నవికత్థనత్వము స్పష్టము.

జ్ఞానవైభవము. తృ అం. 13 శ్లో.

"యజూంషి తైత్తిరీయాణి మూర్తాని వమతిస్మయః
సయోగీ యాజ్ఞవల్క్య స్త్వాం వేదాన్తానధ్యజీగపత్"

తృ. అం. 12 శ్లో. "యత్ర త్వం బ్రహ్మమీమాంసాతత్త్వజ్ఞో దండధా

రకః" పై దానివలన వేదాన్తము బ్రహ్మమీమాంసాశాస్త్రము మున్నగుశాస్త్రములయందును గొప్పవాఁడని తెలియుచున్నది.

వసిష్ఠుఁడు. సప్త. అం. 136 శ్లో.

"రఘుబ్రహ్మక్రియాచార్యం పురాణబ్రహ్మవాదినం
బ్రహ్మర్షిం బ్రహ్మజన్మాన మేవ రామోఽభివాదయే"

దీనివలన వసిష్ఠుఁడు పురాతనుఁ డనియు వేదవక్త యనియు బ్రహ్మర్షియనియు బ్రహ్మనుండి పుట్టినవాఁ డనియుఁ దెలియుచున్నది. వీనిని శ్రీమహావిష్ణువగురాముఁడు నమస్కరించుచున్నాఁ డనిన వీనిమహత్త్వ విష్ణునిమహత్త్వకంటె గొప్ప దని తెలియుచున్నది.

రావణుఁడు, వీనిభక్తి.

"సంతుష్టే త్రిస్సృణాం పురామపి రిపౌ కండూలదోర్మండలీ। క్రీడాకృత్తపునః ప్రరూఢశిరసో వీరస్యలిప్సో ర్వరం।యాచ్ఞాదైన్యపరాంచి యస్య కలహాయ స్తే మిథస్త్వంవృణు।త్వం వృణ్వీత్యభితో ముఖాని స దశగ్రీవః కథంకథ్యతాం." ఇందు రావణుఁడు విలాసగాఁ దనశిరస్సులఁద్రుంచి యీశ్వరునికి హోమముచేసిన మహాదేవుఁడు వరమును గోరుకొమ్మనిన వీనికి మరల మొలచినశిరస్సులు యాచించుటకు సిగ్గును బొందుచున్న వని చెప్పుటచే నీశ్వరసేవాతత్పరుఁ డనియు భక్తులలో నగ్రగణ్యుఁ డనియుఁ దెలియుచున్నది.

వీనిపరాక్రమము. తృ. అం. ౬౮ శ్లో.

"యచ్చేష్టా స్సమనీకసీమని పరిత్రస్తః పరాంచన్నపి।
ప్రత్యక్షీకురుతే సహస్రనయనః పృష్ఠోద్భవై రక్షిభిః।
చక్రే వర్త్మ చనాగలోకజయినీం యాత్రామివ ప్రస్తువన్।
యః కైలాసముదస్య కీదృశ మహాదానంతు తస్యాపదాం"॥

దీనివలన వీనిపరాక్రమము వ్యక్తము.

మహాకులీనత. పం. అం. 9 శ్లో.

"కులే యేషాం కింతు త్వమసి గణితాస్తేపి గురవో
న సప్తబ్రహ్మాణః కథమివ పులస్త్యప్రభృతయః"

పం. అం. 14 శ్లో.

సిద్ధశ్లోత్రపరంపరాపరిగతై శ్శేభిః ప్రపౌత్రస్య తే
వృత్తైరద్య పులస్త్యవర్జ మభిత స్స్మేరేషు దేవర్షిషు.

ఈ రెండు చరణములవలనను వీనియొక్క సద్వంశము తెలియుచున్నది.

వాలి—ఆత్మశ్లాఘ. పం. అం. 50 శ్లో.

“అస్మద్దోర్ద్యాలకూలంకష విషమభుజగ్రన్థిభంగ ప్రసంగ
క్రోశల్లంకేశదత్తత్రిభువన విజయఖ్యాతిసర్వస్వదాయః.

దీనివలన వాలియొక్క యాత్మశ్లాఘ యున్నట్లు తెలియుచున్నది.

వాలిపరాక్రమము.

“పౌలస్త్యావయవౌఘసంకటభుజామూలక్షణోన్మీలిత
ద్వైరాజ్యామమరావతీం కృతవతే వీరాయయస్మై హరిః”.

వీని భుజామూలమందు త్రిలోకైకవీరుఁడును దశకంధరుఁడును, ఇరువది చేతులు గలవాఁడును, నగు రావణుఁడుండె నని వాలిపరాక్రమము చెప్పనలవిగాదు.

పరశురాముఁడు—వికత్థనుఁడు.

చ. అం. 25 శ్లో.

“రే కాకుత్స్థాః కథం వః శ్రుతివిషయమయం నాగమద్భార్గవీయో
దుఃసామన్తాపచారప్రచితపితృవధామర్షనిస్తారబంధుః
వారా నాసన్నవింశా న్విశసితవిషమక్షత్రజాతిప్రరోహాః
క్రోధాదుత్కృత్తగర్భామిషరుధిరవసావిస్రగన్ధిః కుఠారః”.

ఓరోరీ కకుత్స్థవంశజులారా! నా తండ్రిని జంపిన కోపమువలనఁ గార్తవీర్యార్జునిగర్వమును, బోఁగొట్టినట్టియు గర్భవతు లగుక్షత్రియస్త్రీలను బలిపశుఁ గోసినట్టియుఁ బుట్టిన రాజశిశువుల నందఱను జంపినట్టియు నాపరశును మీరు వినియుండలేదు. అని చెప్పుటవలన నాత్మశ్లాఘ గలవాఁడని తెలియుచున్నది.

అరణ్యమందు నివసించువాఁడును, శస్త్రసన్న్యాసము చేసినవాఁడును, సత్త్వగుణప్రధానుఁడును నైయున్న పరశురాముఁడు పరనిందాపరాయణుఁడును, ఆత్మశ్లాఘాపరాయణుఁడును, కోపిష్ఠియును నైయుండుట భావ్యమైనది కాదని యనవచ్చును గాని యిన్నిమంచిగుణము లున్నవాఁడు మరల నిన్ని చెడ్డగుణములలోనికి దిగుటకుఁ గారణము కేవలము మహోత్తరం బగు గురుభక్తియే గాన నాయాత్మశ్లాఘాపరాయణత్వము, కోపము మున్నగుదుర్గుణములు దుర్గుణములుగ నెంచఁదగినవి కావని చెప్పవచ్చును.

మాల్యవంతుఁడు—శత్రుగుణగ్రాహి.

"సార-తతశ్చ రాఘవేణ నిజసచివనిర్విశేషముపగృహ్య పురస్కృత్య చ ప్రహితోఽస్మి" అని సారణుఁడు మాల్యవంతునితోఁ జెప్పినతర్వాత—

"మాల్య-సహర్షం కిముచ్యతే యావద్ద్రివ్య భావీ గుణోఽహి విజగీషూణా ముదాత్తతా విశేషేణపున రయం రామభద్రః" ఇట్లనుటవలన శత్రుగుణగ్రహణము గలదు మాల్యవంతున కని తెలియుచున్నది.

కవి.

చ. అం. **43** శ్లో. క్రిందన-

"నేపథ్యే ఆః పాపక్షత్రియాయాః పుత్ర! క్షత్రియభ్రూణహత్యాపాతకిన్" అని పరశురాముని శతానందుఁడు తిట్టెను. జామ-సరోషహాసం- అరే బ్రహ్మబంధో! బాంధకినేయ, గౌతమగోత్రపాంసన" అని శతానందుని జామదగ్న్యుఁడు తిట్టెను.

తత్త్వతపోవేదియు, సత్వగుణప్రధానుఁడు నగుపరశురాముని చేతనుయాజ్ఞవల్క్యునితో సమానుఁ డగుజనకుని పురోహితుఁడైన శతానందుని చేతను నిట్టి మాటలాడించుటచేఁ గవి బ్రాహ్మణులయందు హీనత్వమును జూపె నని తెలియుచున్నది. ఇట్లు బ్రాహ్మణులయందు హీనత్వమును జూపుటచేతను, ఈకవికి భట్టమురారి యనుపేరును తండ్రికిభట్టవర్ధనుఁ డనుపేరును నుండుటచేతను నితని భట్టశబ్దము భట్టరాజులను శాఖను సూచించును గాన నితడు బ్రాహ్మణేతరుఁడని చెప్పవచ్చు నని తోఁచుచున్నది. చదువరులు క్షీరోదన్యాయముగా గుణము లుండిన గ్రహింపుఁ డనివేడుక.

తారకాపచయవిమర్శనము.

—దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు, కొవ్వూరు—

శ్రీమంత మైనమనయాంధ్రదేశమునఁ బెక్కుభాషలు వాడఁబడుచుండుట సర్వవిదితము. అట్టిభాషలలోఁ బలువురచే వాడఁబడుచు జీవద్భాషయని పేరందినది యాంధ్రభాష. ఇయ్యది యించుమించు, ఎ. డి. 11 వ శతాబ్దమునకంటెఁ బూర్వమందు లేదనియు నీవలనే భారతాదిగ్రంథము లుత్పన్నము లై తెనుఁగునకు మెఱుఁగుపెట్టె ననియు విమర్శకుల యాశయము. నాఁటినుండియు ననేకశాఖలతోఁ బెంపొందుచున్న యీవాఙ్మయమునఁ బ్రబంధములు, గద్యకావ్యములు, నాటకములు మొదలగు వివిధగ్రంథము లుద్భవించుచునేయున్నవి. ఇందు, ప్రాచీనములగుకొన్ని గ్రంథరాజములు ముద్రణాదిసదుపాయములు లేక నశించుచున్నవి. ఆధునికకృతులలోఁ గూడ ననేకప్రబంధము లుదయించుచున్నవి. వీనిలో "తారకాపచయ" మనునది యొకప్రబంధము. తారకాసురనాశనమే ముఖ్యోద్దేశ మగు నియమమున నిద్దాని కీనామ మంకించియుండును. ఇయ్యది రాజవోలుతాలూకా కొత్తపేటవాస్తవ్యుఁడగు ఇవటూరి సూర్యప్రకాశకవిమణిచే రచింపఁబడినది. ఈకవికులతిలకుఁడు సంవత్సరము క్రిందటనే దివంగతుఁ డయ్యెను, గావ్యశరీరావశిష్టుఁడై యచ్చటచ్చట దాఁగియేయుండెననఁదగును. మఱియు దీన నితివృత్తము కృత్తికలార్వురకుఁ, బార్వతీపరమేశ్వరులకు, నగ్నికి, గంగకు నిందఱ కెట్లుగా స్కందుఁ డొక్కరుఁడు పుత్రుఁ డయ్యెనో యావిషయమును దెలుపుచుఁ దారకహననము గూడఁ జెప్పఁబడినది. ప్రకృతమున నీప్రబంధవిషయమున గుణాగుణములఁ గొంచెము విచారింతము.

ప్రథమమున నీతనికవిత్వశైలి యతిగంభీరమై యుండును. కొన్నిచోటుల నోజోగుణయుతముగను, గొన్నిపట్టుల జాను తెనుఁగుపదములతోను, గొన్నిపట్టుల శబ్దాలంకారభూయిష్ఠముగను, రసోచితపదరచనగలిగియుండును. అల్లికయందలి జిగిబిగి యతిస్తుత్యము కాని యచ్చటచ్చట ఝడిత్యర్థస్ఫూర్తి లేని పదముల విస్తారముగాఁ బ్రయోగించియున్నాఁడు. వర్ణనలవిషయమున నలంకారములతో, నతిహృద్య మగు నుత్ప్రేక్షాతిశయోక్తులతో వర్ణించియున్నాఁడు.

"ఓజస్సమాసభూయస్త్వమ్" అనునట్లు క్రిందిపద్యములలో దీర్ఘసమాసము లుండియున్నవి.

"నిశ్శేషమానుష్యకాంతరంగికవ్యథావకరాత్ముల్ల కప్రవర్తమానసమ్మార్జనీభవన్మలయమారుత"

" అంచితసౌందర్యవిశేషసంపాదనరోచిస్స్ఫారితోద్యత్ప్రసాంపతి .... "

" తామరసజన్మశచీదయితాదినిర్జరేశ్వరమకుటోపలద్యుతిపిశంగితమంగళపాదపీఠుఁడు"

"ప్రసూతితనూజసభాస్థితాహిభుగ్ధోరణవాసవాద్యమరకూటము ...... "

"సురసారంగవిలోచనానుతతనూశోభ, న్మదభ్యస్తభాసురసాహిత్యురుగీతికాదికకళాసూద్దామ నభ్యంచితాసురసామ్రాజ్యరమావతారన్ .... "

ఇట్టివనేకము లీప్రబంధమునఁగలవు. దీనివలన నీతనిపాండిత్యము స్పష్టపడుచున్నది. ఈ క్రిందిపద్యములలో జానుతెనుఁగుపదములే తప్ప సంస్కృతపదము వెతకుటకుఁ గూడఁ గానరాదు. చూడుఁడు-

"మొగములతిగ యగపడకుం,డఁగఁబుడమికి దిగినపల్లునవలాయొడయం
డగుతబిసిచేఁజదువులె,ల్లఁగఱచినవలంతి పీవలఁతివె తలఁపన్."

"ప్రాచియగ్గి నీమాటి పడమటినేస్తకత్తియకుఁ బంపినకెంపుతెలె యనంగ
హాదనుపొన్నారిరేయతివసొమ్ములకుఁ గాఁ గరఁగిన యపరంజికరుడనంగ
... ...
తమ్మితీవియబోఁడికి నెమ్మెకాఁడు, నిగ్గుపుంజీఁకటికిఁ దీరనిపగవాఁడు
తొవలయుల్లాస మడఁగించుదుండగీఁడు .... పవలుఱేఁడు."

ఇత్యాదిపద్యములు కేవలము నచ్చతెనుఁగుపదములతో వ్రాసియున్నాఁడు. ఇంక నిట్టివనేకము లున్నవి. విస్తరభీతిను దాహరింపమానితి. ఈ క్రింది పద్యములలో శ్రుతికటు వగుశబ్దాలంకారములు రసహీనములై వ్యర్థపదయుతములై యున్నవి, చూడుఁడు-

"మట్టుమీరినట్టి యిట్టలంపువిరాళి పుట్టునట్టికొట్ట కొట్టువెట్టి
గట్టినట్టుదిట్టఁజెట్టవట్టుటకట్టు గట్టిపట్టుపట్టి గట్టుపట్టి"

పైపద్యమున ద్విత్వటకారములు ప్రోగుగాఁ జేసినట్లు లగపడుచుఁ జదువుట కెంతయో యసహ్యము కలిగించుచున్నవి. మఱియొక చిన్నపద్యమున "సాటి, యేటి, జోటి, నిశాటి, తాటి, మేటి, మాటి, మాటి, చేటి"యని వర్ణావృత్తిం జేసి ప్రాణము పిసువునట్లు చెప్పియున్నాఁడు. మఱియొకచోట,

"వాహాయవాహాయమానాగాహితాయ
వృజినకలంకాయ లంకాయతాక్షి ... ..."

ఇట్లే నాలుగుసీసపాదములందు నావృత్తియగు పదమే మరల నావృత్తిఁ జేయుచు యమకములఁ జెప్పినాఁడు.

"లోకనాయక ... ...లోచనాయ
లోచనాయతినికృత ... ...నలినాయ"

అనుచు ముక్తపదగ్రస్తముగా వ్రాసియున్నాఁడు. ఇట్టి వింకను గలవు-కొన్నిటినే చూపినాను.

ఇంక ఝుడిత్యర్థస్ఫూర్తిలేని పదము లీతనికృతియందు కుప్పతిప్పలుగ నున్నవి. అవి వ్యాకరణము చదువుకొనిన వారికిని రెండుమూఁడు నిఘంటువులు కంఠాగ్రమం దున్నవారికేగాని యితరుల కర్థమగుట దుస్సాధ్యము, చూడుఁడు.

"వాచంయము, చైరకాలికైకత్రవాస, ఓతువాఖువు, క్షేపిష్ఠపాతంబు, ద్వయాతిగప్రవేకుఁడు, వికుర్వాణ, నైర్ఘృణ్య, ప్రాఘుణిక, సంస్ఫోట, ప్రత్యాలీఢ, ఖామరాఘస, జఘ్ధ, క్ష్వేళ ... ..."

ఇత్యాదులు పద్యమున కథమము రెండు మూఁడుండును. కాని యిట్టి పదములు కవికున్న జ్ఞానమునే తెలుపును గాని రసమును బాడుచేయుటయే గాక సర్వజనసాధారణముగా నుండవు. కావ్యము రచించుట ముఖ్యముగాఁ బరుల నానందమునందించుటకుఁగదా ?

"కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే సద్యః
పరనిర్వృతయే ... ..."

అని యలంకారజ్ఞుల యాశయము. పైపదప్రయోగముల సద్యఃపరనిర్వృతి కలుగ దని యనుకొనుట కర్హము కాని కవి తనశక్తిఁ జూపుట కట్టివి ప్రయోగించె ననుకొన్నఁ బ్రకృతమున కంతగా నాక్షేపణ కలుగదు. ... ...

మఱియు నీతని కవిత్వమందు జాతీయతగూడ నచ్చటచ్చట నున్నది...
"పాలన్ముంచిన నీటముంచినను" "దేశముగానిదేశముల" "ముక్కులపచ్చలెయారకుండినన్" "శ్రీతాన యేతేర మోఁకాలడ్డంబిడి" "గోచిపాతరాయఁడయిన వృద్ధతాపసుఁడు"

మొదలగు సామెతలు ప్రయోగింపఁబడి ప్రకృతార్థమున కెంతయో సహాయములై యుత్కటప్రేమను నీతిని నైరస్యమును దెలుపుచుఁ గవియొక్క

హృదయవైశాల్యమును దెలుపుచున్నవి. మఱియు వర్ణనలవిషయమున మంచి మంచి యలంకారములతో హృదయంగమము లైన భావరాసుల గ్రుమ్మరించి నాఁడు. సూర్యాస్తమయవర్ణనావసరమున—

"పతివచ్చు నని నిశావాసకసజ్జిక కట్ట సిప్పిన కావిపుట్టమేమొ ?
ప్రొద్దుతో నైనపోరున నింగిఁబాఱు మందేహదేహాసృక్ప్రవాహ మేమొ ?
సవితతో దినలక్ష్మి సహగమించుటకుఁ బేర్చిజ్వలింపఁజేసిన చిత్యమేమొ?"

ఈసమయముననే చీఁకటిని హృదయాహ్లాదముగఁ బొగడినాఁడు.

"అసదృశమున్ స్థిరంబు నగునంబరరత్నము వోవుటన్ బిత్ర
ప్రసువను సంతివంతగదురన్ విలపించుటయున్ దదీయశో
కసమయమందు జొబ్బిలుసకజ్జలరోదనవర్షమో యనన్
విస్పురమయ్యె నెల్లెడల వెగ్గలమై తిమిరమ్ము రోదసిన్.

ఇట్టివర్ణనము లిఁక రెంటి నుదాహరింతును. అట్లే నక్షత్రములతోఁ గూడిన యాకసమును గూడఁ జక్కగ వర్ణించియున్నాఁడు.

"......రాజువచ్చునని......నింగి చం, దువకల దిష్టముండనుఁడు తోల్తగఁ
గట్టిన ముత్తియంపు చే, రువ లన నొప్పె ఋక్షనికురుంబము లాకసమందు"

మఱియుఁ జంద్రోదయమును వర్ణించుచు—

"మిత్రుని జాడ లేమికిఁ బొక్కుచుఁ దలెత్తి నెమకుచుండిన తూర్పు నెలఁతయేమొ?
హేలకై శచిబిడ్డఁ డెగురవైచుచుఁ బూర్వగిరిపైఁ బడిన బంతివిరులచెండొ
సమయమాంత్రికుఁడు ధ్వాంతము నూపమంత్రవిభూతికై తెచ్చినబూదిపండొ?"

అని యచుంబితార్థసంపత్తిగాఁ జదువరులహృదయకమల వికసనశీలముగ వర్ణించియున్నాఁడు. ఇంక ననేక స్థలముల నీతని గభీరభావతరంగ లానంద సముద్రమున నోలలాడింపఁగలవు.

ఇంకొక విషయము- ఈకవితల్లజుని గ్రంథము దచ్చటచ్చటఁ గొన్ని భావ చౌర్యములు గననయ్యెడి- స్వల్పముగా ననుకరించినవి విడిచి యనుగతములగు వాని నుదాహరింతును. సురస యనురాక్షసకాంత చేయఁబోవు ఋషిసేవను వర్ణింపుచు-

"కడువాఁడియైనట్టి కౌక్షేయకము వాయి నాల్కయంతయుఁ జాచినాకినట్లు,
త్యక్తనిర్మోకంబు దారుణంబునునైన కోడెచిల్వను ముద్దుగొనినయట్లు,
గళముదాఁక శిరంబు ఘాతుకంబైన శార్దూలంబునోటిలోఁ దూర్చినట్లు"

అని చెప్పియున్నాఁడు. ఈపాదత్రయము కువలయానందమున నిదర్శ నాలంకారమునకు గ్రంథాంతరమునుండి లక్ష్యముగా నుదాహరించిన శ్లోకము నకు సరిపడు తెనుఁగుపద్యము లాగున్నది.

"రాజసేవా మనుష్యాణా మసిధారావలేహనం
పంచాననపరిష్వంగో వ్యాలీవదనచుంబనమ్"

ఈశ్లోకమును జూచిన చదువరులు తప్పక నిద్దానిని తెనుఁగున మార్చి రేమో యని యనుకొనక మానరు. మఱియొక స్థలమున నడవిని వర్ణింపుచు నిట్లు వాక్రుచ్చియున్నాఁడు -

"క్రాలు గాలవశాండిల్యకౌశికాదు, లైన ఘనతరుల్ గలిగి యక్కాననంబు
క్రాలు గాలవశాండిల్యకౌశికాదు, లైన ఘనతరుల్ గలిగి యక్కాననంబు"

ఈపైపద్యము చక్కనిశ్లేషతో నిమిడియున్నది. ఒకపక్షమున మునీ శ్వరపరముగను మఱియొకపక్షమున వృక్షపరముగను నర్థము చెప్పుకొనవలె ను. ఇట్టి శ్లేషయే గలిగి రెంటను సమానమగు నర్థము నిచ్చుపద్య మొకటి రామరాజభూషణుని హరిశ్చంద్రనలోపాఖ్యాన మనుద్వ్యర్థికావ్యమున నున్నది. అచ్చటప్రకృతవర్ణనావిషయములు- నదియు సెలయేఱును.

"గాలవశాండిల్యకౌశికాదిపరార్థ్యతరులక్షవటయుక్తి దరులనెసఁగ"

ఇచ్చటఁగూడ నొకపక్షమున నాయాపేరులు గలఋషులును రెండవప క్షమున వృక్షములును వాచ్యార్థములు. ఇట్టి సంపూర్ణమైన పోలిక గలపద్య ములఁ జూచిన భావచౌర్యమే గాక పద్యచౌర్య మని కూడఁ జదువరు లనక మానరు-మఱికొన్ని పట్టుల,

"నెమ్మొగమువర్ణనముసేయ నెలయగుంగ్రొ, శావలగ్నముపొగడఘనాయనమగు
తత్ప్రిశోణినుతింప నబ్దాంబగు పద,ములను శ్లాఘింప దొరకొనఁబుష్కరమగు.

తత్తన్నాయికాంగముల వర్ణింప దీర్ఘకాల మగు ననియు నుపమాన భూతచంద్రపద్మాదుల శ్లేషచేఁ జెప్పియున్నాఁడు. ఇంకను బ్రాచీనతములయి యిక్కాలమున నామమాత్రావశిష్టములు గానున్న భద్రక మదన తరలి శుద్ధవ రాటి మొదలగు బహువిధవృత్తములు చాల వాడినాఁడు. ఛందఃకర్త లెట్టిప్రా సల దుష్కరప్రాస లని చెప్పిరో యట్టిప్రాసల ననఁగా ష్ట, స్త్రీ, న్ద్ర, శ్చ- మొదలగు రెండుమూఁడు హల్సముదాయములు గలవాని వాడి నిరాటంకముగాఁ బద్య ముల వ్రాసినాఁడు. దీనినిబట్టి చూడ నీతనియకలంకకవితాప్రవాహమున కడ్డు

లేదని తేలుచున్నది. ఈతఁడు తఱచుగా శత్రర్థచువర్ణమందలి యుకారమునకు సంధిచేయుచు గొన్నిరూపముల వాడినాఁడు. ఇది వ్యాకరణసమ్మత మైనను శ్రుతికటు వగుస్థలముల నిట్టిసంధి చేయరా దని నాయభిప్రాయము-ఉ:—"అనుచతఁడు, అంచభయంబొసంగి, ఒనర్చుచచ్చుటిదానిన్"అని ప్రయోగములున్నవి. వీనిలో మూఁడవదానియందలి మొదటి మూఁడక్షరములు తీసివైచిన నెంతయసార్థ మిచ్చుచున్నదో! కాన నిట్టివి జాగ్రత్తగా వాడిన బాగుండును. మఱియు, అట్టి యిట్టిశబ్దములపైఁ దచ్ఛబ్దవకారలోపరూపముల "అట్టిఁడు, ఎట్టిఁడు" ప్రయోగించినాఁడు. ఇట్టివి సర్వజనగోచరములు గాక బంధపారుష్యమును గలిగించుచుండును. తనజ్ఞానసూచకముగా కవివాడినాఁడు, కానిచో-

"కలరె యిట్టిరు సౌందర్యఖనులు మహిని"

అనెడి గీతపాదమును,

"కలరె ? యిటువంటిసౌందర్యఖనులు మహిని"

అని ప్రయోగించుకొన్నఁ బై పాదసారస్యము రాదా ? తప్పక కవితన పాండిత్యము చూపుటకే యట్టిపదముల వాడినాఁడు-

ఇఁక రసవిషయమును విచారింతము. ఈవిషయమున విపులముగ రసనిష్పత్తిని జూపిన నధమ మిరువదిపేజీలవఱకు గ్రంథ మధిక మగును గానఁ గొన్నిపట్టుల వాని నెత్తి స్పృశింతును——

ఇందుఁ బ్రథమద్వితీయాశ్వాసములలో సురసను ఋషిసేవనిమిత్తము పంపునపుడు శోకము స్థాయిగాఁ గలకరుణరసము నాటఁబడినది-

"విద్యకై యాచార్యునొద్ద కేగినయప్డె చాలసేపుంటకు జలదరింతు,
బోటికత్తియలతో నాటలకై పోవ తడవుగాన్పడమికిఁ దల్లడిలుదు,
ఎటకైన పయనమేగుట తటస్థంబైన నినుబాసి చనుటకు నెగులుపడుదు,
... .
మామకతపఃఫలమ! నీవు మగిడి వచ్చి,కంటఁబడుదాఁకనీప్రతీక్షణమహాయుగంబులెటువలె యాపింపఁగలుగువాఁడ,నక్కటా! యెంతనిర్దయుఁడవ్యోనియతి"

"నీవు లేనన్నినాళ్లును నావసథము, గహనభూప్రాయమై యుండుఁగద వెతల్లి"

"గోచిపాతరాయఁడయినవృద్ధతాపసునకక్కటయీవలసెఁ ద్వితీయగాఁ"

"ఎదలోని బెంగ నెవ్వతె మఱపించునింక, ముద్దు పలుకుల నెవ్వతె తెలుపునింక, విస్మయంబెవతె గావించు నింక."

ఇత్యాదివాక్యములచేతను, “హార్ద్రమున నశ్రువు లొల్కెడితండ్రిఁ జూచి” అనెడి సురసవాక్యముచేతను గరుణకు స్థాయియైన శోకమును కవినిబద్ధించెను. కాన, కరుణమనవచ్చును—

అచ్చటచ్చట శృంగారరసస్పర్శలు గూడ నున్నవి. సురసకుమారులఁ జూచుటకు వచ్చెడినగరకాంతలఁ గొందఱినివర్ణించినాఁడు. ఇచ్చట శృంగారోద్దీపనవిభావనాదులు లేశములు గా నున్నను వర్ణనమాత్రము పూర్వకవుల ననుసరించుచున్నది.

ఇఁక వీరరసమును గుఱించి వేఱె చెప్పనక్కఱలేదు. చాలచోటుల యుద్ధారంభము లుండుటచే రౌద్రరసము ముఖ్యముగా దీన నంగిరస మనవచ్చును. ఈరౌద్రరసమందు మహాస్రగ్ధరాదివృత్తములచేఁ బ్రకృతపాత్రమే తానో తానేప్రకృతపాత్రమో? యనునటుల వర్ణించినాఁడు. ఇతరము లగు రసము లచ్చటచ్చట నుండి యంగిని బోషించుటచే నియ్యది నవరసభరిత మగుకావ్య మనఁదగును, గ్రంథవిస్తరభీతిని రౌద్రాదిరసముల కుదాహరణముల నీయనైతి.

మఱియొక సర్వకవివిలక్షణ మగుసుగుణ మీతనియొద్ద నున్నది. ఏమన పూర్వకవిశ్రేష్ఠులు తామేదియో కలలోఁ దమతమతాతతండ్రులు గాని భగవంతుఁడుగాని ప్రబంధరచన చేయు మని చెప్ప మొదలుపెట్టితి ననునాచారము వారివారిప్రబంధములఁ గనఁబడుచున్నది. ఈయాచారము నీతఁ డనుసరించియు నిట్టిమహాప్రబంధమున నన్నృత ముండరా దని మధలదానిని తగ్గించినట్లు తన పీఠికలో వ్రాసికొనియున్నాఁడు. ఇదియే యీతని యందలి స్తోత్రార్హమైన గుణము. మనపూర్వులు శతాంధన్యాయమునఁ దమతమగ్రంథముల వ్రాసిరి గాని యిట్టిస్వతంత్రబుద్ధిని వినియోగింపరైరి. ఇన్నిసుగుణములు గలిగి సాహిత్యజ్ఞానమునకుఁ గేలూఁత యొసఁగు నీప్రబంధము ప్రపంచాకాశమున నక్షత్రమువలె నున్నది. ఇట్టిగ్రంథము నుచ్చదశలోనికిఁ దెచ్చిన మనయాంధ్రభాషామతల్లికిఁ గోటియలంకారము లొసఁగుటయే యని యింతటితో ముగింపుచుఁ బైనా వ్రాసిన విషయము లన్నియు నీయుద్గ్రంథమునఁ గల్గు గుణములలో కణము లని తెలుపుచు నింతటితో విరమించుచున్నాను.

గ్రంథస్వీకారము.

(1) ఓడబేరము—ఇది విద్వాన్ నారాయణవనము కూరత్తాళ్వారు అయ్యంగారు రచించినది. 36 పుటల చిన్న వచనము. అక్బరురాజ్యము, అక్బరు ద్రవ్యాదాయము, నౌకాయుద్ధములు, ఓడనిర్మాణము, ఓడదండు, ఔరంగజేబు, ఐదవ జార్జిసార్వభౌముఁడు నను విషయములు గలవు. పూర్వకాలమునందలి యోడలవిషయమిందుఁ దెల్పఁబడినది-విషయముకొంతమచ్చుచూడుఁడు-

"ఇఁక అక్బరుకాలపు నౌకాయుద్ధములను గుఱించి కొంత విచారింతము 1580 న రాజాతోడర్ మాలుని అగ్రాలో 1000 దోనెలను ఫ్రాబ్ ను సిద్ధము చేసికొని ఘూర్జరదేశపు పన్నులను కుదుర్చుటకై అక్బర్ చక్రవర్తి పంపెను. 1590 న అక్బర్ చక్రవర్తి తాత్తానాయకుఁడగు మీర్జాజానీబేగునకు స్వాతంత్ర్యము ప్రకటింప వలయు నను తలఁపు కలిగినందున నతని మీఁదికి ఖానికాననునతనిని బంపెను. అందునకై మీర్జా 120 శస్త్రాస్త్ర సంభరితమైన ఫ్రాబ్ లను 200 దోనెలను ఖానిమీఁదికి వదలెను. వానిలో నొక్కొక్క ఫ్రాబ్ లోను దారుశిల్పులు, తక్షకులు, కట్టెపనివారు,తమకౌఱముట్లతో సిద్ధముగానుందురు. ......"అక్బర్ నౌకానిర్మాణస్థానములను స్థాపించిన సమయమున మూఁడు వేల యానపాత్రములుండెను. పిమ్మట 768 యుద్ధపుటోడలుగా నేర్పడెను. ఇవిగాక జమీన్దార్లు జాగీర్ దార్లు తాము సర్వమాన్యముగా ననుభవించు చుండు భూములకై చాక్రవర్తికి పెక్కుఓడలు దోనెలు సిద్ధము చేయుచుండిరి."

దీని వెల రు 0-4-0 లు. చెన్నపురి, కోమలేశ్వరన్ పేట, నారాయణవనము వకుళాభరణముగారియొద్ద దొరకును.

(2) వ్యాసావళి:—కాకినాడ, నాట్యకళావిజ్ఞానమండలిలోని, మాధ్వశ్రీ చొల్లాబాదు గోపాలకృష్ణారావుపంతులు, బి. ఏ., గారు రచించినది. వచన గ్రంథము. 1923 సం॥ మొదలు నేఁటివఱకు నప్పుడప్పుడు రచించిన అపేక్ష, సగుణనిర్గుణమూర్తి, సచ్చిదానందుఁడు, అజ్ఞానము, సప్తసోపానములు, చక్రములు, యోగాభ్యాసము, పునర్జన్మ, లోకములు, బ్రహ్మాండములు, విజ్ఞానము నను పదివ్యాసములు గలవు. చక్రములనువ్యాసములోఁ జక్రాకృతి, మూలాధారచక్రము, స్వాధిష్ఠానచక్రము మొదలగు చక్రములు పటములతో సోదాహరణముగఁ జూపఁబడినవి. డెమ్మీ సైజులో 123 పుటల గ్రంథము.

ఈకవిగారు "విశ్వమంతయు నసత్య మని కొంతకాలము నమ్మియుంటిని. ఈయభిప్రాయము మాఱినది. విశ్వము భగవంతునికంటె వేఱుకా దని తోఁచినది. భగవంతుఁడు విశ్వరూపమున నావిర్భవించుటకుఁ గారణ మేమని పరిశోధించితిని నూతనభావము లుద్భవించినవి. స్థిరపడినవికావు. ఇట్టి యాందోళనసమయమున దైవికముగా శ్రీయరవింద ఘోసుగారి యోగసంకలనము (The Syntheses of Yoga) దివ్యజీవితము (The Life of Devine) గీతావ్యాసములు (Essays on Gita) చదువుటచే ననుమానము తీఱినది. మద్గురుండగు శ్రీప్రయాగ పురుషోత్తంగారి ప్రసాదమున స్వకీయానుభవమునందుఁ గొన్ని యధ్యాత్మిక విషయములు గోచరించినవి. అంత నూతనభావములు స్థిరపడినవి."—అని యుపోద్ఘాతములో లిఖించియున్నారు. వీరికి బాల్యమిత్రులగు వారణాసి సీతారామయ్యగారు జ్ఞానాభివృద్ధి విషయములో వారి వాగ్దానప్రకారము పరస్పరము తోడ్పాటుగలిగి యుండినందున—నింతమంది యూహాలతో నిండియుండిన యీ గ్రంథము జిజ్ఞాసువులకు సాయపడకమానదని తలంతుము. వీరిశైలిని జూపుటకై కొన్నిబంతులు—

"మిత్రోత్తమా? అజ్ఞానమహత్త్వ మెఱుంగఁ బ్రయత్నించుట వ్యర్థమా? దానికి హద్దులెచ్చట? ఎంతవరకు వ్యాపించినది. పరిశీలింతము. విచారింతము. మనుజునిఁ బరిశోధింతము. మానవుఁడనగా నెట్టివాఁడు? వానియందే తత్వములు కలవని వాడుచున్నారు. స్థూలప్రాణ మనోచిత్తబుద్ధి సమ్మేళనమేకదా మానవుఁడు. అట్టితత్వములలో నన్నిటికన్న శ్రేష్ఠమైనది వ్యక్తికదా? అవ్యక్తినే వస్తుపరిజ్ఞానమనుచున్నారు. (Consciousness) ఈవ్యక్తి జాగ్రతునందు స్థూలప్రాణములం దేకాగ్రతనొంది స్వల్పముగా బహిర్గత మగుచున్నది. ప్రస్తుత విషయమే గోచరించుచున్నది. కాని భూతభవిష్యత్తులు తెలియకున్నవి. వర్తమానము సహితము పూర్తిగా గోచరించుటలేదు."

దీని వెల 1-0-0. కాకినాడ సూర్యారావుపేఁటలో నాట్యకళావిజ్ఞాన గ్రంథమండలిలోఁ గవిగారియొద్దనే దొరకును.

(3) వామనచరిత్రము—సటీకము. రాజమహేంద్రవరము, ఆర్యపుస్తకాలయాధికారులచేఁ బ్రకటింపఁబడినది. శ్రీమదాంధ్ర మహాభాగవతములోని పోతరాజామాత్యుని సహజపాండిత్యప్రకర్ష చూపించు పద్యములకే టీక, తాత్పర్యము మున్నగునవి వ్రాయఁబడినవి; ఉన్నతపాఠశాలల విద్యార్థుల కిది

యుద్దేశింపఁబడియుండును. వారికిఁ దగిన భాషాభివృద్ధికిఁగావలసిన పుస్తకమిది. బాలురజ్ఞానవిద్యాభివృద్ధులంగోరు విద్యాధికారులు తమతమ యధికారములలో నుండు పాఠశాలలలో దీనిని పాఠ్యగ్రంథముగా నొక్కొక్కసారి నిర్ణయించి, బాలురతోపాటు ప్రకాశకులకును లాభము గల్గింతురుగాక.

ఈయార్యపుస్తకాలయమువా రిదివఱకనేక బాలకోపయోగ పద్యగ్రంథములను, శతకములను టీకాతాత్పర్యములతోఁ జక్కగా నచ్చువేయించియున్నారు. దీని వెల 1-0-0.

(4) తొలకరిచినుకులు —ఇది యనంతపురము రాయలసీమ కవికుమార సమితినుండి వెలువడినది. అనంతపురము కళాశాలలోని విద్యార్థులగు ఉ. మ, ఆచార్య, మూర్తి యను ముగ్గురు రచయితలు. వీరి గురువర్యులగు ప్రయాగ వేంకటరామశాస్త్రులుగారు, పీఠికలోఁ దెల్పినట్టులు వీరికవితావాహిని గంగా స్రవంతివలె ముత్త్రోవలంజనక చాలవరకేకముఖముగనే ప్రవహించుచున్నది." ఇందు ఆత్మగీతము, పుష్పము, ఆహ్వానము, ఆతిథ్యము, ఇత్యాదిగా నిరువది రెండు ఖండకావ్యములు గలవు. ముగ్గురివి మూఁడుపద్యములను మచ్చుచూపుచున్నారము.

చ. వగచితి రేయియంత బలవంతపు వంత రవంత దాళకేఁ
మొగిచితిఁ గన్నుల న్నిదురఁ బోవక తావక దివ్యరూపముం
దగస్మరియించుచుం విరహతాపమునోర్చితి నేడ్చి వల్లభా !
విగళిత మైనబాష్పములు వీని దుషారమటంద్రు చూడుమా. (మూర్తి)

చ. ఇఁక నొకసారి యగ్గిబడి యెల్లరకుం భవదీయపారిశు
ద్ధ్యకలన చాటఁగా వలయు నంట; భవాబ్జభవాదివాక్కులే
యొకయవివేకి చాకికడ నుత్తవి యయ్యెను; దుర్మదాంధులో
క్కొకరనినప్పుడెల్ల నగునొక్కొ కృశానునికీలలంబడన్. (ఉ. మ.)

చ. అమృతమునిత్తు వేఁడకయె ప్రాణవిభుండని యెంచి నిన్ను దే
హమున కలంద పుష్పాడి నహర్నిశముం ముదమూర నిత్తు, స్నే
హమున మెలంగ నెంచితి ననంగుని బాధల కోర్వఁజాల నో
భ్రమరకులేంద్ర! యిట్టి నను వంతల ముస్గఁగఁ జేయఁ బాడియే. (ఆచార్య)

ఇందు మొదట "కులపతితొలిపలుకు" అని యొకపాట వంటిది ౬ పుటలు గలదు. అదియుఁ దక్కిన పద్యములవలె నిర్దుష్టముగా సలక్షణముగానే యుండిన

నీహాత్తమునకెంతో తగియుండెడిని. దీనివెల రు 0-6-0 కావలసినవారికి అనంతపురములో సాధనపుస్తకాలయములో దొరకును.

(5) భక్తచింతామణి—కవిశేఖర వడ్డాది సుబ్బారాయ విరచితము. ఇంతవఱకు భక్తచింతామణి యిరువదిసారులు ముద్రింపఁబడినది. ఇది యిరువది యొకటవకూర్పు. ఇందు వెనుకటికూర్పులలోని పద్యములకంటె నెక్కుడు పద్యములు గలవు. వెనుకటి కూర్పులో 270 పద్యములు. ఈ 21వ కూర్పులో 352 పద్యములు. మనయాంధ్రదేశములో నేకవి పుస్తకముగాని యిన్నిసారులు ముద్రింపఁబడినది కనఁబడదు. ఇందలి పద్యములు భక్తిరసప్రధానములగుటయే యిట్లు ప్రకటింపఁబడుటకుఁ గారణము. హిందువులకేగాక యితరమతస్థులకును నిష్పాత్తము పఠనయోగ్యముగానుండుట మఱియొక విశేషకారణము. కవిగారే యిన్నిసారులును ముద్రించుభాగ్యము పట్టుటచే గ్రంథము వన్నెకెక్కుచున్నది.

మచ్చునకుఁ గొన్నిపద్యములు.

శా. బాలుఁ జాలికుఁ దగ్గిగుండమున నిల్వంబెట్టి యాభీలత
జ్వాలాజాలములోన వానిఁ బదముల్ పాడించు, నాడించు; న
న్నాలీలన్ బహుళాపదాస్పదపు మర్త్యంబాదుఁ బుట్టించి క్రీ
డాలోలుం బొనరింతమేయనుగు మాయన్ భక్తచింతామణీ. ౨౭౪

మ. మమతాశృంఖలముల్ దగిల్చి పటుకామక్రోధలోభాది వ
ర్గముఁ బైఁ గాపిడి బొందిబందియఱ నిర్బంధించి, జీవాత్మచే
శ్రమసంధాయక హేయకార్యచయముల్ సల్పించె; దెందాఁక నీ
యమబాధల్ ? పరమాత్మ! నిత్యసుఖమిస్మా! భక్తచింతామణీ. ౩౩౯

ఇది రాజమహేంద్రవరములో గ్రంథకర్తగారియొద్ద దొరకును. క్రౌను సైజు పుస్తకము 5 అణాలు. జేబులో నిముడు చిన్నసైజు క్యాలికో బైండుది 9 అణాలు.

వర్షము.

విద్యాప్రవీణ-బులుసు వేంకటరమణయ్యగారు. (విజయనగరము)

సీ. జలపూరితంబులౌ సస్యంబు లెల్లెడ రతనతివాసీల రహిఁ జెలఁగ
ఘనవితానము మింట ఘనముగ వ్యాపించి ఘనవితానపుసొంపుఁ గడలుకొల్ప
మేఘనిర్ఘోష మమోఘరీతిఁ జెలఁగి దుందుభిధ్వానము పొందుఁ గూర్ప
మబ్బుచాటున నుండి యుబ్బుచుండెడి నెలవిద్యుత్ప్రదీపంపు వినుతిఁ గూర్ప
విశ్వసామ్రాజ్యధుర్యుఁడౌ శాశ్వతునకుఁ
బ్రకృతికల్యాణలక్ష్మితోఁ బరఁగుపెండ్లి
కానుకసౌవస్తునిచయంపుఁ గూరుపనఁగ
వర్షఋతుశోభ జగమున వ్యాప్తమయ్యె.

గీ. పిడుగుటుఫిరంగులధ్వనిఁ గడలుకొల్ప
మెఱుపుపచ్చుతాబాల మెఱుఁగు నించె
పొలిచె మిణ్గుఱుఁబురుగులు పొలుపు మీఱి
యామతాబాల తేజఃకణాళి యనఁగ.

గీ. పారిజాతాదివృక్షముల్ భూరిపుష్పలాజలం జల్లె; కాన్కగా లలితవర్ష
బిందుముక్తాఫలంబులఁ బొందుపఱిచె, నావధూవరు లూరేగు నవసరమున.

*　　*　　*　　*　　*

గీ. స్వర్గలోకము నంటితిఁ జాలు నింక, నలరసాతలలోకంపు విలువఁ జూడ
వలె ననుచు నద్రి క్రిందుగా వఱలె ననఁగఁ, బర్వతపునీడ జలమునఁ బరిఢవిల్లె.

ఉ. మక్కువ మౌళిఁ దాల్చి బతిమాలిన నిర్ఝరిణీమతల్లి తా
నక్కడ నిల్వలేక వెస నబ్ధిని గూడఁగఁ బోయె నంచుఁ దాఁ
బొక్కుచు నద్రి లజ్జఁ దనమోము కంటఁ బడంగనీయకే
స్రుక్కి మసుంగు దాల్చె ననఁ జోద్యము గూర్చెఁ బయోద మద్రిపై.

ఉ. నీరము కల్గుచోటువలె నిర్జలభూమితలంబు లేమియున్
వారి నొసంగవంచు ననివార్యమహాక్షుధ కల్గ, మేఘముల్
ధారల జల్లువెట్టి భువి ధ్వాంతము చేయఁగ నెంచి యేఱులం
బారఁగఁ జేసె భూమిపయి వర్షబలంబులఁ జూపి యెంతయున్.

పాణిని-అలంకారశాస్త్రము

— సాహిత్యవిద్యాప్రవీణ- బులుసు వేంకటరమణయ్యగారు —

పాణినిమహర్షి గీర్వాణవాఙ్మయమునఁ బ్రసిద్ధవైయాకరణుఁడు. ఇతరము లగువ్యాకరణములు చాలగ నున్నను బాణినీయవ్యాకరణమే నాఁటినుండి నేఁటివఱకును సుస్థిరమై పఠనపాఠనములయందుఁ బ్రసిద్ధమై యున్నది. ఇతనియష్టాధ్యాయి సూత్రపాఠముపైనే పూజ్యుఁ డగుపతంజలిమహర్షి మహాభాష్యమును వ్రాసియున్నాఁడు.

వ్యాకరణమున నీముని యనుపముఁడై యుండియు విషయాన్తరములను గూడ బాగుగ గుర్తెఱుఁగు నని యతనిసూత్రముల వలననే దెలియుచున్నది. పాణినిముని కవిప్రవరుఁ డని ప్రసిద్ధి. ఇతనిశ్లోకములు కొన్ని సుభాషితావళి మొద లగుగ్రంథములయం దుదాహరింపఁబడి యున్నవి. ఆలంకారికు లుదాహరణముగఁ దీసికొనుచున్న "ఉపోఢరాగేణవిలోలతారకం" మొదల గుపద్యములు కొన్ని పాణినికర్తృకము లని ప్రసిద్ధి. పాణిని యుపజాతిచ్ఛందస్సున నేర్పరి యని క్షేమేన్ద్రుఁడు వ్రాయుచున్నాఁడు.

పైవిషయములఁబట్టి పాణినిమహర్షి గొప్ప వైయాకరణుఁడే గాక కవియునని తేలుచున్నది. అతఁడు వాఙ్మయమును బాగుగ నవలోడనము నొనర్చియుండుటచేతనే సమగ్ర మగునట్టివ్యాకరణమును వ్రాయఁగలిగి యుండె నని మన మూహించుచున్నాము. వాఙ్మయమును బాగుగఁ బరిశీలించియుండుటచే నతఁడు వాఙ్మయరహస్యములను దెలుపు నలంకారశాస్త్రమును గూడ బాగుగ గుర్తెఱింగి యున్నాఁడని చెప్పవలెను.

పాణిని కవిప్రవరుఁ డనుటకుఁ దత్కర్తృకముగ సుభాషితగ్రంథములలో నుదాహరించిన పద్యములేగాక వేఱొండాధారము లేదు. అతనియష్టాధ్యాయినిబట్టి యావిషయ మించుకయుఁ దెలియదు. కాని యతఁ డలంకారశాస్త్రము నెఱుఁగు ననుటలోను, దాని నెఱుంగుటయే కాక తద్రహస్యములను వివరములను బాగుగ గ్రహించె ననుటకును దత్కర్తృకము లగునష్టాధ్యాయిసూత్రములే కొంతవఱకుఁ జాలియున్నవి.

వైదికవాఙ్మయమున నలంకారాదికములు కొన్ని కన్పించుచున్నను శాస్త్రీయము లగుపారిభాషికపదము లం దెచ్చటను గానరావు. నిరుక్తనిఘంటు

వును వ్రాసినయాస్కాచార్యులు "ఉపమ, లుప్తోపమ" మొదలగుఁ గొన్ని పదములను వాడియున్నారు పాణినిముని యాలంకారికసమయసిద్ధము లగుశబ్దములను జాలవఱకు వాడియున్నాఁడు.

1 ఉపమానాని సామాన్యవచనైః. 2-1-55

2 ఉపమితం వ్యాఘ్రాదిభిః సామాన్యాప్రయోగే. 2-1-56

3 జీవికోపనిషదావౌపమ్యే. 1-4-79.

4 అవ్యయం విభక్తిసమీపసమృద్ధివృద్ధ్యర్థాభావాత్యయాసంప్రతిశబ్దప్రాదుర్భావపశ్చాద్యథానుపూర్వ్యయౌగపద్య సాదృశ్య సంపత్తి సాకల్యాంతవచనేషు. 2-1-6.

5 తుల్యార్థైరతులోపమాభ్యాం తృతీయాఽన్యతరస్యామ్. 2-3-72.

6 ఉపమానా దాచారే. 3-1-10.

7 ఉపమానాచ్చ. 5-4-167.

ఈమొదలగుసూత్రములం దుపమాలంకారవిషయము చెప్పఁబడుటయే గాక పారిభాషికపదములు "ఉపమా, ఉపమానం, సామాన్యం[సాధారణధర్మ]" అనుమొదలగునవి చెప్పఁబడినవి. వీనింబట్టి యుపమాలంకారమున నుపమానము, ఉపమేయము (విశేష్యము) సాధారణధర్మము నుండవలె ననునంశము వ్యక్తముచేయఁబడినది. సామాన్యపదప్రతిపదము లగుసాదృశ్యాదిపదములు మీఁదిసూత్రములలోఁ గొన్నింటియందుఁ గానవగును.

1 తేన తుల్యం క్రియాచేద్వతిః 5-1-115

2 తత్ర తస్యేవ. 5-1-116.

అను నీసూత్రములఁ బట్టి యుపమాలంకారమున నుపమావాచకములగు "ఇవ" మొదలగునవి యుండవలె ననియు వానికిఁ దద్ధితాదివృత్తులయందు వతిప్రత్యయమువచ్చు ననియు నిశ్చయించుచున్నాము. ఇందుఁ గ్రమముగ నార్థి- శ్రౌతి- యనునుపమాభేదములు చెప్పఁబడియున్నవి. ఈపాణినిముని మతము ననుసరించియే ప్రాచీనార్వాచీనాలంకారికు లుపమయందు శ్రౌతార్థభేదముల నుదాహరించుచుఁ బ్రమాణముగఁ బైసూత్రములనే యెత్తివ్రాయుచున్నారు. పైసూత్రములంబట్టి పాణిని యుపమాలంకారవిషయమునఁ జేసినపరిశ్రమ వ్యక్తము కాఁగలదు,

1 మయూరవ్యంసకాదయశ్చ. 1-2-72.

వృత్తి- మయూరఏవ వ్యంసకః మయూరవ్యంసకః వ్యంసకోధూర్తః. ఈమీఁది సూత్రమునుబట్టి రూపకాలంకారమును పాణినిమహర్షి బాగుగ గుర్తెఱిఁగినట్లు నిశ్చయింపవలెను. ముఖమే చంద్రుఁ డనుగీతిని మయూరమే వ్యంసక మనునర్థమున సమాసము చేయఁబడినది కాన రూపక మనవచ్చును.

2 యథాసంఖ్యమనుదేశః సమానామ్. 1-3-10.

3 ఏచోఽయవాయావః 6-1-78.

ఈ రెండుసూత్రములనుబట్టియు యథాసంఖ్యాలంకారము కొంతవఱకు సూచింపఁబడుచున్నది.

షష్ఠ్యాఆక్రోశే. 6-3-21. దాస్యాఃపుత్రః ఆక్రోశేకిం? దాసీపుత్రః.

మీఁదిసూత్రముచే నిందయందు షష్ఠి కలుక్సమాసము [సమాసమున "సుపోధాతుప్రాతిపదికయోః" అనుసూత్రముచే సుప్ప్రత్యయమునకు లోపము రావలసియున్నను రాకుండుట] విధింపఁబడియున్నది. కావున "తొొత్తుకొడుకా!" అని తిట్టునపుడు "దాస్యాఃపుత్ర" అనియే యుండును. "దాసీపుత్రః" అనినచో నింద గమ్యమానము కాఁజాలదు. తిట్టుటయందు "దాసీశబ్దమునకుఁ బ్రాధాన్యము కాని పుత్రశబ్దమునకుఁ బ్రాధాన్యము లేదు. కావున దానికిఁ బ్రాధాన్యము షష్ఠివలననే తెలియుచున్నది. అది ప్రధానము కానిచో విధేయావిమర్శ మనుదోషము వాటిల్లఁగలదు. కాళిదాసునికుమారసంభవమున "ద్వితీయమౌర్వీ మివ కార్ముకస్య" అనినచో మౌర్వి ప్రధానమై ప్రకృతోపయోగియగు "ద్వితీయత" అప్రధానమై మీఁదిదోషము సంభవించుఁ గావున నచట "మౌర్వీం ద్వితీయా మివ కార్ముకస్య" అని పఠించుచున్నాము. మీఁదిషష్ఠీతత్పురుషసమాసమున నదియుత్తరపదార్థమే (పుత్రఅనునదే) ప్రధానము కావలసివచ్చును, గాన నలుక్సమాసమును విధించినఁ గాని యభీప్సితార్థసిద్ధికలుగఁజాలదు. కావున నీయౌచిత్యమును బాగుగ గుర్తించినపాణినిముని ముఖ్యదోష మగువిధేయావిమర్శమును బాగుగసూచించె నని మనము నిశ్చయింపవలెను. ఈదోషము లాలంకారికసంకేతితము లగుట నిర్వివాదాంశము.

పాణినిమహర్షి మీఁదియలంకారదోషవిషయములనే గాక నాట్యమును గూడ బాగుగ నెఱుఁగుటయేగాక నాట్యవిషయకము లగుగ్రంథములను గూడ గుర్తెఱిఁగినట్లు నిశ్చయింపనవకాశము కలదు.

ఛందోగౌక్థిక యాజ్ఞికబహ్వృచనటాఞ్ఞ్యః. 4-3-29.

వృత్తిః-ఛందోగానాం ధర్మ ఆమ్నాయోవా ఛాందోగ్యమ్, నాట్యమ్ (నటానాం ధర్మ ఆమ్నాయోవా)

మీఁదిసూత్రమున నటులయొక్కధర్మము నాట్య మనియు, లేక వారిశాస్త్రము నాట్య మనియుఁ జెప్పఁబడినది. ఇట్లు సామాన్యముగనే గాక విశేషముగ నాట్యశాస్త్రము గల దని చెప్పఁబడినది.

1 పారాశర్యశిలాలిభ్యాం భిక్షు నట సూత్రయోః 4-3-110.

2 కర్మందకృశాశ్వాదినిః 4-3-111.

1 శైలాలినోనటాః, (శైలాలినా ప్రోక్తం భిక్షుసూత్ర మధీయతే)

2 కృశాశ్వినోనటాః (కృశాశ్వినా ,, ,, ,, ,,)

మీఁదిసూత్రములలో శిలాలినటసూత్రములు, కృశాశ్వనటసూత్రములు విశేషముగఁ జేర్కొనఁబడినవి. ఇట్లు పాణినిసూత్రములం దలంకారవిషయములు కొన్ని కలవు. దిఙ్మాత్రము ప్రదర్శించితిని.

ఆంధ్రసాహిత్య పరిషత్పత్త్రిక.

కాకినాడ.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౧. | ఆంగీరసనామసంవత్సరము శ్రావణభాద్రపదమాసములు. | సంచిక 3.

కృష్ణదేవరాయలు–ఆముక్తమాల్యద.

చేకుమళ్ల అచ్యుతరావుగారు, ఎం. ఏ., ఎల్. టి, రాజమహేంద్రవరము.

విజయనగర సామ్రాజ్యమందలి యాంధ్రవాఙ్మయచరిత్రము తుళువ నరసరాయనికాలమువఱకు ననఁగా క్రీ. శ. 1500 వఱకుఁ బ్రథమభాగమం దభివర్ణింపఁబడినది. కొంచెము హెచ్చు తక్కువగఁ బదియేనవశతాబ్దము పూర్తి యగునరికి నరసరాయలు దివంగతుఁ డయ్యెను. ఆయన తరువాత నతని జ్యేష్ఠపుత్త్రుఁ డగువీరనరసింహరాయలు సింహాసన మెక్కెను. ఈతఁడు క్రీ. శ. 1500-1509 వఱకు సామ్రాజ్యమును గడుసమర్థతతోఁ బరిపాలించెను. ఈ మహానీయుఁడు నిరంతరము శత్త్రురాజులతో సమరములు సలిపి రాజ్యము యద్విధమైన కార్శ్యము నొందకుండ సంరక్షింపఁగలిగియు, వాఙ్మయసేవఁగూడఁ గొంత వఱకు నొనరింపఁగలిగెను.

అయిన, నీభూమీశుఁడు తనపూర్వులవలెఁ గాని, తనకుఁ దరువాతి వారివలెఁ గాని పేరొందిన విద్యాపోషకుఁడు గానట్లు తోఁచెడిని. కొన్ని సంస్కృతగ్రంథములును గొన్ని కన్నడగ్రంథములు నీతనికాలమున వెలువడినట్లు గాన్పించుచున్నవి; కాని రాజపోషణము వాని ప్రకటన కెంతవఱకుఁ గారణ మయ్యెనో చెప్పవీలు లేదు. మఱి యాంధ్రవాఙ్మయ మన్ననో యీతఁడు కృతి నొందిన యాంధ్రగ్రంథము లెవ్వియు నిప్పటికిని వెలువడలేదు. గీర్వాణకర్ణాట

భాషలను బహుశః పోషించిన భూకాంతుఁడు తనమాతృభాష యైనయాంధ్ర భాషను విసర్జించునా? అట్లు జరుగదు. కాన భావిపరిశోధనలవలన నీతనికాలమందలి కొన్నియాంధ్రగ్రంథములు లభింపఁగల వని విశ్వసింపవచ్చును.

వీరనృసింహరాయలవెనుక నతనిసవతితమ్ముఁ డగు శ్రీకృష్ణదేవరాయలు సింహాసన మెక్కెను. ఈ చక్రవర్తి క్రీ. వె. 1509-1530 వఱకు రాజ్య మేలెను. ఈయనయె విజయనగరసామ్రాజ్యముఁ బాలించినవారిలో నత్యధిక రాజ్యనీతికోవిదుఁడు ను, బ్రతాపశాలి యు, దేశైకసేవాపరాయణుఁడు నై యుండెను. ఛత్రపతిశివాజీమహారాజునకుఁ బూర్వము దక్షిణహిందూదేశములో నీతనిని మించిన మహాయోధుఁ డెంతమాత్రము గానరాఁడు. ఒకవంకఁ దురుష్కప్రభువులతోడను వేఱొకతట్టు గజపతిరాజులతోడను నిరంతరముఁ బోరాడుచు నెన్నఁడును మచ్చునకైన నపజయముఁ బొందక, తాను జయించినశత్రురాజులకు సహితము తనయౌదార్యసౌశీల్యములచే బహువిధముల శ్లాఘాపాత్రుఁడై నిజామాత్యదండనాయకులయెడలఁ దండ్రివలెను జెలికానివలెను మెలఁగుచు సరస్వతీ సర్వతోముఖాదరణచే రెండవభోజుఁ డనిపించుకొని యాంధ్రసామ్రాజ్యము నత్యున్నతస్థితికిఁ దెచ్చెను. ఆతనికాలమందు విజయనగరము నిక్కముగ విద్యానగరమయ్యెను. హిందూకళలకు నాటపట్టుగను, గవితాకన్యకు విలాసవిహారక్షేత్రముగను, వేదశాస్త్రములకు విశాలపరిషత్ప్రదేశముగ నీసామ్రాజ్యముపకరించి శాశ్వతకీర్తి గడించినది.

ఈ నిరతిశయధీమంతుఁ డగుభూకాంతుఁడు స్వకీయప్రతిభాగౌరవముచేతను, దనయనుయాయు లగు నమాత్యసామంతాది వీరశిరోమణుల భక్తిపరాయణత్వముచేతను దదీయవిపులదక్షిణహిందూసామ్రాజ్యచక్రమును నిర్వక్రపరాక్రమముతో ననవరతము జయప్రదముగ నిర్వహింపఁగలిగెను. మహామాత్యశేఖరుఁ డగుసాళువ తిమ్మరుసుయొక్క నయవిద్యాచాతుర్యము, మహాదండనాయకుఁ డగుపెమ్మసాని రామలింగనాయని యుద్దండదండనీతియు, నాంధ్రకవితాపితామహుఁ డగునల్లసాని పెద్దనార్యుని సులలితకవితాసుధారసము, నీచక్రవర్తియొక్క సహజోపజ్ఞాసముపార్జితకీర్తి ననేకవిధముల భరతవర్షమునంతట వ్యాపింపఁజేయఁగలిగినవి.

శ్రీకృష్ణదేవరాయల తల్లి పేరు నాగాంబ. ఈమె నరసరాయల రెండవభార్య. కృష్ణదేవరాయలభార్యల సంఖ్యను గూర్చియు వారిపేరులఁ గూర్చియుఁ

గొంత భిన్నాభిప్రాయ మున్నది. "పాయజ్" అను పోర్చుగీసురాయబారి కృష్ణదేవరాయలకుఁ బండ్రెండుగురు భార్య లుండి రనియు వారిలో నలుగురు పట్టమహిషులై యుండి రనియు వ్రాసెను. "న్యూనిజ్" అను మఱియొక పోర్చుగీసు యాత్రికుఁడు కూడఁ గృష్ణదేవరాయలకు నల్వురు పట్టమహిషు లుండి రని చెప్పి వారిలో నొకరిత కటకదేశపురాజగు గజపతికుమారిత యనియు, నిద్దఱు శ్రీరంగపట్నపు రాజుకూఁతు లనియు, మఱి యొకయువతి కృష్ణరాయలు చిన్నతనమునఁ బ్రేమించిన భోగపుకన్య యనియుఁ జెప్పి, యాభోగపుకన్య పేరు చిన్నాదేవి యనికూడ నుదాహరించెను.

ఇట్లుండఁ బెద్దన్న మనుచరిత్రలో "తిరుమలదేవి యుఁ జిన్నాదేవి యు దేవేరులుగాన్" అని నుడివెను. ముక్కు తిమ్మన్నకూడ, పారిజాతాపహరణములో తిరుమలదేవినిఁ జిన్నాదేవిని మాత్రమే పేర్కొనియె. తిరుపతిదేవాలయములో నున్నకృష్ణదేవరాయల యిత్తడివిగ్రహమునకు నిరుపక్షముల నున్నయిత్తడివిగ్రహములమీఁదఁ జిన్నాదేవియొక్కయుఁ దిరుమలదేవియొక్కయుఁ బేరులు మాత్రమే లిఖింపఁబడియున్నవి. సింహాచలములో క్రీ. శ. 1516 లోఁ జెక్కించిన శిలాశాసనములోఁ గూడఁ జిన్నాదేవియుఁ దిరుమలదేవియు మాత్రమే యుదాహరింపఁబడిరి. ఇట్లే అమరావతి మొదలగు శాసనములలోఁ గూడ వీ రిద్దఱి పేర్లె యున్నవి.

ఇట్లుండ నాముక్తమాల్యదలోఁ గృష్ణదేవరాయలు తనభార్యల గుఱించి వ్రాయుచు "తిరుమలదేవియు నన్నపూర్ణాదేవియుఁ గమలాబ్జముఖులు దేవేరులుగన్" అని చెప్పికొనియుండుటచేఁ జరిత్రకారు లీమాటల ననేకవిధములుగ నర్థము చేసికొనవలసివచ్చినది. కొంతమంది యీనాలుగుమాటలును నల్గురుపట్టపుదేవులపే ర్లని చెప్పిరి. అనఁగాఁ గృష్ణదేవరాయలభార్యలు తిరుమలదేవియు, నన్నపూర్ణాదేవియు, కమలాదేవియు, అబ్జముఖిదేవియు నని వారియభిప్రాయము. ఈసంఖ్య పాయజ్ న్యూనిజ్ లు చెప్పినసంఖ్యకు సరిపోవుచున్నదికదా ? అయినను మఱియొకబాధకము కాన్పించుచున్నది. కుమారధూర్జటి తనకృష్ణరాయవిజయములో గజపతిరాజుకొమారిత పేరు 'తుక్కా' యని చెప్పెను. మఱియొకరు గజపతిరాజుకూఁతురిపేరు 'భద్ర' యని నుడివిరి. రాయవాచకములో నీమెపేరు 'జగన్మోహిని' యని యున్నది. ఇట్లనేకు లనేకవిధములుగా నీతనిభార్యలపేర్లను గూర్చి వ్రాక్రుచ్చిరి. వీని నన్నిటిని సమన్వయించిచూడఁ

గా నీక్రిందియంశములు విస్పష్టముగఁ గాన్పించుచున్నవి. (1) తిరుమలదేవి యన్నిగ్రంథములలోను సమానముగా నున్నది. కావున నీమెవిషయము నిర్వివాదాంశము. (2) చిన్నాదేవి ప్రశంస కొన్నింట మాత్రము కాన్పించి మఱికొన్నింట లేకపోవుట కొంత సంశయమునకుఁ గారణభూత మగుచున్నది. క్రీ. శ. 1517 వఱకు వెలువడిన కృష్ణదేవరాయల శాసనములలో నీమెపేరు గాన్పించి యటుతరువాత లిఖింపఁబడిన శాసనములలో లేకపోవుటకుఁ దగిన సమాధాన మూహింపవలసియున్నది. ఇంతియగాక మనుచరిత్ర పారిజాతాపహరణ గ్రంథములలో నీమె పేర్కొనఁబడి కృష్ణదేవరాయలచే నతని యాముక్తమాల్యదలో సూచింపఁబడకపోవుటయుఁ బైసందేహమును బలపఱుచుచున్నది. దీనినిగూడ సమర్థింపవలసియున్నది. (3) గజపతికుమారికపేరు తుక్కా, భద్ర, జగన్మోహినియని వేఱువేఱుగ వచింపఁబడుటకుఁ దగినహేతువు నిర్ణయింపవలసియున్నది. (4) వీనిలో నెచ్చోటను గానరాని 'యన్నపూర్ణాదేవి, కమలాబ్జముఖులు'అనునామప్రశంస కృష్ణదేవరాయ లేల చేసెనో నిర్ణయింపవలసియున్నది.

ఈచిక్కువిషయములను విడఁదీయుటకుఁ గృష్ణదేవరాయల దండయాత్రలకు సంబంధించిన చరిత్రాంశములను దదితరజీవితాంశములను జరిత్రకారులిదమిత్థ మని నిర్ణయించినవఱకుఁ గ్రోడీకరించిచూచెదము. కృష్ణదేవరాయలు రాజ్యారంభములోనే యుమ్మత్తూరు గంగరాజును జయించినట్లుగఁ జరిత్రకారులంద ఱేకగ్రీవముగా నొప్పుకొని యుండిరి. కావున పోర్చుగీసు రాయబారులు చెప్పినట్లు గంగరాజుకొమార్తెను రాజ్యారంభములోనే కృష్ణదేవరాయలు పరిణయమాడి యుండును. అంతకుఁ బూర్వమే యౌవనప్రాదుర్భావమునఁ బరిగ్రహించిన విలాసవతి యొకతె యాతనికి నుంపుడుకత్తెగ నుండనోపు. కావునఁ గళింగదేశముమీఁది దండయాత్రకుఁ బూర్వ మాతనికి నొక యుంపుడుకత్తె యు, గంగరాజుకొమారిత యు భార్యలుగ నుండవలసి యున్నది. కళింగరాజ్యదండయాత్ర క్రీ.శ. 1515 మొదలు 1517 లోపుగా మూఁడు సారులు జరిగినట్టులుగా శాసనాదికములవలన నిర్ణయింపఁబడుచున్నది. కడసారి దండయాత్రలోఁ బ్రతాపరుద్రగజపతిని జయించి, యాతనికొమార్తెను రాయలు వివాహము చేసికొనియెను. కాఁబట్టి క్రీ. శ. 1516-17 సంర॥నకుఁ బూర్వమే కృష్ణరాయలు కృతినొందిన గ్రంథములలో వీరి యిద్దఱిపేరులు

మాత్రమే గోచర మగుట న్యాయమే కదా ! వీరియిద్దఱిలోఁ జిన్నాదేవిపేరు విస్పష్టముగఁ గృష్ణదేవరాయలు ప్రేమించిన భోగపుకత్తె యై యుండు నని న్యూనిజ్ చెప్పియే యున్నాఁడు కావున రెండవమహిషి పేరెద్దియో నిర్ణయింపవలసియున్నది.

కృష్ణదేవరాయలు కృతినొందిన మనుచరిత్రయుఁ బారిజాతాపహరణమునుఁ, దాను రచించిన యాముక్తమాల్యదయు నీగ్రంథముల రచనాపౌర్వాపర్యము విషయమై యిటీవల మనసు ప్రసిద్ధచరిత్రపరిశోధకు లగు డాక్టరు నె॥ వెంకటరమణయ్యగారును కుం॥ ఈశ్వరదత్తుగారును మున్నగువారు భారతిలోఁ గొంత చర్చ సలిపియున్నారు. వారివాదప్రతివాదములు జాగ్రత్తగఁ బరిశీలించితిని. కాని నాయభిప్రాయ మేమనఁగా మనుచరిత్ర పారిజాతాపహరణములలో నేది ముందున నేది వెనుకను వ్రాయఁబడినదో నిర్ణయింపఁగడంగుట వృథాప్రయాసము. అది యెప్పటికిని దెగునది కాదు. ఈరెండు నాముక్తమాల్యదకుఁ బూర్వమే రచియింపఁబడిన వని నిర్ణయించుట యథార్థమునకు నెక్కువ చేరువగ నుండును. రాయవాచకమిత్యాది గ్రంథాధారములలో నున్నట్లీగ్రంథములు కళింగదేశముపైఁ గృష్ణదేవరాయలు దండువెడలుటకుఁ బూర్వము రచింపఁబడినట్లు నిర్ణయించుట యెక్కువ సమంజసము. కాఁబట్టి యాముక్తమాల్యదకావ్యరచనను విజయవాడలోఁ గృష్ణరాయలు ప్రారంభింపక పూర్వమే యీ గ్రంథములు సమగ్రముగా నుండినవి. కావున నీగ్రంథములలోఁ గళింగదేశపురాజుకొమార్తె ప్రశంస యుండుట కవకాశము లేదు. ఆకారణమున నీగ్రంథములలోఁ జేర్పఁబడిన యిద్దఱిదేవేరులను భోగస్త్రీ యగు చిన్నాదేవియు గంగరాజుకొమారిత యగు తిరుమలదేవియు నై యుండవలెను.

క్రీ. శ. 1516—17 తర్వాతను బ్రారంభింపఁబడిన యాముక్తమాల్యద కొన్నిసంవత్సరములకుఁ గాని పూర్తి గానేరదు. కావున క్రీ. శ. 1520 నాఁటికి నవతారికభాగముతో గ్రంథము సమాప్త మై యుండ నోపు. ఈమూఁడుసంవత్సరములలోను గాని తదుపరిఁ గాని యేశాసనములలో నయినను లేక గ్రంథములలో నయినను జిన్నాదేవిపేరు కాన్పించుట లేదు. ఈమె మఱి యొకనామాంతరముం బొందిన దని చెప్పుట కేవలము సాహసము, నిరాధారము. అనేకసంవత్సరములవఱకు భర్తయొక్క శాసనాదికములలోఁగూడ నా పేరుననే వ్యవహరింపఁబడిన యాదేవి మఱి యొకపేరున భర్తచేఁ బిలువఁబడుటకుఁ గార

ణము దురూహ్యము. కాఁబట్టి చిన్నాదేవి క్రీ. శ. 1516-17 సం॥రము తరువాత శాసనాదికములలో నేవిధముగానైనను వచింపఁబడ లేదనియే నిర్ణయించుట యుక్తమైనది. బహుశః, ఈకాలమునాఁటి కామె కేదో విధముగ భర్తృసన్నిధి నుండి యెడఁబాపు గలిగి యుండవలెను. మరణించిన దని యూహించుటయే యుభయులయశస్సునకు లెస్సగనుండును.

ఆముక్తమాల్యద పూర్తియగునాఁటికిఁ జిన్నాదేవి యంతరించిన దని నిర్ణయించితిమి కద. ఇఁక నాముక్తమాల్యదలోఁ బేర్కొనఁబడిన రాణు లెవరో నిర్ణయింపవలసియున్నది. గంగరాజుకూఁతురగు తిరుమలదేవి సజీవయై యుండుటచేతఁ బూర్వమువలెనే ప్రశంసింపఁబడినది ఇఁక రెండవపేరగునన్నపూర్ణాదేవి యెవరిది? కమలాబ్జముఖులెవ్వరు? కళింగదేశదండయాత్రలు పూర్తియగు నాఁటికిఁ గళింగరాజకుమారికను గృష్ణదేవరాయలు వివాహ మాడినసంగతి నిర్వివాద మగుచరిత్రాంశము. ఆమెయొక్క కులగౌరవములచేఁ బేరొందిన పట్టమహిషియై యుండును గాని యనామకముగ నుండఁ జాలదు. కావున నన్నపూర్ణాకమలాబ్జముఖులలో నేపేరుననో యామె పరఁగి యుండును. ఈసందర్భములో మఱియొకవైచిత్ర్యమును మనము గాంచవలసియున్నది. కమలాబ్జముఖులు ప్రత్యేకముగా స్త్రీనామములా? లేక స్త్రీనామకవిశేషణములా? చరిత్రాంశములను బట్టియుఁ గథాసందర్భమును బట్టియుఁ జూడం జూడ నీశబ్దములు స్త్రీనామకవిశేషణము లని నిర్ణయించుటయే యెక్కుడు సరసముగానుండు నని నే నభిప్రాయపడుచున్నాను. తిరుమలదేవి యు, నన్నపూర్ణాదేవి యు, వీరిద్దఱు ను గమలాబ్జముఖులుగాఁ గవిచే వర్ణింపఁబడిరి. కాని ప్రత్యేకస్త్రీనామములుగ వీనినిఁ గవి యుపయోగింపలే దని నే నూహించుచున్నాను. కనుకఁ గమల యనియు నబ్జముఖి యనియు వేఱుగ నున్న యిద్దఱురాణులను రాయలు పేర్కొనలే దని నాయూహ. కాని తనభార్య లిద్దఱినిఁ గమలాబ్జముఖు లని వర్ణించుటయందలి స్వారస్య మేమి యనిన నీమాటలచే వారిద్దఱి సౌందర్యమహిమను వర్ణించుటయే గాక వారిసాపత్న్యధర్మమును గూడ నిగూఢముగఁ గవి సూచించె నని నాకుఁ దోఁచుచున్నది. 'కమల' యనఁ దామరపువ్వు- 'అబ్జముఖి' యనఁ జంద్రముఖి. కావునఁ గమలమునకుఁ జంద్రునకునున్న యన్యోన్యధర్మమే వీరిద్దఱియందును గాన్పించుచున్న దని నర్మగర్భముగ సూచించినాఁడు.

'కమలాబ్జముఖులు' అనుపదము స్త్రీనామకవిశేషణ మని పైనఁ జెప్పినరీతిగ నిర్ణయించినయెడలఁ గృష్ణరాయలు పెండ్లియాడిన గజపతికుమారిక యన్నపూర్ణాదేవి యనియే నిశ్చయింపవచ్చును. అయినను, ఆమెకు 'తుక్కా' యని యు 'భద్ర' యని యు 'జగన్మోహిని' యని యు, నిత్యాదినామంబులెట్లు గలిగినవో యాలోచింపవలసియున్నది. 'భద్ర' 'జగన్మోహిని' యిత్యాదినామములు సార్థకబిరుదనామములని సామాన్యముగ గ్రహింపవచ్చును. కావున వానిని గుఱించి మన మంత ప్రయాసము పొందనవసరము లేదు. కాని 'తుక్కా' యనునామ మట్లు కాదు. దీనినిర్వచనముం గూర్చి నాకిట్లు స్ఫురించినది. 'తుక్కా' యనుశబ్దము 'దుర్గా' 'దుర్గ' యనుశబ్దములకు రూపాంతరము. శాక్తేయమతసంప్రదాయుఁడగు ప్రతాపరుద్ర గజపతిపుత్రి 'దుర్గ' యని పిలువంబడుటయం దాశ్చర్య మేమి యుఁ నుండఁగూడదు. ఈ ప్రతాపరుద్రగజపతికి శ్రీదుర్గావీరపుత్రయను బిరుదనామము గలదు. కాఁబట్టి యామెకుఁ బుట్టినింటిపేరు దుర్గ యై యుండవలెను. శాక్తేయమతమునందుఁ బుట్టినయాకన్యను వైష్ణవమతము స్వీకరించిన కృష్ణరాయలు వివాహమాడెను, గావున, నామె పేరు వైష్ణవసంప్రదాయమున కానుగుణ్యముగ మార్పవలసియున్నది. కేవలము వైష్ణవనామ మిడుటకుఁ గృష్ణదేవరాయలకుఁ గాని తనశైవసంబంధికనామము వీడుటకు నామెకుఁ గాని యిష్టముండక నిర్విశిష్టనామ మగు 'నన్నపూర్ణ' యనుపేరున వ్యవహరింపఁబడిన దని తలంచుట యుక్తియుక్తముగ నున్నది.

కావున నీయావద్విషయములను యోజించినచో మనము చేయఁగలిగిన నిర్ధారణ మే మనఁగా శాసనాదికములలోను గ్రంథములలోను బ్రత్యేకముగఁ జేర్కొనఁబడిన కృష్ణదేవరాయలభార్యలు ముగ్గురని తెలియుచున్నది.

(1) చిన్నాదేవి:-భోగస్త్రీ.

(2) తిరుమలదేవి:-ఉమ్మత్తూరి గంగరాజుకుమారి.

(3) అన్నపూర్ణాదేవి:-ప్రతాపరుద్రగజపతి కూఁతురు.

కృష్ణదేవరాయల కిద్దఱుకుమారిక లుండిన ట్లగపడుచున్నది. ఒకకుమారికను 'ఆర్వీటి రామరాజునకును, (అళియరామరాజునకును) రెండవకుమారికను మట్ల వరదరాజునకును నిచ్చి వివాహముచేసెను. కృష్ణరాయలకుఁ బుత్రులు గలిగినను వారు చిన్నతనమునందే మృతినొందియుండవలెను. కావున నే యితని తరువాత నితని సవతిసోదరుఁడు ను నరసరాయనిమూఁడవభార్యపుత్రుఁడు నైన యచ్యుతదేవరాయలు సింహాసనమునకు వచ్చెను.

శ్రీకృష్ణదేవరాయల జీవితచరిత్రముఁ గూర్చియు నాతనిసామ్రాజ్య పరిపాలనా విధానముఁగూర్చియు నెంత విస్తరించి వ్రాసిన నాంధ్రులకుఁ దనివితీఱని కౌతూహలము గలుగుచునే యుండు నని తెలిసియున్నను నావిషయ మంత యుఁబ్రస్తుతాంశముగాదు కావున స్పృశింపమానితిని. ప్రకృతమున నేఁ జేయు ప్రసంగ మంతయు నాంధ్రవాఙ్మయవిషయకము. కావున నీసార్వభౌముఁ డాంధ్ర సరస్వతి కొసంగిన యమూల్యసేవం గూర్చిమాత్రమ వక్కాణించెద.

శ్రీకృష్ణదేవరాయలు మహాయోధాగ్రేసరుఁడే గాక మహాపండితుఁడును గొప్పకవీశ్వరుఁడు నై యుండెను. ఈ మహారాజునకుఁ దనయాస్థాన పండితబృందము "సాహిత్యసమరాంగణసార్వభౌమ" యను నుత్తమ బిరుదము నొసంగినది. ఈవిధమయిన యుత్కృష్టస్తుతికి శ్రీకృష్ణదేవరాయ లెంతయుఁ దగినవాఁడె. తాను స్వయముగ నాంధ్రగీర్వాణములఁ గావ్యగ్రంథముల రచియించియు, గౌరవించియుఁ దనక్రింది సర్దారులచే నట్టిగ్రంథరచనను వెలయింపఁ జేసియు నిత్యాదివిధముల వాణీసేవ నొనరించెను.

శ్రీకృష్ణదేవరాయల యాస్థానమం దాస్థానకవీశ్వరుఁడును మనుచరిత్ర రచయితయు నైన 'అల్లసాని పెద్దనార్యుఁడు ను, పారిజాతాపహరణ గ్రంథకర్త యగు ముక్కు తిమ్మన్నయు రాజ శేఖరవిలాసకావ్యకర్త యగు మాదయ్యగారి మల్లన్నయుఁ గాళహాస్తిమాహాత్మ్యము రచించిన ధూర్జటికవియు మున్నగు నాంధ్రమహాకవులును, వేంకటనాథ, స్వయంభూనాథ, ఏకామ్రనాథ, ఇత్యాది సంస్కృతమహాకవులు ను రాయల యాజ్ఞానుసారముగఁ గన్నడభారతమునుఁ బూర్తిఁజేసి కర్ణాటకవికులసార్వభౌమ యనుబిరుదును సంపాదించిన మహాకవి తిమ్మణ్ణయుఁ గృష్ణదేవరాయల సింహాసనము నెక్కి కొలఁదకాలము సామ్రాజ్య వైభవ మనుభవించిన వ్యాసరాయరు ను మొద లగు కన్నడమహాకవులు ను, కుమారసరస్వతి జ్ఞానప్రకాశుఁడు హరిదాసు ప్రభృతు లగు నఱవమహాకవులు ను శ్రీకృష్ణదేవరాయల యభిమానసన్మానములకుఁ బాత్రులై యాతనియాస్థానము నలంకరించియుండిరి.

కృష్ణదేవరాయలు ప్రథమమున సంస్కృతభాషలోఁ గొన్ని ప్రబంధములు రచియించినట్లు తెలియవచ్చుచున్నది. *విజయవాడ సమీపమున నున్న శ్రీకాకుళక్షేత్రమందలి యాంధ్రమధుమథనుని సేవింపఁబోయినప్పు డాయాంధ్రజలజాక్షుఁడు శ్రీకృష్ణదేవరాయలం జూచి యిట్లానతిచ్చె నఁట.

---

*ప్రస్తుతము కృష్ణాతీరమందలి బెజవాడ.

సీ. పలికి తుత్ప్రేక్షోపమల జాతి పెంపెక్క రసికు లౌనన మదాలసచరిత్ర
భావధ్వనివ్యంగ్యసేవధిగాఁగఁ జెప్పితివి సత్యావధూప్రీణనంబు
శ్రుతిపురాణోపసంహిత లేర్చి కూర్చితి సకలకథాసారసంగ్రహంబు
శ్రోత్రఘచ్ఛటలు విచ్చఁగ రచించితి సూక్తినైపుణి జ్ఞానచింతామణికృతి
గీ. మఱియురసమంజరీముఖ్యమధురకావ్య, రచనమెప్పించుకొంటిగీర్వాణభాష
నంధ్రభాషయసాధ్యంబెయందునొక్క,కృతివినిర్మింపుమిఁకమాకుఁబ్రియముగాఁగ.

(ఆముక్తమాల్యద)

దీనినిబట్టి చూడఁ గృష్ణదేవరాయ లీక్రిందఁ బేర్కొనిన గ్రంథములను సంస్కృతమున వ్రాసె నని తెలియవచ్చుచున్నది. 1. మదాలసచరిత్రము, 2. సత్యావధూప్రీణనము లేక సత్యభామాపరిణయము, 3. సకలకథాసారసంగ్రహము, 4. జ్ఞానచింతామణి, 5. రసమంజరి, 6. ఇంకఁ గొన్ని యితరగ్రంథములు. ఈగ్రంథములలో నిప్పటి కేదియు లభింపలేదు. చెన్నపట్టణమునఁ బ్రాచ్యలిఖితపుస్తకాగారమునఁ గృష్ణదేవరాయలు రచియించిన దని జాంబవతీపరిణయమను సంస్కృతగ్రంథ మున్నది. పైనఁ బేర్కొనిన గ్రంథములు వ్రాసినకాలమున నీరాజకవి యాంధ్రమున నేగ్రంథమును రచించినట్లు కాన్పింపదు. ఆవిషయము పై పద్యములో విస్పష్టముగ నున్నది. ఆంధ్రవిష్ణుఁడే కవిపుంగవుని హెచ్చరించుచు నిన్నిసంస్కృతగ్రంథములు రచించినకవీంద్రునకు నాంధ్రమున నొకగ్రంథము వ్రాయుట కష్టముకాదు. కాఁబట్టి తన కొకయాంధ్రగ్రంథమును వ్రాసి యి మ్మని యాజ్ఞాపించెను. కనుక నాంధ్రవిష్ణుని యాజ్ఞానుసారముగా వ్రాసినగ్రంథ మీకవియొక్క ప్రథమాంధ్రగ్రంథమే యనిస్పష్టము. ఆగ్రంథమే యీ 'ఆముక్తమాల్యద' లేక 'విష్ణుచిత్తీయము'.

సంతతసన్నద్ధసమరయానసంరంభములలోను, మాతంగతురంగస్యందన పదాతిసంకుల స్కంధావారసంఘట్టనములలోను, సర్వదా కాలముఁ గడపవలసివచ్చిన యీసమరాంగణసార్వభౌమునకు నేతద్గ్రంథరచన కె ట్లనుల్లంఘనీయప్రతిజ్ఞ చేయవలసివచ్చినదో యీరాజకవియే తనగ్రంథమందలి యవతారికభాగమున నుడివెను. ఈవాక్యము లేయాంధ్రుని డెందమున నద్భుతామోదకౌతుకము లుద్భవింపఁజేయఁజాలవు ?

"మున్నే కళింగదేశవిజిగీషామనీషఁ దండెత్తి పోయి విజయవాటిం గొన్నివాసరంబు లుండి శ్రీకాకుళనికేతనుం డగునాంధ్రమధుమథను సేవింపం

బోయి హరివాసరోపవాసం బచ్చటఁ గావింప నప్పుణ్యరాత్రిచతుర్థయామం బునఁ దదంధ్రజలజాక్షుఁడు దనకలలోఁ గాన్పించి యాంధ్రభాష నింకఁ గృతి వినిర్మింపు" మని యానతిచ్చెనఁట. అప్పు డీనరనాథకవి "ఎన్నిను గూర్తునన్న విను, మే మును దాల్చినమాల్య మిచ్చు నప్పిన్నది రంగమందయిన పెండిలి సెప్పు" మని యాంధ్రవల్లభుఁ డీభూవల్లభున కాజ్ఞ యొసంగెనఁట.

కావున నీగ్రంథముయొక్క యుత్పత్తి మహాద్భుత మయినది. ఆంధ్రవిజయలక్ష్మి తనతమ్మికేలధరించిన కావ్యాంబుజమే యీగ్రంథము. కృష్ణరాయలు శాంతచిత్తుఁడుగా విజయనగరమం దంతఃపురకామినీజనపరివృతుఁడై శృంగారకేళీవిలాసంబుల వినోదించుచుఁ దదీయాస్థానపండితకవిరాణ్మండిత సభాసీనజేగీయమానవృత్యగీతంబుల కుప్పొంగుచు నీగ్రంథరచనమున కుపక్రమించుట లేదు. ఆహవభూమిసాన్నిధ్యమున ఫిరంగిమ్రోఁతల గుండెయలజడులలో నీగ్రంథము ప్రారంభితమైనది! అట్టిమృతిజీవితసందిగ్ధసమయములే కదా మహామతుల లోకోత్తరకావ్యకరణచణత్వంబునకు సాధనత్వం బాపాదించుచున్నవి.

కావున నీగ్రంథము విజయనగరములోఁగాక విజయవాడలోఁ బ్రారంభించినాఁడు. గ్రంథరచనాకాలనిర్ణయము కొన్నిశిలాశాసనాదికసహాయముచేఁ జరిత్రకారు లిట్లు చేసి యున్నారు. దీనినిఁ గుఱించి మ. రా. రా. శ్రీ. కుందుర్తి ఈశ్వరదత్తు B. A. గా రీక్రిందవిషయము నాకుఁ దెలియఁజేసినారు. "ఆముక్తమాల్యద' పీఠికలో శ్రీకృష్ణదేవరాయలు తాను శ్రీకాకుళనికేతనుఁ డగునాంధ్రవిష్ణువును సేవింపఁబోయి హరివాసరోపవాస మచ్చటఁ గావించితి నని చెప్పుకొనెను. ఆకాలమున శ్రీరాయలవారు శ్రీకాకుళములో నాంధ్రవిష్ణువునకు నొకదానముచేసి శిలాశాసనము చెక్కించిరి. కావున నాశిలాశాసనసహాయమున శ్రీరాయలవారి శ్రీకాకుళతీర్థయాత్రకాలము నిర్ణయింపఁబడినది. రాయలవారు బహుధాన్యనామసంవత్సర కుంభసంక్రమణకాలమునందు నాంధ్రవిష్ణువు నారాధించినట్లు విస్పష్టముగ నున్నది. ఈకుంభసంక్రమణకాలము రాయలు చెప్పినహరివాసరముతోఁ గూడ సరిపోవుచున్నది. అనఁగా క్రీ. శ. 1519 సం॥ జనవరి 26 తేదీని రాత్రి సుమారు 50 గడియలకుఁ గుంభసంక్రమణపుణ్యకాలము. మఱునాఁడు కుంభసంక్రమణపుణ్యదినము. అనఁగా-క్రీ. శ. 1519 సం॥ జనవరి 27 తేదీని రాయలవారు హరివాసరోపవాసము గావించిరి. ఆదినము మాఘబహుళైకాదశి యైనది. కాఁబట్టి 27-1-1519

తేదీతో సరియైన మాఘబహుళైకాదశినాఁడు శ్రీకృష్ణదేవరాయలవారు 'ఆముక్తమాల్యద' ప్రబంధరచనకుఁ గడంగిరి."

ఈప్రకారముగ నేతద్గ్రంథనిర్మాణకార్యము కృష్ణదేవరాయలచే నుద్యమింపఁబడిన స్థలము కాలము నితరసాంబంధికసందర్భములు మున్నగునవి సూక్ష్మాంశసహితముగ వర్ణింపఁబడినను నీకర్తృత్వవిషయము, వివాదాస్పదమై పండితావళిమానసంబులఁ గొంత కలఁత పుట్టించుచున్నది. ఈప్రబంధమును గృష్ణరాయలవారే రచించి రని కొందఱును, కాదు కా దల్లసాని పెద్దనగారు రచించి రని మఱికొందఱును వాదించుచున్నారు. ఈవాదప్రతివాదములకుఁ గారణము, ముఖ్యముగాఁ గ్రీడాభిరామకర్తృత్వవిషయమందువలెఁ గొందఱు లక్షణకవుల యుదాహృతిసూచనలు ను బండితసంప్రదాయప్రసంగములు ను మాత్రము.

ఈచర్చను గూర్చి విపులముగ వ్రాయుటకు నా కిష్టము లేదు. కారణమేమనఁ, గృష్ణరాయలకర్తృత్వము నిరసింప నుద్దేశించిన పక్షమువారును నాచక్రవర్తి యాంధ్రదేశమునకు నాంధ్రభాషకు నొసఁగిన చిరంతనస్మరణీయసపర్యను సాకల్యముగఁ జూచి యేతద్గ్రంథకర్తృత్వము నాతనినుండి తప్పించుటకు సాహసింపలేకున్నారు. కావున వారిపక్షము నవలంబించినవారి సంఖ్యయుఁ దక్కువే, వాదనసామగ్రియుఁ దక్కువే- తత్కారణమున నీవిషయమును గొలఁదిసూత్రముగ సూచించి విడిచెదను. ఈవివాదమును సంపూర్ణముగాఁ దెలిసికొనఁ దలఁచినవారు కీ. శే. శ్రీ వేదము వేంకటరాయశాస్త్రులువారు తమ "సంజీవనీ" వ్యాఖ్యాసమేతముగ ముద్రింపించిన యాముక్తమాల్యదగ్రంథమునకు వారు రచించిన యపారపాండితీప్రకర్షితమైన పీఠికను జదివినఁ దెలిసికొనఁగలరు. ఈవిషయమును శాస్త్రులువారు బహుసమర్థతతోఁ జర్చించి వారియస్నిగ్ధనిబద్ధాద్భుతవైదగ్ధ్య ముల్లసాని పెద్దనగారిపక్షమునకు ములుమొన నాకర్షించుచున్నను, లోకాభిప్రాయమును మానవప్రకృతివిలక్షణజ్ఞానము ననుసరించి శ్రీకృష్ణరాయలపక్షమునఁ దుదకు నిలిచిరి. పూర్వాచారవితండవాదము ననుసరింపక కళాప్రపూర్ణులగు శ్రీశాస్త్రులవారు తమయమేయవాఙ్మయవిజ్ఞానధౌరేయమును బూన్చికొని పండితచక్రవర్తిపక్షమునకుఁ బ్రబలసహాయము నొనరించినందులకు నాంధ్రు లందఱుఁ గృతజ్ఞతాసక్తులయి యుండవలసినది.

ఈవాదమందలి ముఖ్యవిషయములు, 1 రాజు లేడ? కావ్యరచన యేడ?

రాజులును జక్రవర్తులును గ్రంథరచనకు సహజముగ నసమర్థు లనుమతము కొంతమంది విద్వాంసుల మనస్సులలో దాఁగియున్నది. కావున నట్టివారవనిపతులు కేవలము లక్ష్మీపూజకే గాని సరస్వతీపూజకుఁ జాలని వా రని నమ్ముచున్నారు. ప్రాయశః యుద్ధావనిలో నిరంతరముఁ బ్రయాసపడవలసిన పృథ్వీశులకు సారస్వతసేవావకాశ మూ కాశకుసుమ మని వారి గట్టినమ్మకము.

ఈవిషయమును గుఱించి ప్రపంచచరిత్రమును బరిశోధించి చూచి తరువాత భారతవర్ష చరిత్రమును గూడఁ బరికించెదము. మహావీరులు మహామహీభృతులు నెచ్చటనైనఁ గావ్యరచనాధురంధరు లగుట కూడఁ గాన్పించుచున్నదా! తెరిచిచూతము.

గ్రీసు దేశమందలి మహాసేనానులలోఁ బ్రథమగణ్యుఁ డగుమహాఅలగ్జాండరు తనసమరయాత్రలలో నిత్యము గవులను బండితులను శాస్త్రజ్ఞులను వెంటఁ దీసికొని వారితో సారస్వతగోష్ఠిఁ జేయుచుండె నని చరిత్రకారులు చెప్పుచున్నారు. ఆరిస్టాటిల్ మహాశాస్త్రజ్ఞుని యెడల నామహామహుని కెట్టిగురుభక్తి యుండెనో యెల్లరకుఁ దెలిసినవిషయమే. అలగ్జాండరు చాలఁ జిన్నతనములో మరణించియుండుటచే నాతని దిగ్విజయఫలము దక్క సారస్వతగోష్ఠిఫలము లోకమున కిచ్చుటకవకాశము లేకపోయెను. తరువాత రోమనురాజ్యములో నలగ్జాండరుతో సమానుఁ డగుదిగ్విజేత యయిన సీజరుచక్రవర్తి యైరోపాఖండము నాసియాఖండములో సాఁబాలు జయించి పాలించుచుఁ "గామెంటరీలను (Commentaries) పేరువహించిన యుద్ధగ్రంథముల నెన్నింటినో రచించి తనదండయాత్రలను దాను జయించిన దేశప్రజల యాచారవ్యవహారభాషాదికములను విపులముగ నభివర్ణించి ప్రపంచమునకు మహోపకారము నొనరించెను. ఆగ్రంథరాజము లిప్పటికిని ల్యాటిన్ (Latin) భాషకు భూషణములుగా నున్నవి.

జర్మనీదేశపు చక్రవర్తి యయిన మహాఫ్రెడిరికు (Frederick the Great) తనరాజ్యము చుట్టు నున్న ప్రబలశత్రురాజులతో ననేకసంవత్సరములు విసువు విరామములు లేక పోరాడుచు నఖండవిజయలక్ష్మినిఁ జేకొని తనసామ్రాజ్యము నన్నివైపులకు విస్తరిల్లఁజేసి ప్రజాక్షేమము కొఱకు ననిశము పాటుపడుచున్నను వాగ్దేవీకైంకర్యము విడువఁడయ్యెను. చిన్నతనమునుండియు ఫ్రెంచిభాషయం

దమితాదరణము గలిగి ఫ్రెంచికవివతంసుల స్నేహము సంపాదించి ముఖ్యముగ నానాఁటికవిసార్వభౌముఁ డగువాల్టేరుతో నంతేవాససాహచర్యమున మెలఁగి యనేకపద్యకావ్యములను నంతకంటె హెచ్చుగ గద్యకావ్యములను వ్రాసి, సాహిత్యసమరాంగణసార్వభౌముఁ డయ్యెను. తాను వ్రాసిన గ్రంథములను వాల్టేరుమహాకవికిఁ జూపి యాయనచే సరిపఱిపించుకొని ముద్రించుచుండెను.

ఇఁకఁ జక్రవర్తి నెపోలియన్‌ను గుఱించి విచారించెదము. సామాన్యకుటుంబములోఁ బుట్టి తనయతిమానుష ప్రతిభచే మహాసామ్రాజ్యచక్రవర్తియై భువనైకవీరాతిశయమునఁ దన్ను మార్కొనిన యరాతిబృందమ్ముల నెల్లఁ దలక్రిందుఁ జేసి మధ్యందినమార్తాండుని వగిది విజృంభించిన యీమహాప్రతాపశాలి ఫ్రెంచిభాషాయోషామణికిఁ గొన్ని స్వరచితగ్రంథోపాయనములను సమర్పించెను. చిన్నతనములో ననేక గ్రంథములఁ జదివి తత్సారమును సమయసముచితవ్యాసరూపమున రచించి వెల్లడిచేసి వార్ధక్యములోఁ దనయప్రతిమానానుభవమును గ్రంథరూపమున వ్రాసి తనమాతృదేశమున కొప్పగించెను. ఇంతియకాక యీ మహాధీరుఁడు కదనరంగమున వైరినికాయములతోఁ బోరాడుచుఁ జిత్రలేఖనముగూడఁ జేయుచుండెనఁట! అతను చిత్రించిన చిత్తరువులు కొన్ని పుస్తకరూపముగ నిటీవల దొరకినట్లు తెలియవచ్చుచున్నది.

ఇంక భారతభూమి యందలి భూధవుల విద్యాకృషి నరయుదము.

ఉత్తరహిందూస్థానమును దక్షిణహిందూస్థానములోఁ జాలభాగమును దనదిగ్విజయమున జయించి యశ్వమేధయాగము నొనరించిన సముద్రగుప్తుఁడు తాను బ్రచురించిన యలహాబాదుశాసనములో "తా ననేక కావ్యముల రచించినకతన కవిసార్వభౌముఁడయ్యె ననియుఁ దనకావ్యములు బీదలకు జీవనాధారము లయ్యె"ననియుఁ దెలియఁజేసెను.

కాన్యకుబ్జదేశాధీశ్వరుఁ డగుహర్షవర్ధనుఁడు 'రత్నావళీ నాగానంద నాటకములను రచించెను. ముంజభూపతి యగుభోజుఁడు శతాధికగ్రంథములను గీర్వాణభాషలో రచించి తనసాహిత్యమును బ్రదర్శించి సంగ్రామరంగమున నసువులఁ గోల్పోయెను.

హిందూదేశము జయించి ఢిల్లీసింహాసన మెక్కిన 'బాబర్ షాదుషా పారశీకభాషలో ధారాళముగఁ గవిత్వముఁ జెప్పఁగలిగెను. తఱచుఁ దనగుఱ్ఱము మీఁద స్వారిచేయుచుఁ బద్యముల నాశువుగఁ బలుకుచుండెనఁట! తనజీవిత

చరిత్రముఁ దానే వ్రాసికొని యీవిషయముల నన్నిటినిఁ దానే వ్యక్తపఱిచెను. ఇంక మహాబుద్ధిశాలి యగునక్బరుషాదుషాను గూర్చి వేఱె చెప్పవలెనా? చేవ్రా లయినఁ జేయలేని యీచక్రవర్తి నిరంతరము పండితులగోష్ఠి మెలఁగుచు మతచర్చలను వినుచు ననేకశాస్త్రములయందును గళలయందును బ్రావీణ్యము నలవఱుచుకొని మహావిద్వాంసులను గూడఁ దనమర్మజ్ఞతచే డిందుపఱుచుచుండెను.

ఇట్లనేకులగు పార్థివోత్తములు లక్ష్మీకటాక్షపాత్రులై సరస్వత్యుపాసనయందుఁ గూడఁ గాలము గడపుచుఁ దద్దేవీపూజార్హము లగుకావ్యకుసుమముల నేర్పుతో నేర్చి కూర్చుచువచ్చిరి. ఈవిషయముఁ గూర్చి యింతవట్టు చెప్పుట కొక్కటియే కారణము. మనదేశమందు బుద్ధిశాలు లగుగీర్వాణాంధ్ర పండితులలోఁ గొందఱు భూమీశులలోఁ గూడఁ గవు లుండు రన్నఁ గనుబొమ్మ లెత్తి పెదవి విఱిచి యీసడింతురు. వారికొఱ కీస్వల్పవిషయమును గూర్చి యింత విఱివిగా వ్రాసితిని. చదువరులు క్షమింతురుగాక!

మఱి కృష్ణదేవరాయలతట్టు మరలుదము. కృష్ణదేవరాయల గ్రంథరచనావిషయముల గుఱించి యిదివఱలో వ్రాసినవిమర్శకు లొకగొప్పపొరపాటుఁ జేసియున్నారు. వా రెంతమట్టు కైనను గృష్ణరాయలరాజ్యకాలజీవితమును గూర్చియే యాలోచించుచువచ్చిరి. తత్పూర్వపుజీవితము గుఱించి సూక్ష్మపరిశీలనఁ గావింపరైరి.

శ్రీకృష్ణదేవరాయలు సుమారు ముప్పదియేండ్ల వయసు వచ్చినపుడు సింహాసన మెక్కెను. సింహాసనమునకు వచ్చినతరువాత నతనికి నిరంతరము శత్రువులతోఁ బోరాటములు గలిగినను దత్పూర్వ మాయనకు వలసినంతతీరుబడియు నవకాశము నుండినవి. సుమా రిరువదిమూఁడేండ్ల వయస్సు వచ్చినవఱకుఁ దనతండ్రి యయిన నరసరాయలు జీవించియే యుండెను. తలిదండ్రులసంరక్షణలోను వారికంటె నెక్కువవాత్సల్యముఁ జూపుచుండిన మహామంత్రి తిమ్మరుసుయొక్క ప్రేమార్ద్రశిక్షణములో, నుండి కృష్ణదేవరాయలు చిన్ననాఁట నుండియు విద్యాబుద్ధు లామహామంత్రియొద్దనే విశ్వాసపూర్వకముగ నేర్చుకొనుచుండెను. ఆహేతువునఁ దిమ్మరుసును 'అప్పాజీ' యనఁగాఁ దండ్రి యని పిలుచుచుండెను. ఈకాలమున రాయ లసమాన మగుగీర్వాణాంధ్రసాహిత్యము సంపాదించుకొని యుండనోపు. కృష్ణదేవరాయల యౌవనదశను గుఱించి

న్యూనిజ్ మొదలగు చరిత్రకారులు తెల్పినవిషయములనుబట్టి చూడ రాయలవిద్యార్థిదశ యంతయు సంప్రీతికరముగ నుండెను. ఈవిషయమందును మఱి రాజ్యపరిపాలనావిషయమందునుఁ గృష్ణదేవరాయలు జర్మనుచక్రవర్తి యైనఫ్రెడరికును (Frederic the Great) నెంతయు సరిపోలియున్నాఁడు.

కృష్ణదేవరాయలకును, అలసాని పెద్దన్నకును, గలిగినప్రథమపరిచయమును, దదుపరి క్రమముగా వృద్ధినొందిన స్నేహమును రాయలు రాజ్యమునకు రాకపూర్వమే, యనఁగా, విద్యార్థిదశయందే జరిగియుండె నని యేఁ దలంచుచున్నాను. ఈప్రథమదశయందుఁ గృష్ణదేవరాయలు తనపేరు వహించియున్న మదాలసచరిత్రాది సంస్కృతగ్రంథములను వ్రాసియుండె నని నాయభిప్రాయము. ఈగ్రంథములను, పెద్దనయొద్దఁ గవితాశుశ్రూష జేయుచున్నకాలములో రచించియుండుటచేఁ గొంతమంది పండితులు పెద్దన్నగారే రచించి రను ప్రతీతి లోకమునకు వెల్లడించి యుందురు. జర్మనుచక్రవర్తి ఫ్రెడరిక్ విషయములోను నిట్టిలోకప్రవాదము పుట్టినట్టు కొంత చరిత్రదృష్టాంత మున్నది. ఏలయన, నాతఁడు రచించిన గ్రంథములను దొలుదొల్తఁ దనమిత్రుఁడును గవిశిరోమణియు నగు వాల్టేరునకుఁ బరీక్షనిమిత్త మంప నతఁడు సరిచూచి వానిని ముద్రించుచువచ్చెను. ఏతాదృశసారస్వతపరిశ్రమసంబంధమే కృష్ణరాయలకును బెద్దన్నకును గలిగియుండె నని నాయూశయము. ఈసంబంధము క్రమక్రమముగా వృద్ధినొంది పరస్పరగాఢానురాగమయ్యె నని సువిదితమే. కావునఁ గృష్ణదేవరాయలు రచియించిన వని చెప్పఁబడిన గీర్వాణగ్రంథములు నిక్కముగఁ గృష్ణరాయలే రచించియుండె ననియు వానిరచనయం దల్లసాని పెద్దన్నగారి సహాయము మిక్కుటముగఁ బొంది యుండె ననియు నానిశ్చితాభిప్రాయము.

మఱియొకవిశేషము-ఈప్రథమకవితాప్రయత్నము లగుమదాలసచరిత్రయు సత్యావధూప్రీణనము నను సంస్కృతకావ్యములను వ్రాసినపుడు కృష్ణదేవరాయలు కేవలము కవిత్వవిద్యార్థియై యుండవచ్చును; అనఁగాఁ గావ్యభక్తినిఁ గవితాసామగ్రిని మున్ముందు సేకరించుకొనుటయు, వివిధకావ్యధోరణుల నలవఱచుకొనుటయు నభ్యాసకుని లక్షణములు గానఁ గృష్ణదేవరాయలు తన ప్రథమకావ్యప్రయత్నములలో నాయారీతుల నభ్యసించినట్లు గాన్పించుచున్నది. లేనియెడల—

"సీ. పలికి తుత్ప్రేక్షోపముల జాతి పెంపెక్క రసికులౌనన మదాలసచరిత్ర
భావధ్వనివ్యంగ్యసేవధిగాఁగఁ జెప్పితివి సత్యావధూప్రీణనంబు"

అను నిబద్ధ్యములలో నున్న వివిధకావ్యరీతిలక్షణములఁ బ్రత్యేకముగఁ బేర్కొనుటకుఁ గారణము గాన్పింపదు. అల్లసాని పెద్దన్నవంటి యాటితేఱినకవి యొక గ్రంథము నొకవిధమైన కావ్యశైలికి నిదర్శనముగాను మఱియొక గ్రంథమును మఱియొక కావ్యశైలికి దృష్టాంతముగాను రచించి యుండునా ? ఏ గ్రంథమునైనను సర్వావయవపరిపుష్టియు సర్వాంగసౌందర్యమును గలుగునట్లు రచించును గాని యలంకారములకు నిధిగ నొకదానిని భావధ్వనివ్యంగ్యములకు సేవధిగ నొకదానిని రచించుట యస్వాభావికము, నసంగతము. కావున నీసంస్కృతగ్రంథములు కృష్ణదేవరాయలే కవితాభ్యాసకదశయం దున్నపు డల్లసాని పెద్దనాదులశిక్షణమున రచించి యుండె నని మన మూహింపవచ్చును.

కొందఱు లక్షణకర్తలును వ్యాఖ్యాతలును గృష్ణదేవరాయలపేరున నున్నసంస్కృతగ్రంథములనే గాక యాతని యాంధ్రగ్రంథ మగునాముక్తమాల్యదనుగూడ నల్లసాని పెద్దనయే రచించినట్లు నానుడి వెల్లడిచేసిరి.

1. కాకునూర్యప్పకవి తనయప్పకవీయములో "నాంధ్రకవితాపితామహుఁడు 'కొనియె' ననుటకు 'కొనె' నని చెప్పె......విష్ణుచిత్తీయమునందు.

2 చ. ఉరు వగువిష్ణుచిత్తతనయోద్వహనంబును సంస్కృతాంధ్రవా
గ్గరిమ నలంక్రియారసస ఖం బగునట్లుగఁ బెద్దనార్యుఁడు
ద్ధురఫణితిఁ రచించె..................శ్రీనివాసవ్యాఖ్య.

3. గుడిపాటి వేంకటాద్రి:—

గీ. పేర్మి నల్లసాని పెద్దన్న యాముక్త, మాల్యదాఖ్యకృతి సమంచితముగఁ
జేసె నీవు టీక సేయుము చెఱకునఁ, బండుపండినట్టు లుండుఁగాక !

ఆముక్తమాల్యదయందు విస్పష్టముగ నాగ్రంథమును శ్రీకృష్ణరాయలు రచించినట్లున్నను బైనుదహరించిన వాక్యములఁబట్టి కొంతసందేహము కలుగుచున్నది. కావున నేతద్గ్రంథకర్తృత్వసమస్య నిస్సంశయముగఁ దీర్చుటకుఁ దగినఋజువును సంపాదింపవలసియున్నది. మనయదృష్టవశమున నవసర మగుసాధనసామగ్రి కావలసినంత యున్నది. అల్లసాని పెద్దన్న రచించిన యాంధ్రప్రబంధ మగు మనుచరిత్ర కృష్ణదేవరాయలకే యంకితము చేయఁబడినది. కృష్ణదేవరాయలపేర నొక సంస్కృతగ్రంథము గూడ లభ్యమగుచున్నది. వీని నన్నిఁటిని సరిచూచి తారతమ్యము లను నిరూపించిన నీసందేహము తప్పక నివృత్తికాం గలదని నానమ్మకము. (సశేషము)

కావ్యలక్షణము.

— అయలసోమయాజుల నరసింహాశర్మగారు, పర్ణశాల. —

కావ్యమున కనేకు లనేకరీతుల లక్షణముల వ్రాసియున్నారు. అందు మొదటివాఁడు దండి. ఈతఁడు కాలముచేతనే మొదటివాఁడుగాక లక్షణరచనచేఁగూడ మొదటివాఁడే యననగును.

అందునకు ముందుగ నితరలాక్షణికుల లక్షణములఁ బరిశీలించి యీతని మతము విచారింతము.

"తదదోషౌ శబ్దార్థౌ సగుణా వనలంకృతీ క్వాపి" అని మమ్మటుఁడు.

ఇందు గుణాలంకారవర్జితములకుఁ గావ్యత్వవ్యపదేశము లేమింజేసియు దోషసహితములకుఁ గావ్యత్వవ్యపదేశము లోకమునఁ బ్రసిద్ధముగ నగపడుటంజేసియు నీలక్షణ మాలంకారికసమ్మతము కానేరదు. ఇట్లే:—

"అదోషౌ సగుణౌ సాలంకారౌ శబ్దార్థౌ కావ్యం" అను విద్యానాథలక్షణముగూడ నాలంకారికసమయవిరుద్ధ మవుటఁజేసి గ్రాహ్యముగాదు.

ఇంకను నలంకారసర్వస్వకారాద్యాలంకారికుల మతములందలి దోషముల జగన్నాథపండితుఁడు నిరూపించియే యున్నాఁడు.

పండితాగ్రేసరుఁ డగుపండితుఁడుఁగూడఁ(జగన్నాథపండితుఁడు) దాను సరసముగ లక్షణము రచించితి నని గర్వించియు దోషయుక్తముగనే రచించి యున్నాఁడు. చూడుఁడు:—.

"రమణీయార్థప్రతిపాదకశబ్దః కావ్యం" రమణీయార్థ మన లోకోత్తరానందదాయకార్థము.

1. ఈతని మతమున శబ్దముగదా కావ్యము. అట్లయిన శబ్దగతగుణదోషాదులనే నిరూపింపవలెను గాని యర్థగతగుణదోషములఁ గాని, యర్థశక్తిమూలధ్వన్యాదులఁ గాని నిరూపించుట యప్రసక్త మగును. పరంపరాసంబంధముచే నర్థము లోకోత్తరానందదాయి కాన నద్దాని వచియించె నన్నచోఁ దాదృశానందదాయకములగు దృశ్యకావ్యాంగము లగు లాస్యాంగములకుఁ గూడఁ గావ్యస్వరూపనిరూపణమున లక్షణము రచింపవలయును. అట్టు లేయాలంకారికులమతమునను గానరాదు. దృశ్యకావ్యమున శ్రవ్యకావ్యమున నర్థద్వారా వలె లాస్యాంగద్వారమున లోకోత్తరానందము గలుగుట యనుభవదూష్యము కాదు. అచ్చో నీతఁడు శబ్దము కావ్య మని యర్థనిరూపణముఁ జేసి లాస్యాంగముల నిరూపింపకుండుట పూర్వాపరసందర్భహీనతం జూపుచున్నది. అట్లు లాస్యాంగములఁ జూపిన నాలంకారికవిరుద్ధ మగును.

2. ఇంతియకాక కేవలశబ్దమే కావ్య మన్నఁ గానేరదు. శబ్దమునకు రమణీయార్థప్రతిపాదకత్వ మన్న లేదు. హరిః, కృష్ణః, రామః, శంభుః ఇట్టిపదములవలన రమణీయార్థ మెట్లుపాదేయ మగును. ఆశబ్దముల కెట్లు కావ్యత్వము సంభవించును. తాదృశార్థప్రతిపత్తి వాక్యమునకుఁ గాని శబ్దమునకు లేదు.

3. మఱియుఁ గవిసంరంభము కేవల మొక్కశబ్దమందే యనుట యనుభవవిరుద్ధము. వ్యంగ్యార్థప్రతీతియందు కవిసంరంభ మచ్చో నున్న దనుట నిర్వివాదాంశము. కవికర్మ కావ్యము గదా! అర్థమందుఁ గవిసంరంభ ముండ శబ్దమే కావ్య మననగునా. కొన్నిపట్టుల వ్యంగ్యత్వమున శబ్దము సహకారి యగునట్లె యర్థము సహకారియగును.

అట్టిపట్టుల నర్థమునకే ప్రాధాన్య మున్న యెడలఁ గవిసంరంభ మర్థమందే యున్న నద్దానికిఁ గావ్యత్వ మంగీకరింపకుండుట విచార్యము.

ఈరీతి నాలంకారికులు దండిప్రోక్తమగు లక్షణము విడిచి, కావ్యలక్షణమును సరిగ నిరూపింపఁజాలరైరి.

దండి యెంతవిశదముగ నిరూపించియున్నాఁడో చూడుఁడు:—

"తైః శరీరఞ్చ కావ్యానాం అలంకారాశ్చ దర్శితాః।
శరీరం తావదిష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ.

ఇచ్చో నిష్టార్థ మన=లోకోత్తరానందజనకార్థము వివక్షితము.

అనఁగా, లోకోత్తరానందజనకార్థవ్యవచ్ఛిన్నా ఆకాంక్షసహితా పదావళీ కావ్యం, అని లక్షణము.

ఇష్టార్థవ్యవచ్ఛిన్నా యనుటచే నిం దర్థగతిగుణాదులం జెప్పుట యప్రసక్తకథనము కాఁజాలదు.

ఋక్కావ్యదులందు శబ్దార్థోభయవృత్తిచే భాష్యకర్త మొదలగువారలచే "ఋచః పఠంతి" అను మొదలగు స్థలములయందు లక్షణ నంగీకరించుటఁ జేసి "కావ్యం పఠితం అర్థస్తు నజ్ఞాతః" అను స్థలమందు లక్షణ నంగీకరించి లోకోక్తులఁ గుదుర్చుట శాస్త్రద్రూష్యము కాఁజాలదు.

ఈపక్షమున గుణాలంకారవర్జితములకు దోషసహితములకుఁ గూడఁగావ్యత్వము సిద్ధించుచునే యున్నది. లోకోత్తరానందజనకత్వము లేమింజేసి "పుత్త్రోజాతః మృత శ్శత్రుః" అను మొదలగు నవి కావ్యములు కాఁజాలవు.

కాన నీరీతి నాలోచించినను దండికృత మగుకావ్యలక్షణమే నిర్దోషముగ నున్న దనవలయును.

కొన్ని వృత్తములు : తన్మతభేదములు

— దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు, కొవ్వూరు. —

వాఙ్మయము వేదకాలమునుండియు గద్యాత్మకముగను పద్యాత్మకముగను విరాజిల్లుచుంట సర్వలోకవిదితము. దాన నొకశాఖగా నుండి చిరకాలమునుండియు వాడఁబడుచు గద్యపద్యాత్మకముగఁ బెంపొందుచున్నది యాంధ్రభాష. ఇయ్యది పద్యాత్మకముగా వాడుకలోనికి రాకమున్న కొన్నిరకములగు దరువులవలెను జిన్నచిన్న గేయములవలెను దాళానుగుణముగఁ బాడుకొనఁబడుచు నుండెడి దని విమర్శకులు తెలిపియే యుండిరి. రాను రాను గద్యమునకన్నఁ బద్యమున శ్రుతిసుఖము హెచ్చుగ నుండుటచేఁ గొన్నివిధము లగు నియమములచేఁ గొన్ని పద్యములు బయలుదేఱినవి. ఇయ్యవి గానార్హము లై హృదయరంజకముగ నుండుటచే జనుల కత్యంతప్రేమపాత్రము లై ప్రబంధరూపములుగను దృశ్యకావ్యరూపములుగను నభివృద్ధి నందినవి. అట్టికావ్యముల నుండువృత్తములు బహువిధము లై నడకలు గలిగి నామాంతరముల నందినవి. వానినామముల ననుసరించి యీవృత్తమున కిన్నిపాదము లనియుఁ బాదమున కిన్నియక్షరము లనియుఁ గూడ నేర్పఱుపఁబడినవి. ఆయానియమప్రకారము కూర్చుటలో నడక చెడిపోకుండునట్లును, సుకరముగ నావృత్తముల వ్రాసికొనఁగోరువా రీనియమానుసారముగా నడువవలె ననియుఁ గొన్ని గణము లేర్పడినవి. గణ మనఁగాఁ గొన్ని గురులఘువుల సమూహము. ఈయవి యక్షరముల నాశ్రయించి యుండును. వీనినే "హ్రస్వం లఘు, సంయోగే గురు, దీర్ఘంచ" అని పాణిని మొదలగువారు చెప్పియున్నారు. ఇట్టిగురులఘువులతోఁ గూడినగణములయొక్క నడక నాశ్రయించిన కూర్పే వృత్త మనఁబడును. ఈవృత్తపాదమున కెన్నియక్షరము లుండునో యది యన్నవఛంద మని కూడ మనవారు పేరు పెట్టిరి. ఆఛందము లిరువదియాఱని లక్షణకర్తలు విభజించియున్నారు- ఈఛందములఁ బుట్టినవృత్తసంఖ్య కొన్నికోట్లతరబడి కలదు. ఈఛందములలోఁ జేరినవియే సమవృత్తము లనియు నీఛందముల దాఁటినవి విషమవృత్తము లనియు వీనవిభాగము. ఇట్టివృత్తములలో ననేకవిధము లగు వర్ణావృత్తులు రానురాను బయలుదేఱినవి. అట్టియావృత్తిలో ననిర్వాచ్యమైన సుఖము శ్రవణమునకు గలుగు నని మనపూర్వులు తలఁచి యుండుటచే

నిక్కియావృత్తి చేయవలయు ననునొకనియమము కొంతకాలమునకు బయలు దేఱినది. మఱి కొంత నాగరికకాలము రాను శ్రుతిసుఖార్థము నిలుపువర్ణసంతంతి నియమబద్ధమై తప్పక యాయావృత్తములఁ బరిగణింపఁబడుచు శాసనమైనది. ఈశాసనము లనేకరీతు లగునామములతో లక్షణగ్రంథముల నుదయింపఁజేసినవి. అట్లగుచు మఱికొంతబలమును సంపాదించినవై యక్కినియమముల దాఁటరా దనియుఁ బద్యకవితల నల్లువా రంద ఱీనియమములనే పాటింపవలె ననియు నట్లుచేయక పుస్తకముల వ్రాసిన నక్కికృతి నందినవారికి గొప్పగొప్ప కష్టములు వాటిల్లు ననియు నక్కి గ్రంథము కుగ్రంథమగు ననియుఁ గవి కుకవి యనిపించుకొను ననియుఁ జాటినవి. నాఁటినుండియు భాషాసాంప్రదాయము మాఱుటతప్ప పూర్వనియమములు నిలిచియే యున్నవి. కాని రానురాను గొన్నిబిగింపులు సడలినవి. భీమన పదియతులనే చెప్ప నప్పకవి నలువదియొక్క యతిని, మఱికొంద ఱిరువదియొక్కయతులను చెప్పియున్నారు. వారిలో వారే యఖండాదియతులవిషయమునఁ బూర్వమతముల ఖండించుచు స్వమతధ్వజముల నాటియుండిరి. ఇట్లే వృత్తములలోఁ గూడ లక్షణకర్తలు కొన్నిభావభేదముల నంది యున్నారు. ప్రకృతమున నావృత్తములఁగూర్చి కొన్నియుస్పష్టవిషయములను వారివారిమతభేదములను నీక్రిందఁ బొందుపఱుతును.

1. జలదరవవృత్తము:—"నననననలుచనలనొడఁబడినయవినయవిధివినుమురే
చన మనుయతిని నిలుపఁగ మహిని జలదరవమగుగురువుతోన్."

పైవృత్తమున రెండుపాదము లని గ్రహింపవలెను. లక్షణము లక్ష్యము గూడ నదియే. దీనిలో యతిస్థానము "మనువు" అనఁగాఁ, బదునాలుగక్షరములు దాఁటినవెనుక నని చెప్పఁబడినది. ఇయ్యది యప్పకవీయమున "ధరణిధరగతి" అను నామాంతరము నంది యీలక్షణముగనే యున్నది. యతులు మాత్రము పాదమునకు రెండేసి గలవు. ఎనిమిదియక్షరముల తరువాత నొకయతియుఁ, బదునాలుగక్షరములు దాఁటినవెనుక నొకయతియు నున్నది. కవిజనాశ్రయమునఁ బాదమున క్కొక్కయతియే నిలుపఁబడినది. తక్కినలక్షణము లన్నియుసమములు.........

2. మానిని:—కారకముల్ క్రియ గన్గొన నేడుభకారము లొక్కగకారముతో
గారవమై చనఁగా యతిపండ్రెటఁగల్గినమానిని........."

పైపద్యపాదమునకుఁ మూఁడుస్థానముల యతి కనుపించు చున్నది,

గాని, "పంద్రెట" అని స్పష్టముగాఁ బాదమున క్ష్మాకయతియే యని కవిచెప్పి నాఁడు. ఈవిషయ మప్పకవీయమున స్పష్ట మగును. అనఁగా నందు పాద మున విచ్ఛేదత్రయము గానుపింపలేదు. ఇఁక ఛందోదర్పణమున నేతద్భిన్న మార్గ మంగీకరింపఁబడినది చూడుఁడు.

"...............అద్రిభసేవ్యగురున్విలసిల్లురసత్రయచిత్రయతుల్
పన్నుగ నొందత్రిభాసురవిక్రమభంగిగమానిని........."

పై పద్యమున "రసత్రయ" అనుశబ్దముచే షడ్రసములు గాన నాఱక్ష రముల వ్యవధానముగా మూఁడుయతు లని కవి స్పష్టపఱిచినాఁడు. ఆశబ్దముచే పదునెనిమిది యనుటకు వీలులేదు, "చిత్రయతుల్" అని బహువచన మున్నది గాన-ఉదాహరణను, చూడుఁడు.

"వన్నె యొనర్చిన, వాహినియాతని, వామపదంబున, వాలెనసర్" ఇట్లే నాలుగుపాదములందును నాఱక్షరములు వ్యవధానముగా యతిత్రయము నిలు పఁబడినది. తక్కినవిషయములలో లక్షణకర్తల కైక్యము లేకపోలేదు. పదు నెనిమిదియక్షరములు దాఁటినవెనుక యతియన్నను నితరులకన్న భిన్నమే.

౩. లయగ్రాహి:—

ఇంబడరఁగా భజసనంబులకడన్ భజసనంబులుభకారమునొడంబడలయగ్రా
హింబరఁగఁజెప్పకలశంబిడినయట్లయగణంబుకృతిమీఁదనమరుంబరహితార్థీ.

పై పద్యమున గణములు తప్ప మఱేవిషయము చెప్పఁబడియుండలేదు. వృత్తమునకువలెఁబ్రాసకనఁబడుచున్నది. ప్రాసయతులే తత్తత్స్థానములనిలుపఁ బడినవి, కాని, యవెన్నిపట్టుల నిలుపవలెనో తెలియదు, పాదమునకు మూఁడు పట్టుల కనఁబడుచున్నవి. అనంతునిఛందమున "ఏకోనచత్వారింశన్మాత్రాగర్భి తంబు త్రింశదక్షరంబులైన లయగ్రాహి యగు" నని మాటలతోఁ జెప్పఁబడి నది. లక్షణమున యతులవిషయము కవిజనాశ్రయమునే యనుకరించుచున్నది. "ప్రాసముల్ గ్రందుకొని" యనుటవలన వృత్తప్రాసములు ప్రాసయతులుంగూడ గ్రహింపవచ్చును. అప్పకవీయమున నగమ్యము లన్నియు వాచ్యములైనవి, గాన, దానిప్రకారము చూచుకొనినఁ బైవన్నియు సరిగనుండును.........

4. లయవిభాతి:—పైవృత్తవిషయమున నందఱును నేకీభవించియే యుండిరి. అప్పకవీయము ననుసరించి చూడ నాల్గుయతులు పాదాంత మగు వఱకు నిలుపవలె నని తేలుచున్నది. కాని యప్పకవి లక్షణపద్యమును గొంత

దిద్దవలసియున్నది. "ననసద్వయము వెనుక ననగంబులను నిలిపి" అని యున్నది. ఇది కేవలము లక్ష్యవిరుద్ధము. ద్వయ మనుచోట త్రయ మని యుండవలెను. ఇయ్యది యచ్చుతప్పో పరిశీలనకర్తలలోటో యయియుండవలెను గాని అన్యథాకాదు............

5. త్రిభంగి:—ఈవృత్తవిషమై భిన్నాభిప్రాయము లున్నవి. కవిజనాశ్రయకర్త నాల్గునగణములును రెండుసగణములపై భమసగలు పాదమునకుఁగలిగి యీావృత్త ముండు నని చెప్పెను. మఱియు "వడి దప్పక ప్రాసము లొప్పక" అని యతి లే దనికూడఁ జెప్పియున్నాఁడు. అనంతునిఛందమున నాలుగుగణములును ననమసగలనుగణములు పాదమునకు లక్షణ మని చెప్పఁబడినది. ఇతరవిషయము లేమియుఁ జెప్పఁబడియుండ లేదు. లక్ష్యదృష్టిని జూడ మొదటి రెండుపాదముల రెండుప్రాసయతు లున్నవి. మూఁడునాల్గుపాదముల మూఁడేసి ప్రాసయతు లగపడుచున్నవి. ప్రాసము కలదు. ఈలక్షణమును గవిజనాశ్రయ లక్షణమును జూడ నేమియు సంబంధ మున్న ట్లగుపడదు. ఇఁక, అప్పకవీయమును జూచిన, ఆఱునగణములును రెండుసగణములును భమసగములు పాదమునకు లక్షణ మన్నట్లు తెలియుచున్నది. కాని పద్యమునందు నగణము లాఱును ససభసగములును బాదమునకు లక్షణ మని చెప్పఁబడినది. ఇది లక్ష్యవిరుద్ధము. ససభమసగలని దిద్దిన విరోధ ముండదు. తక్కినవిషయముల నియ్యది యస్పష్టముగ నున్నది. రెండుపద్యము లుపయోగించి లక్షణము చెప్పినను నీతఁడు స్పష్టముగా నియమింప లేకపోయినాఁడు. "షడ్యతిసంగిక" అని పద్యమునఁ జెప్పినపదమునకు సరియగు నర్థము గనఁబడదు. ప్రాస కలదు. పాదమునకు రెండుప్రాస యతులైన ట్లగపడుచున్నది. కవిజనాశ్రయమున "వడి దప్పక" అనెడినియమము దీనిచే బాధింపఁబడెను. ఎనిమిదింట యతిస్థానము-అక్షరములలెక్కనుబట్టి యప్పకవిది నీతనిది నొకఛందముననే పుట్టిన వని మాత్రము చెప్పవచ్చును. కవిజనాశ్రయుని త్రిభంగి త్రిభంగిగానే యున్నది. ఇయ్యది విజాతీయమై నామమాత్రసాదృశ్యముగా నున్నది.........

6. విషమసీసము:—ఇయ్యది కవిజనాశ్రయమున నుత్సాహవృత్తము క్రింద గీతిగాని యాటవెలఁదిగాని రచించిన పైవృత్త మగు నని లక్షణము చెప్పఁబడ లేదు. ఈయర్థము స్పష్టముగా లక్షణమునుండి వచ్చుట లేదు. గీతి విష

యము పద్యమున లేనేలేదు. దీని నన్యలక్షణకర్తలమార్గ మారసి కొందఱు చిన్నమార్పు చేసిరి.

"ఉత్సాహ మయ్యె నిదియు నుం బ్రశస్తముగ నొనర్పఁగన్" అనెడిచోట, ఉత్సాహమయ్యె గీతియును బ్రశస్తముగ నొనర్పఁగన్" అనిదిద్దినారు. అప్పుడు గీతివిషయము స్పష్టపడును. అనంతుఁ డీక్రిందిగీతిలో వృత్తమునకువలెఁ బ్రాస గూడ నుండవలె నని చెప్పియున్నాఁడు. చూడుఁడు.

"ప్రాసములును వడులు భాసురంబుగ నిట్లు విలసితముగ నాటవెలఁదియందు నుత్సుకతనొనర్చి యుత్సాహమది నిల్ప విషమసీస మమరు……………"

చెప్పుటయే గాని తాను జేసి యుండలేదు. మఱియుఁ గవిజనాశ్రయ మున నుత్సాహతుదను గీతియే యుండవలయు నని తేలుచున్నది. అచ్చుటచ్చుట నీతఁ డాటవెలఁదికిని గీతికిని యభేదము కల్పించి యున్నాఁడు. అనంతుఁడు గూడ నన్నిసీసలక్షణములకుఁ గ్లుప్తముగా నొకపద్యమునఁ జెప్పుచు, ఉత్సాహ తుదను గీతి పరఁగ విషమసీసం బగు భాను తేజ"అని చెప్పుట పైవిధిని బలపఱు చుచు నేయున్నది. కవిజనాశ్రయుని సర్వసీసలక్షణపద్యమున విషమసీసము నకు "తుదనుగీతి పరఁగవిషమసీసం బగు భాను తేజ" అని లక్షణము చెప్పెను. దేనితుదనో చెప్పకపోవుటచే,

"అది యె సమసీస ముత్సాహ తుదను గీతి, పరఁగవిషమసీసం బగు……………" అని దిద్దిరి. అప్పకవి యీవిషయమును స్పష్టముగాఁ జెప్పియున్నాఁడు. గీతమందు ప్రాస యనవసర మని లక్ష్యమునుబట్టి తేలుచున్నది. ఈవిష యమున ననంతుఁడే మార్గాంతరస్థుఁ డైనాఁడు.

7. వడిసీసము:—కవిజనాశ్రయమున "మున్నైకొన్న యతి పాదమందెల్ల నడరిన వడిసీసమనఁగఁ బరఁగు" అని లక్షణము చెప్పఁబడినది. లక్ష్యముగూడ లక్షణవిరోధముగ లేదు. అనంతుఁడు గూడ నీమతముననే చేరినాఁడు. అప్పకవి మాత్రము "ఆది నేవడి నిల్పి రావడే పదమెల్లఁ జేయనయ్యది వడిసీస మయ్యె" అని లక్షణమును జెప్పి లక్ష్యము తద్భిన్నముగా నిచ్చినాఁడు. చూడుఁడు:—

"విజయసారథిఁగాని, వినుతింపఁగానొల్ల, గిరినాయకునిగాని, కీరిసేయ"

పైపాదాదిని ప్రాణియతి నిలిపి రెండవయర్థమందు వర్గయతి నిలుపఁ బడినది. మూఁడవపాదము మాత్రము స్పష్టముగా నున్నది.

"పద్మనాభునిగాని, పాటింపఁ గానొల్లఁ, బాణినపతిఁగాని, ప్రస్తుతింప"

ఈ పాదమున నభిన్న మగు వర్గయతి నిలుపఁబడినది. దీనినిబట్టి చూడ లక్షణమందలి పదశబ్దాభిప్రాయ మెంతవఱకు సార్థకమో తెలియకున్నది. సీస పాదార్ధమే పద మని తాను గ్రహించినట్లు తేలుచున్నది. అట్లు చెప్పుట యనవసరము. అట్టి ఖండమందు నిలుపవలసిన యతి యెక్కడే గాన నిట్టివిషయము న నన్యోన్యము భేదము కనుపించుచున్నది.

8. ప్రాససీసము:—కవిజనాశ్రయంబున నిద్దానిలక్షణ మిట్లున్నది.

"వృత్తంబునకువలె వెలయ నాల్గడుగుల వెసఁ బ్రాసములు నిల్పి
విరతు లునుప..................ప్రాససీసంబగు"

ఈ పాదచతుష్టయద్వితీయతుల్యహల్త్వము గీతియందుఁ గూడఁ బొడకట్టుచున్నది. ఇచ్చట, అనంతునిమతమున గీతమందు ప్రాసనియమ మగపడదు. ఈతనిలక్షణమునఁగూడ గీతివిషయమునే చెప్పియుండ లేదు. ఈనియమము ననుసరించియే కొందఱుప్రాససీసలక్షణమునందే కలిపి యక్కిలిప్రాససీసమునకు లక్షణము నుభయలక్ష్యఘాతిదృష్టితోఁ జెప్పిన కవిజనాశ్రయుని పద్యమును గొంచెము సవరించిరి. "దీనిపశ్చిమార్థంబున ప్రాసంబు వేఱొక్క ప్రాస మైన" అను చోట దీని, అనుదానిని తీసివైచి గీతి అని నిలిపిరి. అప్పు డర్థము గీతిన్=గీతియందునను, పశ్చిమార్థంబునన్=ప్రాససీసపాదద్వితీయభాగమునను, వేఱొక్క ప్రాసమైనన్=ప్రాససీసమం దేప్రాసనిలుపఁబడెనో తదభిన్నమై తదధిక మైన మఱియొక ప్రాసమును నిలుపఁగా నని చెప్పకొనవలెను. ఇట్లు చెప్పకొన్నచో, ప్రాసాక్కిలిప్రాససీసములలో ననంతుఁడును సీతఁడును సఖ్యపడుదురు. అప్పుడు కవిజనాశ్రయమందలి పద్యలక్షణమున గీతియందలి ప్రాసనియమమును నాల్గవ సీసపాదఖండద్వయమందలి ప్రాసనియమమును నక్కిలిప్రాససీసమున కుదాహరణములు గాని ప్రాససీసమున కుదాహరణములు గావని గ్రహింపవలెను.

కవిజనాశ్రయునికన్న విశేషముగ వృత్తప్రాస, సర్వతఃప్రాస లనుసీసద్వయములను, అప్పకవి యనంతులు చెప్పినారు. అందప్పకవీయమున "ప్రాసమారంభ్రులఁ 'బదిలంబుగానిల్ప, నక్కిలిప్రాససీ సాఖ్యమగును' అని లక్షణము చెప్పఁబడినది. వృత్తప్రాససీసమునకే పూర్వముద్రణప్రతిలో నక్కిలిప్రాససీస మనుపే రుండెడి దని యాపేజీలోఁ గ్రిందిభాగమున వ్రాయఁబడియున్నది. అట్లైన నియ్యది పైలక్షణకర్తలతో భిన్న మగుచున్నది. గీతపాదచతుష్టయమందును ప్రాసనిలుపవలె నని వారిరువురమతము. గీతప్రథమచతుర్థపాదము

లలో నే యీనియమ మున్నఁజాలు నని యప్పకవిమతము. ఎట్లైనను భేదము తప్ప లేదు. అనంతుఁడు గూడ నీవృత్తప్రాసనీసమును జెప్పెను గాన నప్పకవీయమందలి నాచుమును మూర్పక చూతమన్న ననంతుఁడు గీతిలో నేపాదమందునను గూడఁ బ్రాస కావలె నని చెప్పియుండ లేదు. లక్ష్యమునఁ గూడ లేదు. కాన నీవిషయముల భీమనరంగరాజులే కలసిరి గాని యప్పకవిమతము వేరై నది. సర్వతఃప్రాసనీసమున నిద్దఱు నేకీభవించిరి. ఇయ్యది కవిజనాశ్రయమందలి ప్రాసనీసమం దంతర్భవింపదు. దీన, పాదచతుష్టయమందునను వృత్తమునకువలెఁ బ్రాస నిలుపవలెను. సర్వతఃప్రాసమునఁ బ్రాసయు యతిస్థానమునఁ బ్రాసయతులును నయి యుండవలెను............

9. త్రిపద :—ఇయ్యది మూఁడుపాదములతో నున్నది గాన నా నామము నందినది. దీనికిఁ బ్రాస మున్నది. యతి లేనట్లున్నది. ఈవిషయ మప్పకవి చెప్పినాఁడు. "వళిలేక నలరారుఁ ద్రిపద" యని. కాని ప్రథమపాదమధ్యమున యతిస్థానమందువలె గుర్తునిలుపఁబడినది. అయ్యది యచ్చుతప్పయి యుండనోపును. లక్షణకర్తలు సందేహముగాఁ బద్యముల వ్రాయుట యిట్టిప్రమాదములఁ గలిగించుట సహజమే. మఱియు నది పాదచతుష్టయభ్రమ కలుగఁ జేయుచున్నది. ఈ ప్రథమపాదయతివిషయమున నప్పకవీయముననే గాక తక్కిన వారిగ్రంథములఁగూడ నిట్టిభ్రాంతియే కనఁబడుచున్నది చూడుఁడు.

కవిజనాశ్రయము :—త్రిదశేంద్రులాఱగు । పదియగు నెడనకుఁ.

ఛందోదర్పణము :—సరవిఁబ్రాసమునంది । సురపతుల్ నలువురు.

అప్పకవీయము :—తొలుతను నల్వురిం । ద్రులు రెంటమూటను.

పై వారు యతివిషయమును గూర్చి చెప్పకున్నను గూడ దని చెప్పిన యప్పకవిగూడ నిట్టిసందేహమునకుఁ దావులేకుండ వ్రాయలేకపోయినాఁడా? కాదు. ఇది కేవలము మనస్సంకోచమే. కవిజనాశ్రయమున యతియున్నదా? లేదా? అనునిర్ధారణ లేక యతి కనుపించుచుండుటచే ననంతుఁడుఁగూడ గోడపైపిల్లివాటముగ నెట్లనుకొన్నను బాధకలుగ దని సందిగ్ధముగాఁ జెప్పి యున్నాఁడు. మఱియొకసంగతి. కవిజనాశ్రయుని లక్షణలక్ష్యములకు విరోధమున్నది. దానికి సరియగునర్థము కుదురకున్నది. పై వారిలక్షణమైన నావృత్తమునకుఁ బట్టలేదు. అందువలనఁ దప్పనుటకువీలు లేదు. ఏమందురా? అయ్యది.

"బిసరుహోద్భవగణం రసదశస్థానదోళ్

బిసరుహానేత్రే గణమెబర్హళిదవు
బిసరుహానేత్రేత్రిపదిగే''

అనెడి కన్నడలక్షణమునకు సరిపడి యున్నదని క్రింద వ్రాయఁబడినది. పై పద్య ప్రథమపాదమందుఁ గూడ యతి కల దనియే సూచించుచున్నది, గాని, యీ భేదముల నేది నిశ్చయమో ప్రమాణగ్రంథలక్ష్యము దొరకువఱకును నిర్ణయింపఁజాలము. ఈపై వారిలక్షణమునకుఁ గవిజనాశ్రయునిలక్షణపద్యముల సరిపుచ్చవలెనన్న రెండవపాదమును-

''గదియరెండిటను మూడిటను" అని సరిచేసిన భేదము వాటిల్లక గణములు మాత్రము సరిపడును.........

10. చౌపద:—దీనిలక్షణ మన్నిటియందునను సమముగానేయున్నది. అనంతుఁడు మాత్రము పాదాంతమందు లఘువునే నిలిపినాఁడు. తక్కినవారి లక్ష్యముల గురువున్నది.........

11. షట్పద :—ఇయ్యది రంగరాట్ఛందమున స్పష్టముగా నున్నది. ఆఱుపాదములచే నుండుట యిద్దానికి సార్థకనామము. ఆఱింద్రగణములు నొక చంద్రగణమును బాదత్రయ మగు నని దీనిలక్షణము. ప్రాస గలదు. వడి లేదు. చంద్రగణము మూఁడాఱుపాదములనే యుండును. కవిజనాశ్రయమున నీ యర్థమే చెప్పఁబడెను గాని పద్యము ప్రభ్రష్టమైనది. ముద్రణ పాదవిభాగము గా లేదు. ప్రాసము కొన్నిపట్టులఁ బోయినది. గణములకూర్పు పో లేదు. దానిని

"త్రిదశేంద్ర గణములు
కుదురనిర్పాడిడి
కదియనంత్యంబునఁ జంద్రుఁగూర్చి
తుది యిట్లుగాకూర్ప
నది యతిలేక ష
ట్పద మగు మల్లియరేచనాఖ్య''

ఈరీతిగా సవరించిన లక్ష్యలక్షణసమన్వయముగా నుండును. ఇంక నప్ప కవీయమున నీలక్షణ మంతయు సరియగురీతినే యున్నది గాని లక్ష్యపద్యమున "పాద మీసూటితో నాల్గుఁజేసిన" అని యున్నది. ఈనాల్గు అనుదాని కర్థ మున్నట్టు లగపడదు. కొంచెము మార్చిన సరిపడును, గాన, దీనియైదాఱు పాదముల

"భాసిల్లమూఁడగు, నీసూటిరెట్టించి"

అను చిన్నమార్పుఁ జేయవలెను ....

ఇట్లు లక్షణకర్తలలో ననేకభేదము లనేకస్థలములఁ గనఁబడుచున్నవి. ఇంకను గొన్నివృత్తములలోఁగూడ నున్నవి. గ్రంథవిస్తరభీతిని ముగించితి. ఈ యిక్కట్లు సామాన్యముగాఁబూర్వలక్షణముల దిద్దుటవలన వచ్చుచున్నవి. తాను తాను మూఁడునాల్గుశతాబ్దములనాఁటికిఁ గవి తనగ్రంథమునఁ బ్రయోగించిన పదములు నశించి, అధికపాఠమయము లగుచున్నవి. ఇట్టే కొంతకాలమునకు నిరర్థకములు గూడ నగుచున్నవి. ఈదిద్దులు పూర్వమునుండియు వచ్చుచునే యున్నవి. నూతనముగ వ్యాకరణ మొకటి వ్రాయవలెనన్నపండితుఁడు కొన్ని ప్రయోగములఁ బ్రమాణగ్రంథముల మార్చుచేసి యిట్టివిశేషములు తత్పూర్వు లు చెప్పియుండలేదని నేనే క్రొత్తగాఁ బరిశీలించితి ననియుఁ గూడఁ జెప్పుట మనము ప్రౌఢవ్యాకరణాదులలోఁ జూచుచునే యున్నాము. ముఖ్యముగా నతి కష్టతరములగు నిట్టిపెద్దవిషయముల నొకపద్యమున నిమిడింపవలె నన్న నస్ప ష్టత లెక్కువగానే యుండును; గాని యేకచ్ఛందోజాతములై నామసాదృశ్యము ను గూడ నందుచు వానివానినియమములలోను గణములలోను భేదము లక్షణ కర్తలలోఁ గననగుట వింత. ఇయ్యది వారివారి స్వతంత్రములను దెలుపుచు న్నవి, గాని, నియమప్రకార మనుసరించుట లేదు. ఇట్లు వృత్తములలోనే గాక యతులలోఁ, బ్రాసములలో మఱియు ననేకవిషయములలో నిట్టిమతభేద ము లుంటచేతనే శాస్త్రము కఠినమై బహుమార్గములఁ ద్రొక్కుచున్న దనుట సర్వవిదిత మని విరమించుచున్నాను.

సోమనాథస్తవము.

— బండారు తమ్మయ్యగారు, కాకినాడ. —

పయి పేరుగల చిన్నద్విపదకృతి యొకటి పాలకురికి సోమనాథకృతమని చిరకాలమునుండి వాడుకలో నున్నది. ఈ నానుడి ననుసరించియే, ఆంధ్రపత్రిక దుందుభి సంవత్సరాదిసంచికలో, పాలకురికి సోమనాథునిఁ గూర్చి నేను వ్రాసినవ్యాసములో "సోమనాథస్తవ మని మఱియొకద్విపదస్తవము తెలుఁగుభాషలోనే యీకవివరుని దొకటి గలదు" అని వ్రాసితిని. ఆంధ్రగ్రంథమాలలోఁ బ్రకటితమయిన బసవపురాణము పీఠికలోఁ దద్గ్రంథపరిష్కర్త లగు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సోమనాథస్తవమును గూర్చి నేను వ్రాసినవ్రాఁత నిరాధార మని యీక్రిందివాక్యములు లిఖించిరి.

"అది యోరుఁగంటిలో ముదిగొండ శంకరారాధ్యులవారిచేఁ బరిష్కృతమై ముద్రితమైన మోక్షోపాయ" మనుపుస్తకమునఁ గల సోమనాథస్తవమే యగునేని దానికిఁ గర్త పాల్కురికి సోమనాథుఁ డనుట నిరాధారము. దాని ముగింపి ట్లున్నది. "భక్తుల సంగంబు, భక్తసద్గోష్ఠి-భక్తులపదసేవ, పదపడి చేయఁ! గరుణ నొసంగవే, కైలాసవాస, గురునాథ శ్రీపాలకురికి సోమేశ!" తద్రచనము సోమనాథునిరచనమువలె లేదు. తమ్మయ్యగారు పేర్కొనిన సోమనాథస్తవ మింకొకటి కల దేమో! సోమనాథుని గ్రంథముల నెల్లఁ బఠనపాఠనాది ప్రచారమునకుఁ దెచ్చినవాఁడు తచ్ఛిష్యపరంపరలోనివాఁడు నగు పిడుపర్తి బసవన్న* యీగ్రంథమును బేర్కొనలేదు."

పూర్వోక్త మయిననావ్యాసమును వ్రాయునప్పటికి నేను శ్రీశంకరారాధ్యులవారు ప్రకటించిన మోక్షోపాయ మనుగ్రంథమును జూచి యుండలేదు.

* పద్యబసవపురాణమును పాలకురికి సోమనాథుని కంకితముగా రచించినవాఁడు పిడుపర్తి బసవకవిపుత్త్రుఁడు సోమనాథుఁ డని యీగ్రంథమువలనను నందలి గద్యమువలనను గాననగును. కాని శ్రీశాస్త్రిగారు తమవిపరీతపరిశోధనఫలితముగఁ దద్గ్రంథకర్త పిడుపర్తి బసవన గాని సోమనాథుఁడు కాఁడని వ్రాసినారు. అట్లే వీరశైవదీక్షాబోధకర్త పిడుపర్తి బసవన యని యీగ్రంథమువలనఁ దెలియుచుండఁగా సోమనాథుఁ డని వ్రాసిరి. తండ్రి కొడుకులఁ గూర్చి వీరొనర్చిన యీతబ్బిబ్బులు, తాఱుమాఱులు నప్రమాణము లని "పిడుపర్తికవులు" (సమదర్శిని ది 30-4-32) అను వ్యాసమున సప్రమాణముగ నిరూపించియుంటిని.

అప్పటికి నేఁ జూచిన సోమనాథస్తవము, ఏలూరువాస్తవ్యులు శ్రీ కొండగుంటూరు నాగభూషణముగారు ప్రకటించిన యొకమిశ్రగ్రంథములోనిది. దానిలో నీసోమనాథస్తవమే గాక, కోటప్పరగడ, సహస్రగణమాలిక మున్నగునవి ప్రకటింపఁబడినవి. అందులో సోమనాథస్తవము చివర "ఇది శ్రీ పాల్కురికి సోమేశ్వరవిరచితము" అనికూడ ముద్రింపఁబడినది. దీనినిబట్టియు వీరశైవ ప్రపంచమునఁ బరంపరాగతముగ వచ్చుచున్న వినికిడినిబట్టియు నీకృతి పాలకురికి సోమనాథకృతమే యను విశ్వాసముతో నా వ్యాసములో నే నట్లు వ్రాసి యుంటిని. శాస్త్రిగారి వ్రాఁతలను జూచినతరువాత శ్రీ శంకరారాధ్యులవారు ప్రకటించిన మోక్షోపాయ మను గ్రంథమును గూడఁ జూచి యందుఁ బ్రకటిత మయిన సోమనాథస్తవముచు శ్రీ నాగభూషణముగారి గ్రంథమందలిదియు నొకటియే యని గ్రహించితిని.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారిద్విపదకృతి సోమనాథకృతము కా దనుటకుఁ గల కారణములను విస్పష్టముగ వివరింపరయిరి. కృత్యంతమున నున్న "గురునాథ శ్రీపాలకురికి సోమేశ, పరమప్రభుండైన పాల్కుర్కినిలయ" అనుపంక్తులనుబట్టి యీకృతి యన్యవాదకోలాహలమును సీసశతకమువలెనే పాలకురికి సోమనాథుని కంకితముగా నాతని శిష్య ప్రశిష్యకోటిలోఁ జేరిన మఱియొకకవి రచించియుండు ననుభ్రమకు లోనయి వీరిట్లు వ్రాసియుండరుగదా! అట్లైనచో నీభ్రమ కేవలము నిరాధార మని యీస్తవమును సవిమర్శముగఁ బఠించువారికిఁ దోఁపకమానదు. పయిపంక్తులలో సంబోధింపఁబడిన పాల్కురికి సోమేశుఁడు పాలకురికి సోమనాథకవి జన్మస్థానమగు పాలకురికి గ్రామమున సోమేశ్వరనామమున వెలసిన శివలింగమే గాని యాపేరుగల యొకమానవుఁడు గాఁడు. పాలకురికి సోమనాథకవి నిజామురాష్ట్రమున నోరుఁగంటి ప్రాంతమున నున్న పాలకురికి వాస్తవ్యుఁడని యాతని గృహనామమును బట్టియు, అన్యవాదకోలాహలమందలి సీ."భవదీయసంబాధభాసురంబయ్యె నేభాగ్యంబు చేసెనో పాలకురికి" అను పద్యమునుబట్టియు గ్రహింపఁదగును.

పాలకురికియందు వెలసిన సోమనాథేశ్వరుని పేరే మనసోమనాథకవి కాతని తలిదండ్రులు పెట్టియుందురు. ఈవిషయములు శ్రీ శాస్త్రిగారు కూడ గుర్తింపకపోలేదు. "సోమనాథుని నెలవు" అను శీర్షిక క్రింద వారు వ్రాసిన వాక్యములు చిత్తగించునది. తనస్వగ్రామమున వెలసిన సోమేశ్వరుని పేర సోమనా

థుఁడు తన ప్రథమవయస్సులో నీకృతి రచించి యుండవచ్చును. ఈపాలకురికి సోమేశ్వరుఁడు బమ్మెర పోతనామాత్యునకుఁ గూడ మొదట నిష్టదైవముగా నుండినట్లు పాలకురికి ప్రాంతమున నిప్పటికిని వాడుకలోనున్న

"పాలకురికినిలయా- సోమయలింగా పాదములకు శరణు- వురమగ బమ్మెర పోతరాజుకు మీరు కోరిన వరములు కృపచేసినారఁట- పాల్కు రికినిలయా......"అను పాటవలన గ్రహింపఁదగును. కావునఁ గృత్యంతమందలి "గురునాథ శ్రీపాలకురికి సోమేశ" ఇత్యాదివాక్యము లీకృతి సోమనాథకృతి యనుటకు బాధకము లెంతమాత్రము కానేరవని విస్పష్ట మగును. ఇఁక నిది సోమనాథకృతమే యని యనుమానించుటకు నాకుఁ దోఁచిన సాధకముల నివేదించుచున్నాఁడ.

సోమనాథుఁడు బసవపురాణ, పండితారాధ్యచరిత్రముల యవతారికలలో ద్విపదకావ్యరచనమును సమర్థించుకొనుచు వ్రాసిన వాక్యములును ద్విపదలలోఁ బ్రాసయతి చెల్లుననుటకు "అనియతగణైః" "యతిర్వా" "ప్రాసోవా" అనిచూపిన ప్రాచీనసూత్రములను జూడ నాతనికాలమునాఁటికే లోకమున ద్విపదకావ్యములయెడ నొకకరణి నిరసనమును ద్విపదలలోఁ బ్రాసయతి కూర్పరాదను నభిప్రాయమును వ్యాప్త మయినట్లు లూహించుటకుఁ జాలనవకాశము కలుగుచున్నది. సంగీతమునందును, ఇంద్రచంద్రగణములతో నేర్పడు సీసగీతాదికములందును జెల్లెడి ప్రాసయతి యక్కగణములచేతనే యేర్పడి పాటవలెఁ బాడుకొనుటకు మిక్కిలి యనువగు ద్విపదలలోఁ జెల్లనేర దనుట సమంజసముగాఁ దోఁపదు. ద్విపదలలోఁ బ్రాసయతి నంగీకరించుట ప్రాచీనకవి సమ్మతమనియే నాయభిప్రాయము. మన కుపలబ్ధము లయిన ద్విపదకావ్యములలో సోమనాథునికృతులే ప్రాచీనతమములు. అంతకుమున్ను వెలసిన ద్విపదకావ్యములు మనకు లభింపనందునఁ బ్రాచీను లీప్రాసయతి నెంతవఱకు ద్విపదలలోఁ బాటించిరో నిర్ణయింపరాకున్నది. కాని తనకాలమునాఁటికి వ్యాప్త మయిన యీప్రాసయతి నిరసనమును సోమనాథుఁడు గూడ మొదటఁ గొంతవఱకుఁ బాటించి వయస్సుమీఱినకొలఁదిఁ, బాండిత్యము హెచ్చినకొలఁదిఁ బ్రాచీనసంప్రదాయమును గుర్తించి ద్విపదలలోఁ బ్రాసయతి చెల్లుననుటకుఁ బ్రమాణములను గ్రహించినతరువాత దానిని బాహాటముగ నుపయోగించినట్లు తోఁచుచున్నది. ఇందుల కీసోమనాథస్తవమే తార్కాణము. బసవపురాణ పండితారా

ధ్యచరిత్రములలో సోమనాథుఁడు విపులముగను బాహాటముగను బాటించిన యీప్రాసయతి సోమనాథస్తవములోఁ గ్వాచిత్కముగఁ గానవచ్చుచున్నది. శంకరారాధ్యులవారి ముద్రితప్రతియందలి యీ క్రిందిపంక్తులు చిత్తగింపుఁడు.

(1) వరుసగా నఖిలంబు నరసిరక్షించు ।
(2) గురుచరేశ్వరుఁడవై ధరణికివచ్చి ।
(3) ఒడయనంబెన్నకు బడిపనుల్ చేసి ।
(4) పిట్టవ్వకై వెట్టితట్టలుమోసి ।
(5) ఎన్నెన్నిచర్యలఁ బన్నితివీవు ।
(6) మృడునిసద్భక్తులు గుడిచినచోట ।
(7) పుడమిభక్తులయిండ్ల బడిపనుల్ చేయు ।
(8) లింగార్పితంబైన మంగళసాద ।
(9) నిరతంబునీభక్తవరులకు మిగుల ।

వీనిలో 1, 2, 5, 8 పంక్తులకు వరుసగాఁ బ్రాసయతి రహితములయిన "అరయఁగా నఖిలంబు హరియింపుచున్న" "గురుచరేశ్వరుఁడవై కుతలంబు సొచ్చి" "ఎన్నెన్నిజన్మంబు లెత్తితినన్ను" "లింగార్పితంబైన లీలాప్రసాద" అను పాఠములు గూడఁ గొన్నిప్రాఁతప్రతులయందును గంతపాఠముగ నీస్తవమును జదువు కొందఱు భక్తులపాఠములందును గాన వచ్చుచున్నవి. సోమనాథునకు సమ్మతమయి యాతనిచే సమర్థింపఁబడి బసవపురాణ పండితారాధ్య చరిత్రములలో విపులముగాఁ బ్రయుక్తమయిన ప్రాసయతి విరళముగనయిన సోమనాథస్తవమునఁ గాన వచ్చుటగూడ నీకృతి సోమనాథకృతమే యనుట కవకాశ మొసంగుచున్నది. బసవేశ్వరునిఁ గూర్చియు నాతని సమకాలికు లగు భక్తుల గుఱించియు సోమనాథునికిఁ దెలియవచ్చి బసవనియందు భక్తి యంకురించిన తొలు దొలుతటి కాలమున సోమనాథుఁ డీగ్రంథము రచించియుండు నని నాయభిప్రాయము. ఇందు బసవని ప్రసక్తి స్వల్పమాత్రముగనే యుదాహరింపఁబడినది. చూడుఁడు.

"పరమశివాచారభక్తిమర్మములు । బసవన్న మొదలైన భక్తులకెల్ల ।"

ఉపలబ్ధములయిన సోమనాథుని కృతులలో నెల్ల ననుభవసార మనుపద్యకావ్యమే మొట్టమొదటి దని నాయాశయము. ఆకృతి రచించునప్పటికి సోమనాథునికి బసవనిసంగతి యంతగాఁ దెలిసి యాతనియందు భక్తి కుదిరినట్లు

గానరాదు. అట్లుగాక యాతనియందు భక్తికుదిరిన ప్రౌఢవయస్సులోనే సోమనాథుఁ డాగ్రంథమును వ్రాసె నన్నచో దానిలో మల్లికార్జునపండితుని మూఁడుపద్యములలోఁ జెన్నునియు బసవని పేరైన నెత్తకుండుటకుఁ గారణము కానరాదు. ఈవిషయమును "పాలకురికి సోమనాథకవి; కులగోత్ర ప్రశంస" అను వ్యాసమున (పరిషత్పత్రిక సం॥ 19 సం॥ 3-4-5 లో) విస్తరించి యుంటిని. కావున, అనుభవసారరచనమునకు ను, బసవపురాణ రచనమునకు ను మధ్యకాలములో బసవస్తోత్రపరము లగు పంచప్రకారగద్య, నమస్కారగద్య, మున్నగు గద్యకృతులను రచించుట కించుకపూర్వ మీసోమనాథస్తవము సులభశైలిలో భక్తుల యుపయోగమునకయి రచింపఁబడి యుండునని తోఁచుచున్నది.

ఇందలి రచనము సోమనాథుని రచనమువలె లేదని శాస్త్రిగారు వ్రాసిరి గాని యందులకు దృష్టాంతములను జూపరయిరి. నాకుఁ జూడఁగా బసవపురాణ రచనమునకును నిందలిరచనమునకును బాటింపఁదగిన భేద మేమియుఁ గానవచ్చుటలేదు. సోమనాథునకుఁ బ్రియకరమయి యాతని కృతులందుఁ గానవచ్చెడి యనుప్రాసముమాత్ర మీలఘుకృతియం దంతగాఁ గానరాదు. కాని యిది శాస్త్రిగారి వాదమున కొక ప్రబలాధారము కాఁజాలదు. ఇది సోమనాథుని ప్రాథమికకృతులలోఁ బరిగణింపఁదగిన దని మనవి చేసియే యుంటినిగదా! అయినను శైలివిషయమున గ్రంథమందలి క్రిందిపాదములను బరికించి బసవపురాణరచనమునకును దీనికిని బాటింపఁదగిన భేద మున్నది లేనిది విజ్ఞులు నిర్ణయింతురుగాక!

"పాయక కిన్నర బ్రహ్మయ్య పిలువ, హోయని పల్కిన యొడయ రక్షించు
చెన్నయ్యభుక్తావశేషంబుగొన్న, పన్నగకుండలాభరణ రక్షించు
జంగమలింగప్రసాదసేవనము, నంగంబుగాఁగఁ దా నంగీకరించి
తనుమనోధనములు తనవనుబుద్ధి, మనమున నెడలించి మక్కువతోడ
నిరతంబునీభక్తవరులకుమిగులఁ, బరిచర్యలొనరించు భక్తి నాకొసఁగు"

ఇఁక గ్రంథస్థసాక్ష్యమును విచారింతము- ఈకృతియందలి ప్రథమపాదము "శ్రీగురులింగ సుస్థిరదయాపాంగ" అనునది యీమద్భేదములతో బసవపురాణపండితారాధ్యచరిత్రములలోఁ గొన్ని యాశ్వాసారంభములఁ గానవచ్చుచున్నది.

శ్రీ గురులింగ సుస్థిరదయాపాంగ, యోగాత్మ! భక్తిమహోత్తుంగసంగ ।
(బ॥ పు॥ ఆ 4)

శ్రీ గురులింగ సుస్థిరదయాపాంగ, భోగమహోదార పాల్కురికిసూర।
(పం॥ చ॥ వాదప్ర॥)

సోమనాథుని కృతులలోఁ దఱచుగఁ గానవచ్చు నెట్టణయను ప్రాచీనశబ్ద మిందుఁ గూడఁ బ్రయుక్త మయినది. అస్మదర్థ న 'నేను' అనుటకు మాఱు "తాను" అను ప్రాచీనసంప్రదాయము కూడ నిందుఁ గాననగును.

"తిట్టినవారిని దీవించువారి, నెట్టణ యొకటి యన్నేర్పు నాకొసఁగు
......................................తనుమనోధనములు తనవనుబుద్ధి"

అనంతుఁడు మున్నగు లాక్షణికులు చెప్పిన, "గీ. మొదలి తెలుఁగుపై సంస్కృత పదమొకండు । జరగ లోకరూఢిని సమాసంబు చొరదు, పూని ముజ్జగంబులు ననఁ బోలుఁగాని, యితఁడు ముజ్జగద్వందితుఁడనఁగఁ జనదు॥" అనులక్షణమునకు సరిపడని 'ముల్లోకవంద్య' "ముల్లోకనాథుని" మున్నగు ప్రయోగములు సోమనాథుని బసవపురాణ పండితారాధ్యచరిత్రములందును, ఆనాఁటిశాసనములందును గల వని శాస్త్రిగారు బసవపురాణపీఠికలో వ్రాసిరి. ఈసోమనాథస్తవము ముద్రితప్రతిలోఁ గానవచ్చు "ముజ్జగములనేలు పురుష రక్షించు" అనుపాఠమునకుఁ గొందఱుభక్తుల కంఠపాఠమునందును, ఆంధ్రసాహిత్యపరిషత్కార్యాలయమందలి నెం 1244 రు తాళపత్రప్రతియందును "ముజ్జగదాధారమూర్తిరక్షించు" అనుపాఠము గానవచ్చుచున్నది. అదియే కవిపాఠ మయినచో నదికూడ సోమనాథకర్తృత్వమునకు సాధకమే యగునుగదా! అప్పకవిచెప్పిన 'ముకారయతి' ప్రాచీనకవిసమ్మతము గా దని శాస్త్రిగారు బసవపురాణపీఠికలో వ్రాసినారు గాని యీయతిగూడఁ బ్రాచీనకృతులలోఁ గ్వాచిత్కముగఁ గానవచ్చుచునే యున్నది. బసవపురాణముననే యొండురెండు ప్రయోగములు గలవు.

భువినఱువాద్దడి మువ్వురిలోనఁ　　　　(పుట 48)
పురహరార్చితునకు మున్నెత్తుకేలు　　　　(పుట 237)

కావునఁ బయిని జెప్పిన "ముజ్జగములనేలు పురుష రక్షించు" అను నదియే కవిపాఠ మన్నను నదికూడ సోమనాథకర్తృత్వవిషయమున బాధకము కానేరదు.

"అజ్ఞానమని యెడి యంధకారమున, మగ్నుండనై మిమ్ము మఱచుచునుంటి."

ఈపాదములు సోమనాథకర్తృత్వవిషయమున బాధకములు కానోపును. ఇట్టిప్రాసము సోమనాథునకు సమ్మతముగాఁ దోఁపదు. పరిషత్కార్యాలయమందలి వ్రాఁతప్రతిలోఁగూడ నిట్లే యున్నది. కాని యిచ్చటఁ గవిపాఠము మఱుగువడి యపపాఠము నెలకొనెనేమో యని నాయనుమానము. మఱియు నీపాదములు ప్రక్షిప్తము లయినను గావచ్చును. ఈసోమనాథస్తవము విశేషముగ భక్తులకంఠపాఠములమూలముననే ప్రచారమందున్న లఘుకృతి యగుటచేఁ గొన్నిప్రతులలో లేనిపాదములు మఱికొన్నిప్రతులలో నుండుటయు నట్లే కొన్నిటిలో నున్నవి మఱికొన్నిటిలో లేకుండుటయుఁ గూడఁ గాననగును. కొన్నితాటాకుప్రతులలోఁ గాన్పించు "ఆదికి నాదివై యఖిలలోకములు, మోదంబుతోఁబ్రోచు ముఖ్య రక్షించు" మున్నగుపాదములు శ్రీశంకరారాధ్యులవారి ముద్రితప్రతిలో లేనేలేవు. కృత్యంతమందలి యీక్రిందిఫలశ్రుతిలో

అనుదినంబీస్తవ మర్థిఁబఠింపఁ, బసిపూనిచదివిన భక్తితోవినిన
నరయంగవ్రాసిన యభవుభక్తులకు,దొరకునుముక్తియుదురితముల్ తొలఁగుఁ
బరమలింగైక్యసంప్రాప్తిచేకూరుఁ, బరిహృతంబగు జన్మబాధలన్నియును
బరఁగంగ షట్స్థల భావంబుచెందు, గురుభక్తి చెన్నొందు గోప్యంబుగాను
పరమప్రభుండైన పాల్కుర్కినిలయ,కరుణతో నొసఁగవే కలకాలమెల్ల."

సంబోధనరూపమున నున్న చివరి రెండుపాదములును బ్రక్రమము ననుసరించి "పరమప్రభుండు పాల్కురికినిలయుఁడు ! కరుణతోఁ బ్రోచును గలకాలమెల్ల" అని యుండఁదగు ననియు నదియే కవిపాఠమయి యుండుననియు నాతలంపు. పరిషత్కార్యాలయమందలి తాటాకుప్రతిలోఁ జివరపాదము నేను జెప్పినట్లే యున్నది.

ఇఁక నీకృతి సోమనాథకృతము కాదనుటకు శాస్త్రిగారు చెప్పెడి ...లకారణము పద్యబసవపురాణకర్త సోమనాథునికృతుల నుదాహరించెప్పిన "బసవపురాణంబు, పండితారాధ్యులచరితంబు, ననుభవ ...." అనుపద్యములో సోమనాథస్తవము ...కుండుట యొకటి. ఈపద్యమున సోమనాథునికృతు లన్ని యు... వ విడువక యేకరువు పెట్టఁబడిన వని యెన్నఁ దగునా ? ...చో, ఎత్తుగీతి మూఁడవపాదమందలి "ఆది యగు కృతుల్"

అనుదానికి నర్థప్రయోజన మేమి? సోమనాథుని కృతులలో "మల్లమ దేవిపురాణ" మను నొక ద్విపదకావ్యము కూడఁ గలదనియు దాని ప్రతి యొకటి కర్నూలుజిల్లా నందికొటుకూరులో నొకలింగాయతునియింటఁ జూచితి మనియు శ్రీసెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగా రొకపరి వ్రాసియుండిరి. పద్య బసవపురాణకర్త పయిపద్యములో నీ గ్రంథమును గూడఁ జేర్కొన లేదుకదా! అతివిస్తరమేల? ఆతఁ డాపద్యము సీసపాదములందును గీతము మొదటి రెండుపాదములందును సోమనాథుని కృతులను జెప్పఁ దగినన్ని చెప్పి తక్కినవాని నాదిశబ్దముచే సూచించుచు మూఁడునాల్గు పాదములను "ఆదియగుకృతుల్ భక్తహితార్థబుద్ధిఁ, జెప్పె నవి భక్తసభలలోఁ జెల్లుచుండు" అని వ్రాసినాఁడు. ఆదిశబ్దముచే గ్రాహ్యము కాఁదగు నితరకృతులలో నీలఘుకృతియుఁ జేరఁదగును. కావున నిదిగూడ శాస్త్రిగారివాదమున కుపకరింపఁజాలదు. కొన్ని సంవత్సరములయి "భారతి"లోఁ బ్రకటించిన "పాలకురికి సోమనాథుని గురుప్రశంస" అనువ్యాసములో విజయనగర వాస్తవ్యులు నామిత్రులు శ్రీ నిడదవోలు వేంకటరమణగారు కూడ నీసోమనాథస్తవము సోమనాథకృత మనియే పేర్కొనిరి. బహుశః వీరు వీరిజనకులును బహుశైవగ్రంథ పరిశోధకులు నగు శ్రీనిడదవోలు సుందరము పంతులుగారివలన నట్లు తెలిసికొని వ్రాసియుందు రని తలంచుచున్నాను. పెద్దలు పలువు రిట్లె లీలఘుకృతిని సోమనాథకృత మనియే తలంచియుండిరి, తలంచుచున్నారు. పరిషత్పుస్తకభాండాగారమందలి వ్రాఁత ప్రతులను గూర్చి పరిషత్పత్రికలోఁ బ్రకటించు వివరణలోఁ గూడఁ దత్పత్రికాసంపాదకు లీలఘుకృతిని "శివస్తోత్ర"మని పేర్కొని పాలకురికి సోమనాథకృతము కానోపు నని వ్రాసిరి. దీని కర్తృత్వవిషయమున నా కారూఢజ్ఞానము లేకున్నను నిట్లు చిరకాలానుగతముగ వచ్చుచున్న యభిప్రాయము ను ద్రోసి వేయుటకుఁ దగిన కారణములు లేక దానినే నేనుగూడ ననుసరించితిని. సోమనాథకర్తృత్వ విషయమునఁ గల సాధకబాధకముల నిప్పుడు వివరించితిని గదా! బాధకము లకన్న సాధకములే యెక్కువగఁ గాన్పించుచున్నవి. పాలకురికి సోమేశ్వరస్వామి పేర నిట్టిస్తవ మొనర్చుకవి సోమనాథుఁడు తక్క మఱియొకఁ డాకాలమునఁ గానరాఁడు. ఆతని శిష్యప్రశిష్యులు పిడుపర్తి బసవనాదులు దీనిని రచించియుందు రని తలంచుట కవకాశము లేదు. వారికిని పాలకురికికిని సంబంధ మంతగాఁ గానరాదు. వారి స్వగ్రామమగు పిడుపర్తియును, అగ్రహారముగాఁ బడసిన దోకి

పట్టును కృష్ణా గుంటూరుమండలములలోని పని నాయభిప్రాయము. మఱియుఁ బిడుపర్తి బసవన వీరశైవ దీక్షాబోధయు నాతని తనయుఁడు సోమనాథుఁడు వ్రాసిన ప్రభులింగలీలయుఁ జూడ నందుఁ బ్రాసయతి ప్రయోగములు గానరా కున్నవి. అందులకుఁ గారణము వారి కాలమునాఁటికి ద్విపదలలోఁ బ్రాసయతి చెల్లదను పూర్వాభిప్రాయము మరల వ్యాప్తమగుటయు దానిని ద్రోసివేయు సాహసము వారికి లేకుండుటయు నని నేఁ దలంతును. కావున సోమనాథస్తవ మునఁ గ్వాచిత్కముగఁ గానవచ్చు ప్రాసయతి ప్రయోగములు గూడ నీకృతి కర్తృ త్వమును వారి కారోపించుటకు బాధకము లగును. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు గాని తదితరులు గాని వట్టిమాటలచేఁ గాక ప్రబలప్రమాణములచే నీకృతి సోమ నాథరచితము గాదని నిరూపించినచో నేను గూడ వారియభిప్రాయము ననుస రించుట కెట్టియభ్యంతరమును లేదు.

శ్రీశంకరారాధ్యులవారి గ్రంథములో నీసోమనాథస్తవము తరువాత "భక్తస్తవము" అను మఱియొక లఘుద్విపదకృతి కూడ నున్నది. ఈరెంటికిని శైలీభేదము గానరాదు.

సోమనాథస్తవమునకంటె నందుఁ బ్రాసయతి కొంచె మెక్కువగాఁ బ్రయు క్తమయినది. అదికూడ సోమనాథకృతమేమో యని నాయనుమానము. ఆకృ తియందలి యీక్రింది పంక్తులకును బండితారాధ్య చరిత్రమందలి ద్విపదపాద ములకును గల సాదృశ్యమును జూచి విజ్ఞులు విషయనిర్ణయ మొనరింతురుగాక!

"భక్తపుత్త్రుండను భక్తపౌత్త్రుండ, భక్తుల శ్రీపాదపద్మసేవకుఁడ
భక్తులఁబొగడఁ బాల్పడు కవీంద్రుండ, భక్తులదూతను భక్తులబంట
భక్తులలెంకను భక్తసత్పాత్రిణి, భక్తులచెలికాఁడ భక్తబంధుండ (భక్తస్తవము)
బసవనిపుత్త్రుండ బసవగోత్రుండ, బసవేశుశ్రీపాదపద్మశేఖరుఁడ
బసవనిఁబొగడఁ బాల్పడుకవీంద్రుండ, బసవన్నఁబొగడఁ బాల్పడుపాఠకుండ
బసవన్నదూతనే బసవన్నబంట, బసవన్నయిలుపుట్టుబానిసకొడుక
బసవన్నలెంకనే బసవన్నలెంగి- (పం॥ చ॥ దీక్షాప్రకరణము)

గ్రంథస్వీకారము.

(1) తంజాపురాంధ్రనాయకరాజచరిత్రము: — గ్రంథకర్త బ్ర॥ కురుగంటి సీతారామయ్యగారు యం. ఏ. ఉపద్రష్ట, సరస్వతీమహాల్ పుస్తకాలయము, తంజావూరు. వెల రు 2—0—0.

గ్రంథకర్తగా రాంధ్ర విశ్వవిద్యాలయమునఁ దామిచ్చిన యుపన్యాసముల నీరూపమునఁ బ్రకటించినందుల కాంధ్రలోకము వీరికిఁ గృతజ్ఞతనుఁ జూపవలసియున్నది విశ్వవిద్యాలయమువా రీగ్రంథము నేలొకో ప్రకటించియుండలేదు. గ్రంథకర్త విశ్వవిద్యాలయమున వైసుచాన్సెలరుగారగు, సర్. రాధాకృష్ణగారి కీగ్రంథము నంకిత మొనర్చెను. గ్రంథము దేశోద్ధారక కా. నాగేశ్వరరావుగారి సహాయమున నాంధ్రపత్రికా కార్యాలయమున ముద్రింపఁబడినది. ఏదేశమున విశ్వవిద్యాలయములు స్థాపింపఁబడినవో యాదేశచరిత్రమును సమగ్రముగ విశ్వవిద్యాలయ పక్షమునఁ జరిత్రవేత్తలచే నుపన్యాసము లిప్పించి వానిని గ్రంథరూపమున ముద్రింపవలసిన భారము విశ్వవిద్యాలయాధికారులదై యున్నది. అట్టియాశయము నింకనైన నుజ్జీవింపఁజేసి యాంధ్రచారిత్రమును బ్రాచీనకాలమునుండి నేఁటివఱకును దనుచారిత్రోపన్యాసకులచేఁ గాని యితరులచేఁగాని రచింపఁజేసి యాంధ్రులమెప్పును విశ్వవిద్యాలయాధికారులు పొందుదురుగాక యని కోరుచున్నాము.

పాండ్యులచరిత్రమును, గాంచీపురపల్లవుల చరిత్రములో మధురనాయకులచరిత్రమును మదరాసు విశ్వవిద్యాలయమువారు ప్రకటించియున్నారు. తంజావూరు మహారాష్ట్రరాజుల చరిత్రమును కె. యస్. సుబ్రహ్మణ్య అయ్యరుగా రాంగ్లమున రచియించియున్నారు. తంజావూరు నాయకరాజుల చరిత్రము నెవ్వరును రచియించియుండలేదు. ఇందుల కాధారములను గ్రంథకర్తగా రనుబంధమునఁ జూపియున్నారు ప్రథమమున ముఖ్యసాధనములను గూర్చి చర్చించుచు నముద్రితగ్రంథములలోఁ బెక్కు ముద్రితగ్రంథములను జేర్చిరి. మన్నారుదాసవిలాసము, వాల్మీకిచరిత్రము, కంపరాయచరితము ముద్రితగ్రంథములే. మొదటిది సాహిత్యపరిషత్ప్రకాశితము, రెండవది సరస్వతీపత్రికయందు ముద్రింపబడినది. మొదటి రెండుపన్యాసముల గ్రంథకర్తగారు చోళమండల, విజయనగరసామ్రాజ్యవృత్తాంతముల వలయునంతకుఁ జర్చించి, తంజాపురముతో సంబం

ధించిన దగుటచే మధురనాయకవృత్తాంతము సంగ్రహముగ నిచ్చిరి. మిగిలిన యుపన్యాసములు తంజావూరునాయకరాజులను గూర్చినవే. రఘునాథాభ్యుదయము, అచ్యుతరాయాభ్యుదయము, వరదాంబికాపరిణయము, సంగీతసుధ, సాహిత్యరత్నాకరము, అలంకారరత్నాకరము మున్నగు గ్రంథములనుండి చారిత్రికవిషయములఁ గైకొని హీరాసు మున్నగువారి వ్రాఁతలను ఖండించిరి. అనుబంధమున పైలరు మున్నగువారి గ్రంథములనుండి వలయుభాగములను జేర్చియున్నారు. తగువిమర్శనముతో నాయకరాజులరాజ్యకాలములను నిర్ణయమొనర్చిరి.

విజయనగరరాజులవలె, తంజావూరు నాయకరాజులును సంగీతసాహిత్యాదులను బోషించుటయే గాక తాము గ్రంథములను రచించి యాంధ్రులకు మార్గదర్శకులయిరి. ఆంధ్రవాఙ్మయమునఁ జాలభాగ మీ రెండుసంస్థానములు నుచ్ఛదశయం దున్నపుడు వెలువడినదే. నాయకరాజులకాలమున వాఙ్మయ మెట్టిమార్పులను పొందినదో, యేయేగ్రంథములు వెలువడినవో మున్నగువిషయము లీగ్రంథమునఁ జర్చింపఁబడియుండలేదు. నాయకరాజులు సంస్కృతాంధ్రములఁ బోషించి గ్రంథముల రచింపఁజేసిరని మాత్రము సూచింపఁబడినది. గ్రంథకర్తగారు కేవలము చారిత్రికదృష్టితో గ్రంథమును రచియించిరని తోఁచుచున్నది ద్వితీయముద్రణమునైన నొకటి రెండధ్యాయముల నీరెండుశతాబ్దములయందు సంస్కృతాంధ్రవాఙ్మయములు, మిగిలిన లలితకళలును నెట్లభివృద్ధిపొందినవో చర్చింతురుగాక! రచియించిన గ్రంథ మాంధ్రులకు మిక్కిలి యుపయోగకరము. రఘునాథాదులు వారి కెల్లపుడును స్మరణీయులు. ఇట్టిగ్రంథమును రచించిన సీతారామయ్యగారికిని ముద్రణమొనరించిన యాంధ్రపత్రికాధిపతులకును మనకృతజ్ఞతావందనము లొసంగుచుఁ బ్రతిగ్రంథాలయమును విద్యాలయములును నీగ్రంథమును గొని గ్రంథకర్తగారి కుత్సాహ మొసంగుదురుగాక యని కోరుచున్నాము——

---

(2) అన్నపూర్ణ - 1-2 భాగములు- శ్రీ పులుగుర్త లక్ష్మీనరసమాంబ గారిచే శ్రీ దామోదరముఖోపాధ్యాయుని వంగభాషాగ్రంథమునుండి యాంధ్రీకరింపఁబడి, ఆంధ్రప్రచారిణీగ్రంథమాల ౭౨, ౭౩ కుసుమములుగాఁ బ్రకటింపఁబడినవి. ప్రథమభాగము, నాల్గుప్రకరణములు 205 పుటలు, ద్వితీయభా

గము, ఆఱుప్రకరణములు 203 పుటలును. భాగము 1 కి రు 1-8-0 వెల. పిఠాపురములో ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయములోఁ దత్ప్రకాశకు లగు కవిరాజహంస వోలేటి పార్వతీశముగారియొద్ద దొరకును.

---

(3) ఆంధ్రకుందమాల- కవిశేఖర వడ్డాది సుబ్బారాయవిరచితము. దేశసేవాపత్రికనుండి పునర్ముద్రితము దిఙ్నాగకృతమూలమునందలి సంస్కృతపదలాలిత్యముం దెలుప నక్కఱలేదు. సుప్రసిద్ధనాటకాంధ్రీకర్త, లగుకవిశేఖరులును నాంధ్రదేశమున సువిశ్రుతులు. కావున మచ్చునకై వారియిరువురిపద్యములనుఁ గొన్నింటిని పాఠకులకుఁ జూపుచున్నారము.

శ్లో. తస్యాః స్వహస్తరచితా మివ కున్దమాలాం
　సాదృశ్యవన్తి సికతాసు పదాని తాని
　ఛాయాం చ దేవగణికా విదధాతు యేన
　రామం కథం స్పృశతి హస్తపటాన్తవాతైః.　　　　5-3.

ఉ. ఆమెస్వపాణిచే రచిత మన్నటు దోఁపఁగఁ గుందమాల, త
　ద్గోమతిసైకతంబునను దుల్యతఁ గానఁగ రాఁ బదాంకముల్
　దామరసాకరంబునను దత్ప్రతిబింబము సల్పుఁగాక యు
　ద్యామరవేశ్యఁ గామునిఁ బయంటచెఱంగున నేల వీచెడిన్.

శ్లో. మధ్యాహ్నార్కమయూఖతాప మధికం తోయావగాహో దయం
　నీత్వా వారికణార్ద్రకర్ణపవనై రాహ్లాద్యమానాననః
　మన్దం మన్ద ముపైతి కూల మధునా వక్షఃప్రణున్నై ర్జలై
　రాక్రాన్తం కరఘాతఝుంకృతిసరిత్కల్లోలచక్రః కరీ-　　　　3-17

ఉ దినమధ్యార్కమయూఖతాపశిఖ శాంతిం బొందఁ దోయావగా
　హనముం జేసి జలార్ద్రకర్ణపవనం బాస్యం బలర్పంగ మె
　ల్లన వక్షఃస్థలమున్నవారి దరిఁ బొర్లంగాఁ గరాఘాతజ
　ధ్వనితోడం ధునిఁ దోఁపఁ బెందరగవృత్తం బేనుఁ గొ డ్డెక్కెడున్.

దీనివెల రు0-12-0. కవిగారియొద్ద రాజమహేంద్రవరములో దొరకును.

---

(4) పరమయోగివిలాసము- ద్విపద. ఎనిమిదియాశ్వాసములు. తాళ్లపాక తిరువేంగళనాథరచితము. అష్టమహిషీకళ్యాణ మనుద్విపదకావ్య మీతనిదే.

(5) ధర్మఖండము- ఈదులపల్లి భవానీశకవీంద్రవిరచితము. తొమ్మిది యాశ్వాసముల పద్యకావ్యము. దీనిని, పరమయోగివిలాసమును, శ్రీ పిఠాపురము సంస్థానాధీశు లగు శ్రీశ్రీశ్రీ మహారాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దరువారు పండితపరిష్కృతము చేయించి ప్రకటింపించిరి. పరమయోగివిలాసమునకు బరిష్కర్తలు, శతావధాని, ఓలేటి వేంకటరామశాస్త్రిగారు. బ్ర॥ శ్రీ॥ పెద్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు పీఠిక వ్రాసిరి. ధర్మఖండము విమర్శకాదర్శక నడకుదుటి వీరరాజుగారిచేఁ బరిష్కరింపఁబడినది. మఱియు వారిచేతనే వ్రాయఁబడిన 44 పుటల యుపోద్ఘాతముతో నలరారుచున్నది.

పరమయోగివిలాసము, వైష్ణవభక్తాగ్రేసరులగు పన్నిద్దఱాళ్వారులచరిత్రము. దీనినే తిమ్మభూపాలుఁడను నోకకవిరాజు పద్యకావ్యముగ రచించెను. ధర్మఖండము, స్కాందాంతర్గతము. ఈగ్రంథములోని ప్రధానమైన యితివృత్తము- వాల్మీకిమహర్షిచరిత్రము- నీతి, భక్తి, ధర్మప్రతిపాదకము లగు నుపకథలతో నొప్పియున్నది.

పరమయోగివిలాసము-క్రౌను 8 పుటలయాకృతిని 643 పుటలు గలది. ధర్మఖండము- క్రౌనుసైజుననే రెండుసంపుటములును 877 పుటలు గలది.

భాషాపోషకులగు నీమహారాజావారిదివఱకు, పురాణపండ మల్లయ్యశాస్త్రిగారిచే నాంధ్రీకరింపఁబడిన బ్రహ్మసూత్రభాష్యమును, వ్యాఖ్యానముతోడి ప్రభావతీప్రద్యుమ్నమును, (అల్లమరాజుసుబ్రహ్మణ్యకవికృత) భద్రాపరిణయమును బ్రకటించి యాంధ్రలోకమునకు మహోపకార మొనరించిరి.

ఈగ్రంథము లమూల్యము లగుటంగావలయును మూల్యము నాయా గ్రంథములపై నిర్ణయించి తెల్పియుండలేదు.

శ్రీ

ఆంధ్రసాహిత్య
పరిషత్పత్రిక.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy)

సంపుటము. ౨౧ { ఆంగీరసనామసంవత్సరము. ఆశ్వయుజకార్తికమాసములు. } సంచిక ౪.



కాకినాడ:
కొత్తపల్లి సూర్యారావుచేఁ బరిషత్కార్యాలయమునఁ
బ్రకటింపఁబడినది.
చందా, పోష్టువ్యయములతో సంవత్సరమునకు రు 3-0-0.
విడిసంచిక రు ౦-౮-౦.
1932.

విషయసూచిక.

ఆంధ్రసాహిత్య

పరిషత్పత్రిక.

కాకినాడ.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౧. | ఆంగీరసనామసంవత్సరము ఆశ్వయుజకార్తికమాసములు. | సంచిక ౪.

ఆంధ్రమున నలంకారవాఙ్మయస్థానము

సాహిత్యవిద్యాప్రవీణ

—బులుసు వేంకటరమణయ్యగారు- రామతీర్థము—

ఆంధ్రవాఙ్మయమున విషయాంతరములతోపా టలంకార విషయములును సంస్కృతవాఙ్మయము నుండియే గ్రహింపఁబడుచు వచ్చుచున్నయవి. ఇట్టి యాచారము మొదటినుండియును మనయాంధ్రులచే నవలంబింపఁబడుచున్న దనుటకు మన ప్రథమగ్రంథ మగుమహాభారతము సైతము భాషాంతరీకరణమగు టయే ప్రబలప్రమాణ మగుచున్నది.

మీఁదిరీతిని గీర్వాణవాఙ్మయము ననుసరించియే యాంధ్రమున గ్రంథరచన మారంభమై యున్నను గావ్యములరీతిని శాస్త్రగ్రంథములు విశేషముగ నాంధ్రీకరింపఁబడి యుండలేదు. కావుననే సంస్కృతమున నలంకారశాస్త్రము చాలకాలముక్రిందటనే సుప్రసిద్ధమై వ్యాప్తిఁజెంది యున్నను దెలుఁగునమాత్ర మిది చాల నవీనమై యున్నది. అలంకారశాస్త్రవిషయప్రతిపాదకము లగు గ్రంథములు తెలుఁగువాఙ్మయమున లెక్కకు మిక్కిలి తక్కువగ నున్నయవి. కాని యిప్పుడిప్పుడే కొందఱు విద్వాంసులు చాలగ్రంథముల నాంధ్రీకరించుచుఁ గొందఱు కవితావిమర్శన మొనర్చుస్వతంత్రగ్రంథములను రచించుచును సాహిత్యశాస్త్రమును బెంపొందించుచున్నారు. అం దాంధ్రభాషాకోవిదుల భాషాం

తరీకరణములును, పాశ్చాత్యవాఙ్మయనిష్ణాతుల స్వేచ్ఛావిమర్శగ్రంథములును మిక్కిలి ప్రఖ్యాతము లైనవి.

సంస్కృతమున నలంకారవిషయచర్చ యెపు డారంభ మైనదో గ్రంథ రచన యెపుడు ప్రారంభింపఁబడినదో సరి యగు సమయమును నిశ్చయించి చెప్పుట కష్టము. కావునఁ దదనుసారి యగునాంధ్రవాఙ్మయమునం గూడ నేత చ్ఛాస్త్రవిషయ సమాలోచనారంభకాలము ను గ్రంథరచనాసమయము ను నిశ్చయించుటకుఁ దగినయాధారములు కన్పింపవు. కాని వేదవాఙ్మయమునఁ గూడ నలంకారవిషయములు కన్పించుటచే గీర్వాణవాఙ్మయమున నీశాస్త్ర చర్చ చాల ప్రాచీన మైన దనియు నాంధ్రమునఁ బ్రాచీనాలంకారగ్రంథములు లేనందున నాంధ్రాలంకారశాస్త్రము చాల నవీన మైన దని యు మాత్రము చెప్పవచ్చును.

గ్రంథరచనంగూర్చిన నిశ్చయము లె ట్లున్నను గావ్యవాఙ్మయ మెపుడు ప్రారంభ మైనదో యలంకారవిషయవిమర్శనము దానితోడనే యారంభమైన దని చెప్పవలెను. మనలను హితమునందుఁ బ్రవర్తింపఁజేయుటయు, నహితము నుండి మఱల్చుటయు వాఙ్మయమువలని ముఖ్యప్రయోజనములు. అందు వేద పురాణాదులు ప్రభుమిత్రసమ్మితము లగుటచే నవి చేయు నుపదేశములు సరస ములు కాకపోవుటచే మనకుఁ బ్రవృత్తి కలుగకపోవచ్చును. కాని కావ్యము కాంతాసమ్మిత మగుటచే నయ్యది చేయు నుపదేశము సరస మై సర్వజనాకర్ష కమై యందఱికిని బ్రవృత్తిఁ గల్గించును. కావ్యము రసము చిప్పిలునట్లు చమ త్కారముఁ గలుగఁజేయనిచో నయ్యది కావ్యాభాస మగును గాని కావ్యము కాఁజాలదు. అట్టిచమత్కారము వక్రతవలననే గలుగుచున్నది. కావుననే నిండు వెన్నెల కాయుచున్న దని చెప్పుటకు మాఱుగఁ బిండి యారఁబోసినట్లు వెన్నెల కాయుచున్న దని చెప్పుటయు, నామె మిక్కిలి చక్కని దనుటకు బదు లామె రంభ యనుటయు మిగులఁ జమత్కారాధాయకము లగుచున్నవి. అట్లే కొన్నికొన్నివిషయములను బహిరంగముగ వెలిపుచ్చక వ్యంగ్యమర్యాద నను సరించి చెప్పిననే రమణీయముగ నుండును. ఇట్లు చెప్పుచుండుట మానవజాతి స్వభావము. కాన నీయలంకారవిషయోత్పత్తి వాఙ్మయముతోఁ గాని, కావ్య వాఙ్మయముతోఁ గాని ప్రారంభమైన దని చెప్పవచ్చును.

సామాన్యముగ ఛందోవ్యాకరణాలంకారాదు లగుశాస్త్రగ్రంథములు

లక్షణగ్రంథము లని చెప్పఁబడుచున్నవి. ఆంధ్రవాఙ్మయమున లక్షణగ్రంథము లలో నీమూఁడువిధము లగుగ్రంథములు చెప్పఁబడినవి. అప్పకవి తనలక్షణ గ్రంథ మగునప్పకవీయమునందుఁ దనకంటెఁ బ్రాచీనులగు లక్షణవేత్తలగ్రంథ ముల పేళ్లె నుగ్గడించుచు మీఁదఁజెప్పఁబడిన రీతిని ముత్తెఱంగు లగులక్షణ గ్రంథములను జెప్పియున్నాఁడు. అట్లయినను వానియందు ఛందోవ్యాకరణగ్రం థములకంటె నలంకారగ్రంథములు చాలఁ దక్కువ యనియు, ఛందోగ్రంథము లే యెక్కువ యనియుఁ దెలియుచున్నది. (1)

అప్పకవీయమునఁ గవి తాఁ జింతామణికి శుద్ధ మగువ్యాఖ్య వ్రాయఁ బూని యాగ్రంథమును రచింపఁ దొడఁగినట్లు పీఠికాపద్యములవలనఁ దెలియవ చ్చుచున్నది. ఆంధ్రశబ్దచింతామణి వ్యాకరణగ్రంథ మైనట్లు మన మెఱుఁగు దుము. కావున వ్యాకరణమును రచింపఁబూను కవి తనకంటెఁ బూర్వము లగువ్యాకరణగ్రంథములనే యుట్టంకింపవలసి యుండుట యుక్తము. కవి యట్లు గాక సర్వవిధము లగులక్షణగ్రంథముల నుట్టంకించుటం బట్టి యాతనిగ్రంథము నందు ముప్విధము లగులక్షణములును నిరూపింపఁబడిన వని మనము తెలిసికొన వచ్చును. అందుఁ గ్రమముగ నలంకారవ్యాకరణచ్ఛందోవిషయములు మనకు గోచరించును.

కాఁగా నప్పకవీయమున నలంకారచ్ఛందోవ్యాకరణ విషయములకు సాంకర్యము కల దనియు, లక్షణగ్రంథము లనఁగా ముత్తెఱఁగులలక్షణములను నిరూపించుగ్రంథము లనియుఁ దేలిన సారాంశము. ఇట్టి విషయసాంకర్యమును మనము దోషముగా లెక్కింప వీలు లేదు. ఆంధ్రమున లక్షణగ్రంథములు చాల స్వల్పముగ నున్నవి. కావునఁ బ్రత్యేకముగ నొక్కొక్కశాస్త్రమునఁ గృషి చేసి యాంధ్రమునఁ బ్రతిష్ఠఁ బొందుట దుర్ఘటము. కావున లక్షణము లగుఛందో వ్యాకరణాలంకారముల నొకవిషయముగాఁ జేర్చి యాలక్షణసముదాయమునఁ బరిశ్రమలు సల్పి పేరుపొందుటయే మనవారి యాశయమై యుండవచ్చును.

(1)...కవిగజాంకుశంబును, గవిసర్పగారుడంబును, గవిజనాశ్రయంబును, గవిలోకసంజీవ నియును, గవికంఠాభరణంబును, గావ్యాలంకారచూడామణియును, గావ్యచింతామణియు, నథ ర్వణచ్ఛందంబును, గోకర్ణచ్ఛందంబును, శ్రీధరచ్ఛందంబును, ననంతామాత్యచ్ఛందంబును, ఛందో దర్పణంబును, నలంకారసంగ్రహంబును, నలంకారరత్నాకరంబును......లక్షోపలక్షులుగఁ గలవు.

[అప్పకవీయము, వావిళ్ళవారిప్రతి. సం. 1922. ప్రథమాశ్వాసము. పుట. 14.]

మఱియు నాదివాఙ్మయ మగుగీర్వాణమునఁ బరిపూర్ణముగ శాస్త్రగ్రంథములు రచింపఁబడియుండుటచేతను, సంస్కృతమువలననే శాస్త్రపాండిత్యమును బొందుటకుఁ దగిన సదుపాయము లుండుటచేతను, నొకవేళ నాంధ్రమున శాస్త్రగ్రంథములు విశేషించి రచింపవలసినచో గీర్వాణవాఙ్మయమునుండియే విషయమును గ్రహింపవలసి యుండుటచేతను మన తెలుఁగువారు తక్కుంగల యితిహాసపురాణకావ్యాదుల నాంధ్రీకరించుటకే తొడఁగిరి, గాని, శాస్త్రగ్రంథములను విరివిగను బ్రత్యేకముగను రచింపఁబూనలే దని మనము నిశ్చయింపవచ్చును. అక్కతముననే మనవారు భాషాంతరీకరణముల నొనర్చుటకును, భాషాంతరీకరణముల నర్థముచేసికొని సాధ్వసాధుపరిజ్ఞానమును బొందుటకును నెంతటిపరిజ్ఞాన మవసర మగునో యంతమాత్రపులక్షణములనే నిరూపింప సంకల్పించి ఛందో వ్యాకరణాలంకారములను మేళవించి గ్రంథములను వ్రాయం దొరకొనిరి. కావుననే యాంధ్రలక్షణగ్రంథములందు గీర్వాణలక్షణగ్రంథములందువలె శాస్త్రాంతరములతో సంబంధించిన చర్చలు కనిపింపకున్నవి. ఇట్టి విషయసాంకర్య మించు మించుగ నాంధ్రలక్షణగ్రంథము లన్నింటియందును గలదు. ప్రథమాంధ్రలక్షణగ్రంథము నాఁబరగు చింతామణియందు మొదటి రెండుకారికలును గావ్యలక్షణవిషయకము లయి యుండుటచే(2) నలంకారశాస్త్రవిషయము మొదటనే నిబంధింపఁ బడినట్లును, బ్రథమపరిచ్ఛేదమునందలి "వళి రాద్య మనంతరాక్షరం ప్రాసః" అను సూత్రమునుబట్టి యిందు ఛందోవిషయము నిరూపింపఁబడినట్లును మనము నిశ్చయింపవలసియున్నది. ఇట్లే కవిజనాశ్రయమను ఛందోగ్రంథమును రచియించిన వేములవాడ భీమకవియుఁ దనగ్రంథమున ఛందోవిషయములనే గాక యలంకారవిషయము లగు "కావ్యభేదపరిగణనాదులను" "హృద్యానవద్యకావ్యము గద్యము పద్య మని చెప్పఁగా ద్వివిధ మగు" నను మొదలగు రీతులఁ జెప్పియున్నాఁడు. అలంకారశాస్త్రాంగ మగు దోషవిచారమును విపులముగ నొకయధికారమునఁ జెప్పియున్నాఁడు ఆంధ్రమునఁ బ్రథమాలంకారగ్రంథ మని ప్రసిద్ధికెక్కిన కావ్యాలంకార

(2) విశ్వశ్రేయః కావ్యం తపదోషా పరిష్కృతౌ చ వాగర్థౌ,
సావాగ్యా గసవృత్తిః సాధ్యోహి రసో యథాయథం కవిభిః.
స్వస్థానవేషభాషాభిమతాస్సంతో రసప్రలుబ్ధధియః,
లోకే బహుమన్యన్తే వైకృతకావ్యాని చాన్యదప్యపోహ్య. [చిం. 1-12.]

చూడామణిని రచించిన విన్నకోట పెద్దయకవి కూడ నలంకారవిషయములను బూర్తిగ నిరూపించి యంతటితోఁ దనివి నందక మూఁడుల్లాసములలో ఛందో వ్యాకరణవిషయములను గూడ విపులముగఁ జర్చించియున్నాఁడు. ఇట్లే తక్కిన గ్రంథములలోఁ గూడఁ గానవగును.

ఇట్టివిషయసాంకర్యము కేవల మాంధ్రముననే గల దని మనము చెప్ప వీలు లేదు. సంస్కృతవాఙ్మయమునందలి యర్వాచీనాలంకారగ్రంథములలో నిట్టి విషయసాంకర్యము లే కున్నను మొదటిగ్రంథ మగు నాట్యశాస్త్రమున కన్పించుచున్నది. అందుఁ గావ్యవిశేష మగు నాట్యమే ప్రధానప్రతిపాద్య మగువిషయ మై యుండ ఛందోవిషయములు కూడ నిరూపింపఁబడియున్నవి. నాట్యశాస్త్రమునందలి ముప్పదిరెండవయధ్యాయమున ధ్రువలక్షణాధ్యాయ మున ఛందస్సు చెప్పఁబడినది. ధ్రువ యనఁగా వృత్త మగుట స్పష్టము. వామనుని కావ్యాలంకారసూత్రములందును, నతనికంటెఁ బ్రాచీనుఁ డగుభామహుని కావ్యాలంకారమునందును శబ్దశుద్ధి యను పేరిట వ్యాకరణవిషయములు ప్రతిపాదింపఁబడి యున్నవి. కాని, యిట్టిసాంకర్యము కల గ్రంథములు గీర్వాణమునఁ జాలఁ దక్కువ యనియు నాంధ్రమున నెక్కువ యనియుఁ జెప్పి తీరవలయును. కాఁగా నిట్టిసాంకర్యమున నాంధ్రులే స్వాతంత్ర్యము నవలంబింప లేదనియు, సంస్కృతవిద్వాంసులు త్రొక్కినమార్గముననే వీరనుసరించి రనియుఁ దెలియుచున్నది. కాని యట్టిసాంకర్యము కొలఁదిగ్రంథములలోనే యున్న దనియు, నం దలంకారగ్రంథములలోఁ దగుమాత్రము కల దనియుఁ జెప్పవలెను. ప్రత్యేకమగు శాస్త్రపాండిత్యమును సంపాదింప నెంచువారు గీర్వాణమున నిట్టిగ్రంథములనే గాక గ్రంథాంతరములయొక్క సాహాయ్యమునే యపేక్షింతు రనుట నిర్వివాదాంశము.

మీఁదికారణములనుబట్టి యాంధ్రమున నలంకారవిషయము చాల నవీన మైన దనియును, నయ్యది యుపయోగానుసారముగఁ జాలవఱకు సంగ్రహముచే యఁబడి తక్కినవిషయములతోపాటు చెప్పఁబడిన దనియుఁ, గావున గీర్వాణము నందువలె నాంధ్రమున నలంకారవాఙ్మయమునకుఁ బ్రత్యేకత లేకపోయిన దనియును జెప్పవలసియున్నది.

మనకు లభించిన యాంధ్రాలంకారగ్రంథములలోఁ గావ్యాలంకారచూడామణియే మొదటిదిగాఁ దోఁచుచున్నది. కవి యలంకారవిషయములలో

దండ్యాచార్యునిమతమును రీతులవిషయమున వామనునిమతమును దక్కినయలంకారసామగ్రీవిషయమునఁ దనకంటెఁ బూర్వము లగు కావ్యప్రకాశాదు లగుప్రసిద్ధాలంకారగ్రంథములమతము ననుసరించె నని చెప్పవలయును. ఇందలిరచనాప్రణాళి యించుమించుగ విద్యానాథుని ప్రతాపరుద్రీయమునకు సరిపడుచున్నది. కాన నిద్దియుఁ బ్రతాపరుద్రీయమును సమకాలికు లగు కవివరులచేత వ్రాయఁబడియుండవచ్చును. లేదా, ప్రతాపరుద్రీయ మింతకంటెఁ గొంచెము ప్రాచీన మైనఁ గావచ్చును. మూర్తికవిరచించిన నరసభూపాలీయము సామాన్యముగ విద్యానాథుని గ్రంథమున కాంధ్రీకరణ మనియుఁ జెప్పవచ్చును. కొన్ని విషయములను విడిచియుఁ, బెవిషయములఁ గొన్ని చేర్చియుఁ గొన్నిపట్లఁ గవి స్వతంత్రరీతుల ననుసరించెను. మొత్తముపై నాంధ్రులు గీర్వాణగ్రంథముల నర్వాచీనములనే యాధారముగఁ జేసికొని గ్రంథములను వ్రాయఁ బ్రారంభించిరనుట నిర్వివాదాంశము. అప్పకవి తనలక్షణగ్రంథమున నాంధ్రలక్షణగ్రంథములనే గాక సంస్కృతలక్షణగ్రంథములను గూడఁ బేర్కొనెను. అందుఁ బ్రతాపరుద్రీయముకంటెఁ బ్రాచీన మగునలంకారగ్రంథము నాతఁడు పేర్కొనియుండకపోయెను.(3) చూడామణి యలంకారవిషయములలో దండికావ్యాదర్శమునే యనుసరించియున్నను నప్పకవి కావ్యాదర్శము నుదహరింపకపోవుటచే నతఁడు కావ్యాదర్శమును, నట్లే ప్రాచీనాలంకారగ్రంథము లగుభామహాలంకారము, వామనుని కావ్యాలంకారసూత్రవృత్తి, రుద్రటుని కావ్యాలంకారము, ధ్వనికారుని గ్రంథము మొద లగువాని నెఱుఁగఁ డేమో యని చెప్పవలసి వచ్చుచున్నది. సామాన్యముగఁ గాశ్మీరాదిదూరదేశీయులచే వ్రాయఁబడిన ప్రాచీనాలంకారగ్రంథముల కన్నింటికిని దెలుఁగుదేశమున నక్కాలమునఁ దగినప్రచారము లేక యుండవచ్చును. కావుననే సామాన్యముగ మన యాంధ్రాలంకారికులు దాక్షిణాత్యుఁ డగు దండియొక్కయు, నాంధ్రుఁ డగు విద్యానాథుని యొక్కయు థములనే యనుసరించుట యుక్తమై యున్నది. కావ్యప్రకాశము, రసమం మొదలగు కొన్ని గ్రంథాంతరములు కూడ నాంధ్రదేశమునఁ బ్రచార నుండె ననుటలోఁ గూడ యుక్తి లేకపోలేదు. మీఁది గ్రంథముల నొకటి

(3) అవి యెయ్యవి యనినఁ బ్రతాపరుద్రీయంబును, కువలయానందంబును, జంద్రాలోకం రసమంజరియును. [అప్పక. ప్రథమా. పుట 14]

రెండింటిని విడిచి మనవారు గీర్వాణాలంకారగ్రంథముల నెఱుఁగ రని చెప్పుటయే నాయభిప్రాయము కాదు.

మీఁదిరీతినిబట్టి చూడామణికారుఁడు మూర్తికవి మొదలగువారు తమ గ్రంథరచనమునకు గీర్వాణగ్రంథముల నాదర్శములుగఁ దీసికొని రనుటలో సందేహము లేదు, అట్లయ్యును, జూడామణి యేదో యొక్కగ్రంథమునే గాక చాలగ్రంథములను బరిశీలించి యనేకవిషయములను సంగ్రహించెను. మూర్తికవి నరసభూపాలీయ మించుమించుగఁ బ్రతాపరుద్రీయమునే యనుసరించి వ్రాయఁబడియున్నను, నందు నాయికాభేద (సామాన్యాది) నిరూపణమునందును, రీతివిషయమున ను మఱికొన్ని పట్లను మూలములో లేని విషయము చెప్పఁబడినది. గుణములవిషయమై స్వాతంత్ర్య మవలంబింపంబడి ప్రతాపరుద్రీయమునందలి రీతి నిరువదిరెండుగుణములు కాక గ్రంథాంతరములయందలి మాదిరిని పదిగుణములే యంగీకరింపఁబడినవి. కావున నీగ్రంథము లొకమాదిరిగ స్వతంత్రగ్రంథములే కాని భాషాంతరీకరణములు కావని చెప్పవలెను. మనయాంధ్రాలంకారికు లిట్లు తమగ్రంథరచనమునకు సంస్కృతగ్రంథములనే యాధారముగఁ జేసికొనినను, సంస్కృతాలంకారికుల నామముల నుట్టంకించియుండ లేదు. మూర్తికవి గ్రంథము మూఁడువంతుల మువ్వీసములు ప్రతాపరుద్రీయాంధ్రీకరణమే యైనను, గవి విద్యానాథుని పేరైనఁ దలఁచియుండ లేదు. ప్రతాపరుద్రీయనామమైన నందు గోచరించుట లేదు. అట్లు వారు చెప్పకపోవుటకుఁ గలకారణము వారిగ్రంథములు కేవల మొక్కగ్రంథమునకు భాషాంతరీకరణములు కాకుండుటయే యని మన మూహింపవచ్చును. తమగ్రంథములయందు గీర్వాణాలంకారికుల నామము లున్నచో వారిగ్రంథములకుఁ దమగ్రంథములు భాషాంతరీకృతు లని పరులు పొరపడుట కవకాశ ముండవచ్చునను నభిప్రాయము మనవారికిఁ గలిగి, యట్టి యభిప్రాయము కలుగకుండుటకుఁగూడ వారు నామోట్టంకమును మాని యుండవచ్చును. కాని కేవలము భాషాంతరీకరణము లొనర్చినవారు మాత్రము తమగ్రంథములు మూలగ్రంథములకు భాషాంతరీకరణము లని చెప్పిరి. (4) అందు రసమంజరిని రచించిన

(4) సీ. … … … … … …
… … … భాసిల్లు కోదండపతిఘనుండు.
గీ. సరసకవితాచమత్కారసార్వభౌముఁ, డవని శ్రీరంగధామదయాప్రియుండు
తెలిమి రసమంజరిని రచియించెనందు, సరవిగాఁగఁ దృతీయగుచ్ఛంబుతనరు.　[రసమంజరి.]

కోదండపతియుఁ జంద్రాలోకమును వ్రాసిన సూరకవియుఁ గువలయానందమును వ్రాసిన రామయకవియు గణనీయులు.

మనయాంధ్రులు తమగ్రంథరచనమున నేదో యొక్కగ్రంథమునే యాధారముగఁ దీసికొనక యనేకగ్రంథముల సాయము నపేక్షించుటచేఁ బరస్పరవిరుద్ధము లగునభిప్రాయములు కొన్ని మనవారిగ్రంథములందు గోచరింపవచ్చును. వారియాదర్శగ్రంథము లొక్కొక్క సమయమునఁ బరస్పరము విరుద్ధాభిప్రాయములను గాని విభిన్నాభిప్రాయములను గాని దెలియపఱుచుచుండుటచే, వాని ననుసరించి వ్రాయఁబడిన విషయములు కొన్ని భాషాంతరీకర్తల యభిప్రాయమును గప్పిపుచ్చును. చూడామణికారుఁడు రీతులవిషయము వ్రాయుచు వామనుని మతము ననుసరించి "అఖిలకావ్యములకు రీతు లాత్మ యండ్రు" (5) యని రీతియే కావ్యమున కాత్మ యని చెప్పెను. కావ్యమున నెట్టిప్రాధాన్యము లుండవలె ననువిషయమున "ఆరయ వస్తురసాలం, కారప్రాధాన్యవృత్తిఁ గబ్బంబుల" (6) నని మమ్మటాచార్యాదులమతము ననుసరించి వ్యంగ్యములగు వస్తురసాలంకారములకుఁ బ్రాధాన్యము కలదని వ్రాసెను. వామనుని కాలమునకు వ్యంగ్యమను మాటయే లేదు. కావున, నతఁడు రీతులే ముఖ్యము లని చెప్పవలసి వచ్చెను. క్రమక్రమముగ నానందవర్ధనాచార్యులు ప్రారంభించిన ధ్వనివాదమునకే ప్రాధాన్యము కలిగినది. కావునఁ గావ్యప్రకాశమున మమ్మటుఁడు ధ్వనియే ప్రధాన మైనదని వాక్రుచ్చెను. అతనిమతము ననుసరించి మనపెద్దయకవి వస్త్వాదులకుఁ బ్రాధాన్యమొసంగెను. ఇట్లు విభిన్నకాలికుల యభిప్రాయముల ననుసరించినపుడు పరస్పరము విభిన్నములును విరుద్ధములు నగువిషయములు కన్పించుట కవకాశము లేకపోలేదు గదా! ఇట్టివిషయమునఁ బరస్పరవిరుద్ధములు కాని యాశయములనే దీసికొనుట శ్రేయము. ఇట్లే కొన్నికొన్ని విషయము లప్పకవీయాదులయందును గోచరించుచున్నవి. కాని వీని నంతటి గొప్ప

గీ. బాలురకునైనఁ దెలియఁగాఁ గాళిదాసు, మును రచించెఁ జంద్రాలోకమును ద్రిలింగ
భాషఁ జేసితి నీకృప భవ్యముగను, దీని గరుణించి కైకొమ్ము దేవదేవ? [చంద్రాలోకము.]

గీ. సరసుఁ డకలంకవంశాబ్ధిచంద్రుఁ డనఘుఁ, డైన రంగార్యవర్య సాహాయ్యమునను
గువలయానంద మిలను దెల్గున రచింపఁ, గడఁగితిని దుష్కరంబైనకార్యమునకు.
[కువలయానందము.]

(5) చూ. కావ్యాలంకారచూడామణి. చతుర్థోల్లాసము. ప. 77.
(6) చూ. ... ... ప 45.

దోషము లని చెప్పకుండుట మనకుఁ గర్తవ్యము. అలంకారశాస్త్రమునకుఁ బ్రత్యేకత నొసంగక కొన్ని యుపయుక్తవిషయములనే గ్రహింప నెంచిన మనవారు బాగుగ నీవిషయమునఁ జర్చలు సలుపలే దనియుఁ జెప్పవచ్చును.

మనవారు లక్షణగ్రంథములను రచించినపుడు కేవలభాషాంతరీకరణబుద్ధినే గాక యుపయుక్తవిషయప్రతిపాదనాశయమున గ్రంథరచనఁ బ్రారంభించి యున్నను గొన్నిముఖ్యవిషయము లందుఁ జెప్పవలసినసంగతులను జెప్పక గతానుగతికముగ సంస్కృతమునే యనుసరించినట్లు తోఁచుచున్నది. లక్షణగ్రంథ మేవాఙ్మయమును బరిశీలించి చక్కఁజేయుట కేర్పఱుపఁబడుచున్నదో యావాఙ్మయమున కుపయోగించు ముఖ్యములగు విషయములను నిరూపించుట లక్షణవేత్తల ముఖ్యకర్తవ్యమై యున్నది. ఆంధ్రవాఙ్మయమునందలి దోషములను నిరూపించునపుడు కేవలము గీర్వాణము నాంధ్రీకరించుచోఁ బ్రయోజనము లేదు. ఆంధ్రవాఙ్మయమున వృత్తయతిభంగదోషములవలెనే ప్రాసభంగము కూడ ముఖ్య మగుదోషమై యున్నది. మఱియు వానికంటె నిదియే ప్రధాన మని చెప్పవచ్చును. ప్రాస ముఖ్య మైన దని వేఱుగఁ జెప్ప నక్కఱలేదు. కావునఁ బ్రాసభంగమును మనవారు ముఖ్య మగుదోషముగాఁ జెప్పవలసియుండఁగా నట్లు చాలమంది చెప్పక పోయిరి. కవిజనాశ్రయ, కావ్యాలంకారచూడామణి, నరసభూపాలీయములందు ఛందోయతిభంగములు దోషము లని చెప్పి ప్రాసభంగపు సంగతియే చెప్పఁబడలేదు. దీనింబట్టి కూడ మనవా రలంకారవాఙ్మయవిషయమున మిగుల శ్రద్ధ తీసికొనియుండలే దనియు, నాంధ్రవాఙ్మయమున దానికిఁ జాలినంత యవకాశము నొసంగలే దనియుఁ జెప్పవలయును.

క్రమక్రమముగ నలంకారమునకుఁ బ్రత్యేకత యీయఁబడుచు వచ్చినది. కావుననే తొలుతఁ దక్కినవిషయములతోపాటు చెప్పఁబడు నీవిషయము నరసభూపాలీయమున విషయాంతరసాంకర్యము లేకయే చెప్పంబడినది-రసమంజర్యాదులందు నట్లే కలదు. మొత్తముపై విషయాంతరములం దున్న గ్రంథములకంటె నలంకారమునఁ గలగ్రంథములు చాల స్వల్ప మనియుఁ జాల నవీన మనియుఁ జెప్పవచ్చును-కాని కాలక్రమమున నిందును జాలగ్రంథములు రచింప ననేకు లిక్కాలమున దొరకొనియున్నారు. విద్వాంసులు చాలమంది యనేకగ్రంథముల నాంధ్రీకరించుచున్నారు-ఆంగ్లవాఙ్మయమున నిష్ణాతులైన విద్వాంసులు తమదేశభాషావాఙ్మయపరిపోషణాభిలాష తమవిజ్ఞానము

నకుఁ జేయూఁత నొసంగ ననేకవిమర్శ గ్రంథములను రచియించి వాఙ్మయమున కవసరము లగు నియమములను బ్రతిపాదించుచున్నారు- ఇట్టి గ్రంథములు పూర్తిగాఁ గాకున్నను గొంతవఱ కైనను వాఙ్మయమున కుపయోగింపఁగల వని చెప్పవలెను.

కాఁగా నాంధ్రమునఁ బ్రాచీనకాలమున నలంకారమునకుఁ బ్రత్యేక శాస్త్రత్వము లేకపోయిన దనియు, నలంకారవిషయములు స్వల్పముగ నుపదేశింపఁబడిన వనియు నందుచే నలంకారమున కక్కాలమున నుచితమగు స్థానము లభింపలే దనియుఁ జెప్పవలెను. ఇక్కాలమున మాత్ర మీశాస్త్రము ప్రత్యేకింపఁబడి విషయాంతరములతోడి సాంకర్యము లేక యభివృద్ధిం బొందింపఁబడుచున్న దని చెప్పవలయును. కావున నిప్పటివారు మీఁదిసాహిత్యవిమర్శశాస్త్రమునకు వాఙ్మయమున నుచితమగు స్థానము. నీయఁదలంచుచున్నారని చెప్పుటలో సందేహము లేదు.

అభిజ్ఞానశాకుంతలము.

అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు—కొవ్వూరు.

శకుంతల కొడుకుం గొని పతికడ కేగెను. దుష్యంతునియందు మున్ను కణ్వాశ్రమంబునఁ గన్నయనురాగము కనఁబడలేదు. ఎఱిఁగియు నెఱుఁగ నొల్లనివారిం దెలుపఁగలనా? అని నిరాశ యయ్యు వచ్చి మిన్నక పోవం గాదనుకొనినది.

రాజా! వేఁటనెపమునఁ గణ్వాశ్రమమునకు వచ్చి నాకు నీవిచ్చిన వరముఁ దలంపుము. వీఁడు నీకొడుకు. వీనికియౌవరాజ్యపట్టాభిషేకము చేయుము. అనినది.

దుష్యంతుఁ డది విని యెఱింగియు నెఱుంగనివాఁడ పోలె, "ఏనెఱుఁగ నిన్ను నెక్కడి, దానవు? మిన్నకయ యనుచితంబులు పలుకం,గానేల యరుగు మంబురు,హానన యెందుండివచ్చి తందులకు వడిన్" అనినాఁడు.

అపుడు శకుంతల తనపాతివ్రత్యము నూఁతగాఁ గొని పెద్ద యుపన్యాసము గావించెను ఫలింపలేదు. తనయుం దోడ్కొని క్రమ్మఱి పోవుచుండె. అప్పు డాకాశవాణి, ''గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు సేకొని భరియింపు మీతని, శకుంతల సత్యము పల్కె సాధ్వి సద్వినుతమహాపతివ్రత.'' అనిఘోషించినది. అంత దుష్యంతుఁడు సభాసదులతో,

''ఏను నీయింతియును గాని యెఱుఁగ రన్య,లర్థిఁగణ్వమహామునియాశ్రమంబు
నందుగాంధర్వవిధి వివాహమునఁ గరము, నెమ్మిఁ జేసినదీనిపాణిగ్రహణము."
"అన్యు లెఱుఁగమిఁ జేసి లోకాపవాద,భీతి నెఱిఁగియు నిత్తన్విఁ బ్రీతిఁ దప్పి
యెఱుఁగనంటినినిందఱకిప్పు డెఱుఁగఁ, జెప్పెనాకాశవాణియుచ్చైరవుగాఁగ."

అని మహానురాగంబునఁ గొడుకునెత్తికొని హర్షపులక లెసఁగ నాలింగనంబుచేసి, శకుంతలామహాదేవి నతిప్రణయగౌరవంబున సంభావించె. యౌవరాజ్యంబునకు భరతు నభిషిక్తుం జేసె.

ఇతఁడు భారతములోని దుష్యంతుఁడు. ఈతనికన్న నభిజ్ఞానశాకుంతలములో మాఱినదుష్యంతుఁడు బాగుగ నుండెనా? మఱచుట తప్పు. దానికి శాపము కావలసివచ్చినది. శాపము నిర్నిమిత్త మనఁదగియున్నది. కావుననే దుర్వాసుఁడు కావలసివచ్చినాఁడు. ఐనను శకుంతల యభ్యాగతపూజయం

దశ్రద్ధవహించుట ఋష్యాశ్రమములలోని యలవాటులకుఁ దగినపని కాదు. ఇచ్చట మహాకవికి రసపక్షపాతమున మునులశిక్ష లక్ష్యము కాలేదు. మొట్టమొదటఁ బ్రియంవదానసూయలతో శకుంతల చెట్లకు నీళ్లుపోయునప్పుడును శృంగారమే ముదిరియున్నది ఋష్యాశ్రమములలోని పిల్లలుకదా ! ఏచదువు సంధ్యలమాటలో, ఏతపస్సుమాటలో, ఏసత్ప్రవర్తనశ్లాఘలో, ఏగృహిణీధర్మములో వారిమాటలలో రాఁగూడదా? ఎంతశృంగారప్రధాననాటకమైనను ముందు వచ్చెడిది యనురాగమయ ప్రసంగమే యయినను గొంచెము ఋష్యాశ్రమములోఁ బెరిఁగిన వైలక్షణ్యము కన్పట్టవలదా ? "నా వాం కామశాస్త్రస్య అభ్యంతరే స్వః' అను మాటచేత నయ్యాశ్రమమున బాలికలు చదువుల నాఱితేఱినవా రని మహాకవిగారే సూచింతురు గదా. సాంఖ్యయోగాదిచర్యలు ప్రసంగములోనికి వచ్చినను రావచ్చును. అథవా వాత్స్యాయనాదులు నిర్ణయించిన దాంపత్యధర్మములు మున్నగునవియు వివాహాదివిధులును నాబాలికలవిమర్శములలోనికి మాటలసందర్భమున రావచ్చును. అవి యన్నియు వదలి "పయోధరవిస్తారయితృకం యౌవన ముపాలభస్వ" అని వైఖానసవ్రతములో నున్న శకుంతలచెలులచేఁ బలికించుటయే తప్పనిపనియా ?

ఆ మునికన్యక లెప్పుడును శృంగారప్రసంగములనే చెట్లకు జలములు వోయుచుఁ గూడఁ జేయుచుండు రనకపోయినను మహారాజదర్శనమునఁ దారామైత్రిని సమకూర్చి నిష్కపటమైన ప్రణయమును బెంచుకొని శృంగారసామగ్రిని సమకూర్చుట యసాధ్యమా ?

కాని యిది యెల్ల మహాకవిగారి శృంగారపక్షపాతఫలితమే. అట్లే కామపరవశ యై శకుంతల దుర్వాసు నాదరింపక శాపమును దిన్నది.

ఇన్నిసమర్థనల కవకాశ మిచ్చిన దుష్యంతుని మఱపుకల్పన భారతకథకంటె మిన్న కాదేమో !

కాని కథ పంచమాంకముతో ముగిసిన దేవేంద్రసాహ్యము లేనిచో దుష్యంతుఁడు ధీరోదాత్తుఁడు కాఁడేమో ! అట్లనుటకును వీలు లేదు. వేఁటలో హస్తలాఘవము వైఖానసాజ్ఞచే నెక్కిడినశరము నుపసంహరించుట ఋష్యాశ్రమమున యజ్ఞరక్షణమునకై పిశితాశనులఁ బాఱఁదోలుట మున్నగునవి దుష్యంతుఁడు ధీరలలితుఁడు కాఁడని చాటుచున్నవి. కాని దేవేంద్రసాహా

య్యము వంటి విక్రమకార్యము లవి కా వనవచ్చును. ఇంకొక పెద్దప్రయోజనము కానిపించును. నాటకాంతమున నిర్వహణసంధిలో, అద్భుతము. అది యుత్తరరామచరిత్రాదులలోకన్న నభిజ్ఞానశాకుంతలములో మిక్కుటము కాక పోలేదు. ఇంకఁ గనఁబడ దని రూఢిచేసికొనిన శకుంతల పిల్లవానితో, యుద్ధకార్యములను విస్మయముతోఁ జెప్పుకొనుచు సారథిద్వితీయుఁడై వీరరసాలంబనముగ వచ్చుచున్న దుష్యంతున కాకస్మికముగ మార్గమధ్యమునఁ గొండమీఁదఁ గన్పట్టుటా ? ఇది యద్భుతపోషకము కా దనువా రుందురా ? మఱియు షష్ఠాంకములోని ప్రవాసవిప్రలంభశృంగారవర్ణనావకాశసంపాదనముకూడ దుష్యంతుని మఱుపుకల్పనకు ఫలమై యుండనోపు. ప్రవాసవిప్రలంభలోలత మేఘసందేశముతో ముగియలే దేమో ? లోకాంతరగత నాయికయైన కరుణవిప్రలంభ మనిన నిదియు మఱొకక్రొత్తయే. కరుణమా కరుణవిప్రలంభమా, అనుశంకలకుఁ జోటీయని కరుణావిప్రలంభశృంగారమున మహాకవి తనిసియుండెనేమో !

కృష్ణదేవరాయలు-ఆముక్తమాల్యద.

ఓకుమళ్ల అచ్యుతరావుగారు, ఎం. ఏ, ఎల్. టి., రాజమహేంద్రవరము.

(గతసంచిక శేషము.)

అల్లసాని పెద్దనార్యుఁడు మనుచరిత్రను వ్రాసి యాప్రబంధము సులభశైలిని నుండుటచే నంతకంటెఁ గఠినశైలిని నీయాముక్తమాల్యదను వ్రాసె నని యొకవాదము ఈవాదమునుఁబట్టి చూచిన నీరెండుగ్రంథములకుఁ గలభేదము శైలియందలి మార్దవకాఠిన్యములే యని సూచింపఁబడుచున్నది. ఈరెండుగ్రంథములకుఁ గలభేద మింతమాత్రమే యైనచో నీవాదము నంగీకరింపవచ్చును. కాని యీగ్రంథములను విమర్శదృష్టితో సమ్యక్పరిశీలనఁ జేసినయెడల నొక్క శైలియందే గాక యన్నివిషయములయందును నీరెండుగ్రంథములు భేదించుచున్న వని విశద మగును. ఈరెంటికిని యద్విధమైన పోలికయు లేదు. శిల్పము, భావము, రసము, భావనాశక్తి, యలంకృతి, శబ్దసామగ్రి, శ్రావ్యత, యిత్యాది యేవిషయముఁ జూచినను నీరెండుగ్రంథములకు నిసుమంతయుఁ బోలిక గాన్పింపదు. కావున నొక్కకవియే యీరెండుగ్రంథములను రచించె నని చెప్పుట కేవలము దుర్గ్రాహ్యము-దురూహ్యము— మామిడిచెట్టున మామిడిపండును తాటిపండును బుట్టింపఁగల వృక్షశాస్త్రజ్ఞుఁడు, నావుకడుపున నావుదూడను గేదెదూడను బుట్టింపఁగల పశుశాస్త్రజ్ఞుఁడు, నీనానారూపిణి యగుప్రకృతియందుఁబొడసూపెనా యప్పు డొక్కకవియే మనుచరిత్రము, నాముక్తమాల్యదను రచించె నని నేను నమ్మెదను. కాఁబట్టి యీగ్రంథకర్తృత్వయశస్సు కృష్ణదేవరాయల కిచ్చుట కిష్టము లేనియెడల, మఱి యొక పేరులేని పెద్దమనుష్యున కీపేరుప్రతిష్ఠల నొప్పఁజెప్పవచ్చును; గాని పెద్దనార్యునకు మాత్రము సమర్పించుట యెంతమాత్రము వలనుపడదు.

కావునఁ దక్కినవిషయము లెట్లయిన—ననఁగాఁ గాలనిర్ణయాదులసందర్భము, గ్రంథమందలి వ్యాకరణాదిదోషములు, కొన్ని కల్పనలయసంభావ్యత మున్నగు నంతర్నివిష్టవిషయములను దడవి చూడకయే, సామాన్యపరిశీలనమీఁదనే యీగ్రంథము పెద్దన్నరచించినది కా దనియుఁ గృష్ణదేవరాయలో, లేక మఱి యొకకవియో వ్రాసి యుండవచ్చు ననియు, స్పష్టముగాఁ జెప్పవచ్చును. పెద్దన్ననుండి కర్తృత్వముఁ దప్పించి నపుడు కృష్ణరాయల కీయక మఱి

యొకనిమెడకుఁ జుట్టుట యేటిన్యాయము? కావున శిల్పమును, శైలియుఁ బరీక్షింపఁగఁ బెద్దన్నకృష్ణరాయలలోఁ గృష్ణరాయలదే యాగ్రంథ, మని వక్కాణింపవచ్చును.

కాని, పెద్దన్నగారి పద్యములు కొన్ని దీనియం దుండుటకుఁ గారణ మేమి? పెద్దన్నగారు మనుచరిత్రములోఁ గృష్ణరాయల వంశావళిఁ గూర్చి యాతనిశౌర్యప్రతాపవిజ యాదికములఁ గూర్చియు వ్రాసినపద్యము లతిస్వల్పము లైనమార్పులతో నట్లే యాముక్తమాల్యదయందు స్వీకరింపఁబడినవి ఉభయ గ్రంథములలో నీపద్యములు సమముగా నుండుటచేతఁ గొంతమంది విమర్శకు లీగ్రంథముల నొక్కకవియే రచించె నని వాదముఁ బొసఁగించుచున్నారు. మఱి కొందఱు కృష్ణదేవరాయలకుఁ బెద్దన్నగారిమీఁద నున్న గౌరవాతిశయసూచకముగా నీపద్యములనారాజకవి యుపయోగించెనని యభిప్రాయపడుచున్నారు. మఱికొందఱు కృష్ణదేవరాయ లాత్మస్తుతిఁ జేసికొనుట కిష్టము లేక తనయాస్థానకవీశ్వరుఁ డగునల్లసానివారి పద్యములను దనగ్రంథములోఁ జేర్చికొనియె నని తలఁచుచున్నారు.

పైఁ జేర్కొనినహేతువులలో దేనివలనఁ గృష్ణరాయ లీపద్యములఁ దన గ్రంథమున నిమిడ్చికొనియుండవచ్చును? ఆత్మస్తుతి కిష్టము లేకపోయిన నాశ్వాసాంతపద్యముల నెట్లు వ్రాయఁగలిగెను? కావునఁ బెద్దన్నగారియందలి గౌరవాతిశయముచే నీపద్యములఁ దనగ్రంథమందుఁ జొప్పించి యుండవచ్చును. ఈ యూహకుఁ దోడుగ నేను మఱొకయూహ నిచట సహృదయులకు విన్నవించుచున్నాను.

కృష్ణదేవరాయలకు నల్లసాని పెద్దన్నగారియెడల నత్యంతభక్తివిశ్వాసము లుండిన ట్లనేకనిదర్శనము లున్నవిగదా?

"సీ. ఎదురైనచోఁ దనమదకరీంద్రమునిల్పి, కేలూఁత యిచ్చియెక్కించుకొనియె"

ఇత్యాదిపద్యముల మూలమునఁ బ్రభువాత్సల్యము విశదమే కదా! రాజ్యవిషయములో మంత్రితిమ్మరసు రాయనికి నప్పాజీ యయ్యెను. కవిత్వవిషయములోఁ దనయాస్థానకవీశ్వరుఁ డైనయల్లసాని పెద్దన్న యారాజకవికి నప్పాజీతుల్యుఁ డయ్యె నని చెప్పవచ్చును. ఇట్లుభయులును బితృసమానులే. వారి యెడల నత్యంతప్రేమాతిశయము రాయలు చూపుచువచ్చెను గదా! మఱియు నల్లసానివానిగ్రంథమందుఁ దనయేలిక యగుకృష్ణరాయలప్రశంస కృతిపతికా

రణమున నున్నది. కాఁబట్టి యాగ్రంథముఁ జదివినపు డెల్లఁ గృష్ణదేవరాయలు జ్ఞప్తికి వచ్చును. అట్లే కృష్ణరాయలగ్రంథముఁ జదివినపుడెల్ల నల్లసాని పెద్దన్న స్మరణకువచ్చునెట్లు ? రాయలు తనగ్రంథముఁ దనయాస్థానకవీశ్వరునకు నంకితము చేయుట యయుక్తము గదా ! ఇంక నేవెరవునఁ దనకవితాగురుసంబంధ మభేదాధ్యవసాయముగఁ గల్పింపవచ్చును ? ఆకవీశ్వరుఁడు తన్నుఁగూర్చి వ్రాసినపద్యములఁ దా నుపయోగించుకొనినయెడలఁ దనకుఁ గలగౌరవము, భక్తి, కవిత్వాదరణము, గాఢానురాగము, నివి యన్నియు నొక్కసారిగఁ జేకూరును ! కావున శాశ్వతప్రేమైకబంధస్ఫోరకముగ నీపద్యములను దా నుపయోగించుకొనె నని నేఁ జెప్పసాహసించుచున్నాను.

వేఱొకవాదము:—అంతఃపురములలోను దర్బారులలోను గాలముఁ గడపుచుండు రారాజుల కెన్నఁడుఁ దెలియరాని జానపదవిషయములును దత్త్వజ్ఞానవిషయములు నీగ్రంథమందు ననేకములు కలవు. కావునఁ గృష్ణదేవరాయలు గాక పెద్దన్న యీగ్రంథము రచించె నని యొకవాదము. రారాజులకు జానపదులజీవితము తెలియనియెడల సామాన్యజనులకు రారాజులజీవిత మెట్లు తెలియుచున్నది ? సామాన్య కుటుంబములకుఁ జెందిన కవీశ్వరులు రాజుల యితివృత్తములఁ గూర్చి వ్రాయుచున్నారుగదా ? వారి కెట్లవి తెలియవచ్చుచున్నవి. ఇలాగునే రాజులకుఁ గూడ సామాన్యమానవుల జీవితరహస్యములు తెలియఁగలవు. “రవి గాననిచోఁ గవి గాంచునేకదా ?” అన్నట్లు కవితాదృష్టిఁ గలిగిన యేమానవుఁడైన సామ్రాట్టైనను సామాన్యుఁడైననుఁ బ్రపంచమందలి నానావిధమర్మకర్మములను గుర్తెఱుఁగుటకుఁ బ్రేరేపించెడి ప్రజ్ఞాప్రభావ మెక్కువగఁ గలిగియుండును. అంతియేగాక కృష్ణదేవరాయలు ముప్పదివర్షములవయస్సువఱకు రాజ్యభారము వహించినవాఁడు కాఁడు. స్వతంత్రుఁడుగ సారస్వతదీక్షలోఁ గాలముఁ గడపినవాఁడు. లక్ష్మీనారాయణకవియనుసంగీతశాస్త్రజ్ఞుఁడు కృష్ణదేవరాయలబాల్యముఁ గుఱించి వర్ణించుచు “బాల్యేఽసౌ సకలకలాకలాపయుక్తః” అని చెప్పినాఁడు. అనఁగాఁ జిన్నతనముననే యనేకశాస్త్రములు కళలు సాఁగోపాంగముగా నేర్చినవాడు, అని చెప్పఁబడినది. కావునఁ గృష్ణరాయఁడు తనచిన్నతనమునఁ దనయత్యున్నత నానావిధవిజ్ఞాన సౌధమునకుఁ బునాదులు వేసికొనియుండెను.

రాజ్యమునకు వచ్చినతరువాతనైన సంతతము పండితకవీశ్వరగోష్ఠిలో మెలఁగుచుండెడివాఁడు. యుద్ధయాత్రలలోఁ దనయాస్థానకవిపండితబృందములను దనతోఁ దీసికొనిపోవుచుండెడివాఁడని యెల్లరకుఁ దెల్లమేకదా? కావునఁ దనగ్రంథమునకు సంబంధించిన విజ్ఞానవిశేషములను జేర్చి కూర్చుకొనుటకుఁ జాల నవకాశ ముండెను. విశిష్టాద్వైతవాదప్రతివాదములసారము నష్టాంగయోగవివరణము, నిత్యాది నిగూఢ తత్త్వసంప్రదాయము లన్నియుఁ దనగురువుల సమ్ముఖమున నేర్చికొని తాను బద్యరూపముగ నల్లి గాని లేక వారిచేవ్రాయించి గాని తనగ్రంథమం దిమిడ్చికొని యుండవచ్చును. కాఁబట్టి శాస్త్రముల యందధికారి గాఁ డనియు, మతవిషయములందలి మర్మము లెట్లు తెలియ వచ్చిన వనియు నిట్టిశుష్కాక్షేపణలు కొఱగానివాదములే.

కృష్ణరాయల కంకితము చేసిన గ్రంథములలో ననఁగా మనుచరిత్రమునందుఁ బారిజాతాపహరణమందుఁ, గృష్ణరాయలు కవిత్వప్రియుఁ డని చెప్పుటయేగాని యతఁడు రచించిన గ్రంథముల వేనినైనఁ బేర్కొని యుండలే దని యొకవాదము. కవిబ్రహ్మ యగుతిక్కన సోమయాజి కంకితముచేసిన దశకుమారచరిత్రమందుఁ దిక్కయజ్వ వ్రాసినగ్రంథములలో వేని నైనను కేతనకవి యుదహరించినాఁడా? 'మహాభారతము' గాకపోయినను నిర్వచనోత్తరరామాయణము నేనిఁ బేర్కొనియెనేమొ తిలకింపుఁడు. అందున లేనికారణమున మహాభారతముఁ గాని యుత్తరరామాయణముఁ గాని కవితిక్కన వ్రాయలే దని చెప్పఁగలమా? బహుశః యిట్టిమహాపురుషులవిషయములోఁ గవిత్వ మొకయానుషంగికవిలాసముగ మనపూర్వులు పరిగణించిరేమొ యని యే నూహించుచున్నాను. ఆమహాపురుషుల రాజకీయకృత్యముల తేజఃపుంజములో వారి గ్రంథరచన యొకకిరణకణముగ నుండెను. కావున వారికావ్యరచనము గణింపఁబడలే దని తోఁచుచున్నది. ఇప్పటికాలముననో వారి రాజకీయకీర్తికంటెఁ గావ్యములయశస్సే స్థిరమైనది. ఇట్టివియే కదా లక్ష్మీసరస్వతుల యన్యోన్యాతిశయతారతమ్యములు!

వీనియన్నింటికంటె నెక్కుడైన కారణము గ్రంథమందే యున్నది. దానినిదివఱకే కొంత సూచించితిని. శ్రీకృష్ణరాయ లేకాదశినాఁ డుపవసించి శ్రీకాకుళములో నున్నయాంధ్రవిష్ణువును దర్శింపఁబోయి యచ్చట నాభగవత్సన్నిధి నారాత్రి గడపి యుండఁ దచ్చతుర్థయామమునఁ గలలో నాభగవం

తుఁడే కృష్ణదేవరాయల కొకసందేశము తెలిపెను. అది యేమన, 'ఆముక్తమాల్యద' గ్రంథము తెనుఁగున రచింపు మనియే. అట్లానతిచ్చుటలో సంస్కృత గ్రంథములఁ గొన్నిటిని కృష్ణరాయలు రచించినట్లు తెలుపుడు చేసెను. కావున నట్టిపవిత్రస్థలమున, నట్టిపవిత్రసమయమున, సాక్షాద్భగవంతునిచే నబద్ధము లాడించుటకు నేరికైన మనస్సు కలుగునేమో యాలోచింపవలెను. సర్వదా, అనృతము లాడెడుచోరులు సహితము, దేవాలయములో నిలఁబెట్టించి దేవుని యెదుట మాటలాడించిన నిజమునే పలుకుదురు! అట్టిస్థితిలో నుపవాసదీక్షలో నుండిన తనకుఁ దనయిష్టదైవము సాక్షాత్కరించి ప్రసాదించునపుడా భగవంతునిచే నేమనుజుఁడైనఁ గల్లలాడించునేమో యాలోచింపఁదగినది. అట్టిసమయమున మృషావచనముల కేమైన నవకాశ ముండునేమో యోచింపఁదగినది. కాఁబట్టి యాగ్రంథములు కృష్ణదేవరాయలు దప్ప యొరులు రచియించి రని యూహించుట కేవల మసంగతము, నన్యాయము, నఘావహము,

కావున నీయాముక్తమాల్యదఁ బెద్దన్న ప్రత్యేకముగా రచియించియుండలే దనియుఁ గృష్ణదేవరాయలు రచించినపిమ్మట పెద్దనాదు లచ్చటచ్చటఁ బరిష్కరించియుండవచ్చు ననియు నానిశ్చితాభిప్రాయము.

కథాసారము:—ఆముక్తమాల్యదకు 'విష్ణుచిత్తీయ' మనునామాంతరము కలదు. ఇందు విష్ణుచిత్తుఁ డనువైష్ణవభక్తాగ్రేసరుని జీవితము నాతనికొమార్తయగు 'ఆముక్తమాల్యద' లేక "గోదాదేవి" యొక్క పరిణయము నభివర్ణింపఁబడినవి. కావున నీప్రబంధమున కీరెండుపేరులును బొసఁగినవి. ఆముక్తమాల్యదకు నరవమున "చూడికొడుత్తాళ్" అని యందురు. విష్ణుచిత్తునికథ ప్రాయికముగ "గురుపరంపరప్రభావ" మనుద్రావిడగ్రంథమునుండి యెత్తి తీయఁబడినది.

విష్ణుచిత్తుఁడు శ్రీవిల్లిపుత్తూరులో నున్న వటపత్రశాయిస్వామి దేవాలయమునం దర్చకుఁడు. ఈతఁడు గొప్పవైష్ణవభక్తుఁడు. అందుచే నీతనికి "పెరియాళ్వార్" అనిపేరు వచ్చినది. ఈతఁడు దేవునికి నిత్యము కైంకర్యము చేయుచుండెడివాఁడు. దేవాలయపుతోటలోఁ బూలమొక్కలకు గొప్పుత్రవ్వుట, నీరు పోయుట, పూలను గోసి దేవునికిఁ దోమాలలను గ్రుచ్చుట, దేవునికి నిత్యము ధూపదీపనైవేద్యాదిక్రియలు చేయుట. ఇట్లు దేవునిసేవయందే కాలము గడపుచుండెను. "ఆరామత్సు ఖననక్రియాఖరఖనిత్రగ్రాహితోద్యత్కిణస్తోమాస్నిగ్ధకరుం డవద్భువనదాసుఁడ" అని చెప్పఁబడెను.

ఇట్లుండ నాపాండ్యదేశపురాజు గొప్పశివభక్తుఁడుగానుండి తనముఖ్యపట్టణ మగుమధురాపురమునఁ గొండొకరాత్రి భోగినీగృహమునకుఁ బోవుచు మార్గమధ్యమున నొక బ్రాహ్మణగేహమున

"...... నెలల్ చతుర్ద్వయిని వృష్టిదినాళికి రాత్రికై దివం
బున జరకై వయస్సునను, బూని పరంబున కిప్పు డుద్యమం
బనువుగఁ జేయఁగావలయు ...."

అనుమాటలను వినెను. తత్క్షణమే చింతాపరుఁడై గిఱ్ఱునమరలి నగరికేతెంచి మఱునాఁ డుదయమునఁ గొలువుదీర్చి సభకేతెంచిన పండితులను "మీమీశాస్త్రములలో నెవ్వరు మోక్షం బెలయించునో చూచి నిశ్చయింపుఁడని కోరి యట్టిమోక్షమార్గమును జూపఁగలిగినవానికిఁ బారితోషికముగా నిచ్చుటకు వరాలసంచి నచటనే వ్రేలాడఁగట్టెను. అటుపైని వారందఱు నొకరితో నొకరు వాదములు చేయ మొదలిడిరి. శివుఁడు మోక్షప్రదాత యని కొందఱును, ఇంద్రుఁడని కొందఱును, అగ్ని యని కొందఱును-ఇట్లు వాదములాడిరి. మధురలో నిట్లు సభ జరుగుచుండఁగా శ్రీవిల్లుపుత్తూరులో వటపత్రశాయిస్వామి విష్ణుచిత్తునికి సాక్షాత్కరించి "వెంటనే మధురకుఁ బోయి రాజసభలో జరుగుచున్న వాదములోఁ బాల్గొని వారి నందఱిని నోడించి విష్ణువుయొక్క యాధిక్యత స్థాపింపు" మని కోరెను. ఆమాటలకు విష్ణుచిత్తుఁడు వెఱగంది తాను జదువులేని మూర్ఖుఁడ ననియు స్వామివారి కైంకర్యమునకుఁ దక్క మఱియొందునకుఁ బనికిరాననియు విన్నవించుకొనెను. కాని స్వామివారభయహస్తముఁజూపి ధైర్యముఁ జెప్పి వెంటనే వెళ్లుమనిరి.

విష్ణుచిత్తుఁడు శీఘ్రముగా సభకుఁ బోయి వాదమందుఁ గలిసి భగవత్సహాయమునఁ దక్కినవారి నెల్ల నోడించి విష్ణుమతమును స్థాపించెను. ఆసందర్భమున ఖాండిక్యకేశిధ్వజసంవాదమును గూడఁ జెప్పి విష్ణుభక్తులకుఁ బరమార్థసాధనమును దెలిపెను. అంతటఁ బాండ్యరాజు సంతసించి రూకలమూట విష్ణుచిత్తుని కిచ్చి యితరబహుమానముల ననేకములఁ జేసి తాను వైష్ణవమతమును స్వీకరించి విష్ణుచిత్తుని బ్రహ్మరథము నెక్కించి శ్రీవిల్లుపుత్తూరునకు సపరివారముగ సాగనంపెను.

ఇట్లు శ్రీమహావిష్ణువు తనభక్తుఁ డగువిష్ణుచిత్తునిద్వారా తన కఖండవిజయము గలుగఁజేసికొని తనహృదయేశ్వరి యగులక్ష్మీదేవితో సరసముగ సల్లా

పించుచు దనభక్తులలో నీవిష్ణుచిత్తుఁడును యామునాచార్యుఁడును నగ్రగణ్యులని నుడివెను. యామునాచార్యునిఁగూర్చి తెలిసికొనుట కామెకుఁ గుతూహలము గలుగ నాతనిచరిత్ర మంతయు వెన్నుఁ డామెకు నివేదించెను.

ఇట్లుండ విష్ణుచిత్తుఁ డొకనాఁడు తనపురమందలి యొకయుద్యానవనములోఁ దిరుగుచుండఁగా నాతని కొక యాఁడశిశువు కానిపించెను. ఆశిశువును దీసికొనివచ్చి యనపత్యురాలయిన తనభార్యకు భగవత్ప్రసాదముగ నొప్పగించెను. ఆసాధ్వీమణి చాల ముదమంది బాలికను దనకూఁతురుగాఁ బెంచుచు వచ్చెను. ఇట్లు దినదిన ప్రవర్ధమాన యగుబాలిక యౌవనవతియై విష్ణుమూర్తి యందు బద్ధానురాగయై యాభగవంతునిచర్యలను గూర్చినపాటలను గీర్తనలను వినుచుఁ బాడుచు లక్ష్మీకళ్యాణములను జూచి సంతసించుచుఁ దానావిష్ణునిఁ బరిణయము చేసికొనెడి భాగ్య మెన్నఁడైనను గలుగునాయని యువ్విళ్లూరుచు విరాళిఁ గుందుచుండెను. తండ్రి విష్ణుచిత్తుఁడు ప్రతిదినము కూర్చుచుండిన పూలమాలికను దానొక్కసారి మెడలో ధరించి నూతిసీటను దన ప్రతిబింబముఁ జూచి యానందించుచు వచ్చెను. విష్ణుచిత్తుఁ డీమాలికను ధరించుచున్న దని యెఱుఁగకయే దానితో స్వామి నలంకరించుచుండెను.

ఇట్లు విరహవేదనలఁ గుందుచున్న కుమారికస్థితినిఁ జూచి యేమియుఁ దోఁపక విష్ణుచిత్తుఁ డామెయవస్థ స్వామికి విన్నవించుకొనెను. అప్పుడు స్వామివారు "నీకొమార్త ధాత్రీదేవి. భగవంతుఁ డగుకేశవుని వివాహమాడుటకు విరహము నొందుచున్నది. కావున నామెను శ్రీరంగమందున్న రంగనాథస్వామిసముఖమునకుఁ గొనిపొమ్ము'' అని సెలవిచ్చిరి. ఆసమయమున మాలదాసరి బ్రహ్మరాక్షసులకథ విష్ణుచిత్తునికి స్వామివారు దెల్పిరి.

స్వామియాజ్ఞానుసారముగఁ గూఁతుని వెంటఁబెట్టుకొని, విష్ణుచిత్తుఁడు శ్రీరంగమునకు వెడలి స్వామివారియాలయములోఁ దానును గొమార్తయగు గోదాదేవియు రంగనాథునికిఁ గైంకర్యములు సేయుచుండిరి. ఇట్లుండ స్వామివా రనుగ్రహించి గోదాదేవినిఁ బాణిగ్రహణము చేసికొనుట కంగీకరించిరి.

అప్పుడు విష్ణుచిత్తుఁడు కొమార్తతోఁ గూడ శ్రీవిల్లుపుత్తూరు వచ్చి వివాహమునకుఁ దరలివచ్చిన స్వామివారికిని బృందారకబృందములకుఁ దగునమ్మానములు గావించి విశేషవైభవముతో వైవాహికమహోత్సవము జరిపి తన కూఁతు శ్రీరంగనాథుని కర్పించెను.

గ్రంథనిర్మాణము:—సూక్ష్మదృష్టినిఁ బరిశీలించినయెడల, నాంధ్రప్రబంధములలో నెల్ల నీప్రబంధమందలి నిర్మాణ మత్యద్భుతము- విజాతీయము. ఈ నిర్మాణ విలక్షణభావము, ముఖ్యముగా శిల్పమునందును శైలియందుఁ గాన్పించుచున్నది. శైలీ శిల్పవిషయములలో నీప్రబంధమునందుఁ గాన్పించెడు వింతలక్షణము లేతెనుఁగుగ్రంథమందు నుండు నని తోఁపదు. ఇటువంటి గొప్పకావ్య మొకమహాచక్రవర్తి రచించుట యెంత యద్భుతమో దీనియందలి శిల్పమును శైలియు నంతవిలక్షణముగానే యున్నవి. ఈశైలీశిల్పములు సరియైనదృష్టితో మనము గ్రహింపనియెడల నీగ్రంథమందలి నిజస్వభావమును మనము తెలిసికొనలేకపోవుటయే గాక కర్తృత్వవిషయములోఁ గూడఁ బొరపడుట తటస్థించును. కావున నీగ్రంథమందలి శైలీశిల్పవిచారణ యన్నిటికంటె నెక్కువముఖ్యమైనది.

ఈప్రబంధమందలి శైలీశిల్పము లేలాగున నున్నవి? వీనిస్వభావ మెట్టిది? వీనిలక్షణము లెట్టివి? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పుట యతికష్టసాధ్యమైన పని. ఇతరప్రబంధములతీరు వేఱు. ఈగ్రంథముతీరు వేఱు.

మనయాంధ్రదేశమందలి పశ్చిమభాగమున నున్నదత్తమండలములలోఁ గాని నైజామురాజ్యములోఁ గాని యెన్నఁడైనను దిరిగి యాదేశమందలి ప్రకృతిలక్ష్మి ధరించినయాకృతిలక్షణములఁ దిలకించితివా? ఆదేశమున నున్న కొండలకును మనప్రాంతమున నున్నకొండలకు నెట్టిభేదము, ఎట్టివ్యత్యాసము కానిపించుచున్నదో కనిపెట్టితివా? మనము లోఁతుగా నాలోచించినయెడల నట్టిభేదము, నట్టివ్యత్యాసమే యీప్రబంధమునకు నితరాంధ్రప్రబంధములకు నున్నట్లు భావింపవచ్చును.

ఆదేశపుకొండ లెట్లున్నవి? పెద్దబండరాళ్లు, గొప్పవృక్షములు, చిన్నపొదరిండ్లు, స్వల్పముగా స్రవించు నీటిబుగ్గలు, గఱికయొనయైనను లేని చట్రాతిబయళ్లు, వానియందుఁ గానిపించుచున్నవి. ప్రకృతిలక్ష్మి యల్లెంతో నానావర్ణసంకీర్ణయై కొంతసుకుమారముగాను కొంతయుగ్రముగాను, దర్శనీయముగాను, భయావహముగాను బరిఢవిల్లియున్నది. గండశిల లున్నతావులఁ జెట్లులేవు. చెట్లున్నచోట శిలలులేవు. చెట్లెంతపొడవులో శిలలు నంతేపొడవులు. చల్లనినీటిచెమ్మ చిమ్ముచున్న తావులఁ బచ్చనిగడ్డి పట్టికలు; నటుపైనఁ గనుచూపుమేర మలమలమాఁడుచున్న రాతిబయళ్ళు! ఈవిధముగా వేఱువేఱువిధ

ము లగునైసర్గికలక్షణములు ప్రత్యక్ష మగుచున్నవి. చల్లగ నేత్త్రానందముం జిమ్మెడు తరులతానికుంజపుంజములకును, గొడ్డువడి మొఱకువాఱిన భీషణపాషాణనివహంబులకు సంబంధము లేదు. సమన్వయము లేదు. నయనశుభ మగు స్నిగ్ధత్వము, సుకుమారత, పటుత్వము, నానారూపసమ్మేళనమువలనఁ గలిగిన సౌందర్యము గానరాదు. ఆయారూపము లన్నియుఁ గలయిక లేక వేఱుపడి వైకల్యభావమును బుట్టించును గాని సంయోగముఁ బొంది యేకత్వదృష్టిఁ గలిగించుట లేదు. ఈస్థితియే యీ ప్రబంధమందలి శైలీశిల్పములలోఁ గానుపించుచున్నది.

ఈ ప్రబంధమందునిర్మాణచాతుర్య మంతగఁ గనఁబడదు. తిలతండుల న్యాయము. గుణములు దోషములు విస్ఫుటముగను వేఱువేఱుగను బొడిచి కొని యున్నవి. తీర్థమునకుఁ దీర్థము! ప్రసాదమునకుఁ బ్రసాదము! అవయవ నిర్మాణములో సౌష్ఠవసౌభాగ్యము మృగ్యము; సమన్వయసౌందర్య మదృశ్యము.

ఈపృథగ్భావ మన్నివిషయములయందుఁ గానుపించుచున్నది. రసము, భావము, అలంకారము, కథాసంవిధానము, భాషాప్రయోగము, ఇత్యాది యన్నివిషయములందును విరోధలక్షణములకు సమీకరణము కలుగ లేదు.

అలంకారమును గుఱించి ప్రథమమున విచారింతము. చక్కనిస్వభావోక్తు లెన్నియో హృదయాహ్లాదకరముగ నచ్చటచ్చట నలరారుచున్నవి. వాని మిసిమితనమును, బరువమును, గ్రొవ్విరినెత్తావిపోలుపును, దలంపునకుఁ దెచ్చుచున్నవి. ఈస్వభావోక్తులను జూచి యొకవిమర్శకశ్రేష్ఠుఁ డిట్లు వక్కాణించియున్నాఁడు. "తిక్కన, శ్రీనాథుఁడు, సూరనార్యుఁడు మొదలగు కతిపయ కవిశిరోమణులు సకలజనమనోహ్లాదకరములైన స్వభావోక్త్యలంకృతసూక్తులను మెండుగ వ్రాసియున్నారు. ఈకవికూడ నట్టివాఁడే." (మేడేపల్లి వేంకటరమణాచార్యులు.)

ఇది యంతయుఁ జాల బాగుగానే యున్నది. కాని, యీ రెండవదృశ్యముఁ జూడుఁడు! ఆలెక్కకు మిక్కుటమైన దిక్కుమాలిన యుత్ప్రేక్షాతండములఁ జూడుఁడు. ఆయుత్ప్రేక్షలలోఁ గొన్నింటియందుఁ దక్క సామాన్యముగా నొకహద్దు, ఒకసందర్భము, ఒకయందము, నేమైన నున్నవేమో చూడుఁడు! ఏవస్తువైనను మఱేవస్తువునైనను బోల్చి యుత్ప్రేక్షించుటయే! బోడితలకు మోఁకాలికి ముడిపెట్టుట! కోడిగ్రుడ్డునకుఁ గొండచిలువకుఁ బోలిక! బదరీబాదరాయణసంబంధములు! వడగండ్లు, సుమారు పదిరకములుగ నుత్ప్రేక్షింపఁ

బడినవి. పులిసినపెరుఁగుముక్కలు, బాల్యదంతములు, వడిసెలయుండలు, ముత్యములు, అమృతబిందువులు, తామరతూఁడులు, ఇత్యాదులు.

2. ఆరుద్రపురుగులనుగూర్చి సుమారయిదాఱువిధములగు నుత్ప్రేక్ష వర్ణన లల్లఁబడియున్నవి:—ఎఱ్ఱనిఱుచ్చులు, అగ్నికణములు, ఇంద్రధనుస్సు కరఁగినముక్కలు, అంగారకగ్రహముయొక్క పిల్లలు, ఇత్యాదులు.

స్వభావోక్తులను జూచి సంతసించుటయా, యీవెఱ్ఱితలలు వేసిన యుత్ప్రేక్షలనుజూచి విసువుఁజెందుటయా.

ఇఁక భాషావిషయముఁ జూడుఁడు. పూగుత్తులతో నిండారు నిద్దంపు సెలదీఁగలఁబోలు మృదువులై సరసములైన పద్యము లొకతావునఁ, గంటకములవలె మనస్సు చివుక్కుమన గ్రుచ్చుకొను మాఱుమూలకఠినశబ్దములు కలిగిన కర్కశపద్యము లొకతావున—మృదుమధురఫణితిఁ జూచి సంతసమా! శ్రుతికటువులై క్లిష్టపదజటిలమైన రచనఁజూచి విచారమా!

కథాసంవిధానమునఁ గూడ నిట్టివిరోధస్థితియే యున్నది. ఇతివృత్తకథనమందలి కూర్పు, నేర్పు, చిక్కఁదనము, ఔచిత్యము, ప్రయోజనమును జూడుఁడు! వర్ణనములందలి నిరంకుశవిహారములు నిష్ప్రయోజనకల్పనములును జూడుఁడు! మూలకథను బెంచుచుఁ జేర్చిన యితరాఖ్యాయికల యప్రసక్తత, అనావశ్యకతఁ జూడుఁడు. ఋత్వాదిదీర్ఘవర్ణనలు, కథాసరణియం దధికాంతరాయములు గలిగించుట యనుదోషము గాక యీయాఖ్యాయికల యదృచ్ఛాసంబంధమువలనఁ గలిగిన యతుకులబొంత బ్రతుకనఁదగు రెండవదోషముఁ జూడుఁడు. మహావిష్ణువు తనమనోవల్లభ యగుకమలాలయకు సర్వగోష్ఠిని యామునాచార్యచరిత్రముఁ జెప్పఁ బ్రసాదించిరి. కావున భూతభవిష్యద్వర్తమానముల కతీతుఁ డగుభగవంతుఁడు భవిష్యత్పురుషుఁ డగుయామునాచార్యులవారి చరిత్రముఁ బూర్వపుగాథగా వర్ణించినారు. భగవంతునికి దేశకాలపరిచ్ఛిన్నభావము లేదు, గాన మనము, ఔచిత్యానౌచిత్యవిచారము చేయఁగూడదు కాఁబోలు. మఱియు నీసర్వస్వతంత్రుఁ డగుభగవంతుఁడు తన భక్తాగ్రేసరునకు మాలదాసరిభక్తిప్రభావమును జెప్ప నుద్యోగించెను. కావున స్వామివారి నుడువు లచ్చట నవశ్యకములా? యనావశ్యకములా? యను ప్రశ్నకెడము లేదు. మన మందఱము విని తీరవలెను. ఇట్టు సర్వేశ్వరునియంశకళాసంభూతుఁడును, భూలోకప్రతినిధియు నైనకృష్ణదేవరాయలునుగూడ శ్రీమహా

విష్ణువవలె స్వచ్ఛందవర్తనుఁడై వాఙ్మయనియమముల కతీతుఁడై యథేచ్ఛా విహారముగా నీకథను గల్పించెను! కాని సామాన్యకావ్యశిల్పసూత్రముల నియమము లిందుఁ గానరావు.

కథాభాగములన్ననో చక్కని యుద్యానవనపంక్తులవలె నిండుసోయగమున నిర్మలానందము నొదవుచుండ, వర్ణనభాగము లంతములేని యరణ్యములవలెఁ బోవంబోవ నలసటమాత్రమే కలిగించుచున్నవి.

ఈవిధముగఁ గథాసంవిధానమందు విరోధభావమే కాని సంయోగము సమన్వయము, సౌష్ఠవము కానఁబడవు.

ఇవ్విధమైన విపరీతస్థితికిఁ గారణములు రెండు మూఁడు గానోపు నని నాకుఁ దోఁచెడిని. (1) శ్రీకృష్ణదేవరాయలు నైజప్రకృతిచేఁ గవియైనను గావ్యపరిశ్రమయే ప్రధానవృత్తిగాఁ జేకొనిన వాఁడుగాఁడు. గ్రంథరచన యతనికి రాజకార్యవ్యాకులతనుండి యలవోక నిచ్చిన విశ్రాంతిపని. కావునఁ గవిత్వమునకుఁ గావలసినపరికరములు పరిమాణములు సంప్రదాయములు మున్నగునవి దీర్ఘచింతనచేతను దదేకదీక్షచేతను సంతరించికొని, యుపయోగించుకొను నవకాశము నలవాటును లేక యుండెను. కావునఁ గావ్యనిర్మాణమందలి యవయవసమష్టి, సౌష్ఠవము, లాతనియంతర్బుద్ధికి గోచరించియుండకపోవచ్చును. సమన్వయశక్తి కేవలము ప్రజ్ఞాఫలమే గాక పరిశ్రమఫలము కూడను. (2) కృష్ణరాయ లేతత్కృతికావ్యమునందు మహాకవులు రచించిన ప్రబంధములను మేలుబంతిగా నిడికొని నిర్మింపఁబూనుకొనియుండెను. పెద్దన తనమనుచరిత్ర మాఱాశ్వాసముల గ్రంథముగాఁ బెంచెను. ముక్కుతిమ్మన్న తన పారిజాతాపహరణము నైదాశ్వాసములుగలదిగాఁ జేయఁగలిగెను. వీరిద్దఱును దనయాస్థానమం దున్నకవులలో ముఖ్యులు. వీరిచేఁతలకుఁ దాఁజేయుపని తాలిమి పొందఁగూడదు. కావునఁ దన గ్రంథ మైదాశ్వాసములకుఁ దగ్గఁగూడదని యోచించియుండును. కాని తనయాస్థానమందున్న మాదయ్యగారిమల్లన్న రాజశేఖరవిలాసమును మూఁడాశ్వాసముల గ్రంథముగా రచించెను. ధూర్జటికవి కాళహస్తిమాహాత్మ్యము నాలుగాశ్వాసములలో ముగించెను. వీరి సంకుచితమార్గమును ద్రోక్కక పైఁజెప్పిన పెద్దనాదికవులదారినిఁ బోవనుద్యోగించి తన గ్రంథమును మూఁడునాలుగాశ్వాసములు గాక అయిదాశ్వాసములకుఁ దక్కువగాకుండనుండవలె నని సంకల్పించుకొనెను. మనుచరిత్ర నాఱాశ్వాస

ముల గ్రంథముగా వ్రాసినను గావలసినంతమూలకథ యున్నది. కాన సేగి లేక పోయెను. పారిజాతపుకవి వాగ్దేవికి వరతనూజుఁడు గాలిఁ బ్రోవుఁజేసి మెప్పింపఁ గలమేధావి. వీరితో సమానమగునుద్దిగ రచింపఁబూనుకొన్నకవికిఁ బెద్దన్నవలెఁ గథయైనను వలసినంత యుండవలెను; లేక తిమ్మన్నవలెఁ బట్టిన దంతయు బంగారముఁ జేయఁగల కవితాపరుసవేది యైన నుండవలెను. ఈరెండునులేని కవితల్లజుఁడు తన యాశయమును నవకాశమును బట్టి సర్దుకొనఁగలిగియుండిన బాగుండెడిది. అట్లు సర్దుకొనలేక పోవుటయే కృష్ణరాయలు చేసినగొప్పపొరపాటు. న్యాయముగా "ఆముక్తమాల్యద" మూఁడాశ్వాసములగ్రంథముగరచించినచో నెంతరమణీయముగా నుండెడిదో చెప్పనలవి గాదు. రాజశేఖరవిలాసము, కాళహస్తిమాహాత్మ్యము, నాసికేతోపాఖ్యానము—ఇత్యాదిగ్రంథముల కెంతమాత్ర మీడుతీయకపోవును. అట్టిస్థితిలోఁ జక్రవర్తికవి యనవసర మగు నత్యాశకుఁ బోయి తీరుతెలియని శిల్పివలెఁ దనశ్రమ యంతయు వృథాచేసికొనెను. తన ప్రబంధము నైదాఱాశ్వాసములవఱకుఁ బొడిగించుట కొఱకే గాని మఱియొక యవశ్యప్రయోజనము లేకయే ఖాండిక్యకేశిధ్వజసంవాదము, యామునాచార్యచరిత్రము, ఇత్యాదులు చొప్పింపఁబడినవి యని నాయాశయము. (3) ఇంకొకకారణముఁగూడ నేనూహించుచున్నాను. ఆనాఁటికావ్యములన్నియుఁ బండితసభలలోఁ బ్రామాణికముగఁ బరిష్కృతములైన పిదపఁ బ్రకటితము లగుచుండెడివి. నందిమల్లన ఘంటసింగన తమప్రబోధచంద్రోదయములోఁ జెప్పినట్లు—

క. "పొరిఁబొరి నొప్పసలాకల, నొరసిన కుందనపుఁబూదియును బోలె సభన్
సరసుల సంఘర్షణమున, వరకవికావ్యంబు మిగుల వన్నెకు నెక్కున్."

అనిన ప్రకార మాంధ్రగ్రంథములను బండితులును గవులును విమర్శించి చర్చించి యంగీకరించినపిదపఁ గాని కృతిభర్త లాకృతుల నంగీకరింపరైరి. మఱియు ముక్కుతిమ్మన్న తనపారిజాతహరణములో

క. "ప్రతివర్ష వసంతోత్సవ, కుతుకాగతసుకవినికరగుంభితకావ్య
స్మృతిరోమాంచవిశంకిత, చతురాంతఃపురవధూప్ర-సాదనరసికా"

అని శ్రీకృష్ణదేవరాయలను గొండాడెను. కావునఁ గృష్ణదేవరాయలు తనపూర్వులవలెనే వసంతోత్సవకాలమున గ్రంథములను బండితసభలో విని చర్చించి బహూకరించుచు వచ్చెను. కాని యట్టివిమర్శనావకాశమీ యాముక్త

మాల్యదకుఁ గలుగ లేదని నాయభిప్రాయము. చక్రవర్తి రచించిన ప్రబంధమును విమర్శించుట కెవ్వరికి సాధ్యమగును? సార్వభౌముఁడు చెప్పిన దంతయు లెస్స యే! అందఱును దలయూఁపవలసినదే! కావున నీగ్రంథమందలి దోషములను సూచింప సాహస మెవ్వరికినిఁ గలుగ లేదు. అట్టిదురవస్థ యేతద్గ్రంథమునకుఁ దటస్థించిన దని నాయూహ. ఏలయన నాకాలమందలి ప్రబంధములలో దేని యందైన నింతవిపరీతముగా విరోధభావములు సమన్వయ మొందకుండ నుండ లేదు. ఇంత యెక్కువగా నిర్మాణదోషములు దీనియందు మాత్రమే కానఁబడుచున్నవి. కాఁబట్టి వే॥ వేంకటరాయశాస్త్రులువారు చెప్పినమాటలు "వాఙ్మయమున కెల్ల ముఖ్యముగా నాంధ్రవాఙ్మయమున కెల్ల నెల్లయై యుండున ట్లీగ్రంథము రచించినార"నుమాటలను నేనంతగా విశ్వసింపను. దీనికంటె నెక్కువ సమన్వయ పుష్టి గలిగిన ప్రబంధము లాకాలముననె కాన్పించుచున్నవి. మనుచరిత్రము, పారిజాతాపహరణము, వసుచరిత్రము, ప్రభావతీప్రద్యుమ్నము, మున్నగు ప్రబంధరాజము లీయాముక్తమాల్యద కన్న శైలీశిల్పవిషయములలో మిన్న లని నాయభిప్రాయము.

(సశేషము)

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనేనమః.

వ. సు. రాయనివిజ్ఞప్తి.

శ్రీమద్రాజమహేంద్రసజ్జనమనఃక్షేత్రంబులందుం గవి
గ్రామణ్యాదరబీజరోపముఁ గృపం గావించి, సౌవర్ణభూ
షాముఖ్యంబులు తద్బహూకృతివిశేషంబుల్ ఫలింపించు నా
నామర్త్యాదికభూతజాతబహిరంతర్యామి కే మ్రొక్కెదన్. 1

మ. కవివీశా! వ. సు. నాటకంబును, జగత్కర్తా! శుభాంతంబు స
ల్పవె యంచే మును* చాటుపద్యమున నిన్ బ్రార్థింప, నావాకు నీ
చెవి సోఁకెన్, దొరఁకొంటి టిటుల్ బహుమతుల్ చేయింప, రెండేండ్లు త
క్కువగా నెన్బది యావయస్సునను నాకున్; భక్తచింతామణీ. 2

క. శ్రీకాంతుఁడు వ.సు. రాయబహూకరణసమాజమును,దముద్యమలతకున్
బ్రాఁకగుసుశ్రీకుల, సభ, నాకల్పప్రాయకవిముఖాంగముఁ బ్రోచున్. 3

ఉ. రాజమహేంద్రపౌరగణరత్నము న్యాపతి సుబ్బరావుజీ
మాజలదుర్గయాఖ్యుఁడును, మద్గురుమూర్తి నృసింహముఖ్యులున్
యోజన చేసి యీఁ, గొనితి "సూక్తిసుధానిధి" యంకనంబు, వి
భ్రాజితహేమకంకణము, రాంకవయుగ్మము నేఁ గృతజ్ఞతన్. 4

చ. నలువదియైదువర్షములు నావయ సౌజ్జనమందుఁ జెల్లుటన్,
నలుఁగడ వేనవేల్ గలరు నాలుగువర్ణములన్ మదీయశి
ష్యులు గురుభక్తియుక్తులు; మహోన్నతమంత్రిపదస్థుఁ డత్తెగం,
దలఁచె నొకప్డు కంకణము నా; కది చేకుఱె నిప్డు డీక్రియన్. 5

ఉ. పౌరు లుదారు లీకటకభారము వార్ధకమందు నాకయిం
బేరిమిఁ బెట్టినారు; తమప్రేమమె కాని మదీయశక్తి దా

*చ. కడచిననాళ్ళఁ బైఁ బడిన కష్టములం దలపోయ నిప్డు నా
యొడల గగుర్పడంకుఁ జెమ రుప్పతిలుం; బెడగొండలట్టిపె
క్కిడుమలకుం దొలంచి యెటు లీస్థితి నిల్పితో; యంచు నబ్బురం
పడుదు; శుభాంతముం జలుపుమా వ.సు. నాటకమున్ జగత్పతీ.

మారయ; రందుమీఁద నుఱ వౌబిరు, దాపయి నున్నిపట్టముల్;
దీరమి నిన్ని యీసభను దెంపునఁ బూనుదు లేనిసత్త్వవ౯. 6

క. ఎడమకరముబొట్ట్రవేల్, కడుబాధాధరము నాకుఁ గలిగించు సదా;
కడియపుబరు వక్కడ ని, ప్పుడు; ములుములువోలె నిద్దిపుచ్చునొ దాని౯.

క. కుడికరమ! పయిఁడికడియము, నెడమకయికిఁ దొడిగిరనుచు నీరసపడకే;
కడిమియు గరిమయుఁ బుట్టునఁ,బడయుభవాదృశుల కేల బంగరుబిరుదుల్?

మ. పరమేశుండు దయాళుఁ డేకగణి నన్ బ్రశ్రించె, సూర్యాదు లా
సరణిం బ్రశ్రిన, మెచ్చి, యందుకయి, భాషాసేవకుం డంచు నా
కురుసత్కారము రాజమహేంద్రపురముఖ్యుల్ సల్పి; రీకార్య మా
గురువర్యున్ గుణధుర్యుఁ జెందు ధ్రువ; మన్నాం చేను హర్షించెదన్. 9

తే. కంకణగ్రహణంబుఁద్యాగంబుసాజ,మగుదువ.సు.ర్యాట్లరమ్మున;కందొకండె
యిందిపుడుగాంచు బుధులెంతు రేమొ నేతి,బీఱకాయయటంచునాపేరు నేఁడు.

మ. గురుమూర్త్యాదిమదిష్టశిష్యులకుఁ, దెల్గుంభీష్మముఖ్యాంధ్రసో
దరసంఘంబునకున్, జిరంబుగ మనస్థ్సంబైననామీఁదియా
దరమున్ మొన్నటిమజ్జ్వరామయజసంతాపంబు సుబ్బించె; నం
బరకీర్ణం బగునీటియావిరి ధరన్ వర్షించు ఘర్మంబునన్. 11

ఆ. శ్రావణమున నాదు జనకపాదులతిథి, నాఁడు నాకు వేఁకి; గీడొకప్పు
మేలు గూర్చు; బిరుదు, సాలులు,సౌవర్ణ,కంకణముఘటించెలంకణములు 12

చ. మునుపె బుధాదరైకగుణభూషణవేమురివిశ్వనాథశ
ర్మ నుడివెఁ గంకణాదిబహుమానముల౯ నను గారవింపఁ దా
మనుకొనుచుంట; కొంతవఱకయ్యె మనోరథసిద్ధి యిప్పు; డ
చ్చున నిఁక సంపుటత్రయిగఁ జూడఁబడన్ వలె నన్ని మత్కృతుల్. 13

చ. పటుమతి సభ్యుఁ డీచెఱకువాడకులుండు పరోపకారి వేం
కటపదపూర్వరామయ, ప్రగల్భుఁడు మత్ప్రియశిష్యుఁడుం గదా!
కటకకలాపకల్పనముఖక్రియలన్ గురుకార్యదర్శి కి
ప్పటిగురుకార్యసిద్ధిఁ గుడిబాహు వటం ద్రది తత్స్వధర్మమే. 14

చ. కృతి నయదర్పణంబు రచియించితిఁ గృష్ణున కంకితంబుగ౯,
మతి నిడి పంచతంత్రమున నాలవతంత్రము లబ్ధనాశ మ౯

కత, గతభావనామసమ గద్య; సముద్రిత; షష్టిపూర్తి గా
బ్రతుకున కామహోత్సవముభంగి బయల్పడెఁ బేరు నేఁటికిన్. 15

ఉ. భారతవిశ్రుతాఖ్యమును బంచమవేదము నాంధ్రభాష కా
ధారముగా రచించినస్వతంత్రులు, నన్నయ దిక్క నెఱ్ఱనల్
భూరియశశ్శరీరులు, త్రిమూర్తిసముల్, మును సుప్రసూనవా
గ్ధారఁ గవిత్రయం బని బుధస్తుతిపాత్రము లైరి మువ్వురున్. 16

ఉ. భావను రాణ్మహేంద్రమునఁ బాదము వెట్టితి; నాఁడిటం గవుల్
వావిల వాసుదేవగురువర్యుఁ డొకండు, వివేకవర్ధనీ
ధీవరపత్రికాధిపతి దేశికవీరవలింగ మొక్కఁడుం,
గావుటచేఁ గవిత్రయముగా గణియించిరి మమ్మిటీవలన్. 17

క. వ.సు.రాయబహూకృతిసం, ఘసదధ్యక్షుఁడు, పరార్థఘటకుండు, శతా
యుసుఁ బడసి యాంధ్రభీష్ముఁడు, వసుమతి వాగీశుకరుణ వర్ధిలుఁగాతన్.

తే. ఆంధ్రవిశ్వవిద్యాధ్యుపాధ్యక్షుఁ డఖిల
ఖండపాండిత్యవిశ్రుతాఖ్యుండు నాంధ్ర
మౌళి, సర్. స. రాధాకృష్ణమహితుఁ, డస్మ
దీయభాగ్య మేతత్సభాధీశుఁ డగుట. 19

చ. మును పిఠ నో. జె. కూల్డ్రియువిభుండు కళాలయనేత్రుఁ డౌచు నుం
డినతఱి నీమహామహుఁడు నేఁడును నొజ్జల మొదు; వీరిద
ర్శనము తృతీయ మిప్పు; మును రైలున నొక్కప్పు: డీసభాధినా
థున కిఁకతన్ విధాత వరదుండు నిరామయతన్ జిరాయువున్. 20

తే. మూలసంఘాన కాంధ్రభీష్ముఁ డధీశుఁ;
డాంధ్రవిశ్వవిద్యాధ్యుపాధ్యక్షుఁడు సభ;
కాంధ్రకవికి సమ్మానంపుటదనిది; బళె !
యెట్లు గురుమూర్తి గూర్చెరా యీత్రయంబు ? 21

చ. అడిగినయట్లు సల్పును శుభాంతముగా వ.సు. నాటకంబు ము
న్నిడుమల ముంచియున్నఁ బరమేశ్వరుఁడంచును దోఁచునట్లు పెం
జడి యుదయాద్రిగాఁ గురిసి సంజకడన్ దెఱపిచ్చె నన్నుమె
ర్వడిఁగొని తెచ్చి సత్కృతులు పొరలిడన్ బురమందిరంబునన్. 22

మ. సమ నాంగీరస నాశ్వినప్రథమపక్షప్రాప్త మహాసౌమ్యవా
రములోఁ గూడుత్రయోదశిన్, బుధకవివ్రాతస్ఫురత్పౌరసా
ధమునన్ రాజమహేంద్రమందు సభ రాధాకృష్ణసత్సన్నిధిన్
సమకూడెన్ వ.సు.రాట్కవీశునకు సన్మానం బనూనంబుగన్. 23

మ. తెలుఁగుం బాసకుఁ బోషకుం డిటనె యాదిన్ రాజరాజేంద్రుఁ; డ
వ్వల మన్నేశుఁడు; వీరభద్రధరణీపాలుండు దర్వాత; వి
ద్యలభోజుం డగురాయ లాల; నిపుడో, యాధారు లేతత్సభా
స్థలరత్నాభరణాయమానులు జమీన్దారుల్ మహోదారులున్. 24

ఉ. రాజమహేంద్రపట్టణవరంబు పురాతన మాంధ్రభూమి; వా
ణీజగదంబ లేకమతి నృత్యము సల్పెడురంగధామ; మిం
దే జయభూతి; కోడలికి నెక్కుడుగౌరవ మత్తకంటె ని
చ్చోఁ; జిరసంప్రదాయ మిది సుస్థిర మయ్యెడు మెప్పు డిప్పుడున్. 25

వడ్డాది సుబ్బారాయఁడు.

అభివందనము.

—వడ్డాది సీతారామాంజనేయులుగారు, ఖాసింకోట—

శ్రీదేవి, లలితహాసా,పాదితవిజ్ఞానయోగవైభవసుప్ర
సాదవిహారిణి మనవ,డ్డాదికులము నోముతన్ గటాక్షశ్రీలన్. 1

మ. శ్రుతితత్త్వేచ్ఛుఁ బురాణపూరుషునిఁ, దీర్ఘున్, సూర్యనారాయణున్
దతభక్తిన్ భజియించువాయుజుఁడు సీతారామపాదాబ్జసం
గతశీర్షుం డగునట్లు, నేనిపుడు త్వత్కల్యాణపాదాంబుజా
శ్రితచిత్తభ్రమరుండ నైకొలుతుఁ దండ్రీ! భద్రసంసిద్ధికై. 2

ఉ. రామయతాత ప్రోదియమరన్ విభవాతిశయమ్మునొంది బల్
నీమముతో సరస్వతిని నిత్యముఁ గొల్చుచు మీరుఁగొన్నయు
ద్దామసుధాభిరామకవితారమ తా మనవంశవర్ధన
శ్రీ మెఱయించి మిత్రుల కశేషశుభప్రతిపాది గావుతన్! 3

చ. అమృతరసప్రసారవచనాదృతిమై సుమనోమనోవినో
దము రచియించి యాంధ్రకవితాహృదయేశ్వరులైన విజ్ఞులన్
మిము నతిభక్తి నాంధ్రజగమే భజియింపుచునుండె నన్ను మీ
కొమరుఁడ నైన నేనెపుడుఁ గొల్చుటవాకొననేల వేఱుగన్? 4

గీ. మామనఃపీఠములయందు మీమనోజ్ఞ, పుస్తకసరస్వతిని నిల్పి పూజఁజేసి
తత్ప్రసాదమునొంది, సార్థకతఁగాంచి,యలరుదుముసుబ్బరాయబాబయ్యగారు!

క. నామావశిష్ట మయ్యెను, రామయబుధపుత్రతిమ్మరాజకవికృతుల్;
స్వామీ! నింపిరి పృథుకీర్త్యామోదము దెసల మీర లన్వయ మలరన్.

సీ. నన్నయార్యునకుఁ బ్రసన్నులైన త్రిమూర్తు లేతెంచి మీలో వసించిరేమొ
తిక్కనమఖి కేలనెక్కొని మించుబంగరుగంటమే మీకు దొరకెనేమొ
పోతనామాత్యు విశ్వాతీతకవితామృతరసంబునే మీరు త్రావిరేమొ
పింగళి సూరకవిప్రవరుండె మీయాకారసంపత్తి నలరునేమొ
కాక గోదావరీదేవి కమలవిలసి,తార్ఘ్యపాద్యమ్ము లిచ్చి మిమ్మనవరతముఁ
బూజల నలర్చునే? రాజరాజనగర,మింత యభ్యుదయమ్మున నెసఁగునొక్కొ!

క. పొందఁగఁదరమే? కవితా, బృందారకభూజనికట మేరికిఁ; దచ్ఛా
యం దరిసితి; ధన్యుఁడ; నివె, వందనములు సుబ్బరాయ బాబయగారూ!

క. ఆతతవడ్డాదికులా,బ్జాతవనీరవికి భీమశంకరకవికిన్
మీతమ్మునకున్ దనయుఁడ, సీతారామాంజనేయచిహ్నాంచితుఁడన్.

వసురాయసన్మానపద్యరత్నములు.

చంద్రాభట్ల రామమూర్తిగారు- రాజమహేంద్రవరము.

క. వడ్డాది సుబ్బరాయని, దొడ్డకవనమునకుఁ బారితోషికమిడఁ బే
ర్వడ్డజనులీపురంబున, సడ్డను సభజరుపుటెంతొ సంతసముగదా !

క. వసురాయజీవకవితకుఁ, బసదన మిచ్చుట ప్రజాస్వభావము, గంగా
రసమాని దానిఁ బాగడని, రసనగలాఁ డెవ్వఁ డీధరాతలమందున్.

క. తెలిచానకలిమిచెలువలు, కలసిమెలసి నీగృహంబుకడ నర్తనముల్
సలుపుదురు; భవద్భాగ్యము, సుశుభముగా దన్యులకు; వ. సు. ఖ్యాతకవీ!

ఉ. శత్రువు లేరు లే, రరయ సంతతముం గడు ప్రేమగూరు స
న్మిత్రులె గాని; విద్దియల నిర్మలగోష్ఠియె గాని, యన్యమే
మాత్రము లేదు నీకడను, మాదృశు, లో వసురాయ ! వృద్ధులే
ఛాత్రులుగా మెలంగుదురు; చాఁగురె ! త్వత్కృతపుణ్యమెట్టిదో ?

ఉ. చిన్నయసూరివ్యాకృతివిశేషములన్ వసురాయ ! నే భవ
త్సన్నిధి నేర్చినాఁడఁ గద; శాంతివినీతిసుబోధనక్రియల్
నిన్ను వరించియుండుటను, నిచ్చలు వత్తురు పెద్దవారలుం
జిన్నలుఁ బుస్తకంబులను జేకొని నేర్వఁగ నీదుపజ్జకున్.

గీ. ఆంధ్రసారస్వతపరిషదార్యులిడిరి, కనుకఁ గవిశేఖరుండను బిరుదు, విజయ
నగరి;వసురాయ!రాజ్మహేంద్రబుధులిడిరి,మరలసూక్తిసుధానిధిబిరుదునేఁడు.

గీ. సంతసమునరాజమహేంద్రసభ్యజనులు, స్వర్ణకంకణమునరాఁకవద్వయమునఁ
బేర్మిసూక్తిసుధానిధిబిరుదున నిను,సత్కరించుట వసురాయ ! శ్లాఘ్యతమము.

సీ. ఇంటింటి కూరూరి కేగి పెద్దలయొద్ద రేపుమాపును దేవు రింపకుండ,
నాత్మలాభార్థమై యన్యమాన్యులకుఁ జేకూరునర్థముఁ జెడఁ గొట్టకుండ,
నింతటివాఁడ నే నంతవాఁడ నటంచు స్వీయప్రశంసఁ జేసికొనకుండఁ,
దగుఁదగండనువివాదములుసత్కృతిసభాస్థలమందుఁబండితుల్ సలుపకుండ,
నాంగ్రభాషామతల్లిక యాదివేద,రూపమునఁ బాదుకొన్ననిరూఢిగన్న
రాజ్మహేంద్రానఁగనెవసురాయసుకవి,నిరుపమానసమ్మానము నేఁడు;బళిర!

గీ. ఆంధ్రవిశ్వవిద్యాలయోపాధినాథ,పదవినున్న రాధాకృష్ణపండితుండు,
సాధువసురాయసన్మాన సభకునగ్రి,యాసనాధిపుఁడగుటభాగ్యంబు,నేఁడు.

గీ. సుప్రసిద్ధుని వడ్డాది సుబ్బరాయ,సుకవి సత్కరించుట కగు సూరిజనుల
ప్రకటనముఁజూచినవపద్యరత్నములువి,రాళమొసఁగెఁజంద్రాభట్లరామమూర్తి.

రసాభరణము.

కొమ్మనమంచి జోగయ్యశర్మగారు—విజయనగరము.

ఆంధ్రసాహిత్యపరిషన్మహాశయు లతులితాదరణాభిమానాతిశయములతోఁ బ్రాచ్యలిఖితగ్రంథముల నచ్చొత్తించి యాంధ్రపాఠకలోకమున కర్పించుచున్న యాంధ్రగ్రంథములలో రసాభరణ మనునది యొకయాంధ్రసాహిత్యగ్రంథమై యున్నది. ఏతద్గ్రంథకర్తను గూర్చియును, గ్రంథప్రాశస్త్యాదులను గూర్చియును, టీకాకారచయిత లగు బ్రహ్మశ్రీ కోపల్లి శివకామేశ్వరరావు, విద్వాన్, గారు పీఠికలోనే తెలిపియుండుటచే నావిషయ మిచ్చట ముచ్చటించుట యసంగతమైనను, గ్రంథప్రసంగవశమునఁ దత్కర్తృప్రశంస కొలఁదిగాఁ జేసి విడుచుట న్యాయము. రసాభరణకర్త, నియోగియు, కృష్ణామండలతీరనివాసియు, భోజరాజీయ, ఛందోదర్పణాది గ్రంథప్రణేతయు, నగు ననంతామాత్యుఁడు, తన గ్రంథాంతమునఁ జెప్పికొనిన—

"జానొందన్ శకవర్షముల్ ఋతుశరజ్యాలేందులై యొప్ప నయ్యానందాబ్దమునందు"అను పద్యభాగమునుబట్టి శా. వా. శక 1356 వ, సంవత్సరమున (క్రీ. శ. 1434) నీరసాభరణమును దేవాంకితము చేసినట్లు తెలియుచున్నది. కనుక నీయనంతామాత్యుఁడు క్రీ. శ. 1434 వ సంవత్సరము ప్రాంతమువాఁడై యుండనోపు.

పూర్వము, అనఁగా, రాజరాజనరేంద్ర, కృష్ణదేవరాయ, రెడ్డినాయకులకాలములో, భక్తిపూరితము లగు పురాణములు నవరసభరితములై మృదుమధురశైలితో నొప్పారి, బహువిధరచనాభూయిష్ఠము లగు, నాశు, చిత్ర, బంధ, గర్భ, కవిత్వములతో నిండియున్న వివిధప్రబంధములును బయలువెడలినవి. కాని, యాంధ్రమునఁ బరివర్తనముగఁ గాని, స్వతంత్రముగఁ గాని, రూపకము లెవ్వియు బయలువెడలి యుండలేదు. రమారమి నూఱు, నూటయేఁబది సంవత్సరముల కీవలనుండియే నాటకరచన యాంధ్రభాషయందు ప్రారంభమైనది. ఆకారణముచే రూపకలక్షణగ్రంథము లెవ్వియును నాకాలమున నాంధ్రభాషలో రచియింపఁబడి యుండలేదు. దృశ్యశ్రవ్యకావ్యోభయసామాన్యోపయోగము లగు, రసము, నాయికానాయకులు, విభావానుభావసాత్త్వికవ్యభిచారభావములు, మొదలగు వాని

లక్షణములఁ జెప్పెడు, నరసభూపాలీయము, రసాభరణాది స్వల్పగ్రంథములే సాహిత్యగ్రంథములుగాఁ గన్పట్టుచున్నవి. వీనియందు నాటకలక్షణము లెచ్చో టను జెప్పఁబడి యుండకపోవుటకుఁ దత్పూర్వము రూపకము లెవ్వియు లేకుం డుటయే కారణము. వానిలోఁ గూడ నరసభూపాలీయమున గుణదోషాలంకా రాదిప్రకరణములైన నున్నవి గాని, రసాభరణమున, నట్టివియుఁ గానరావు. రసము, దానిభేదములును, తత్పరిపోషణోపయోగము లగువిభావాదులును, నాయకనాయికలు వారిభేదములు, మొదలగునవి స్వల్పముగా శ్రవ్యకావ్యోప యుక్తములుగా నిరూపితము లైనట్లు గన్పట్టుచున్నది ఆంధ్రమున సాహిత్య గ్రంథములు విశేషముగా లేవని తెల్పియుంటిని. ఉన్నవానిలోఁగూడ, నరస భూపాలీయము స్వతంత్రగ్రంథము గాక, సంస్కృతములో విద్యానాథవిరచిత మగుప్రతాపరుద్రీయమునకుఁ బరివర్తిత మనియు, నందు లక్షణము లన్నియు సరిగాఁ బ్రతాపరుద్రీయమునుండి స్వీకరింపఁబడి, లక్ష్యములు మాత్రము స్వయంకృతము లనియు, నొకవ్యాసరూపమున నొకప్పుడు, బ్రహ్మశ్రీ విద్వాన్ దూసి రామమూర్తిశాస్త్రిగారు 'భారతి'లోఁ బ్రకటించినట్లు జ్ఞాపకము. ప్రస్తు తము, ఈరసాభరణము, స్వతంత్రమా? లేక నరసభూపాలీయమువలె నెద్దాని లక్షణముల నైన స్వీకరించి యాంధ్రీకృతమా? యనెడువిషయము చర్చింప వలసియున్నది. రసాభరణపీఠికలో బ్రహ్మశ్రీ విద్వాన్ కోపల్లి శివకామేశ్వర రావుగారు-"ఈగ్రంథము స్వతంత్రమైనదో లేక యేసంస్కృతగ్రంథమున కైనఁ బరివర్తనమో తెలియదు. మాతృక కన్పించువఱకు స్వతంత్రగ్రంథమే యిది యని యనుకొనవలసియున్నది" అని తెలిపియున్నారు. కాని యియ్యది యుఁ బ్రతాపరుద్రీయమునకుఁ బరివర్తన మని తెలియఁజేయుటకే యీవ్యాసరచన కై కడంగితిని. ఆవిషయము ముందుఁ జూపుప్రమాణములఁ బట్టియు, నుభయగ్రంథస్థోదాహరణలను బట్టియుఁ దేటపడఁగలదు.

అనంతామాత్యుఁడు, తారచింప నుద్దేశించుకొనిన రసాభరణమునకుఁ గావలసిన లక్షణములలోఁ, బ్రతాపరుద్రీయమున నున్నంతవఱకు స్వీకరించి, లాఁతిలక్షణముల నేకొలఁదినో యితరగ్రంథములనుండి స్వీకరించియున్నాఁడు. తనకవితను దేవాంకితముగాఁ జేయనుద్దేశముతో, కృష్ణుని నాయకునిగను, రుక్మిణ్యాదుల నాయికలఁగను గ్రహించి, లక్ష్యములను మాత్రము స్వతంత్ర ముగా రచించియున్నాఁడు. నాయకుని, (లేక నాయికను) మాత్రము మార్చి

ప్రతాపరుద్రీయస్థలక్ష్యములఁ గూడ నచ్చటచ్చట నాంధ్రీకరించియున్నాఁడు. ముందుఁ జూపఁబోవు ప్రమాణములవలనఁ బ్రతాపరుద్రీయమును ముందిడుకొని యనంతామాత్యుఁ డీరసాభరణమును రచించె నని పాఠకమహాశయులే తెలిసికొందురు.

వాగనులేపనాభరణాదిపంచవిధశృంగారము కేవల నాట్యవేదమునందే చెప్పఁబడి యున్నది. కాని సామాన్యముగా నేకొంతమఁదియో తప్పఁ దక్కిన యాలంకారికు లేరును దానిని జెప్పియుండలేదు. ఇతఁ డాపంచవిధశృంగారమును స్వీకరించి లక్ష్యలక్షణములను జూపినాఁడు. ఇంతియకాక శృంగారభక్తి వాత్సల్యములకు నేకకంఠ్యమును గూడఁ జెప్పియున్నాఁడు. ఇయ్యదీతని కల్పన కాదు.

"రతి ర్దేవాదివిషయా వ్యభిచారీ తథాంచితో భావః ప్రోక్తః, ఆదిశబ్దాన్మునిగురునృపపుత్త్రాదివిషయా, కాన్తావిషయాతు వ్యక్తా శృంగారః" (కావ్యప్రకాశిక, చతుర్థోల్లాసము 35 వ శ్లో.) అనువాక్యముల ననంతుఁడు:—

"రతి దా నాయకనాయికాదిపరతన్ రంజిల్లు శృంగారమై
క్షితిలో దేవగురుద్విజాదిపరతన్ జెన్నొందు సద్భక్తియై
సుతమిత్త్రాశ్రితసోదరాదిపరతన్ సొంపారు వాత్సల్యమై"

......అని రతియే యాలంబనవిభావభేదమునుబట్టి భక్తివాత్సల్యాది భావరూపముగా మాఱుచున్న దని తేటపఱిచినాఁడు. తావన్మాత్త్రముచే, భక్తివాత్సల్యములను రసములుగా ననంతుఁడు నిరూపించె నని యనుకొన వీలులేదు. అయ్యవి భావము లనియే చెప్పవలయును. కావ్యప్రకాశికకారాదులమతముగూడ నియ్యదియే. అనంతుఁడు ప్రతాపరుద్రీయమున లేని, నాయికకు స్వకీయ, పరకీయ, పణ్యస్త్ర్యాదిభేదములును ఉత్తమ, మధ్యమ, అధమ, భేదములును, వీరివచన, కోప, ప్రసన్నతలును, చాతుర్వర్ణ్యగృహిణుల స్వరూపనిరూపణమును, మొదలుగాఁ గలకొన్నిటినిమాత్త్రము, ప్రతాపరుద్రీయమునకుఁ బూర్వరచితము లగు దశరూపకాద్యాలంకారికగ్రంథములనుండి స్వీకరించి, యిందుఁ జేర్చొని యుండనోపు.

రసాభరణమున నచ్చటచ్చటఁ బద్దెములయందనన్వయత్వమును, నిరర్థకా సంపూర్ణార్థక, వ్యతిరేకార్థక, పదములును గనఁబడుచున్నవి. మొదట

నీరసాభరణస్థలక్షణములు, ప్రతాపరుద్రీయలక్షణముల కాంధ్రీకరణము లని నిరూపించి, యనంతర మావిషయచర్చకుఁ గడఁగుట సమీచీనము.

ప్రతాపరుద్రీయమందలి నాయక-రసప్రకరణముల రెండింటిని మాత్రమే స్వీకరించి, యమాత్యుఁడు రసాభరణమును నాల్గాశ్వాసముల గ్రంథముగా నల్లి నాఁడు. తనగ్రంథము స్వతంత్రమైన దని పాఠకు లూహింతు రనునాశయము చేతనో, లేక తనగ్రంథరచన కనుకూలముగా మార్చి చూపవలయు ననునుద్దేశము చేతనో గాని, యనంతుఁడు ప్రతాపరుద్రీయలక్షణక్రమము నచ్చటచ్చట మార్చి, రసాభరణమున ముందు వెనుకలఁగాఁ జూపియున్నాఁడు. కాని భావము లోను అర్థములోను, బదములకూర్పులోను, దుట్టతుదకు నన్వయక్రమములో నని గూడఁ జెప్పట సాహసము కాదని తలంతును. ప్రతాపరుద్రీయలక్షణము లకును, రసాభరణలక్షణములకును మిక్కిలి సాదృశ్యము గన్పట్టుచున్నది.

ప్రతాపరుద్రీయమునఁ దొలుదొల్త నున్న నాయకప్రకరణమును దన గ్రంథమునం దనంతుఁ డంత్యమునఁ జూపినాఁడు. అందు మధ్యనున్న రసప్రక రణస్థవిషయముల స్వీకరించి, ప్రథమాదితృతీయాంతాశ్వాసములుగాఁ జేసి నాఁడు. వానిలోఁ బ్రథమాశ్వాసమున నవరసస్థాయిభావలక్ష్యలక్షణములును, సజాతీయవిజాతీయభావ-విభావానుభావములలక్షణములను జేర్చొని, యయాశ్వాసమునకు సంజ్ఞాప్రకరణ మని పేరిడిన ట్లాశ్వాసాంతగద్యములోఁ దెల్పి యున్నాఁడు. ద్వితీయాశ్వాసమున, శృంగారభక్తివాత్సల్యములు, భిన్నభిన్నా లంబనవిభావాశ్రిత మగురతియొక్క విపరిణామములని తెల్పి, యాలంబనోద్దీపన విభావముల యొక్కయు, నిర్వేదాది సంచారిభావముల యొక్కయు లక్ష్యలక్షణా ములఁ జూపియున్నాఁడు. తృతీయాశ్వాసమున శృంగారరసవిశేషములును, అవస్థాంతరవిధములును, చక్షుఃప్రీత్యాది ద్వాదశానంగదశలును; సామాన్య ముగా నాలంకారికులచేఁ బరిగ్రహింపఁబడనివియు, నాట్యవేదమునమాత్రమే చెప్పఁబడినవియు, నగుపంచవిధశృంగారములును భావోదయాది చతుష్టయ- రససంకరములును లక్ష్యలక్షణములతోఁ జూపి యున్నాఁడు. చతుర్థాశ్వాస మున, నాయక-నాయికా-తత్సఖ-సఖీ-భేదములను జూపియున్నాఁడు.

ఇఁక నీరసాభరణమందలి లక్షణములు ప్రతాపరుద్రీయలక్షణముల నాధారముగాఁ జేసికొని యనంతామాత్యునిచేఁ గూర్పఁబడిన వనుటలో నుదాహరణములఁ జూపుచున్నాను. విశేషప్రమాణము లుదాహరించినచో

గ్రంథము చాల నధికమగునను భీతిచే నొక్కొకయాశ్వాసమునకు స్థాలీపులాకన్యాయముగా నచ్చటచ్చటిలక్షణములఁ దీసి యుభయగ్రంథస్థవిషయములకును సామ్యమును గనఁబఱుచుచున్నాను

అనంతుఁడు ప్రతాపరుద్రీయలక్షణములను యథాక్రమముగ ననుసరింపక తనరచన కనుకూలముగా ననుసరించియున్నాఁడు. ప్రతాపరుద్రీయములో రస మన నేమియో ప్రశంసించి యనంతరము చూపఁబడిన స్థాయిభావములను, రసాభరణమున ననంతుఁడు ప్రథమాశ్వాసారంభముననే పేర్కొనియున్నాఁడు. సరిగా నాసంస్కృతశ్లోకమునే,

"శృంగారహాస్యకరుణా రౌద్రవీరభయానకాః
బీభత్సాద్భుతశాంతాఖ్యాః రసాః పూర్వై రుదాహృతాః"

అని యుదహరించియున్నాఁడు. తరువాత తరుణీతరుణుల యన్యోన్యాలింగనభాషణాదులు సంభోగ మనియు తదేకాయత్తచిత్తత్వమే రతి యనియు, రతిస్వరూపము నిరూపింపఁబడియున్నది. (ప్ర. రుద్రీయములో) "తత్ర సంభోగవిషయికేచ్ఛావిశేషో రతిః" అని యున్నది. దీనికి సరిగా నిందు,

"తరుణులుఁ బురుషులు నితరే,తరసంభోగేచ్ఛ లెలమిఁ దలకొనఁగాఁ ద
త్పరమతిఁ దిరుగుట శృంగా,రరసజ్ఞులమతమునందు రతి యనఁబరఁగున్"

అని చెప్పఁబడియున్నది.

'సంభోగవిషయికేచ్ఛావిశేషమే రతి' యని కదా! ప్రతాపరుద్రీయములోఁ జెప్పఁబడియున్నది. ఆవాక్యమునే యిట గ్రహించి, తదభిప్రాయఘటితముగా "తరుణులుఁ బురుషులు—..." ననుపద్యమును రచించి యనంతుఁడు మఱికొన్ని పదములఁ గలిపినాఁడే కాని, యామూలమున నున్న "సంభోగేచ్ఛావిషయకో రతిః" యనువాక్యమునకు సరియగు నభిప్రాయమును దనపద్యమునఁ జూపుట మానలేదు. తరువాత,

ఉత్సాహలక్షణము.

"లోకోత్తరకృత్యంబులఁ, గైకొని యవి యెడపకుండఁ గావించు దృఢా,
స్తోకప్రయత్నమది సుగు,ణాకర యుత్సాహ మనఁగ
నభినుతికెక్కున్" (రసా)

అని చెప్పఁబడియున్నది. నాయకుఁడు లోకోత్తరము లగుకార్యముల స్వీకరించి, వానిని సాధించుదాఁకఁ బట్టినపట్టు విడువక తత్ఫలసిద్ధికై యమో

ఘము లగు ప్రయత్నములఁ జేయుట యుత్సాహము. అని దీనియభిప్రాయము సుగమము. దీనికి సరిగా-

"లోకోత్తరకృత్యేషు స్థేయాన్ప్రయత్నః ఉత్సాహః"

అనుప్రతాపరుద్రీయోత్సాహలక్షణము సరిపోవుచున్నది. ఛందముకొఱకును, బద్యపూర్తికొఱకును "అని యొడపకుండ, సుగుణాకర" యనెడునితర పదములున్నవిగాని తక్కిన పదములు సరిగానందలివే యనియుఁ జెప్పవచ్చును.

"ఆలంబనగుణాశ్చైవ తచ్చేష్టా తదలంకృతిః,
తటస్థశ్చేతి విజ్ఞేయ శ్చతుర్ధోద్దీపనక్రమః" (ప్ర. రు.)

"ఇల నుద్దీపన మనఁగా,నలి నాలంబన మగు గుణం బనంగాఁ దచ్చే
ష్టలునాఁదదలంకృతియన,నలరుఁదటస్థములునాఁగనగునలుఁదెఱఁగుల్" (రసా)

ఉద్దీపనవిభావము రసమునకు నిమిత్తకారణమై యున్నది. ఆలంబనగుణ తచ్చేష్టా—తదలంకృతి—తటస్థ, భేదములచే నాయుద్దీపనవిభావము నాల్గు తెఱఁగులు. ఈయభిప్రాయము రెండుగ్రంథములయందును సామ్యమును బొందుచున్నది.

ఇట్లు, ఆలంబనోద్దీపన విభావముల యొక్కయు, నిర్వేదాద్యుద్దీపనవిభావముల యొక్కయు, స్వరూపము ను దేటపఱిచి సముద్రమునఁ దరంగములు పుట్టుచు నుప్పొంగుచు నందే తిరిగి యెట్లు లయమును బొందునో, యట్లే రత్యాదిస్థాయిభావములయందు నిర్వేదాదిభావములు జనించి మగుడ నందే విలయము నొందు నని-

"అదట వర్ధమానవిభవాతిశయంబున వీచులట్లు ర
త్యాదులు, వార్ధులట్లుదయమా నడఁగుం బెఱభావపంక్తి ని
ర్వేదముఖోపభోగరుచివృద్ధిరసం బది నాట్యసంగతిన్
మోదమెలర్ప సభ్యులమనోగతులందును భావమై చనున్" (రసా)

అనుపద్యమున, ననంతుఁడు చెప్పియున్నాఁడు. ఇట్టి యభిప్రాయము నిచ్చెడు శ్లోకము ప్ర. రుద్రీయరసప్రకరణాంతమున నున్నది. చూడుఁడు-

"భావే స్థాయిని వర్ధమానవిభవే రత్యాదికే సింధువ
త్కల్లోలా ఇవ సంభవంతి విలయం చాయాన్తి భావా ముహుః
నిర్వేదాద్యుపభోగభావితరసాస్వాదాతిరేకో రసో......(రసా)

అని, అనంతుఁడు ప్రతాపరుద్రీయలక్షణములను దన గ్రంథమున ముందు వెనుకలఁగాఁ జేర్కొనియున్నాఁ డని మొదటనే చెప్పియుంటిని. రత్యాదిస్థాయి భావములందు నిర్వేదాది భావములుపుట్టుచు, మరల నందే విలయము నొందును, అనఁగా, కల్లోలము లెట్లు సముద్రాభిన్నములై, తత్స్వరూపములైయున్నవో యట్లే నిర్వేదాదులు గూడ, రత్యాద్యభిన్నములై యున్న వన్నమాట. ఈవిషయము ప్ర. రు. లో, ప్రకరణాంతమునఁ జెప్పఁబడియున్నను, స్థాయిభావ, వ్యభిచారభావప్రసంగవశముచే ననంతుఁడు, ననుపదముననే యీవిషయమును జెప్పె ననుటలో క్షతి యేమియు నుండదు. శృంగారాదిరసస్వరూపనిరూపణముతో విరమింపక, ప్రతాపరుద్రీయమున లేకున్నను దదితరగ్రంథములనుండి స్వీకరించి రసాధిదేవతలను గూడ నమాత్యుఁడు పేర్కొనియెను.

కొందఱాలంకారికులు శాన్తమును రసముగ్రా గ్రహింపలేదు, కొందఱు శాంత మనునది లోకములో లేనేలే దని "నాస్త్యేవ శాన్తో రసః అనాదికాలాగతరాగద్వేషయో రుచ్ఛేత్తు మశక్యత్వాత్" అని యద్దాని నిర్మూలింప నెంచిరి. ఒకకొందఱు రౌద్రాదిరసములలో నంతర్భావము చేసిరి. మఱికొందఱు శృంగారాద్యష్టరసములనే స్వీకరించి, యయ్యవి దృశ్యశ్రవ్యకావ్యోభయసామాన్యోపయోగము లనియు, శాన్తరసము గూడ నున్నది గాని యయ్యది కేవలము నభినయాదిశూన్య మగుటచే నాట్యమునం దుపయోగింప వీలులేదనియు నుడివియున్నారు. కావ్యప్రకాశకకారాదులు, అష్టరసములనే తొలుతఁ జెప్పి యనంతరము-

"నిర్వేదస్థాయిభావో శాన్తోపి నవమో రసః"

అని నుడివియున్నారు. ఈవిషయమున నేరిమతముల స్వీకరింపక విద్యానాథుఁడు "......... శాన్తాశ్చ రసాః పూర్వై రుదాహృతాః" అని యన్నిరసములతోఁ గలిపి శాన్తమును గూడ నొకరసముగానే చెప్పియున్నాఁడు. ఈశాన్తరసవిషయములో మనయనంతుఁడు గూడఁ బ్రతాపరుద్రీయమునే యనుసరించి యాకారికనే రసాభరణమందుఁ "...... శాన్తాఖ్యాః రసాః పూర్వై రుదాహృతాః" అని యుదహరించినాఁడు.

శృంగారాదిరసము, అనుకార్యరామాద్యాశ్రిత మని కొందఱును, అనుకరణనటాశ్రయ మని కొందఱును, ప్రేక్షకసామాజికాశ్రయ మని కొందఱును, భిన్నభిన్నమతములఁ జూపి యున్నారు. విద్యానాథుఁ డట్లుగాక

రసము, అనుకార్యనాయకాశ్రయ మనియు, నద్దానిని నిపుణనటాభినయాదు లచే, లౌకికనాయికాపరిరంభణాదివాసనావాసితాంతఃకరణు లగుసామాజికు లనుభవింతు రనియు, నటుఁడు రామాదుల ననుకరించి కృత్రిమాభినయముల జేయువాఁ డగుటచే రసాశ్రయుఁడు గాఁ డనియు, నొకవేళ రసాశ్రయత్వ మున్నచో వాఁడును సామాజికులవంటివాఁడే యనియుఁ జెప్పియున్నాఁడు. ఈ విషయము—

"అత్ర రసో నాయకాశ్రయ ఏవ, యది పరం నిపుణనటచేష్టయా తథావిధకావ్యశ్రవణబలేన చ సామాజికై స్సహృద్భావ్యతే తదా పరగతస్యాపి రసస్య సమ్యగ్భావనయా పరత్ర నిరతిశయానందజనన మవిరుద్ధమ్, అథవా మాలత్యాదిశబ్దేభ్యో యోషిన్మాత్రప్రతీతౌ...... స్మృత్యారూఢేన తత్తద్యోషిద్విశేషేణ అనుకార్యేణ సామాజికాశ్రయత్వమపి నవిరుద్ధమ్, నటస్యానుకరణమాత్ర పరతయా నైవ రసాశ్రయయోగ్యత్వమ్, తస్య భావుకత్వాభ్యుపగమేతు సామాజికత్వ మేవ" అను, వాక్యతతివలనఁ దేటపడఁగలదు. రసాభరణములో ననంతుఁడు గూడ నీమతమునే—సర్వవిధముల నీవాక్యసరణినే యనుసరించినాఁడు గాన—

సీ. రసము నాయకసమాశ్రయమునఁ బ్రావీణ్యుఁడగు నటుచేష్టల నైనఁ దత్క
థాకర్ణనంబుననైన, సామాజిక ప్రకరానుభావమై పరఁగుచుండు
బరగతంబయ్యు, సద్భావనచే రసోదయవిశేషము విరుద్ధంబుగాదు
మఱియు మాలత్యాదిమహిళాప్రసంగంబువినుచు సభ్యులు నిజవనితలందుఁ
దలఁపునిలుపరసాశ్రయత్వంబుగలుగు,ననుకరణమాత్రమైయుండునాశ్రయంబు
గాదు,భావకత్వాదులుగలిగెనేని,వాఁడెసామాజికులయట్టివాఁడె యపుడు.

అని ప్రతాపరుద్రీయవాక్యములయభిప్రాయము నొక్కయెడనైనఁ దప్పక యట్లే తెనుఁగుసేఁత చేసినాఁడు.

—: ద్వితీయాశ్వాసము :—

రతి యనుస్థాయిభావమే నాయకనాయికాగత మగుచో శృంగారము గను, దేవద్విజగుర్వాదిగతమగుచో భక్తిగను, సుతమిత్రసోదరాద్యాశ్రిత మగుచోవాత్సల్యముగను బరిణమించు నని యనంతుఁడు చెప్పియున్నాఁ డని యిది [illegible]కే చూపియుంటిని. ఇయ్యది ప్రతాపరుద్రీయమున లేకుంటచేఁ గావ్యప్రకా[illegible] ననుసరించె ననియుఁ గూడఁ బ్రసంగించితిని. హావ-భా

గరించుచు,

"మానితమైన రసాభిజ్ఞానమునకు యోగ్యమగుట <u>నను</u>భావంబై"

అని, రస మన నేమియో తెలిసికొనుటకు యోగ్యమగు జ్ఞానము గలిగి యుండుట భావ మని యనంతునిలక్షణము. ఇది,

"రసాభిజ్ఞానయోగ్యత్వం భావ ఇ త్యభిధీయతే''

అను ప్ర.రుద్రీయలక్షణమునకు ఛాయ. కాని యీలక్షణమున "యోగ్య మగుట ననుభావంబై" యని యున్నది. "జ్ఞానమున కయోగ్య మనుట" అని పాఠాంతరము గానవచ్చుచున్నది. ఇఁట మూలమునఁ గ్రిందగీటుపెట్టఁబడిన 'నను' అనుపద మంత యభిప్రాయదాయకమై యుండలేదు. ఇఁట "జ్ఞానమునకు యోగ్య మగుట యగు భావంబై" యనియుండి యుండవచ్చును. అట్లైన నర్థము సరిపోయి సరియగుభావము నొసఁగును.

"ఈషద్దృష్టవికారస్స్యాద్భావో హావః ప్రకీర్త్యతే'' (ప్ర.రు.)

"దాన నొకించుకఁ గానఁగనైన వికాసంబుపేరు హావం బయ్యెన్ (రసా)

ఇఁట దిగువ నుదహరింపఁబడిన లక్షణపద్యపాదము, మీఁద నుదహరింపఁబడిన ప్రతాప రుద్రీయలక్షణపద్యవిభాగమున కాంధ్రీకరణము. ప్ర. రు. లో, "ఈ షద్దృష్టవికారః...'' అని యున్నది. భావమే యొకించుక వికారము గల్గియున్నచో హావ మగు నని యిద్దానియర్థము. దాని కాంధ్రీకరణ మగు (రసా.లో) "దాననొకించుకఁ గానఁగనైన వికాసంబు పేరు హావంబయ్యెన్" అని వికారస్థలము వికాసపదఘటితముగా నున్నది. కాని, వికార-వికాసములకు నలంతిభేదము మాత్రము లేకపోలేదు. కనుక నీస్థలమున "వికారము" అని యుండనోపును. మూలగ్రంథమునఁ గూడ నట్లే యుండవచ్చును.

"భావంబున సువ్యక్తం బై విక్రియదోఁప హేలయగు'' (రసా)

"సువ్యక్తవిక్రియో భావో హేల ఇ త్యభిధీయతే" (ప్ర.రు)

"ఆభరణాభావంబునందు నంచితభావము మాధుర్య మనఁగఁ బ్రస్తుతికెక్కున్" (రసా)

"అభూషణేపి రమ్యత్వం మాధుర్య మితి కథ్యతే" (ప్ర.రు)

"శీలము వదలమి ధైర్యము" (రసా)

"శీలాద్యలంఘనం నామ ధైర్యమి త్యభిధీయతే" (ప్ర.రు.)

"ప్రియునియట్లం బ్రియయుం, బోలఁగ నాగతిచేష్టలు చాలఁగ నొనరించెనేని చను లీలయనన్ (రసా)

"ప్రియానుకరణం లీలా వాగ్భి ర్గత్యర్థచేష్టితైః" (ప్ర.రు.)
విచ్ఛిత్తి యనంగాఁ బొల్పగు నా,రయసర్వాభరణములకు రమ్యం
బైనన్" (రసా)

"విచ్ఛిత్తి రతిరమ్యత్వం స్వల్పైరపి విభూషణైః (ప్ర.రు)

ఇటఁ బూర్వోదాహృతరసాభరణస్థశృంగారచేష్టల లక్షణములు, వాని వెనువెంటనే యుదహరింపఁబడిన ప్రతాపరుద్రీయలక్షణములకు సరి యైన యాంధ్రీకరణము లనుటలో సందేహ మేమైన నున్నదా? ఇచ్చట, విచ్ఛిత్తి లక్షణమును జెర్కొనుటలో 'విచ్ఛిత్తియనంగాఁ బొల్పగు నారయ సర్వాభరణములకు రమ్యంబైనన్." అని, షష్ఠ్యంతముగా వేయుటలో నర్థ మేమియు బాగుండుట లేదు. దీనికి మూలమగు (ప్ర.రు.) లోని "స్వల్పైరపివిభూషణైః" అనువాక్యములో స్వల్పపదమును తృతీయాంతత్వమును గన్పట్టుచున్నవి. ఆ లక్షణమునే పరిగ్రహించినయమాత్యుని యాంధ్రీకరణముగూడ, 'స్వల్ప'పద ఘటితముగను, తృతీయాంతముగను నుండవచ్చు నని చెప్పుటలో దోషము లేదు. సాత్త్వికభావలక్షణములఁ దెల్పుటకుఁ బూర్వము సాత్త్విక మన నేమియో నిర్వచింప నుద్దిష్టుఁడై -

"పరగతసుఖదుఃఖాదిభావనయా భావితాంతఃకరణత్వం సత్వం, తతోభూ సాత్త్వికాః"

అనుప్ర.రుద్రీయవాక్యముల నాధారముగాఁ జేసికొని

"అపగతంబగుసుఖదుఃఖాదిభావనంజేసి భావింపంబడు నంతఃకరణత్వంబు సత్వంబు, తత్సంభవంబులై సాత్త్వికంబులు......"

అని తెలిపియున్నాఁడు. కాని యిఁట నొక్క విశేష మున్నట్లు తోఁచును. ప్రతాపరుద్రీయములో "పరగతసుఖదుఃఖాది............"అని యుండఁగా, నిందు "అపగతంబగుసుఖదుఃఖాది..." అని 'పరగత' అనుశబ్దస్థానమందు, 'అపగత' అని ప్రయోగింపఁబడియున్నది. "పరగతసుఖదుఃఖాదిభావనయా" అనఁగా నితరులఁబొందిన సుఖదుఃఖాదులను భావించుటచే ననిగదా యర్థము! సర్వవిధముల ప్ర.రుద్రీయమును, అనుసరించుచున్న యనంతుఁ డీస్వల్పవిషయములో భిన్నముగాఁ జెప్పక 'పరగత' యనియే చెప్పియుండును. శైథిల్యము నొందినమాతృకయం దీవిషయ మస్పష్టముగానుండవచ్చును.

తృతీయాశ్వాసము.

మొదటియాశ్వాసమున నుగ్గడింపంబడిన శృంగారాదిరసములలో శృంగారమును మాత్రము గ్రహియించి,యీయాశ్వాసారంభమున దానిభేదములఁ జెప్పియున్నాఁడు. శృంగారము సంభోగ, విప్రలంభభేదములచే రెండుతెఱఁగు లనియు, నందు విప్రలంభము అభిలాష-ఈర్ష్యా-విరహ-ప్రవాసభేదములచే నాల్గువిధము లనియు, సంభోగము, ఆలింగన-భాషణ-చుంబన-ఆలోకనాదులచే ననేకవిధము లనియు,

"భువి శృంగారము రెండుచందములు, సంభోగంబు, నవ్విప్రలం
భవిధంబు, న్వటివిప్రలంభము, చతుర్భావంబులై యుండు, నె
య్యవియంటే, యభిలాష, యీర్ష్య, విరహాఖ్యానానువాసంబు లి
ట్లు వివేకింపఁ దగు న్విచక్షణులు త్రైలోక్యైకరత్నామణీ."
"ఆలోకనభాషణములు, నాలింగనచుంబనములు నాదిగ నెన్నం
జాలినబహురతితంత్ర, శ్రీలవిసంభోగనామశృంగారంబుల్"

అని, రెండుపద్యములలోఁ జెప్పియున్నాఁడు. ఈపద్యములు-

..."అథ శృంగారః, స ద్వివిధః, సంభోగో విప్రలంభశ్చేతి..."
"సంభోగస్య పరస్పరావలోకన- సంభాషణా- లింగన- చుంబనాది......
విప్రలంభః పునరభిలాషే-ర్ష్యావిరహ- ప్రవాసహేతుకత్వేన చతుర్విధః"

అను ప్రతాపరుద్రీయవాక్యములకు భాషాంతరీకరణము లని తేటతెల్లముగఁ దెలియుచున్నది.

"అభిలాషోనామ సంభోగాత్ప్రా గనురాగః" (ప్ర. రు)
"కలయకమున్న రాగ మధికం బగునే నభిలాష" (రసా)
"విరహోనామ లబ్ధసంయోగయో ర్నాయకయోః కేనచి త్కారణేన పున
　　స్సమాగమకాలాతిక్షేపః" (ప్ర. రు)
"ఇద్దఱు, గలిసినమీఁదఁ బాయుట తగ న్విరహంబు" (రసా)
"ఈర్ష్యానామ నాయక స్యాన్యాసక్తభావా చ్చిత్తవిక్రియా" (ప్ర. రు)
"నిజేశుఁ డొండుతో,య్యలిఁగవయుంగ నవ్వనిత యల్గుట యీర్ష్య"(రసా)
"యూనో ర్దేశాంతరవృత్తిత్వం ప్రవాసః" (ప్ర. రు)
"విదేశవాసులై నిలుచుటఁ దాఁ బ్రవాసము" (రసా)

ఇఁటఁ బూర్వపూర్వోదాహృతప్రతాపరుద్రీయలక్షణములయొక్క భావ

మును, వానివెనువెంటఁ జూపఁబడిన రసాభరణస్థలక్షణములు గ్రహించియున్న వని చెప్పవచ్చును. సామాన్యముగా, నేతాదృశ లక్షణాభిప్రాయము లందఱివి సమానముగానే యుండు నని, పాఠకు లూహింతురేమో? ఛందశ్శృంఖల బంధితుఁడై సరిగ నాపదములనే యిం దిముడ్చుటకు వీలులేక మానినాఁడే గాని, సమమైన యాంధ్రీకరణ మని చెప్పుటలో నసత్యము గాని సాహసము గాని చూపట్టదు.

—: చతుర్థాశ్వాసము :—

ప్రతాపరుద్రీయములో విద్యానాథునిచేఁ జెప్పఁబడిన నాయకగుణము లగుమహాకులీనతాదుల విడనాడి, యనంతుఁడు తన గ్రంథమునఁ గేవల నాయకులు, వారిసాధారణ—శృంగారభేదములనే చూపియున్నాఁడు.

"ఉదాత్త ఉద్ధతశ్చైవ లలిత శ్శాంత ఇత్యపి
ధీరపూర్వాఇమేపూర్వైశ్చత్వారోనాయకా స్స్మృతాః" ప్ర.నాయకప్రర)
"ఎలమి నుదాత్తోద్ధతులన, లలితుఁడు శాంతుండు నాఁగలరు నాయకులి
మ్ముల ధీరపూర్వలనువా,రలు నలుపురు వీరు సర్వరససామాన్యుల్" (రసా)

ఇఁట మూలగ్రంథమునఁ గల"ధీరపూర్వా" అనుపదమునకు "ధీరపూర్వలనువారు" అని సరిగా శబ్దప్రయోగమును గూడఁ దెనిఁగించియున్నాఁడు. శృంగారనాయికలఁ జూపుసందర్భమున-

"ప్రియోపలాలితా నిత్యం స్వాధీనపతికా స్మృతా" (ప్ర. రు)
"పతిచే నెప్పుడు నుపలాలిత యగు స్వాధీనపతిక" (రసా)
"చిరయ త్యధికం కాంతే విరహోత్కంఠితోన్మనాః" (ప్ర. రు)
"విరహోత్కంఠిత యనునది, వరునితడవు సైఁపలేక వగనొందు" (రసా)
"కోపా త్ప్రియం పరాణుద్య పశ్చాత్తాపసమన్వితా కలహాంతరితా"(ప్రరు)
"కలహాంతరిత పతినవమానించి పిదపఁ చిరతప్త యగున్" (రసా)
"దేశాంతరగతే కాంతే ఖిన్నాప్రోషితభర్తృకా" (ప్రరు)
"ఒకదేశమునకుఁ దనపతి యేగినఁ జిన్నవోవునది ప్రోషితభర్తృక" (రసా)

ఈ చూపఁబడినవానిలోఁ, బూర్వోదాహృతలక్షములకుఁ దరువాత నుగ్గడించిన లక్షణములు భాషాంతరీకరణము లని తెలిసికొనుటలోఁ గష్టమేమియు నవసరములే దని యూహింతును. కాని, యంత్యమగు ప్రోషితభర్తృకోదాహరణసందర్భమున, ప్ర. రు. లో. "......ఖిన్నాప్రోషితభర్తృకా" అని

యుండ, ఖిన్నయనుపదముగాని తద్భావఘటిత మగు నొండొకపదము గాని లేక, దానికి మాఱుగా రసాభరణములో '...జిన్నవోవునది ప్రోషితభర్తృక" అని యున్నది. ఖిన్నపోవుట యనఁగాఁ జింతనుపొందుట, చిన్నపోవుట యనునది పరాభవాదులవలన సంభవించును. ప్రస్తుతము, నాయికకు, నాయకవిషయకవియోగము సంభవించెను గాని, పరాభవము సంభవింపలేదు. కనుక "తననాథుఁడు దూరదేశము పోయెను, ఇంక నెంతకాలమునకు వచ్చునో!" యనెడు ఖేదము నాయిక కవసరము గాన, "చిన్నవోవునది" అనికాక "ఖిన్న వోవునది" అనియే యుండవలయును.

ఇట్లే ప్రాచ్యలిఖితపుస్తకములలో నక్షరము లస్పష్టముగా నుండుటచే, వానినేదోవిధమున సంస్కరించి ముద్రాపకు లచ్చొత్తించి, ప్రకటించినతరువాత నాగ్రంథముల నున్న కొన్నికొన్నిపదముల కర్థములు, నిఘంటువులలోఁ గూడఁ గనఁబడక, సందర్భమును బట్టి పాఠకు లనేకార్థములఁ గల్పించుకొని, యథార్థములగు నర్థములను విడనాడి యెంతయో చికాకులు పడుచుండుట యెందఱికో యనుభవమై యున్నది. అట్టిచికాకు లీరసాభరణమున నెన్నియో గలవు. ఉదాహరణముగాఁ గొన్నిఁటిని జూపుచున్నాను.

ప్రథమాశ్వాసములో బీభత్సరసోదాహరణసందర్భమున-

దురమున నందికేశ్వరుఁడు దుర్దముఁడై నుఱుపంగ రాక్షసో
త్తరవరగాత్రముల్ మెదిగి కాళ్లును జేతులు నుత్తమాంగముల్
బరులును వీఁపులుఁ బిఱుసుఁబ్రక్కలు రూపరస్రగ్గిరొంపిమైఁ
బురపురమ్రింగుచుఁ గదురు భుగ్గున నామటనున్నవారికిఁ." (రసా)

ఈపద్య మనన్వితముగాఁ గన్పట్టుచున్నది. ఇందు, కర్త యేది? రాక్షసోత్తరవరగాత్రములా? అయినచో, పిక్కలు మొద లగునవి రూపర స్రగ్గినవియు రొంపిమైఁ బురపుర మ్రింగినవియు, రాక్షసోత్తరవరగాత్రములేనా? గాత్రము లనఁగా శరీరములనిగదా యర్థము! శరీరములు రొంపిమైఁ బురపుర మ్రింగుటయేమి? పోనిందు, కామేశ్వరరావుగారు పీఠికలో "బీభత్సరసోదాహరణపద్యమునఁ బ్రకాశకు లాదరించిన పాఠమున కెట్లర్థము చెప్పవలయునో నాకు బోధపడుటలేదు." అని వ్రాసి యున్నారు. ఈసందర్భమున నాయనకుఁ గూడ విసుఁగు గలిగినట్లు తోఁచుచున్నది. కాని, యీమాటవ్రాసి, తరువాత 'క్రింద నుదహరింపఁబడిన పాఠభేదము నంగీకరించిన నేరైనఁ బద్య మర్థము

గా లేదనఁగలరా? యని నాకుసందేహము" అనినుడివియున్నారు. 'రొంటెమై' ననుపద్యస్థపదమునకు 'రొంటిమై' ననియు "మ్రింగుచుక్" అనుపదమునకు "పొంగుచుక్" అనియుఁ బాఠాంతరములు గానవచ్చుచున్నవి. అప్పుడుమాత్ర మొకవిధముగా, రాక్షసవరగాత్రములు, ప్రక్కలు మొదలగునవి యూపరస్రగ్గ రొంటెమైఁ బొంగుచు నామగంధమును విడుచుచున్న వని యర్థమును జేయవచ్చును. ద్వితీయాశ్వాసములో ఋతువుల నుదహరించుచు-

"విప్వలి ఘనమంచు వెన్నునితోఁదీఁగె చప్పరంబునఁ బ్రొద్దు జరుపఁగలరు" అనుచో నిచ్చటి విప్వలి శబ్దమున కర్థమేమి? మఱియు స్తంభోదాహరణసందర్భమున 'ఒడ్డారపుఁబట్టి కడు న్వొడ్డరియగుశౌరిఁజూచి' యనునపుడిచ్చటి 'ఒడ్డారపుఁబట్టి' యనఁగా నే మని యర్థము, చెప్పవలయును? ఇట్లే పరిశీలించినచో లేఖనప్రమాదములు, నాలేఖనములుసరిగా నుండకపోవుటచే ముద్రాపకులు చూపిన ముద్రణప్రమాదములు, నిటీవల నచ్చుగుచున్న ప్రాచ్యలిఖితగ్రంథములయం దెన్నియో గలవు. ఇయ్యది పాఠకుల కనుభవములోనున్న విషయమే యని యూహింతును—

ఇప్పటికే యీవ్యాసము చాల గ్రంథము పెరిఁగినది. ఇందలి లక్షణము లన్నియుఁ బ్రతాపరుద్రీయస్థలక్షణములయొక్క ఛాయానుసరణము లనియు, దనకుఁ గావలసినవియుఁ బ్రతాపరుద్రీయమున లేనివియు నగు కొన్నింటిమాత్ర మితరగ్రంథములనుండి యనంతుఁడు స్వీకరించినాఁ డనియు, నంతియ కాని యియ్యది స్వతంత్రగ్రంథము గా దనియుఁ, దెలియఁజేయుచుఁ, దద్విషయనిర్ధారణకై, ప్రతాపరుద్రీయ లక్ష్యానుకరణములు రసాభరణమున నచ్చటచ్చటఁ గాననగుచున్న వనువిషయమునకుఁ బ్రమాణములఁ జూపి యింతతో విరమించుచున్నాను.

చింత కుదాహరణము:—

"సన్నిహితమపి గురుజనం నచ ప్రేక్షతే పృష్టాపి నాలపతి
ఏషాపి మార్గతి గతిం హృదయస్య ప్రియానుబన్ధస్య" (ప్ర. రు)
"గురుజనములు చేరినఁ జెచ్చెరఁజూడదు, పలుక దెంతచీరిన నభ్యంతరయుతుఁ డగుపురుషోత్తము, కరుణవడయుపనికినతివగతియూహించుక్"

ఘోషాహోదాహరణము:—

"కథమపి గమయిత్వా వాసరం దీర్ఘదీర్ఘం విరచితనవవేషా ప్రేషయిత్వా

థదూతీః, చిరయతి హృదయేశే ప్రాంశుభి శ్చంద్రపాదై రభిహతసకలాం
గీ మూర్ఛితా కోమలాంగీ" (ప్ర. రు.)
"ప్రకటమనోభవాతపనిరంతరదీర్ఘదినంబు లెట్టకే
లకుఁ గడతేర్చి, దూతిఁ దగులాగునఁ బిల్వఁగఁబంచి యొక్కగో
పిక యభిరామవేషమునఁ బ్రీతినలంకృతిచేసి కృష్ణుఁడిం
చుకవడి రాకయున్నయెడ సోమకరావళిఁ దాఁకి మూర్ఛిలున్." (రసా)

ధృత్యుదాహరణము:—

"వీరరుద్రనృపతౌ హృదయ! త్వద్వల్లభే త్రిభువనైకధురీణే
సాధు! సాధు! కృతకృత్యమసి త్వం మన్యసే జగదశేషమసారం" (ప్ర. రు)
"నీవల్లభుఁడరయఁగల, శ్రీవల్లభుఁ డమ్మఁ మేలు మేలు లతాంగీ!
నీవుకృతకృత్యురాలవు, పోవీక్షించెద వసారముగ జగమెల్లన్" (రసా)

హర్షోదాహరణము:—

"యత్పూర్వం సరసీషు పద్మముకుళవ్యాజాత్తపస్సంచితం
వక్షోజౌ యువయో స్తదద్యఫలితం జాతౌ కృతార్థౌ యువాం
దత్తా కాకతివల్లభేన భవతో రేషా స్వవక్షఃస్థలీ
కస్తూరీద్విగుణీభవత్పరిమళా కల్హారమాలాయతః" (ప్ర. రు.)
"సరసులఁ బద్మకుట్మలమిషంబునఁ జేసినతొంటిమీతప
శ్చరణఫలంబ యిప్పుడు కుచద్వయమా? యిదె పూనె మన్మనో
హరుఁ డగు కృష్ణుఁ డిచ్చిన నిరంతరకల్పలతాప్రసూనసుం
దరవనమాలికామృగమదద్విగుణీకృతగంధబంధుతన్." (రసా)

సాధారణముగాఁ గవులు తమకుఁ బ్రత్యక్షముగా మనోహరము లగు భావములు గన్పడుచున్నయపుడు, ఆభావముల విడనాడి, యితరము లగుభావములఁ గల్పించుకొనలేరు. అట్లే యనంతుఁడు గూడ లక్షణములను మాత్రమే ప్రతాపరుద్రీయమునుండి గ్రహింపవలయు నని యెంచి, చాలవఱకు నట్లేయొనర్చి, లక్ష్యములను స్వతంత్రముగాఁజూపినను, గొన్నికొన్నిమధురము లగు—భావమును మరలింపనీయని—భావములు కన్నుల కెదురుగాఁ గనుపించుటచే నచ్చటచ్చట లక్ష్యములనుగూడ స్వీకరించి, యాంధ్రీకరించినాఁ డనుటలో మీఁద నుదహరింపఁబడిన పద్యములే ప్రబలప్రమాణములై పరఁగుచున్నవని భావింతును.

పాఠకులకొక విజ్ఞాపన:—అచ్చటచ్చటఁజూపఁబడిన యుభయగ్రన్థస్థల క్షణభాగసామ్యోదాహరణ సందర్భమున రసాభరణలక్షణములలోఁ గొన్ని కొన్నిపదములు సరియగు నభిప్రాయము నీయలే దనియు, దీనికి మూలగ్రంథ మగు ప్రతాపరుద్రీయమునందలి లక్షణములఁబట్టి యాయాభాగములు సవరిం చుకొనవలసియుండు ననియు, నట్టిపదములే రసాభరణమాతృకయందుఁగూడ నుండవచ్చుననియు, ప్రాచ్యలిఖితగ్రంథమగుటచే నక్షరములపోల్కి సరిగానుండ కపోవుటచే ముద్రాపకులు సవరించి యిట్లచ్చొత్తించియుందు రనియు వ్రాసి నిర్బాధకము లగు కొన్నిసవరణలఁగూడ మూలగ్రంథము ననుసరించి చూపి యుంటిని. ఇట్టి సర్దుబాట్లు చేయనిదే, రసాభరణమందలి లక్షణములు ప్రతా పరుద్రీయలక్షణములకు సరిపోక యిట్లు "అవకతవకగా" వ్రాఁతలు వ్రాసినాఁ డని మాత్రము పాఠకులు శంకింప నవకాశము లేదని మనవి. ఒకవేళ నట్టిస వరణలఁ జేయనిపక్షమునఁ గూడ, నీలక్షణములు ప్ర. రుద్రీయలక్షణములఁ బోలియుండుటలో సందేహము లేదని పాఠకులుమాత్ర మూహింపకుందురా! అట్లు సరియగుసవరణలు చేయవలసినభాగములు, ఏకొన్నిలక్షణములయందో గన్పట్టుచున్నవి గాని, గ్రంథమంతయు సవరణ చేయవలసిన యవసరము లేదు గదా! సర్వవిధములను, రసాభరణము ప్రతాపరుద్రీయము ననుసరించియు న్నట్లు మనకుఁ గోచరించుచున్నపుడు, కొన్నిటియందుమాత్రము, యథాయో గ్యాభిప్రాయానభివ్యంజకము లగుపదము లున్నవిగాన వానిని మూలగ్రంథము ననుసరించి సవరణచేసినను, క్షతి యేమియు లేదని యేతద్గ్రంథపరిచితులకుఁ దెలియకుండునా? వారుమాత్రము యోగ్యమగు నాకార్యమున కొడంబడ కుందురా?

చారుతరవ్యాసరచనాభ్యాసపాటవములేని నాయీవ్రాఁతయం దెచ్చ టనైన, వాక్యసరణి, యర్థమందుఁగాని యన్వయమందుఁ గాని, సరియగునభి ప్రాయ మీయఁజాలకున్నను, అనఁతుఁడు తనగ్రంథరచనకుఁ గావలసిన లక్ష ణముల నన్నింటిని ప్రతాపరుద్రీయమునుండి స్వీకరించి యచ్చటచ్చట మనోహ రము లగు లక్ష్యములను గూడ ననుకరించి, యితరములకు నేకొన్నిలక్షణము లనో మఱికొన్నిసంస్కృతసాహిత్యగ్రంథములనుండి సంగ్రహించి రసాభరణ మును జేసినాఁడే గాని, యీగ్రంథ మీతనిస్వంతకల్పన గాదని, యీనావ్యా సమునకు ముఖ్యాభిప్రాయముగా గ్రహించి, యద్విధమగు దోషము లున్నను మన్నింతురుగాక!

శ్రీ

ఆంధ్రసాహిత్య పరిషత్పత్త్రిక.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy)

సంపుటము. ౨౧ { ఆంగీరసనామసంవత్సరము. మార్గశిరపుష్యమాసములు. } సంచిక ౫.



కాకినాడ:

క్రొత్తపల్లి సూర్యరావుచేఁ బరిషత్కార్యాలయమునఁ బ్రకటింపఁబడినది.

చందా, పోష్టువ్యయములతో సంవత్సరమునకు రు 3-౦-౦.

విడిసంచిక రు ౦-౮-౦.

1933.

విషయసూచిక.

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక.

కాకినాడ.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౧.	ఆంగీరసనామసంవత్సరము. మార్గశిరపుష్యమాసములు.	సంచిక ౫.

కృష్ణదేవరాయలు—ఆముక్తమాల్యద.

టేకుమళ్ల అచ్యుతరావుగారు ఎం. ఏ., యల్. టి. రాజమహేంద్రము.

(వెనుకటిసంచిక తరువాయి)

గ్రంథనిర్మాణము గుఱించి వ్రాయునపుడు శిల్పమునుఁ గూర్చియు శైలినిఁ గూర్చియుఁ గొంచెముగాఁ జెప్పుటయైనది. ఇప్పు డీ రెండువిషయములను సూక్ష్మముగఁ బరిశీలనఁజేసి వానియందలి గుణదోషములను సోదాహరణముగ నిరూపించెదను.

శిల్పము:—కథాశిల్పము రెండువిధములుగ భాగింపవచ్చును. (i) ఇతివృత్తకథనము (ii) వర్ణనము. ఇతివృత్తకథన మీగ్రంథమునఁ బూర్వోత్తరసందర్భశుద్ధిగను దీర్ఘవిలంబనములు లేకుండగను గొనసాగింపఁబడినది. వర్ణనము లట్లుగాక యతిదీర్ఘములుగను గథాపోషణమునకు సంబ ధింపకుండఁగను బ్రత్యేకముగ వర్ణనానైపుణ్యముకొఱకే చేయఁబడినవి. కావుననే యీరెంటికిని సమన్వయము కుదుర లే దని వెనుక సూచించితిని. కథకు వర్ణనములు పరిపోషకములుగ నుండవలెను. వర్ణనలకు నితివృత్తకథన ముపయోగకరముగా నుండవలెను. ఈరెంటికిని నన్యోన్యమైత్రి లేనికారణమున నీకావ్యమందలి శిల్పముం గూర్చి వ్రాయునపు డీరెంటిని వేఱువేఱుగ నిరూపింపవలసినదే !

— ఇతివృత్తకథనము —

ఈకావ్యమందలి కథాకథనము మంచి ప్రౌఢముగను గడుసుఁదనము తోను, జక్కనినేర్పుతోను జేయఁబడినది. శ్రమ యావంతమైనను వ్యక్తమగుట లేదు. కథాప్రణాళిక కడు జిగిబిగిగ, గాఢముగ, ననుస్యూతమై కమ్మచ్చునుండి తీఁగసాగునట్లు నిబ్బరముగను సూటిగను నడచును. కథాకల్పనము దిట్టముగ దట్టించి నేసిన బట్టవలె నిబిడమై నీరంధ్రమై మనోజ్ఞముగ నున్నది. ఇతరకవులు సామాన్యముగ రసవృద్ధికొఱకుఁ జేర్చు ప్రాసంగికకల్పనలు, దృష్టాంతములు, సందర్భావశ్యవర్ణనలు మున్నగునవి యీకవి చాలవఱకుఁ గ్ర స్తుతపఱిచి కథాకథనమున నెక్కడ నంతరాయము గలుగకుండఁ జెప్ప నుద్యోగించెను. కథాసరణిలో రసపుష్టికొఱకుఁ బనికివచ్చెడు నితివృత్తములను మంచినేర్పుతో నేర్చి కూర్చికొని యచ్చటచ్చట పొందిక మైన యతుకులను బెట్టి బిగువైనయల్లికగాఁ గథాబంధనము నెఱవేర్చెను. ఇంతటిగాఢబంధనము శ్రీనాథునియందుఁ గానఁబోము. పెద్దన్న తిమ్మన్నలయందును సామాన్యముగా లేదు. దీనికి సరిచూడవలె నన్న పింగళి సూరన్న గ్రంథములకుఁ బోవలెను. ఇటువంటి జటిలమగు నితివృత్తబంధ మానిరుపమాన కవితాశిల్పియే కనఁబఱిచినాఁడు. కావున పింగళి సూరన్నకుఁ గృష్ణరాయలే కొంత మార్గదర్శి యయ్యె నని చెప్పవచ్చును. అయిన నీచక్రవర్తికవి కథాశిల్పమునకు నాకవిచక్రవర్తి కథాశిల్పమునకు నొకించుక తారతమ్య మున్నది. పింగళి సూరన్నకథాసంఘటనమునఁ గృష్ణరాయలదానికంటె నెక్కుడు రసము, గాంభీర్యము, వచోవిలాసము, జాణతనము, నిర్భరకౌతూహలనిష్పత్తి వెల్లివిరియుచున్నవి. ఉదాహరణములు.

(1) ప్రథమమున విష్ణుచిత్తునికథ నరయుఁడు:— వేసవికాలవర్ణన మైనతరువాత—

క. అప్పెను వేసవి విభవము, విప్పుగఁ దన్నగరనికటవృషగిరిహరికిన్

దెప్పతిరునాళ్లురా మొద, మొప్పన్ బరదేశవిప్రుఁ డొక్కఁడు భక్తిన్.

అని ప్రారంభించి యూపిరిసలపని వేగమునఁ గథానివేదమునఁ బరుగులెత్తెను. ప్రతిపద్యమందును గంథాశములను నిర్వక్రక్రమమునఁ గ్ర స్తుతముముగ నొడువుచుఁ గథయం దంతరాయ మెంతయైనను గలుగనీయక యొకమెట్టు తరువాత రెండవమెట్టునకు వేవేగమె చేరుచువచ్చెను. ఇట్లీయతిత్వరితగతిని విష్ణుచిత్తుని బాండ్యరాజ్యసభకుఁ గొంపోయి యచ్చటిపండితులను స్వల్పకాలములో స్వల్ప

శ్రమతో నోడించెను. ఇది యెంతయు నెంత రమణీయముగ నున్నదో చెప్ప నలవి కాదు! వాగతీతము! వర్ణనాతీతము! ఇట్టిరభసగతియే విష్ణుచిత్తుఁడు ప్రాసంగికముగఁ జెప్పిన ఖాండిక్యకేశిధ్వజసంవాదమునఁ గూడఁ గానంబడుచున్నది. దీనియందలి గమన వేగ మన్నిటికంటె నెక్కువ. విస్మయజనకము లగుదీర్ఘ వర్ణనలతో విపులముగ వ్రాయ ననువగు నీచక్కనికథను కొద్దిపాటి స్థలములో నిమిడ్చి రసము తగ్గకుండ వలసినయంశముల నన్నిటిని యథావసరముగఁ బెంచి యతిమనోహరముగ రచించెను. ఈకవీశ్వరుని క్రోడీకరణశక్తియు, రసభావనిరూపణసామర్థ్యమును శ్రోతృహృల్లసనచాతుర్యమును సంపూర్ణముగఁ దెలుపుట కీకథానక మొక్కటియే చాలును. ఆంధ్రవాఙ్మయమునందలి మనోజ్ఞ మగు కథారచనమును నిరూపించెడు ముఖ్యోదాహరణములలో నిది యొకటి యని తప్పక చెప్పఁదగ్గది.

స్థాలీపులాకన్యాయముగ నీతునుకను దిలకింపుఁడు.

క. హరిణాజినోత్తరీయుఁడు, నిరాయుధుఁడు నగుచు నతని నెలవగునడవిన్
జొర గొట్టికాండ్రు డెక్కెముఁ, బరికించి యెఱింగి కలయఁబడి కూఁతలిడన్.
గీ. వలస బెదర నృపతి కలఁగక ప్రజవగ, లార్పఁ బనిచి కనుమలందు నిలువ
వేఱువేఱ యేర్చివిలుమందిఁ బనిచి తాఁ, దఱుకుపెండె మలుకవాడమ వెడలె.
క. పచ్చురిపుఁ జూపులనె చుఱ, వుచ్చుచుసిరిఁగొనుటమగుడఁబొడముటరుషము
చ్చిచ్చునను వెచ్చమరి వి,ద్యుచ్చలచాపజ్యఁదూపు దొడుగుచుఁ బలికెన్.
మ. ధనధాన్యద్విరదాశ్వగోధనసమేతం బెల్ల సామ్రాజ్యమున్
గొనియుం జాలక తాటకేయఫలభుక్స్థాటాకృతిన్ జింకతో
లున నాచ్ఛన్నుఁడవై ప్రశాంతుగతి మాలోఁ జొచ్చి ప్రాణంబులన్
గొననే తెంచితె? దుర్మతీ! కెడపెద న్గ్రూరంపుభల్లంబునన్.
మహా. అనినం జేయెత్తి యోహో యలుగక విను కానాతతాయిన్ బ్రమాదం
బున వైకల్యంబు యాగంబునకుఁ బొడమ నే భూసురశ్రేణి వేఁడన్
నినునావేదించి పంపె న్నృప యతఁ డెఱుఁగు న్నిష్కృతి న్వేఁడు పోపా
మ్మనికోపమ్మైన రోపమ్మయిన విడుపు మెట్లైనమే లింకనన్నన్.

ఈతీరునఁ బ్రతికథను సంక్షేపముగ నుడువుటయం దీకవికి నద్భుతశక్తి యున్నను మొత్తముమీఁద సర్వావయవసమన్వయమునమాత్ర మీశక్తి వెనుకఁబడి గ్రంథమును విరళబంధముగను నియమరహితముగను బెంపుచేసినది.

కథాశిల్పమున విరళబంధము గలుగుటకు హేతువులు-

(1) మూలకథ కిసుమంత యు సంబంధము లేని యుపాఖ్యానములను జేర్చి యనవసరముగ గ్రంథముఁ బెంచుట. (2) ఋత్వాదివర్ణనములలో మూల కథ మునిఁగిపోవునట్లు వానిని విపరీతముగఁ బెంచుట. (3) ఆవర్ణనలకు మూల కథకును దగినసంబంధములు కలుగఁజేయకపోవుట. ఈమూఁడువిధముల క థాశిల్పము శిథిలబంధముగా నేర్పడినది.

(ii) వర్ణనలు:—వర్ణనలవిషయములోఁ గవి తనయావచ్ఛక్తిని విని యోగించి యనేకవిధములైన కల్పనలు చేయ నుద్దేశించుకొనెను. ప్రతిమహా ప్రబంధములోను నిర్ణీతములైన యష్టాదశవర్ణనములలోఁ గొన్నియైన నుండవ లెను గదా! పురశైలఋత్వాదివర్ణనలు ముఖ్యములు. ఈకవి ఋతువర్ణనలకు గ్రంథమందుఁ జాలభాగము వినియోగించెను. గ్రీష్మవర్షశరద్ధేమంతవసంతము లన్నియుఁ గ్రమమున వర్ణించి వర్షఋతువు నినుమడించి వేసరక రాజనీతి యని మఱియొకగొప్పవర్ణనము సుమా రెనుబదిపద్యములదానినిఁ జేర్చెను. జలక్రీ డావిరహాదివర్ణనలు విడుచుటకు వీలు లేదు గదా! ఈవర్ణన లన్నియు మొత్త మున కావ్యమందలి సగము భాగము నావరించినవి. కావ్యమం దున్నసుమారు 870 గద్యపద్యములలో నీవర్ణనములు 400 లకుఁ బైగా నున్నవి. ఈఋతువర్ణ నలు బహుశః, అప్పుడప్పుడు ప్రాస్తావికముగను యాదృచ్ఛికముగను గవి వ్రాసి నపద్యములగుత్తు లని నాయూహ. ఏలయన వానియం దొక సరియైనక్రమము లేదు. ముందు నుండి వెనుకకు, వెనుకనుండి ముందుకు నూఁగులాడుచుండును. మహాచక్రవర్తిముఖమునరాజనీతి వినెడుభాగ్యము మన కిచ్చుటఁ గలిగిన దని సంతసింపవచ్చును, గాని, కథాశిల్పక్రమముం బట్టిచూచిన నీసుదీర్ఘమగు రా జనీతివర్ణన మెంతయుఁ గథాప్రణాళికకు నిరోధ మని చెప్పవలసియున్నది.

ఇంతియగాక యొండురెం డనౌచిత్యంబులు గూడ దీనియందుఁ గా న్పించుచున్నవి. (i) విష్ణుచిత్తునికిఁ గావించిన బ్రహ్మరథోత్సవపువర్ణనమున శ్రుతి పవిత్ర మగు వేదగానము గాని, భగవద్భక్తిపూరితము లగుకీర్తనల రసావేశము గాని సూచించెడు వర్ణన లెక్కువ గా నుండిన సమయోచితముగ నుండును గ దా! అట్టివి లేక కేవలము శృంగారరసాతిశయస్ఫోరకము లగువేశ్యావర్ణనము లు నర్తకీనృత్యాభినయములు విటీవిటాభిసారికాపరస్పరసమ్మేళనములు, నిత్యా ది జఘన్యశృంగారరసప్రేరకము లగువిషయములనే ముఖ్యముగ వర్ణించుట యనౌచిత్య మని నాకుఁ దోఁచుచున్నది.

(2) విష్ణుచిత్తునకు బాలిక యగు గోదాదేవి మొట్టమొదట దొరకిన యుద్యానవనమును వర్ణించుచు నందు స్త్రీపురుషు లుపరతియందలి గెల్పోటముల యానందము ననుభవించుచుందు రని విశేషముగ వర్ణించెను. ఆయుద్యానవనమందు నిత్యము జరుగు నుపరతిక్రియలకును గోదాదేవి జన్మకును నెట్టిసంబంధ మున్నదియో మనకుఁ దెలియరాదు. అట్టిగుప్తశృంగారక్రీడలవలన నాగోదాదేవి జనించినది? లేనియెడల నచ్చటి వీరాయితవర్ణనముయొక్క స్వారస్యమేమి? అయోనిజయుఁ బవిత్రమైనదియు నగుబాలిక- గోదాదేవిని నింద్రియనిగ్రహమూర్తి యగు విష్ణుచిత్తుఁ డాలోకనము చేయుసమయమున స్వచ్ఛమైనదియు, నిర్లోలమైనదియు, నిర్వికారమైనదియు నగు ప్రకృత్యాదివర్ణనమును గల్పించిన నెంతయోగ్యముగ నుండునో యాలోచింపుఁడు?

ఇట్టి యనౌచిత్యము లచ్చటచ్చట లేశమాత్రములుగఁ గాన్పించుచున్నవి. భక్తాగ్రేసరుఁ డగువిష్ణుచిత్తుఁడు తనదుహిత నన్యాయముగ శ్రీరంగనాథస్వామి లోనకైచుకొనె నని యబ్రహ్మణ్య మార్చుచుఁ బరుగులిడుట విరస మగువిషయము. ఈదృశంబు లగు నెరసులు, మధురసప్రవాహములో మక్షికములపగిది నిక్కావ్యమహాసుధలో నెచ్చటెచ్చటనో సూక్ష్మదృష్టికి గోచరించినను, రసమాధుర్యముఁ గ్రోలువారి కెంతమాత్రము బాధకములు గావు.

శైలి:—ఈకావ్యమందలి శిల్పమందు వలెనె శైలియందును ద్వైధావృత్తి కాన్పించుచున్నది. కథాసరళియందు శైలివేఱు. వర్ణనభాగములందు శైలి వేఱు. మహాకవి తిక్కన చెప్పినట్లు "అలఁతియలఁతితునియలు సంధించిన కావాళి వలె" కథాసరళియందలిశైలి చిన్నచిన్నమాటలతోఁ జక్కగను జిక్కగను గ్రుచ్చబడి జిగిబిగిగ సొగగ తీఁగవలె సాగుచున్నది. పదములయందలి పటుత్వము రచనయందు రాగముఁ జూడఁదగును. రాగముకంటెఁ బటుత్వమే హెచ్చు. మచ్చునకైనను వ్యర్థపదములును పాదపూరణపదములును గానరావు. ధారాళ మగుప్రాసంగికశైలిని వ్రాయుట యీచక్రవర్తికవితోఁ బ్రారంభింపఁబడినట్లు నే నూహించుచున్నాను. ఈతని ననుకరించి యతిశయించినవాఁడు పింగళి సూరన్న యని నామదికిఁ దోఁచుచున్నది. కథాకథనభాగము లెంతయు మనోహరముగా నున్నను వానియందు బాహుళ్యముగా మృదుత్వము మాధుర్యమును గాన్పింపవు. ఈచక్రవర్తికి నేలకో సంగీతజ్ఞానము సున్న. ఎచ్చటెచ్చటనో క్వాచిత్కముగఁ దప్పఁ దఱచుగ నీతనిపద్యములు శ్రుతికటువులుగాను

గజగజలాడుచున్నట్లు నున్నవి. కందిరి నూనె మెఱుఁగని బండ్లు గులకరాళ్ల మీఁద నడచినట్లు లీపద్యములు సాపుగాను స్నిగ్ధముగాను జదువఁబడవు. సమకాలికు లగుపెద్దన్న, తిమ్మన్న, మల్లన్న, ధూర్జటి మొదలగు కవివరులకృతులు స్వీకరించెడు భాగ్య మీయనకుఁ గలిగినను వానివలె శ్రావ్యముగఁ గబ్బము చెప్పెడుయోగ్యత కలుగలేదు. ఈకవిని రాబర్టుబ్రౌనింగుతోఁ బోల్పవచ్చును. ఆయాంగ్లేయకవీశ్వరునివలె నీకవియు నర్థగాంభీర్యమునకుఁ గాను శబ్దప్రౌఢిమకుఁ బేరొందియుఁ గవిత్వరీతియందు లాలిత్యము లేక శ్రుతికటువగుపదగుంఫనము చేయుచువచ్చెను. ద్రుతస్వరములు, స్నిగ్ధద్విత్వాక్షరములు, సరళసంధులు, నిత్యాదులగుపదసంధానసామ్యరీతులను లక్ష్యముచేయక విడిచిపెట్టెను. ఉదాహరణము:—

ఉ. అంబరవాసు లగ్నిఁ బ్రియమై ద్యుమణిస్ఫటికోపలంబునం
దుం బడయన్ శరజ్జలదతూలపరంపరఁ గొంతపై ఘటిం
పం బెలుచన్ జనించి మఱి మట్టున నిల్వక యాక్రమించెఁ గాఁ
కం బరితాపమూన ననఁ గాసె మొగుల్వీఁ యెండ లత్తఱిన్.

మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారీప్రబంధమందలి శైలినిఁ గూర్చి వ్రాయుచు "దీనియందలి శైలి యోజోగుణభూయిష్ఠము. ఓజస్సనఁగా దీర్ఘసమాసములను గలిగియుండుట" అని చెప్పిరి. ఈప్రకారము శ్రీవారిగ్రంథమందలి శైలినిగుఱించి చేసిననిర్ణయము గొప్పపొరపాటని నాయభిప్రాయము. దీర్ఘసమాసములు కొన్ని వర్ణనభాగములలోఁ దక్కఁ దదితరస్థలములలోఁ గానరావు. ప్రాయికముగా నిచ్చటి శైలియందుఁ జిన్నచిన్నపదములను గూర్చుటయే కాన్పించుచున్నది. దిఙ్మాత్రముగాఁ గొన్ని యుదాహరణములఁ జూడుఁడు.

ఉ. ఎన్నినుఁ గూర్తు నన్న విను మే మును దాల్చిన మాల్య మిచ్చున
ప్పిన్నది రంగమందయిన పెండిలి సెప్పుము మున్ను గొంటి మే
వన్నవదండ యొక్కమగవాఁ డిడ నేను దెలుంగురాయఁడన్
గన్నడరాయ యక్కొదవఁ గల్పు ప్రియాపరిభుక్తభాక్కథన్.

క. ఉన్నట్ల యుండఁగా దరి, కిన్నరులను నావఁ జేర్చుక్రియ వెసఁ దాఁకో
కున్నట్ల యుండి కాలం, బున్నరులకు వయసుఁబుచ్చు మోసము హెచ్చున్.

ఇట్టిచక్కనిపద్యము లనేకములను జూడఁగలము. వర్ణనలలో సహితము తఱచు చిన్నచిన్నపదములను జక్కగాఁ గూర్చుటయే యున్నది. కాఁబట్టి దీర్ఘస

మాసములచే శైలి కాఠిన్యము వహించిన దని చెప్పుట పొరపాటనియే నా యభిప్రాయము. మఱి యింక నేకారణమున నీకావ్యమందలిశైలి క్లిష్ట మని యుఁ బాకము నారికేళపాక మనియుఁ బండితులచేఁ బరిష్కరింపఁబడినది? సమాసదైర్ఘ్యముచేఁ గాక పదకాఠిన్యముచే దీని క్లిష్టత యేర్పడిన దని చెప్పుట యెక్కువయొప్పిద మని తెలుప సాహసించుచున్నాను. ఈమహాకవికిఁ గఠినము లగుమాఱుమూలపదములను నిఘంటువులనోటనుండి బైటకు లాగి తన గ్రంథమందు వాడుకొనుటయం దభిలాష యెక్కువ. సామాన్యముగా నితరకవులు వాడుకచేయు శబ్దములకు బదులుగా నీకవి కఠినమైన నిగూఢపర్యాయపదములను వాడుకచేసెను. ఉదాహరణముగాఁ గొన్నిపదముల నీవ్యాసమునందే 'కృష్ణరాయని ప్రతిభావిజ్ఞానము'లను శీర్షికక్రిందఁ జూపఁబడెను. ఈవైచిత్ర్యము చాలచోట్ల కాన్పించుచున్నది. కావుననే యీకవి వీనినిఁ బ్రత్యేకముగా బుద్ధిపూర్వకముగా వాడినాఁ డని చెప్పవలసియున్నది. ఈవిషయము గుఱించి అక్కిరాజు ఉమాకాంతముగా రిచ్చిన యభిప్రాయముతో నే నేకీభవించుచున్నాను. "శ్రుతికటు పదములు, అస్థానస్థసమాసములు, ప్రసన్నపదము లున్నప్పటికి వాటిని వదలి ఆయర్థమునందే వాడిన యప్రయుక్తపదములు (నిఘంటువులలో మాత్ర ముండినవి, కవులు తఱచుగా వాడనివి, ప్రసన్నపదములు తెలిపే అర్థమునే తెలిపెడివి, అయిన మూలగొట్టుపదములు) ఇట్టివన్ని కావ్యములందు దోషము లని కావ్యప్రకాశ, సాహిత్యదర్పణ, విద్యానాథీయాదులను జదివి తెలిసికొనియుంటిని, అనేక కావ్యములు చదివితిని, పైనుదాహరించిన వన్ని దోషము లన్నమాట నాకు నిశ్చయబుద్ధి కలిగినది. కాని యీదోషము లన్ని యుండుటవల్ల ఆముక్తమాల్యదకు దుర్జ్ఞానత్వ మనే యొక గొప్పతనము వచ్చినట్లును మూలగొట్టు నిఘంటుపదము లుండుట కావ్యమునకు గొప్పలక్షణమైనట్లున్ను శాస్త్రిగా రుపన్యసించిరి. (శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి గారు) కాని యీమాటలయందు నాకుఁ బ్రమాణబుద్ధి కలుగలేదు." అక్కిరాజు ఉమాకాంతము:-(తెలుగుదేశవాఙ్మయపత్రిక 1921 నవంబరు సంచిక.)

ఈవిమర్శన మంతయు నుత్తమకావ్యాదర్శముల నాధారముగఁ జేసికొనినదై యుండుట వలన స్వచ్ఛ మగుకవితారసమును గ్రోలువా రందఱు నంగీకరింపకతప్పదు. కావున నీగ్రంథమందు ముఖ్యముగా నాక్షేపింపఁదగినది భాషాకాఠిన్యము. ఈశబ్దకాఠిన్య మొకయుత్కృష్టలక్షణముగా, కేవలపండితులు

(శ్రీ. వే. వేంకటరాయశాస్త్రులువారి వంటివారు) తలంపవచ్చును. నిజముగా శ్రీ శాస్త్రులువారీవిషయమునుగుఱించియే వారిపీఠికలోను పీఠికానుబంధము లోను జాలవఱకు శ్రమపడిరి. వారు చేసినకృషి యంతయు నాంధ్రలోకము నకు మహోపకారమే. అయిన నిటువంటి కావ్యములు శ్రీవారివంటి మహా పండితులు నమలి రసము గ్రహింపఁగలిగినవి గాని సామాన్యవిద్యావంతులగు నస్మదాదులు గ్రహించి యాస్వాదింపఁగలిగినవి కావు. శ్రీ శాస్త్రులువారు దీని ది పక్వపనసఫలపాక మని చెప్పిరి. అగుఁగాక పనసపండ్లలో బురదపనస య నికూడ నొకరకపు పనస యున్నది దానియందంతయుఁ బీఁచు. అచ్చటచ్చటఁ జిన్నచిన్నతొనలున్నను, ఆతొనలు నమలిన జిగురుముద్ద గొంతునఁ బట్టుకొని మనుష్యుని నుక్కిరిబిక్కిరిచేయును. అట్టిపనసపాకమే దీనిదని చెప్పవచ్చును.

భాషాకాఠిన్య మిట్లుండ రసభావములవిషయ మెట్లిది? ఈకావ్యమం దలి భావములకు రెండురూపములున్నవి. రోమనదేవుఁడగు జేనసునకు రెండు ముఖము లున్నవఁట. అటులే యీకవి భావప్రపంచము రెండుముఖములు ధ రించియున్నది. చక్కనిప్రకృతిస్వరూపము ముద్దులొలుకుచు, నిద్దంపుతళుకులు గులుకుచు, సహజసౌందర్యరసముఁ జిలుకుచు వఱలుచున్నది.

రెండవప్రపంచము:—మానవసృష్టి నతిక్రమించి యతటప్రవాహ ములఁ బోలు నూహాతరంగిణుల నోలలాడి యొక్కొక్కచో లోకోత్తరమనోజ్ఞ రూపములు దాలిచియుఁ బలుతావ్రల వికృతాకారము లగపఱిచియు భావనా శక్తి యతిశయావేశమునఁ జిందులు త్రొక్కుచున్నది. ఈరెండు ప్రపంచములను సర్వస్వతంత్రుఁడగు నధికారివలెఁ దనకరతలాధీనము చేసికొనెను. ప్రకృతిలక్ష్మినిఁ జిత్రించెడునేర్పసమానము! దాని నతిక్రమించెడు నాతురతయు నప్రతిమాన మే! యథావద్వస్తువర్ణనములు చూచిన నీచక్రవర్తిదృష్టిపథమునఁ బడనివిష యము లేవియైన నీచరాచరప్రపంచమున నున్నవా? యని సంశయింపవల సివచ్చును! లోకానుభవ మతిక్రమించి యుత్ప్రేక్షించునప్పు డీచక్రవర్తి కల్ప నాశక్తి యున్మత్తావస్థనుబొందినదేమో యని సంశయింపవచ్చును.

ఈయుభయమార్గములను విశదీకరించుపద్యములను బుంఖానుపుంఖము లుగఁ జూపవచ్చును. దిఙ్మాత్రముగ నీక్రిందిపద్యముల వీక్షింపుఁడు.

i చక్కనిస్వభావోక్తి:—

చ. తడి తలడిగ్గి ముంప జడతం దుదఱెప్పలఁ గన్నుపీడి, పు
లొప్పుచుచు నీరు ముంగఱల పోలిక ముక్కునఁ గూడ నోటిఁ గొం

తోఁడియుచు గూఁటికజ్జ సగ మొత్తుచు ద్రొక్కఁ బిదుర్పు మున్నుగా
వడకు టెగాక చేష్టుడిగ వక్షము పక్షులు జానువుల్ చొరన్.

ii మనోహరమగు నుత్ప్రేక్ష:—

మ. తలఁ బక్షచ్ఛటఁ గ్రుక్కి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర
స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకు లుపస్నాత ప్రయాతద్విజా
వళిపిండీకృతశాటు లన్నలిఁ దదాహాసంబుఁ జేర్పంగ రే
వుల డిగ్గన్వసఁ బాఱ వానిఁ గని నవ్వున్ శాలిగోప్యోఘముల్.

iii తలచించుకొన్న యుత్ప్రేక్ష:—

చ. జలధర ముప్పుతోఁ బులుసొసంగు రసం బని యప్పయోధి నిం
పొలయఁగఁ గ్రోలి పై దధిపయోధియుఁ గ్రోలఁగఁ బ్రాఁచిడాట చే
న్బులుసుఁ గఱుల్లఁ గ్రాయ నవెపో వడగండ్లన రాలెఁ గానినాఁ
డిలఁ బడు వానిఁ దిన్న యపుడే చలిఁ బండ్లు వడంకనేఁటికిన్.

శైలి యందలి మఱియొకవిశేషము:—ఆంధ్రకవులలో శ్రీనాథుఁడే మొట్టమొదటఁ దనకావ్యములో దేశకాలవర్ణనలయందుఁ గొంతప్రత్యేకతయు యథార్థస్థితియు, నైజప్రకృతిరూపమును Local colour and individuality యిచ్చినాఁడు. తన కాశీఖండములో వారణాసీపురవర్ణనమున యథార్థ మగు స్థలజ్ఞానము కాన్పించుచున్నది భీమేశ్వరపురాణమున దక్షారామపురీవర్ణనము గూడ నట్లే యున్నది ఆపురమును బరిసరగ్రామములను బ్రత్యక్షముగాఁ జూచి యచ్చటి చెట్లు చేమలు పంటలు మున్నగునవి యున్నవి యున్నట్లు వర్ణించి వాని ప్రతిబింబము తీసినాఁడు. హరవిలాసమున నున్న కాంచీపురవర్ణన మూప ట్టనమునకుఁ గేవలము ఛాయాపటము తీసినయ ట్లున్నది. కాలపరిస్థితులవిష యమునఁ గూడ నిట్టిస్వాభావికవర్ణనలే యలరారుచున్నవి. ఈప్రకారముగానే "ఆముక్తమాల్యద" లోఁ గూడ దేశకాలపరిస్థితివర్ణనలలోఁ గవి తాను స్వయ ముగాఁ గని వినిన యంతయును వర్ణించినాఁడు. శ్రీవిల్లుపుత్తూరువర్ణనమునఁ బ్రత్యేకముగా నాస్థలానుభవము మిక్కిలి చక్కగాఁ జిత్రింపఁబడినట్లు కాన్పించు చున్నది. అట్లె పాండ్యదేశపు రాజసభవర్ణనమును, ఇంకసమకాలికదేశకాలప రిమాణవ్యవస్థలను యథాస్థితముగా ననేకస్థలములఁ బొందుపఱిచినాఁడు. మ చ్చునకై యీపద్యమును జూడుఁడు.

చ. రయమున వృష్టికై యొదిఁగి రచ్చలపై విడియింతు రుగ్రతన్
హయపతిమీఁద దంతిపతి నాతనిపై నృపతిం గజాదిని

ర్ణయముల మొత్తులాడుదురు మబ్బ్బాకయించుక విప్ప విచ్చుమొ
గ్గయి మఱి పాఱిపోదురు సమస్తదిశాగతులైన యధ్వగుల్.

దీనియందుఁ దన కాలమున జరుగుచున్న ఘోరసమరములవిషయము నెంత హాస్యగుంభితముగ వర్ణించెనో చూడుఁడు ! నృపతి యగుతానును హయపతి యగుబహుమనీసుల్తానును గజపతియగు కటకరాజును హోరాహోరిగఁ బోరుచుండిరి గదా ! ఈవిషయమును వర్షాకాలవర్ణనలో నిమిడ్చెను!

ఇట్లు సమకాలికవిషయములను దమకావ్యములలోఁ జొప్పించుపద్ధతి కృష్ణదేవరాయలతోఁ బ్రారంభించినను పెద్దన్న, తిమ్మన్న, మున్నగువారియందంత కాన్పింపదు. ఈవిషయమునఁ బింగళి సూరన్న రాయల నెక్కువగ ననుకరించెను. భావప్రపంచమున నింత సర్వస్వతంత్రుఁడు గా విహరించిన మహాకవి రసనిరూపణమున నొకింత కుంటువడి యుండుట యాశ్చర్యజనకము గదా. తనయాస్థానకవు లగుపెద్దనాదులతో దీటుకొనఁదగు ప్రతిభాగౌరవములు గలిగియు, సర్వజ్ఞబిరుదమునకు నాచనసోమునితో సమానముగాఁ బోటీవహింపఁగల బుద్ధిశాలియునై యీకవితంసుఁడు రసవికసనవిషయమున, ముఖ్యముగా శృంగారరసవర్ణనవిషయమున నామేటికవులతోఁ దులఁదూఁగ లేకపోయె నని చెప్పవలసినందుకుఁ జింతిల్లుచున్నాను. ఇతనిశాంతరసవర్ణనము మనోహరముగ నుండి మనహృదయములయందు భక్తి నావిర్భవింపఁజేయఁగలదు. విష్ణుచిత్తుని జీవితవర్ణన మంతయు శాంతరసయుతమే కదా ! "గృహసమ్మార్జనమో, జలాహరణమో, శృంగారపల్యంకికావహనంబో" ఇత్యాదిపద్యముల నాభక్తమూర్తి శాంతచిత్తత, యతిమృదులముగ నభివర్ణింపఁబడినది. మఱి వీర, రౌద్ర, భయానక, బీభత్సరసములు తత్తదనుగుణ స్థలముల నధికనైపుణ్యముతోఁ జిత్రించెను. మాలదాసరి యెదురుకొన్న బ్రహ్మరాక్షసుని వర్ణించినభాగములు చదివిన శరీరము కంపించును. బుద్ధిచలించును.

"ఎలనీటిబోఁడలఁబులఁబోలె మెదడెల్ల జుఱ్ఱివైచిన డొల్లుపుఱ్ఱగములు.

ఇత్యాదిపద్యము లుదాహరణములు.

అయినను శృంగారరసవిషయములో మాత్ర మింత ధ్రువముగాఁ జెప్పలేము. ఆముక్తమాల్యదయు నామెచెలికత్తెలును శృంగారరసప్రసంగములు చేయునప్పుడు హృదయము రసానుకంపన మొందుటలేదు. ఆముక్తమాల్యద విరహోత్కంఠితయై కలవరించుచున్ననుఁ జెలికత్తెలు నిర్వికారముగ నూఱ

డింపుమాటలు పలుకుచున్నను, బాలకుని యుల్లంబున ననుకంపాలేశము కలుగుట లేదు. చిత్తరువున లిఖించిన దృశ్యముఁ జూచిన నెంతమాత్రము హృదయస్పందనము కలుగునో యంతియ కాని తాదాత్మ్యరూప మగురసపారవశ్యము కలుగ లేదు. విరహిణి యైనవరూథినీపరిదేవనము వినిన, భవభూతి చెప్పినట్లు "అపిగ్రావారోదం త్యపి దళతి వజ్రస్య హృదయం" అన్నమాటలు యథార్థములగుచున్నవి. రాతిగుండియు చెదరిపోవును. మఱి మానవునిహృదయము కరఁగిన దనిన నెంత ?

అసూయాపరవశ యైన సత్యభామాక్రందనము వినిన నెవ్వరిమనస్సు జాలిఁగొనదు ? అట్టివికారము లెవ్వియు నాముక్తమాల్యదయవస్థలు పుట్టింపఁజాలకున్నవి. ఆముక్తమాల్యదవిరహావస్థను వర్ణించుచుఁ జెలికత్తెలు చెప్పినమాటలు వినుఁడు.

చ. ఎఱుఁగరుగా యొకద్భుతము నీచెలి దీర్ఘికఁ దీర్థమాడ నా
　యఱుతఁ దగిల్చి పోవు దనహారము వోయిన నేనుబోవుదుఁ
　మఱవక వెంటఁబోవ జలమగ్నత నౌనది సున్నమైనఁ దాఁ
　గఱకఱిఁ బెట్టి పొమ్మనుగుఁ గాని నిజార్తి యెఱుంగ దేమియున్.

మ. అనినన్ స్రగ్విణి వల్కెఁ దన్నుఁ జెలులారా నే లతాడోలఁ జి
　క్కన నూపం దెగి వ్రాల దీనిచనుప్రేంకం బెక్రియం దాల్తునా
　యని పట్టం దినమధ్యమార్కరుచిఖద్యన్మంజుపుల్ వోని వా
　డినపాలిండ్లను బెండుబొమ్మగతి నుండె న్నాఁడటం జుల్లనై !

ఈ రెండుపద్యములలోను రసజ్ఞానముకంటె రసాయనజ్ఞాన మెక్కువగాఁ గవి కనఁబఱిచినాఁడని చెప్పవలసియున్నది. విరహతాపముచే ముత్యము లుడికిపోయి జలక్రీడాసమయమున నీరు తగులగానే సున్నపుగుల్ల విడిపోయినట్లు విడి సున్నమైన దని చెప్పినాఁడు. ముత్యమును సున్నము నొకపదార్థమే యను రసాయనవిషయమును ఋజువు చేసినది గాని, యామె విరహాతిరేకమును మన మనస్సునకు స్ఫురింపఁజేయఁజాలదు. అట్లే యా రెండవపద్యమందలి విషయమును, ఆమెశరీరము విరహానలముచే మిక్కుటమైన వేఁడిమిఁ బొంది క్రీడాడోలికగా నున్న లేఁదీఁగను శోషించి త్రెంపి వేసినదఁట- (కాల్చివేసిన దని చెప్పిన మఱింత బాగుగా నుండునుగదా !!) ఇట్టి విపరీతభావములప్రోవులే యీ కవి యొక్క శృంగారరసవర్ణనలు ! ఉద్రేకమునుఁ దదుచితరసభరితశబ్దజాలముచే

సహజముగ వర్ణించుట యీకవి యెఱుంగఁడని నాయదికిఁ దోఁచుచున్నది. పెద్దన్న కావ్యమందలి "ప్రాంచద్భూషణబాహుమూలరుచితో" అనియు, తిమ్మన కావ్యమందలి, "ఇందునిభాస్య మైతొడవు లేల ధరింపవు" అనియు నిట్టి రసార్ద్రపద్యములు చాలఁ దక్కువగ నీ గ్రంథమునఁ గాన్పించుచున్నవి. ఉద్రేకావస్థను స్వాభావికముగ వర్ణింపలేనిలోప మీకవియందు ముఖ్యముగఁ గాననగును. కాన నీతనికవిత్వమునందు భావోద్రేకముకంటె భావగాంభీర్యమును, రసవిజృంభణముకంటె బుద్ధిప్రకాశము నెక్కువగాఁ గాన్పించుచున్నవి.

అలంకారములయందుఁ బ్రాయికముగా నర్థాలంకారములే యీకవి వాడియుండెను. ఉపమ, రూపకము, ఉత్ప్రేక్ష, స్వభావోక్తి, అతిశయోక్తి, యిత్యాద్యర్థాలంకారములలో నేదో యొకటి ప్రతిపద్యమునందును జూడనగును. ఉత్ప్రేక్ష లన్నిటికంటె నెక్కువగా నున్నవని యిదివఱలోనే చెప్పితిని. శబ్దాలంకారములు మిక్కిలి యరుదుగాఁ బ్రయోగింపఁబడినవి. అచ్చటచ్చట శ్లేష చక్కగఁ జమత్కారముగ వాడఁబడినది.

శా. అప్పుల్వారిధిచేతఁ బుచ్చికొని కార్యంబైన మున్గొన్న య
య్యప్పుల్ దాచనియు న్సవృద్ధికముగా నవ్వార్ధికే తీర్పఁగా
నప్పుణ్యాతివిశుద్ధజీవుఁడు నిజాచ్ఛాంగంబులం దోఁచున
ట్లొప్పారె న్శశిబింబగర్భితములై దోశ్చారిశుభ్రాభ్రముల్.

అనుప్రాసములును యమకములును నెచ్చటను గాన్పింపవు. శబ్దార్భటి శబ్దాలంకారవికారముఁ బొందలేదు. కావున నీకవియు శైలివిషయములోఁ బెద్దనాదిమహాకవులదారినే పోయె నని నిర్ణయింపవచ్చును.

ఈకావ్యమందుఁ బద్యశైలికంటె గద్యశైలి నిరుపమానముగఁ దేజరిల్లుచున్నది యని నాయభిప్రాయము. వచనభాగములలోఁ బదలాలిత్యము, అర్థవైశద్యము, అన్వయసౌలభ్యము, మెండుగఁ జూపట్టుచున్నవి. కృష్ణరాయనిగద్యశైలియందు సామాన్యము లగువాడుకపదములనే ముఖ్యముగాఁ గానవచ్చును. వాక్యములు నాతిదీర్ఘములు గాక కవియొక్క యభిప్రాయములను దేటతెల్లముగాఁ దెలుపుచున్నవి. నాచనసోమనాథుఁడు, శ్రీనాథుఁడు మున్నగువారి వక్రప్రౌఢదీర్ఘసమాసములను జేర్చి కాని యనుప్రాసయమకాది శబ్దాలంకారముల కొఱకుఁ బెనఁగులాడి గాని వచనశైలి యతికఠినము చేయఁబడలేదు. పద్యశైలియందుకంటె నీవచనములయందు స్వరమాధుర్య

మెంతయో వీనులకు విందొనరించుచున్నది. గద్యలలో లలితమృదులోక్తులు గూర్పఁగలిగిన గ్రంథకర్త పద్యములలోఁ గర్కశకాఠిన్యమునకుఁ బాల్పడుట యెంతయో విస్మయజనకముగ నున్నది. ఇందలి పద్యములు ధారాళముగాఁ బ్రవహింపలేదని యిదివఱలోఁ జెప్పఁబడినది. కాని వచనము లట్లుగాక శ్రుతిసంతుష్టిదాయకము లగురసస్నిగ్ధపదముల మధురగుంఫనమూలముగాఁ జదువం జదువ నానందము హెచ్చించుచుండును. ఈ యుదాహరణముఁ జూడుఁడు:—

"అని యిట్లు త్రపాభరంబున నుపాలంభదంభంబుగఁ జేయు పునఃపునస్స్మరణంబున నంతఃకరణరాగంబు తేటపడం జెలిమిబోటు లీబోటి కైటభారియెడ నాటుకొన్న కన్నెకన్నారి లజ్జావశంవదయై... ...నర్మగర్భంబుగా నిట్లనిరి" ఇంత మనోహరముగానే యితరవచనములుగూడ రచింపఁబడినవి.

పాత్రపోషణము:— ఈకావ్యమందలి పాత్రపోషణము మనుచరిత్రాది సామాన్యకావ్యములవలె నుండదు. సామాన్యముగాఁ గావ్యములయందుఁ గథాపాత్రలగుస్త్రీపురుషులు తమతమవ్యక్తులను బట్టియు, శక్తులను బట్టియు, యోగ్యతాయోగ్యతలను బట్టియుఁ దమ జీవితచర్యల నిర్ణయించుకొనెదరు, భగవంతుఁడు ప్రత్యేకముగను బ్రత్యక్షముగను, నిగ్రహానుగ్రహసంవిధానము సలుపుచుండుట గానిపింపదు. ప్రవరుఁడు తనసౌశీల్యముచేతను, ఇంద్రియనిగ్రహముచేతను వరూథినీసంపర్కమునుండి తప్పించుకొనియెను. వరూథిని తనయైంద్రియభోగేచ్ఛకు బానిసయై కుహనాప్రవరుని మాయలలోఁబడి తనశీలముఁ గోల్పోయెను. పారిజాతాపహరణమున భగవంతుఁ డగు శ్రీకృష్ణుఁడును సత్యభామయు నున్నగువారు సామాన్యస్త్రీపురుషులవలెనే సుఖదుఃఖములను యోగక్షేమములను గనఁబఱుచుటయు మానుషత్వనియమముల నతిక్రమింపక ప్రాపంచికభోగేచ్ఛాద్యనుభవములను వెలయించిరి. ఇట్లే తక్కినయనేకప్రబంధములందు స్త్రీపురుషపాత్రలు స్వయంవ్యక్తియు స్వయంశక్తియుస్వాతంత్ర్యమును గనఁబఱుపఁగలిగిరి.

ఆముక్తమాల్యదయం దట్లుగాక కథాపురుషుల ప్రవర్తనములు వేఱుగఁ జిత్రింపఁబడినవి. ఈకథయందు భగవంతుఁ డగు మహావిష్ణువే సర్వాధికారి; భగవంతుఁడు సర్వజ్ఞుఁడు, సర్వశక్తుఁడు, సర్వవ్యాపి యను నిర్వచన మీగ్రంథమందుఁ బూర్తిగ నెలకొల్పఁబడినయది. మహావిష్ణువు కార్యాకార్యప్రేరకశక్తిరూపమాత్రముగ నుండక ప్రత్యక్షముగ సాకారరూపము వహించి కథాపురు

షుల పరస్పర జీవితచర్యల నిర్ణయించుచు వచ్చెను ఇతర కావ్యములయందుఁ గథాపాత్రలస్థితిగతులు నాటకరంగము నందలి స్త్రీపురుషుల యన్యోన్య సంయోగవియోగములవలెఁ గాన్పించును. ఈకావ్యమునందలి కథాపురుషులనడవడు లన్ననో తోలుబొమ్మలాటలోఁ బ్రదర్శింపఁబడు క్రియాకలాపము వలె గోచరించును. తోలుబొమ్మలాటలోఁ దెరపైన నాడుచున్న బొమ్మలన్నింటిని నాడించి పాడించెడుసర్వస్వతంత్రాధికారి వేఱుగ నుండును గదా? అట్లే యీ కావ్యమునందును సర్వజ్ఞుఁడు ను సర్వశక్తుఁడు నగుమహావిష్ణువు ప్రత్యక్షముగాఁ గథాపురుషుల నందఱిని జగ్గసాలభంజికలవలె సల్లాపప్రమోదముల నాడించుచున్నాఁడు. విష్ణుచిత్తుని మధురలో జరుగుచున్న పండితసభకు వెళ్లుమని మహావిష్ణు వానతీయఁగ నతను చదువెఱుఁగని యజ్ఞాని నని యనేకవిధములఁ జెప్పికొనినను మహావిష్ణువు తనరాణియగు నాదిలక్ష్మికిఁ దనయద్భుతఘటనాఘటనప్రభావముఁ గనఁబఱుచుటకుఁగ నావిష్ణుచిత్తుని వెంటనే సభకుఁ బంపించి పరకాయప్రవేశము చేసినట్లు చదువెఱుఁగని తనకింకరునిచే మహావాదము చేయించి యాఱితేఱిన పరమతమహాపండితుల నవలీలగా గెల్పించి తనవిజయముఁ బ్రకటించుకొనెను.

“క్రియాసిద్ధిః సత్త్వే భవతి మహతాం నోపకరణే” అను వాక్యము సార్థకమైనది. కథానాయిక యగుగోదాదేవి కాజన్మతః మహావిష్ణుసంసేవనమే పరమావధిగా నుండెను. విష్ణుప్రాప్తి దక్క యామెకు వేఱు జీవనమే లేదు. అట్లే ఖాండిక్యకేశిధ్వజరాజన్యులును-ఖాండిక్యునకుఁ గేశిధ్వజుఁడు రాజ్యము దిరిగి యిచ్చివేయుటకు నిచ్చగించి బతిమాలుకొనినను మోక్షప్రదాత యగు విష్ణునిసేవదక్క మఱి దేనిని నభిలషింప నని మొండిపట్టు పట్టి తనయమాత్యపరివారముల హితబోధనను సరకుచేయ లేదు. కేశిధ్వజుఁడు తాగెలిచినరాజ్యము దనస్పర్థి యగు ఖాండిక్యునికొడుకున కొప్పగించి యపవర్గప్రదాత యగు శ్రీమహావిష్ణుని పాదసేవఁ జేయ నూల్కొనెను!

యామునాచార్యుఁడు రాజ్యసుఖములలోఁ దగుల్కొని తనపూర్వులగు వైష్ణవభక్తాగ్రేసరుల సంప్రదాయములను విష్ణుసేవాప్రపత్తులను మొదలంట మఱచి శ్రీరంగనాథునిపాదములఁ జూచినమాత్రమునఁ గలలోనుండి మేల్కాంచినరీతినిఁ దనపూర్వవృత్తాంత మంతయుఁ దెలిసికొనెను. మాలదాసరి తాను ప్రభాతసమయంబునఁ బాడిన విష్ణుస్తోత్రమందలి చరమ గీతమాత్రమున బ్రహ్మ

రాక్షసుఁడు తనవికృతాకారము వీడి "ధూమపటలినుండి వెడలుశిఖవోలెఁ జూడఁజూడ వైష్ణవుఁడై నిలిచె సోమశర్మ" అని చెప్పినట్లు స్వచ్ఛమగు వైష్ణవబ్రాహ్మణుండయ్యె. ఇట్లెక్కడఁజూచినను వైష్ణవమహిమయె. స్త్రీపురుషులవ్యక్తిజీవితములు వేఱుగ నగపడవు. విష్ణుప్రభావము లేనిది యొకరిని మఱియొకరు మార్చలేరు తీర్చలేరు. "సర్వం విష్ణుమయం జగత్" అన్నవిధివాక్య మీగ్రంథమం దామూలాగ్రముగ నిరూపింపఁబడినది. కావున నీగ్రంథమునకు 'విష్ణుచిత్తీయ' మనుటకుబదులుగా 'విష్ణుశక్తీయ' మని కాని 'విష్ణుభక్తీయ' మని కాని యనిన సార్థక మగు నని తోఁచుచున్నది.

కాఁబట్టి పాత్రపోషణమునం దీకవికిఁ దనప్రావీణ్యముఁ బ్రత్యేకముగ నీగ్రంథమునఁ జూపింపఁగల యవకాశములు తక్కువ యైనవి. అయిన నొక్కవిశేషముమాత్రము గమనింపఁదగ్గది. మహావిష్ణుమాహాత్మ్యమునకు లోఁబడి జీవితములయందలి తదితరచర్యలయందుఁ గథాపురుషులు తమతమప్రత్యేకమానవకర్మధర్మమర్మములను గడుంగడు శ్లాఘనీయముగా నిర్వర్తించుకొనిరి. వారితత్తజ్జీవితప్రవృత్తుల నీమహాకవి యతిమనోహరముగా వర్ణించినాఁడు. విష్ణుచిత్తుఁడు తనయింట నతిథుల నహోరాత్రములు సంతర్పించుట, దేవాలయములలో వటపత్రశాయికి నిత్యకైంకర్యములు చేయుట-అనఁగాఁ బువ్వులమొక్కలకు గొప్పుద్రవ్వుట, నీరువోయుట, దేవునివాలకి మోయుట, దివిటీపట్టుట- యిత్యాది యూడిగములు చేయుట-తనధర్మపత్నికి వంటింటిపొగచేఁ గన్నులకు జబ్బు రాకుండ నెండుకొబ్బరిడొక్కలను జాగ్రత్తపెట్టి యిచ్చుట, తనపెంపుడుకొమార్తెయగు గోదాదేవియం దపరిమితానురాగముఁ గనఁబఱుచుట, యీ మొదలైన సుగుణసంపత్తియంతయు నత్యంతహృదయంగమముగా నభివర్ణింపఁబడినది.

గోదాదేవికిఁ దనపెంపుడు తల్లిదండ్రులయందుఁ గలయనురాగపుఁబెంపు తెలిసికొనుట కవకాశము గలుగలేదు. బాల్యము నుండియు నామె జీవితము జనార్దనునిసేవాతాత్పర్యములలో లీనమయ్యెను. ఈయమమానవత్వము నామమాత్రము. కథానాయకుఁడగు శ్రీరంగ నాథుఁడువలెనే కథానాయికయు నతిమానుషవ్యక్తియయ్యెను. ఖాండిక్యకేశిధ్వజులసుచరిత్ర మీయార్యభూమిని జన్మించిన రాజన్యవరేణ్యులజీవితచరిత్రముల కెంతయు వాసి తగ్గదు. క్షుద్రజీవనము చేయుచు ధనాశాపిశాచావేశముఁ బొందిన నామమాత్రబ్రాహ్మణుఁడు కట్టకడకు బ్రహ్మరాక్షసుఁ డెట్లగునో సోమశర్మజీవితము వలన ద్యోతక మగును

బ్రహ్మరాక్షసుఁ డన రాక్షసకృత్యములకు నలపడిన బ్రాహ్మణుఁడే యని యీకథయందు విశేషముగ విశదీకరింపఁబడినది.

ఈపైనఁ బేర్కొనినఁ కథాపురుషుల జీవితచరిత్ర వర్ణన లన్నియు నొక యెత్తు శివమతస్థుఁ డగు పాండ్యరాజును వైష్ణవభక్తురా లగు నతనిభార్యయు వారిజీవితచరిత్రముల యభివర్ణన మంతయు నొకయెత్తు. ఈచక్కనియుపాఖ్యానము స్వభావసమృద్ధిగాఁ గవిచే నిరూపింపఁబడినది ఈకథయందు మహావిష్ణు వెట్టెట్టో యాత్మగోపనము చేసికొని మనుష్యమాత్రు లెట్లు స్వస్వబుద్ధులతో ముముక్షుమార్గముకొఱకై ట్లన్వేషింతురో యాదృశ్యము మనకుఁ బ్రసాదించెను. "ద్రవిడమండలంబున మద్భక్తులు తఱచగుటను దద్దేశంబున కొడ యుం డతండగుటను, రక్షణశిక్షణంబులు రాజముఖంబునంగాక నేన సాక్షాత్కరించి చేయుమియు" నట్లాలోచించి మహావిష్ణువు స్వప్రకాశముగ నాపాండ్యరాజునకుఁ గాని యాతనిభార్యకుఁ గాని, యామునాచార్యునకుఁ గాని సాక్షాత్కరించి యాదేశం బీయకయె తనమనోరథంబు నెఱవేర్చికొనఁగలిగెను. ఈ మార్గమును కావ్యమందలి తదితరవిషయములలోఁ గూడ నవలంబించినచో నెంతయో సమంజసముగా నుండెడిదిగదా!

పాండ్యరాజు శైవుఁడగుటచే జంగమదేవరలకు విధేయుఁడై వైష్ణవులను బ్రాహ్మణులను బీడించుచుండెడువాఁడు. ఆతనిపట్టపుదేవి వైష్ణవభక్తురాలు. ప్రాతఃకాలముననే లేచి తులసీపూజచేసియు వైష్ణవకథలు వినియు నేకాదశీదినముల నుపవాసంబులు చేయుచుఁ దనయక్కజమగు విష్ణుభక్తి నిలుపుకొనుచువచ్చెను. అట్లైన నాసుశీలకుఁ దనభర్తయం దనురాగము భక్తియు లేశమంతయుఁ దగ్గలేదు. పతిసేవయుఁ బతిపూజయుఁ బొరపొచ్చెములేకయే చేయుచుండెను. ఇట్లుండ యామునాచార్యుఁడను వైష్ణవవటు వాపాండ్యరాజును శైవమతమునుండి వైష్ణవమతములోనికి మార్చుటకుఁ బూనుకొని యందుకుగా నొకగొప్పమహాసభ నేర్పాటుచేయించి యాసభలో శైవపండితులతోఁ దాను వాదముచేసి వారి నోడించి వైష్ణవమతము స్థాపించి తద్విధముగ నారాజునకు విష్ణునియందు భక్తికుదురునట్లు చేయ నుద్దేశించెను. ఈప్రకారము సభచేయించుటకొఱకు రాజునకు విన్నపము చేయుటకైనను నితరులు వెఱతురు కాని పతివ్రత యగురాణిమాట కెంతయు రాజు విధేయుఁ డగుటచే నామె మాత్రమె యట్టి యనధ్యపుఁబనికిఁ జొరకొనఁ దగియుండెను. కాన

యామునాచార్యుఁడు మహారాణికి దౌవారికులద్వారా తనసంకల్పము విన్నవించుకొని సభ కావించుకొనెను. అందు యామునుఁ డభ్యస్తవిద్యాసంపన్నుఁడగుటచే శైవమతాచార్యుల నవలీలగా గెలిచి ప్రతిజ్ఞాపూర్వకముగఁ బాండ్యరాజును విష్ణుభక్తిపరాయణుని జేసెను. ఈకథ యంతయు సలలితముగఁ జిత్రింపఁబడినది. ఇందలిపాత్రపోషణ మపూర్వపరిశీలనాశక్తిని వెల్లడిచేయుచున్నది. చక్రవర్తుల యంతఃపురస్త్రీల జీవితములును, వారి యాచారవ్యవహారములును, ప్రజలకు నాయసూర్యంపశ్యలకు నెట్లెట్లు సందర్శనాకాంక్షాఫలములు కలుగుచుండునో యావిషయములన్నియు బహుసూక్ష్మముగ వర్ణింపఁబడినవి. అంతఃపురములో నుండు రాణివాసపుస్త్రీలు కేవల మైంద్రియసుఖ పరాయణులుగా నుండక సామాన్యజనుల కష్టసుఖముల ననురాగదృష్టితో నారయుచు వారి కనేకవిధములఁ దగుద్రవ్యసహాయము చేయుచుందు రని యీచక్రవర్తికవిమూలముగాఁ దెల్ల మగుచున్నది.

శ్రీకృష్ణరాయని ప్రతిభావిజ్ఞానములు:-ఇంతవఱకు నీకావ్యమందలి గుణదోషములను నాశక్తికొలందియు వ్యాసావకాశమునుబట్టియు వివరించితిని. ఇంక మహాకవి శ్రీకృష్ణదేవరాయని ప్రతిభాసామర్థ్యములను జీవితాశయములను సాంఘికరాజకీయాధ్యాత్మికధర్మముల నీప్రబంధమునుండి తెలియవచ్చినంతమట్టుకుఁ గ్రోడీకరించెదను. ఈగ్రంథమును జదువునప్పుడు మున్ముందుగఁ బ్రతిపాఠకునికిఁ దోఁచునభిప్రాయ మేది యనిన నాగ్రంథమందలి శబ్దబాహుళ్యమును శబ్దకాఠిన్యమును సామాన్యముగ నాంధ్రదేశమందుఁ బేరెన్నిక పొందిన యాంధ్రప్రబంధములలో దేనియందు నీకవి వాడుకచేసినన్ని కఠినపదములు సంస్కృతమునఁ గాని యాంధ్రమునఁ గాని బహుశః శ్రీనాథుఁడు తప్ప మఱి యెవ్వరును వాడుచేసియుండ రని నాయభిప్రాయము. నిఘంటువులు నశించినయెడల నపరూపక (Rare) పదముల ప్రదు కే మగునో యని యీకవి తప్పక వానినే వాడెనో యనున ట్లనితరకవిప్రయుక్తము లగుపదములను దఱచు వాడుచువచ్చెను. సామాన్యముగ నితరకవులు 'దవానలము' 'దవాగ్ని' యనునప్పు డితను "దవథుభరము" అనెను. 'కపిల' లేక 'పింగళ' యనుశబ్దమున కితఁడు 'కడార' అని వాడెను. 'అల్పకాల' యనుదానికి 'అల్పానేహః' అనియు 'కరిణి' యనుటకు 'వశా' యనియు, 'సరణి' 'పద్ధతి' అనుటకు 'పద్యా' అనియు ని ట్లనేకము లగు నపరూపశబ్దములనే వాడెను.

ఈ కవియొక్క సర్వంకషశబ్దపరిచితినిఁగూర్చి శ్రీవేంకటరాయశాస్త్రిగారీక్రిందివిధమున నభిప్రాయపడియున్నారు. "ఈయనకు నాంధ్రగైర్వాణకావ్యాదివాఙ్మయ మెల్ల జిహ్వాగ్రగతము. ఇందలి యనుబంధములోని మహాకవిప్రియశబ్దజాలములను "తృణతా, తెండి, మత్తల్లి, కర్కరీ" యిత్యాదులం గనునది. సంస్కృతశబ్దశాస్త్రపాండిత్య మసాధారణము-శబ్దోపదేశమున నిది మనుచరిత్రకుఁబైది."

మఱి రెండవయభిప్రాయ మేమనిన:-ఈకవియొక్క సర్వస్వతంత్ర ప్రపంచజ్ఞానము-కృష్ణదేవరాయలు చక్రవర్తివంశమునఁ బుట్టి, పెరిఁగి చక్రవర్తియై లోకమందలి నానాతరగతుల సంఘజీవితముల నెట్లు కనిపెట్టఁ గలిగెనో యద్భుతజనకమైనవిషయము. ఈమహాకవికిఁ జరాచర ప్రపంచమునం దేదియుఁ దెలియరాకుండలేదు. మృగజీవితములు, పక్షిజీవితములు, జలచరజీవితములు, మున్నగువాని నతిసూక్ష్మముగ గ్రహించినట్లు తెలిపెడుపద్యములు గలవు. ఇంక మానవకోటిలో రాజు మొదలు రెడ్డివఱకును, బ్రాహ్మణుఁడు మొదలంత్యజునివఱకు నన్నిజాతులు నన్నివర్ణములు వారివారి జీవితములలో యోగక్షేమములు, కష్టసుఖములు, నాచారములు, నలవాటులు, నిష్టానిష్టములు, వృత్తులు, వేయేల సమస్తవిషయములు నీతనికిఁ గరతలామలకములైనట్లు విస్పష్ట మగు ఋజువులు కాన్పించుచున్నవి. "విద్యలకు నెల్ల నుత్తమవిద్య కవిత దానిఁ దెలియుట విశ్వమంతయును గనుట" యని యప్పకవి చెప్పినమాటలు నిజమయ్యెను.

సూక్ష్మదృష్టిని వాఙ్మయమును బరిశీలించినరీతినిఁ బ్రపంచము నంతనుఁ బరిశోధించినట్లు తెల్ల మగుచున్నది. ఈసర్వస్వతంత్రవిజ్ఞాన మంతయు ననేకసందర్భములలోఁ జూపించినాఁడు. పాండ్యరాజుభార్య యనుదినము చేయుగుప్తదానధర్మములను జూచిన నీమన్నుఁడు తనరాణివాసమున జరుగుచున్నదినచర్యక్రమమును గనిపెట్టె నని చెప్పవచ్చును. ఆవిషయము నిచ్చట నుద్ధరించెదఁ జూడుఁడు.

"నానాదేశాగతదీనానాథవృద్ధభూసురకుటుంబములకు, ధాన్యాజినపటాదులును, వటువులకుం బెండ్లిండ్లకనుపనీతుల కుపనయనంబులకుఁ బంగ్వాంధబధిరాదులకు సౌరభేయాదియానంబులు, మఱియుఁ జెఱువు గడమవడియెననియుఁ, బేదగుడులకుఁ బూజ నడువ దనియు, నెడవునం జలిపందిరిడియెదమనియుఁ దిథి చిక్కెననియుఁ, దీర్ఘయాత్ర చనియెద మనియు, వ్రతోద్యాపన

కనియు, నారాశివాసంబు గుప్తాగుప్తప్రకారంబులం బంపు ద్రవ్యంబుఁ దెచ్చి యిచ్చుముదుసళ్లగు వర్షధరుల చేతులకుం గ్రందుకొని చేసాచిన.........”

విష్ణుచిత్తుని బ్రహ్మరథ మెక్కించి మధురాపురమునుండి శ్రీవిల్లిపుత్తూరు తీసికొనిపోవునప్పుడు చేసిన మహోత్సవమును ముఖ్యముగాఁ జదివితీరవలెను. ఆవర్ణనము బ్రహ్మరథోత్సవమునకుఁ దగినది కాకపోయినను జక్రవర్తి దిగ్విజయ యాత్ర జరిగించి రాజధానియందుఁ బ్రవేశించునపుడు రాజబంధువులు సామంతరాజులు పురజనులు కలసి జరిగించిన యూరేగింపు టుత్సవము కన్నులకుఁ గట్టినట్లు కాన్పించును. ఇట్టి యుత్సవము లెన్నియో కృష్ణదేవరాయలకు జరుపఁబడియుండును. ఆయుత్సవములలో జరుగు ప్రతివిశేషమును సూక్ష్మపరిశీలనక్రమమున మనకన్నుల యెదుట జరుగుచున్నట్లు చిత్రించినాఁడు. ఈవర్ణనము పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు జైమినిభారతమున వ్రాసిన దండయాత్రవర్ణనతో సరిచూడవచ్చును. ఇట్టివర్ణనలను గ్రోడీకరించి మనము ప్రత్యేకముగా ముద్రించిన, ప్రాచీనకాలమందలి హైందవరాజకీయజీవితదృశ్యములు సినిమాపటములవలె మనయనుభవములోనికి రాఁగలవు.

పల్లెటిగ్రామములలో నున్న కర్షకులవృత్తి జీవితములను వివరించు విశేషము లనేకసందర్భములలోఁ జెదరి యున్నవి. వారి యిండ్లతీరు, వారి భోజనపదార్థములు, వేఱువేఱు ఋతువులలో వారెట్లు కాలము గడుపుచుండురో వారి విహారములు, వినోదములు, నాటపాటలు, నివన్నియుఁ, బూసగ్రుచ్చినట్లు సూక్ష్మాంశములతో నచ్చటచ్చట నభివర్ణింపఁబడినవి.

మ. గురుగుం జెంచలిఁ దుమ్మి లేదగిరిసాకుం దింత్రిణీపల్లవో
త్కరముం గూడఁబొరంటి నూనియలతోఁ గట్టావికుట్టారికో
గిరముల్ మెక్కి తమిం గొామల్ పొలమువోఁ గ్రేపుల్ మెయుల్నాక మే
కెరువుంగుంపటిముంచ మెక్కిరి ప్రభుత్వైకాప్తి రెడ్లజ్జడిన్.

వీనియన్నిటికంటె మహత్తరచిత్రమైన విషయ మొకటి కలదు. దానినిఁ జదివినఁ గడుంగడు నచ్చెరువు కలుగుచుండును. మాలదాసరి బ్రహ్మరాక్షసుని యుపాఖ్యానములో బీదబ్రాహ్మణుఁ డెట్లు డబ్బు సంపాదించి కూడఁబెట్టుకొనెనో యావర్ణన మతిచిత్రముగా నున్నది. గ్రంథవిస్తరభీతిచేఁ గొంచెముమాత్ర మిట నుదహరించెదను.

"సీ. బహువర్ణద్విజనకల్పపుఁబాదికం బిడి
పసిఁడికై తా వాని బంతిఁ గుడిచి" (ఆ 6 పద్య 69)

ఇట్లనేకనిదర్శనములు చూపవచ్చును. వీనిని బట్టి యీకవియొక్క నానారూపవిజ్ఞానము తెలియవచ్చుచున్నది. ఈమహాకవి సూక్ష్మపరిశీలనలోఁ జేరనివిషయము లెవ్వియైన నీపృథివియం దున్నవా యని సంశయింపఁ దగినంతసర్వంకష ప్రజ్ఞ యీతనియందుఁ గానంబడుచున్నది.

ప్రజలపట్ల సానుభూతియు, నానావర్ణజాతులయం దనురాగమిశ్రితాదరణయు, ముఖ్యముగా దేవబ్రాహ్మణభక్తియు నీభూజానియంతఃకరణమందు స్థిరముగా మొలచి యున్నవి. ప్రజాపీడన మనిన నీపుడమిఱేఁ డెంత భయపడెనో యీతఁడు రచించిన రాజనీతిక్రమమును జదివిన బోధపడఁగలదు.

క. ఏపట్టున విసువక ర,క్షాపరుఁడవు గమ్ము ప్రజల చక్కి విపన్నుల్
గూపెట్టిన విని తీర్పుము, కాపురుషులమీఁద నిడకు కార్యభరంబున్.

గీ. దేశవైశాల్య మర్థసిద్ధికిని మూలం,బిలయొకింతైన గుంటకాల్వలు రచించి
నయము పేదకు నరిగోరునను వొసంగి, ప్రబలఁ జేసిన నర్థధర్మములు పెరుఁగు.

క. త్రివిధోత్పాతము లొదవిన, నవనివిభుఁడు విడువవలయు నధికద్రవ్యం
బవనీసురముఖసురముఖ,పవనసఖముఖములభుక్తి బలిహోమవిధిన్.

ఈయవనీశుని రాజనీతిక్రమ మీగ్రంథమందు విధించినదానికిని బ్రసిద్ధముగాఁ దనరాజ్యమందుఁ దాను నిర్వహించినదానికి నించుకైనను భేదము లేదు. ప్రబంధనిర్మాత యగుకృష్ణదేవరాయఁడు నాంధ్రసార్వభౌముఁ డగుకృష్ణదేవరాయఁడు నొక్కఁడే యని ఘంటారవముగాఁ జెప్పవచ్చును.

కాని మతవిషయమం దట్లు చెప్పుటకు వీలు లేదు. మతాభినివేశమున నాముక్తమాల్యదకర్తయుఁ జరిత్రపురుషుఁ డగుశ్రీకృష్ణదేవరాయలును వేఱు మనుష్యులుగాఁ జెప్పవలసియున్నది. తనరాజ్యపరిపాలనమందుఁ జూపిన పరమత సహనమును దనగ్రంథమందుఁ జూపిన పరమత దుస్సహనమును—ఈరెంటిని సరిపెట్టుట కవకాశము లేకున్నది. శ్రీశైలమందు మల్లికార్జునస్వాములవారికి, నమరావతియందు నమరేశ్వరునకు, ద్రాక్షారామమున భీమేశ్వరునకు భూరిదానములు చేసిన యీహిందూమహాచక్రవర్తి తనగ్రంథమం దెట్లు శైవమతగురువుల నిష్కారణముగా నిరసించి దూషించెనో చెప్ప వీలు లేకున్నది. శైవాచార్యుల నందఱిని 'బ్రేలెడుదుర్మదాంధు ల'ని నికృష్టముగాఁ దిట్టినాఁడు. గ్రంథమం

దుఁ జూచిన కృష్ణదేవరాయలు వీరవైష్ణవుఁడు. చరిత్రయందుఁ జూచిన కృష్ణదేవరాయలు సర్వసమహిందూమతస్థుఁడు. ఈభిన్నప్రకృతి తీక్ష్ణముగా మతవిషయములయందుఁ గాన్పించుచున్నది.

శ్రీనాథుఁడు ప్రత్యేకముగా శైవగ్రంథముల వ్రాసెను. కాని వైష్ణవులను దూషించుట లేదు. శ్రీకృష్ణదేవరాయ లట్లుచేయక శైవమతదూషణముఁ గావించెను. వీరవైష్ణవముఁ బ్రకటించిన యాంధ్ర గ్రంథములలో నిదియే మొదటిది.

ఉపసంహారము:— ప్రపంచమం దెక్కడఁ జూచినను మహాచక్రవర్తులు గ్రంథములు వ్రాయుటయే యరుదు. అందు ముఖ్యముగాఁ బద్యకావ్యములను వ్రాయుట యెక్కువయరుదు. అట్టివిషయములో నాంధ్రవాఙ్మయమున కొక యమూల్యాలంకార మనఁనొప్పు పద్యకావ్యరాజమును రచించిన యుత్కృష్టభాగ్యమొకయాంధ్రమహాచక్రవర్తికిఁ గలుగుట యాంధ్రుల యలభ్యయోగ మనిసర్వదా కొనియాడఁదగియున్నది.

ఈమహాకావ్యము రసవంత మయినపద్యకావ్య మగుటయే గాక గీర్వాణాంధ్రభాషావైదుష్యములకు నికషోపల మనియుఁ జెప్పఁదగియున్నది. భాషావిషయమునఁ బారంగతత్వముఁ బొందిన దని చెప్పినను గూడ దీనిప్రాశస్త్యవర్ణనము పూర్తి యగుట లేదు. ప్రాపంచికవిజ్ఞాన ప్రదర్శనమునఁ గూడ నగ్రస్థానమలంకరింపఁదగి యున్నది. కావున నీకావ్యమతల్లి మూఁడువిధములగు యశోభూషణంబులను ధరించి యాంధ్రమహాజనులహృదయసీమల నద్భుతామోదములు పెంపొందించుచున్నది.

తీఱిక లేని చక్రవర్తి తీరుబడి చేసికొని యీకావ్యకన్య నలంకరించిన కతనఁ గొంతవఱకు రూపరేఖావిలాసములలోఁ గొఱవడుట తప్పినది కాదు. ఆయొచ్చెము లన్నియు జనకుప్రమాదాలసతజనితంబులు. "ప్రమాదో ధీమతామపి" యని యార్యన్యాయము. ఏది యెట్లున్నను రాజకుటుంబములో జనించిన కన్యకాలలామలు సహజలక్ష్మీసంపన్నలు కదా. వారి లోపముల నెంచుట యేరికిఁ జెల్లు? కాన కించిద్దోషలేశము లున్నను జాతిరత్నములవలె నిట్టికావ్యపుత్రికలు సర్వజనసమాదరణీయములే. అట్లే యీకృష్ణరాయకవీంద్రుని కావ్యేందిర నిత్యసంస్తవనీయమై శాశ్వతకీర్తిని నెగడొందుఁగాక!

శివయోగసారము.

మారేమండ రామారావుగారు బి. ఏ. ఆనర్సు. బి. ఇడి. రాజమహేంద్రము.

చరిత్రమునకును మతమునకును గూడ మిక్కిలి ముఖ్యమగు నీగ్రంథము చరిత్రకారులదృష్టి నాకర్షింపలేదు. ఇయ్యది పూర్వోత్తరభాగములు గలది. ఒక్కొక భాగమున నాల్గాశ్వాసములు గలవు. ఇందలి యుత్తరభాగము వారంగల్ శైవప్రచారిణీమండలివారిచే ముద్రింపఁబడినది. హైదరాబాదు లక్ష్మణరాయ పరిశోధకమండలివారియొద్దఁ బూర్వార్ధ చతుర్థాశ్వాసమును రాజమహేంద్రవర గౌతమీగ్రంథాలయమున మొదటి మూఁడాశ్వాసములును గలవు. పైగ్రంథాలయప్రతి యరుదైనది. శిథిలావస్థలో నున్నది. సుమారైదుమాసములకుఁ బూర్వము నేను జూచినపు డందలి నాలుగైదుపుటలలో నెడమవైపున నొక యంగుళముభాగము మాత్రము పోయినది. కొలఁదిదినములక్రిత మీవ్యాసమును రచించునపుడు తిరిగి యాగ్రంథమును బరిశీలింపఁగా నాఱవపుటలో సగము భాగ మదృశ్యమై యితరస్థలములలో గొన్ని క్రొత్తశిథిలము లేర్పడినవి. గ్రంథమునఁ గొన్ని తప్పులు కూడ గలవు. ఆంధ్రలోక మీగ్రంథమునుగూర్చి జాగ్రత్తదీసికొనవలసియున్నది.

కృతికర్త:—ఈగ్రంథమును రచించినవాఁడు గణపతిదేవుఁడు. అవతారికలో నీతఁడు తనవంశమును వర్ణించి యందుఁ దనకుముందుండిన వంశీయులను బేర్కొనియున్నాఁడు. మహావిష్ణువునకు బ్రహ్మపుట్టెను. ఆతనికి గౌండిన్యముని జన్మించెను. కౌండిన్యగోత్రమున నానగార్యుఁ డుద్భవించెను. ఆతనికిఁ బెదమల్లన పినమల్లనయను నిర్వురుసుతులు గల్గిరి. అందు, పెదమల్లన సోమపెదగన్నయ లను పుత్రులను బడసెను. వీరితల్లి పోచమాంబిక. సోమయకు అప్పాంబికయందు మనుమగన్నయ గల్గెను. పెదగన్నయకు గౌరమవలన అన్నయదేవుఁడు పుట్టెను. మనుమగన్నయకు మల్లమాంబికవలన రుద్రుఁడు, ఇమ్మడిరుద్రుఁడు, ముమ్మడిరుద్రుఁడు నను మువ్వురుసుతులును, సోమాంబికయను కూఁతును గల్గిరి. ఇందు రుద్రుఁడు గౌరాంబికను బెండ్లాడి గణపతి, ఔబలుఁడు నను తనయులఁ గాంచెను. ఈగణపతి అన్నమాంబ నుద్వాహమై మల్లమ, గౌరమయను దుహితలను, అన్నయ, రుద్రుఁడు, ఆదిమూలుఁడు ననుపుత్రులను గాంచెను. ఆదిమూలునికి లక్కమాంబవలన జనించినవాఁడు గణపతిదేవుఁడు. ఈతఁడే శివయోగసారరచయిత.

కవివంశమునకు కొలనివారనియు, నిందులూరివారనియు నామములు గలవు. దీనికి మూలపురుషుఁడగు నానగార్యుఁడు "ఇందులూరివిభుఁడు" అన్మకొండపురిలో నివసించుచు మిగుల విఖ్యాతుఁడైయుండెను. దీనినుండి యీనానగార్యుఁ డిందులూరు నగ్రహారముగనో లేక నాయంకరముగనో యనుభవించుచుండెననియు, నందుచే నాతనివంశమున కిందులూరివారను నామము వచ్చెననియుఁ దోఁచుచున్నది. ఈవంశీయులలో మూఁడవపురుషాంతరమువాఁడగు సోమయ కాకతీయగణపతిదేవచక్రవర్తి వెలనాఁడు దండయాత్రలలోఁ బాల్గొని కొలనిపురమును జయించి యంతటినుండియుఁ గొలని సోముఁ డని పేరొందెను. ఈతనికిఁ దరువాతవార లీ'కొలని'శబ్దమునే గృహనామముగ స్వీకరించిరి. దానఁజేసి శివయోగసారగ్రంథకర్త కొలని గణపతిదేవుఁ డగుచున్నాఁడు. ఈతఁడు కౌండిన్యగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు రాయచౌహత్తమల్ల, అభినవకామధేను, అన్యాంగనాసహోదర- బిరుదవిభ్రాజితుఁడు, నూతన కవితానిపుణుఁడు. శివయోగసారముగాక నీకవి పశుపాశపతిజ్ఞానము, అశరీరభవజయము, మనోబోధయను కృతులను 'దేశ తెనుఁగున' రచించెను. కఱకంఠుని కరుణచే నీతఁడు జనులౌనౌనని పొగడఁ 'గృతుల నాటకముల నేర్పున' రచనగావించెను. ఇంతకుమున్నె 'శివయోగసారసముచ్చయము' వ్యాప్తిలో నుండెనఁట. దానినాధారముగఁ జేసికొని, కవి తనగురుఁడును, శివయోగసార కృతిభర్తయునగు నూకనార్యునికృతి మాతృకగా శివయోగసార మను గ్రంథమును రచియించెనని తెలియుచున్నది.

కొలని గణపతిదేవకవి కాలమును నిర్ణయించుటకుఁ గొన్నియాధారములు గలవు. గ్రంథారంభమునం దీకవి సంస్కృతకవులను నుతించి, నన్నయ తిక్కన సోమనాథ చక్రపాణి రంగనాది యాంధ్రకవులను నుతించియున్నాఁడు. దీనినిబట్టి యీతఁడు క్రీ. శ. 13 వ శతాబ్దికిఁ దరువాత నుండె నని తెలియుచున్నది. కొలనివంశీయులలో నీగణపతిదేవుఁ డెనిమిదవతరమువాఁడు. ఈతని ముత్తాతకు జ్యేష్ఠుఁడు నైదవతరమువాఁడునగు కొలనిరుద్రదేవుఁడు కాకతీయ ప్రతాపరుద్రచక్రవర్తికడ సేనానిగనుండి క్రీ. శ. 1326 లో నొకధర్మమును జేసినటు లొకశాసనమునుండి తెలియుచున్నది. అప్పటినుండియుఁ దరమునకు ముప్పదేండ్లవంతున లెక్కించినచో, కొలని గణపతిదేవుఁడు క్రీ.శ. 15 వ శతాబ్ది ప్రథమపాదమునం దుండె నని స్పష్ట మగుచున్నది. సుప్రసిద్ధాంధ్రకవియగు

శ్రీనాథు నీగణపతిదేవుఁడు స్మరింపకుండుటగూడ నీతఁడు శ్రీనాథునికిఁబూర్వుఁడని యే దెల్పుచున్నది.

కృతిభర్త:—ఇందులూరి నూకనారాధ్యుఁడు శివయోగసారమును గృతి నందెను. గ్రంథావతారికలో నీతనివంశప్రశంసగూడఁ గలదు. వేంగినాఁటిలో హారీతగోత్రజుఁడు నాపస్తంబసూత్రుఁడునగు నూకనార్యుఁడు ప్రసిద్ధివహించెను. ఈతని తనయుఁడగు బల్లప్రెగడ నిరవద్యాపురరాజులకడ నమాత్యుఁడుగ నుండెను. తత్సుతుఁడు నాగమంత్రియు నిడుదవోలిచక్రవర్తుల కమాత్యుఁడుగనే యుండెను. అతనికి కొమ్మాంబయందు నూకరాజుజనించి కొమ్మాంబను బరిణయమయ్యెను. ఈదంపతులకు నాగయవల్లభేంద్రులను నిర్వురతనయులు గల్గిరి. ఇందు నాగయ 'రాయచౌహత్తమల్ల' బిరుదాన్వితుఁడై కొలని రుద్రదేవునిపౌత్రియు గణపతిపుత్రియునగు గౌరియనునామెను బెండ్లాడెను. ఈతఁడు ధర్మార్థకామములను సాధించి తుదకు సన్న్యసించి, కాశీక్షేత్రమునఁ బాశుపతవ్రతదీక్షనుండి మోక్షమునందెను. ఈనాగయమంత్రికి నూకయ పుట్టెను. ఈతఁడు పూడికొమ్మరాజుపుత్రికయగు గౌరిని బిదప లక్ష్మీదేవిని బెండ్లాడెను. మహాపండితుఁడగు తండ్రికి శుశ్రూష యొనర్చి యీతఁడు "సకలవేదపురాణశాస్త్రార్థసారవిజ్ఞాతయు, నాధ్యాత్మసంవేత్తయు నై," 'చన్నగురుసదాశివయోగినాఁ' బరగుచు 'కాశికాదేశముఖ్యప్రదేశములఁ జరించి కులకోటుల నుద్ధరించె'ను. దీనినుండి గణపతిదేవకవి నూకనమంత్రికి సన్నిహితబంధువును, "ఇది శ్రీగురుచన్నసదాశివయోగీంద్రపాదారవిందసుధాకరాయమాన" యనుగద్యమునుండి శిష్యుఁడును గూడ నైయుండెనని స్పష్టమగుచున్నది.

చారిత్రకాంశములు:—శివయోగసారమునుండి యనేకచారిత్రకాంశములు వెలువడుచున్నవి. ఇందుఁ గొన్ని యితరప్రమాణములను బలపఱుచునవిగను మఱికొన్ని నూతనములుగను గన్పడుచున్నవి. (1) కాకతిరుద్రునకిందులూరి పెదమల్లన పినమల్లనయను సచివులుండిరి. వా రాతనిచే నాయకత్వములను బడసి యోరుగల్లునం దుండిరి. (2) రుద్రుఁ డోరుగల్లును గట్టించెను. హనుమకొండ రుద్రేశ్వరాలయశాసనములో నీరాజు తానుజయించిన శత్రునగరములపేరిట నోరుగల్లులో విభాగములను నిర్మించెనని చెప్పఁబడి యున్నది. ప్రాచీనవంశచరిత్రములలో నానగరము రెండవప్రోలరాజుచే నిర్మింపఁబడె నని యున్నది. శివయోగసార మీవిషయ మవిశ్వసనీయ మని చూపుచున్నది.

(3) గణపతిదేవచక్రవర్తికడ దండనాథుఁడుగనుండి కొలని సోముఁ డారాజు వెలనాఁడుకళింగదండయాత్రలలోఁ బాల్గొనెను. ఇది నూత్నాంశము. (4) పెదగన్న, మనుమగన్నమంత్రులు రుద్రాంబికకాశ్రితులై యనేకసమరములలో విజయ మందిరి (5) "బాహత్తరిదుర్గంబులు, సాహసులై రుద్రమాంబశౌర్యము కతనన్" అను పద్యభాగమును బట్టి రుద్రమదేవి దా స్వయముగ యుద్ధరంగముల కేగుచుండెనను క్రొత్తవిషయము దెలియుచున్నది. (6) ఇందులూరి అన్నయదేవుఁ డొకశైవయోగి కపరావతారము (7) అన్నయరుద్రులు ప్రతాపరుద్రచక్రవర్తికడ నాయకులుగ నుండిరి. (8) అన్నయ రుద్రాంబకూఁతురగు రుయ్యంబను బెండ్లాడెను. ప్రాచీనచరిత్రములందలిగాథ నీవిషయము బలపఱుచుచున్నది. (9) అన్నయదేవుని బిరుదములు, విజయములు అపూర్వవిషయములు. (10)రుద్రదేవుని పాండిత్యము, విజయములు, బిరుదములు నూతనవిషయములు. (11) ఈరుద్రుని సోదరి యగు సోమాంబిక కాకతిరుద్రునిమంత్రి యగు విద్ధిరాజునకు భార్య. (12) నిడుదవోలులో నొకరాజవంశ ముండెడిది. ఈరాజులకడ శివయోగసారకృతిభర్త యగు నాకనమంత్రిపూర్వులు మంత్రులుగ నుండిరి. (13) రుద్రాంబ గణపతిదేవుని పుత్రిక.

వ్యక్తికచరిత్రము—ఇంతవఱకును శివయోగసారకృతికర్తృభర్తలను గూర్చియు, నాగ్రంథమునుండి తెలియ నగు నూతనచారిత్రకాంశములను గూర్చియు వ్రాసియుంటిమి. ఇందులూరివంశీయులచరిత్రమునకును గాకతీయులచరిత్రమునకును సన్నిహితమగు సంబంధము గలదని యింతవఱకును స్పష్టమైనది. ఈవంశమునందలి పురుషుల చరిత్రమునుగూడ సంగ్రహముగఁ బరిశీలింపవలసి యున్నది—

(1) సోమమంత్రి—'సకలవేదశాస్త్రసంపన్నుఁడు'. ఈతఁడు బహుసైన్యసమేతుఁడై "యేకశిలాపురితూర్పుదిక్కునంగలరిపుభూములెల్లఁ'గొనెను. (సెరికాడి) మండలీకులఁ నవలీలఁదోలెను. గోగులనాడు, కొలనివీడునను దుర్గములను జయించెను. గోదావరినిదాఁటి 'పన్నెండుమన్నియములనోడిచి', కళింగరాజుల రాజ్యమునఁ గొంతభాగమును జయించెను.

(2) ఇందులూరిఅన్నయ—మహాపరాక్రమశాలియగు నీతఁడు పన్నెండువేలరౌతులకు నైదులక్షలకాలుబలమునకు నధిపతిగనుండి యోరుగల్లుప్రాగ్ద్వారముమొదలు సింహాచలమువఱకునుగల ప్రదేశమును బాలించుచుండెను. మో

పూరిరాజుల నోడించెను. వేఁగినాఁటిలో సూరపురమును, వోలచెర్లాది డెబ్బదిరెండుదుర్గములను జయించెను. ఆర్వేలశూరులతో, కళింగరాజగు గజపతితోఁబోరి యాతనిని బాఱఁదోలెను. దక్షిణదేశమునకేగి పంచపాండ్యులను జయించెను. తురకలను బలాయితులంజేసి ప్రతాపరుద్రచక్రవర్తిచే బహూకరింపఁబడెను. ఈయన్నయదేవునికి 'మూరురాయరజగదాదిగండ, జగమర్త్యగండ, సప్మెటనారాయణ, కలియుగభీమ, మండలికఘంటానినాద, రాయచౌహత్తమల్ల, స్థలగిరివనదుర్గజలకోటమల్ల' మున్నగుబిరుదము లనేకము లుండెడివి. మహదైశ్వర్యసంపన్నుఁడయ్యు నీతఁడు బంధులయెడ నెక్కు డాదరమును జూపి వారిని దనయధీనమునం దనేకోద్యోగములలో నుంచెను. పైతృకములగు కొలనిపురమున్నగువానిపైఁ దనయన్నకుమారుఁడగు రుద్రదేవుని, రాజమహేంద్రవరదుర్గమునఁ దనమేనమఱఁది యగు పర్వతమల్లును, దనయన్నయల్లుఁడగు శేవన నోలచెర్లదుర్గమునను, నూజెళ్ళలో బంధువులగు మంగిరాజ సింగరాజులను, నిల్పెను. అన్నయదేవునకు లకుమాంబ, అద్రిజ, యనువారలు కులసతులు. వీరలు గాక నీతఁడు కాకతీయరాజ్ఞి యగు రుద్రాంబిక తనయ యగు రుయ్యాంబను గూడఁ బెండ్లాడెను. ఇటులు బలపరాక్రమములతో శోభించుచుఁ గాకతీయరాజన్యులకు సన్నిహితబంధువై యీమహామంత్రి రాజగౌరవము భోగములననుభవించుచుండెను. ఈతనికి "అయిదువన్నెలగొడుగు, వింజామరలు, గజసింహకేతువులు, గంధవారణము, ఐదుఘంటలు, పులితలాటము, ప్రధానఘోటకము" మున్నగు రాజలాంఛనము లుండెడివి. ఇట్టులుండియు నీమంత్రి యాముష్మికమును మఱవక కళింగమునందలిమహేంద్రగిరిమొదలు కృష్ణానదీతీరమువఱకునుగల భూభాగమునఁ గూపారామతటాకాది ప్రతిష్ఠల ననేకముల నొనర్చెను.

(3) ఇందులూరి రుద్రుఁడు—ఈతఁ డన్నయదేవుని కన్నివిషయముల నినయుఁడయ్యెను. ఈతనికి, కొలనిపురము కేంద్రస్థానము. చేఁబ్రోలు, పదినపురము, దేవపురపుకోట, కంచెర్ల, ఓలచెర్ల, నూజళ్ళ, శూరవరము, రాజమహేంద్రవరము, కురుమతురుకోట, చామర్లకోట, పిఠాపురము, బోడసకుఱ్ఱు, బెండ్లపూడి మున్నగు స్థలము లీతనిస్వాధీనమునం దుండినవి. ఈతఁడు 'కాళింగరాయవిభాళుఁడు' 'వీర(మా)కారవసుంధరవిక్రమేశబల్లహులు నాఁడగిన పంచపాండ్యరాయ మానమర్దనుఁడు' కలుకోటను జయించి యీతఁడు

కాకతిభూపాలుని మెప్పువడసెను. ఈరుద్రదేవునకు 'బాహత్తరిదుర్గనాయక, రాయచౌహత్తమల్ల, ఇరువత్తుగండ' మున్నగుబిరుదము లుండెడివి. శౌర్యమునకుఁ దోడుగ నీమహనీయునకు నిరుపమమగు వైదుష్యముగూడఁ గలదు. సకలాగమప్రాజ్ఞుఁడని యీతనిని సద్విప్రులెల్ల నుతించుచుండిరి. "శైవవైష్ణవసిద్ధాంతశాస్త్రవేది" యు, "సదమలోపేత దర్శనజ్ఞానమూర్తి" యు నగు నీతనిని "నరులెల్ల వ్యాకరణబ్రహ్మ"యని కీర్తించుచుండిరి. బంగారునకుఁ దావివలె నీతనిశౌర్యవైదుష్యములకు, వితరణాసక్తి వన్నెఁదెచ్చెను. "అనుపమచరితుఁడగు రుద్రనరేంద్రుని కరాళవారిధారలచేఁ దునియని భూపతిసుతులును, దనియని ధరణీసురులును ధరణిఁ గలరే" యనుటనుబట్టి యీతని మహత్త్వము వెల్లడి యగుచున్నది. ఈరుద్రదేవుఁడు "బ్రహ్మణ్యరాజు"గఁ బేర్కొనఁబడియున్నాఁడు.

సమస్యలు — శివయోగసారావతారికయందలి విషయములనుండి కొన్నిసమస్యలు బయల్వెడలుచున్నవి. వానిలో ముఖ్యమైనవాని నిటఁ బేర్కొని మఱియొకవ్యాసమున సవిమర్శముగఁ జర్చింతుము- (1) ఇందులూరి అన్నయ దేవునకును ప్రతాపచరిత్రాదులందలి శివయోగయ్యకును సంబంధ మేమైనఁ గలదా ? (2) ముమ్మడంబ రుద్రాంబికకుఁ బుత్రికయేనా ? (3) ప్రతాపరుద్ర చక్రవర్తి తండ్రియగు మహాదేవరా జెవ్వఁడు ? (4) శివయోగసారకృతిపతి పూర్వికుల కాశ్రయమొసంగిన నిడుదవోలిపాలకు లెవరు ? (5) ప్రతాపరుద్రునికిఁ గాకతీయరాజ్యాధిపత్య మెట్లు వచ్చెను ? (6) కాకతీయులవైవాహిక సంబంధములు ? (7) కొలనిరుద్రదేవుని వైదుష్యము.

(సశేషము.)

గ్రంథస్వీకారము.

---

1. యమున—ఇది యనువాదగ్రంథమండలివారు ప్రకటించెడు గ్రంథములలో మొదటిది. ఈగ్రంథమండలి సంపాదకులు శ్రీ మంగిపూడి శ్రీరామచంద్రశాస్త్రిగారును, శ్రీదార్శనికపండిత నేరేళ్ళ నారాయణమూర్తిగారును. ప్రచురణస్థానము విశాఖపట్టనమండలములోని పాలకొండ. మండలీసంస్థాపకులు శ్రీ యెఱ్ఱాపాత్రుని కూర్మినాయుఁడుగారు. వంగభాషలోనుండి సంపాదకులలో నొకరగు శ్రీ రామచంద్రశాస్త్రిగారిచే నాంధ్రీకరింపఁబడినది. ఈయనువాద సమితివారు యథామూలముగనే కాక యేది యె ట్లనువదించిన రసవంతముగ నుండునో య ట్లనువదించుచున్నారు. కథావిధానమునను, పాత్రతత్వమునను మూలగ్రంథకారుని ముఖ్యాభిప్రాయమునను గూడ మార్పు లవసరము నను సరించి మార్పు చేయుచున్నారు. భాష యీకాలపుగ్రాంథికము. ఇట్టి యనువాదగ్రంథములు రెండేసిమాసముల కొక్కటిగాఁ బ్రకటింతురు. ఇంచుమించు 250-300 పుటలుగల నవల యాఱణాలవెలకుఁ జందాదారులకుఁ బంపుచుందురు. భాషాసేవయే ముఖ్యోద్దేశముగాఁ గలవారు గావుననే చవుకగా నిచ్చుచున్నారు. యమున నాలుగుఖండములును 218 పుటలును గలది. అచ్చు చక్కనిది.

---

2. ప్రేమ—అనువాదగ్రంథమండలి రెండవగ్రంథము. హిందీభాష నుండి దార్శనికపండిత నేరేళ్ళ నారాయణమూర్తిగారిచే నాంధ్రీకరింపఁబడినది. పాలకొండతాలూకా తలవరము నివాసులు శ్రీ గేదెల శ్రీరాములునాయుఁడుగారు ప్రధానపోషకులుగానుండి యీప్రేమ ముద్రణవ్యయము నొసంగి యౌదార్యమును భాషాభిమానమును బ్రకటించుచున్నారు. ఇదియు సుమారు 200 పుటలుగలది. వీనివెంట ననుబంధగ్రంథములు కూడఁ బ్రకటించుచుందురు. రసవంతముగా నుండుటకై మూలగ్రంథకారుని ముఖ్యాభిప్రాయములలోఁ గూడ మార్పుచేయసాహసించిన యీసంపాదకులు, ఖగేనుఁడు మొదలగు కొన్నిపేరులనుగూడ మార్చుటకుఁ దలఁతు రని నమ్ముచున్నాము. సవరణలలో, మరిదిగారూ! అనుదానిని మరదిగారూ అనిసవరించిరి. అందు సవరణయవసర మైనచో మఱఁదిగారూ అనిన లోప మేమికల్గునో! మరదిగారను

నది నిర్దుష్టమా ! అయిష్ట మనిష్టమని నవరించిరి. తప్పుపట్టుటకుఁ గాదుగాని భాషాభిమానులగు వీరు, కొందరైన- కథాసంవిధానమేకాక, భాషాసౌష్ఠవమునుగూడఁజూడఁదలఁచువారు కూడ నుందురు గావున నర్ధానుస్వారశకటరేఫములనుగూడఁ బాటించి సర్వాంగసుందరముగా గ్రంథములను బ్రకటించుచుందు రని కోరుచున్నాము. అవి పాటింపకున్న నిబ్బంది యేముందురా తామలపాకులు, యాలకులు, విద్యుద్వీవన-(రూపాయినోటు) ఇట్టివియు నవరణలోఁ జేర్పనక్కఅలేదు. మామాటలు నచ్చెనేని యట్లుచేయవచ్చును. లేదేని మాననవచ్చును. యోజింపఁగోరెదము.

చందాదారులకు గ్రంథము వెల రు 0-6-0. ఇతరులకు రు 0-10-0. ఇంతచవుకగా నే గ్రంథప్రకాశకులును బంపుటలేదు. ఇది నిక్కముగ వీరిభాషాభిమానమే.

3. విచారసంగ్రహము—సాధుధ్యానానందులవారిచే శ్రీనటనానందస్వామి ద్రావిడభాషయందు రచించిన దానింబట్టి తెనిఁగింపఁబడినది. ఇది కర్మభక్తియోగజ్ఞానములను నాల్గుమార్గములసారమును దేటగఁ జెప్పుచున్నది. అరుణాచలక్షేత్రమందు భగవాన్ శ్రీరమణమహర్షులు 1901-2 సం॥లో గంభీరం శేషయ్యగారను బ్రాహ్మణోత్తమున కుపదేశించిన వాక్యములసంపుటి. 48 ప్రశ్నల కుత్తరములుగలవు. మచ్చునకై 17 ప్రశ్నయు నుత్తరమునుదిలకింపుఁడు.

ప్రశ్న—ఆత్మయే హృదయమునందు బ్రహ్మముగ ప్రకాశించుచున్న దనుట యెటులు ?

ఉత్త—దీపజ్వాలయందుగల ఖాళీస్థలమందుండు భూతాకాశము ఆ జ్వాలకు లోను వెలిని అభేదముగ నిండి హద్దులేక ప్రకాశించుటవలె హృదయమునందు ఆత్మజ్యోతిలోనుండు జ్ఞానాకాశమున్ను ఆయాత్మజ్యోతికి లోనను వెలిని అభేదముగ నిండి హద్దుమీరి వెలుగుచున్నది. ఇదియే బ్రహ్మమనబడును.

బ్ర॥ శ్రీ॥ పండిత పురాణం సూర్యనారాయణతీర్థులవారిచేఁ బరిశోధింపఁబడి కృష్ణాజిల్లా ఘంటసాలపాలెయములో నుండు శ్రీశాంతి శిక్షాశ్రమము తరుపున ముద్రింపఁబడినది. వెల రు 0—4—0 కావలసినవారు సాధుధ్యానానందంగారు శ్రీ శాంతిశిక్షాశ్రమము, ఘంటసాలపాలెయము, చల్లపల్లి పోస్టు కృష్ణాజిల్లా అని వ్రాసి తెప్పించుకొనవచ్చును.

4. ఆనందదాసుచరిత్ర—(శ్రీకోదండరామ విలాసము) గ్రంథకర్త గుంటూరుమండలస్థ చాగంటిపుర వాస్తవ్యుఁ డగు మారూరి మహానందిరెడ్డి గారు. శ్రీవాసుదాసస్వామి (వావిలికొలను సుబ్బారావుగారును) వీరిశిష్యులు ఆనందదాసు (మారూరి మహానంది రెడ్డి)గారు. వీరిఛాయాపటము మొదటఁ గలదు. యక్షగానము- భజనవిధానము, వైరాగ్యప్రకరణము, దుఃఖశాంతి, తీర్థసేవనము, శ్రీరామకైంకర్యము, విఘ్ననిరోధము, సీతావిన్నపము, శ్రీరామానుగ్రహము, కోదండరామసేవక సమాజవిజ్ఞప్తి, ఫలశ్రుతి యను భాగముల నొప్పుచున్నది. కొన్నిపద్యములు:—

ఉ. ఎంతని వేఁడువాఁడ, జగదీశ్వర నీపదపంకజాతముల్
స్వాంతము నందు నిల్పి యనిశంబు భజించుట నీ వెఱుంగవే
వంతముఁ బూనె దేల ననువంటి యభాగ్యునిఁ బ్రోవఁ గూడదే
చింతల ముంతువే సకలసేవిత కృష్ణ రమేశ మాధవా!

ఉ. ఏల మతిభ్రమంపడెద వీవు కృపానిధి జానకీధవుం
డేలినవాఁడు గల్గ గుణహీనులఁ జేరి చరింపనేల గో
పాల జనార్తిహారుఁ డగు ప్రాజ్ఞుఁ డతండు భజించువారలన్
మేలు కొనంగఁ జేయును సుమీ తనయా యనుమాన మేటికిన్.

ఒంటిమిట్ట—భక్తిసంజీవనీ పత్రికకనుబంధముగా మాకుఁ జేరిన యీగ్రంథము మహారాజశ్రీ కలగొట్ల రామకృష్ణారెడ్డిగారి ద్రవ్యసహాయంబున ముద్రింపఁబడినది. వెల రు 0-4-0 లు.

---

5. యోగసంకలనము:—ప్రథమభాగము. (కర్మయోగము) కాకినాడ నాట్యకళావిజ్ఞానగ్రంథమండలి తృతీయకుసుమము. శ్రీ అరవిందఘోషుగారి యాంగ్లగ్రంథమునకుఁ దెనుఁగు-మధ్వశ్రీ దాల్తాబాదు గోపాలకృష్ణారావు బి ఏ. గారిచే నాంధ్రీకరింపఁబడి ప్రకటింపఁబడినది. వెల రు 1-4-0. 166 పుటలలో శ్రీ అరవిందఘోషుగారి "The synthesis of yoga" అను గొప్పయోగశాస్త్రములోని యొక్కభాగ మిది. 46 పుటల యుపోద్ఘాతము గలదు. సాధనచతుష్టయము, ఆత్మసమర్పణము, కర్మసన్యాసము, గీత, త్యాగము-త్రివిధమార్గము, ధర్మశాస్త్రము, ఉత్తమేచ్ఛ, పరిపూర్ణసన్యాసము, కర్మాధిపతి, కర్మ-ఇట్లని పండ్రెండధ్యాయము లీపుస్తకములో నున్నవి. ఇదియొక కథగాదు. విషయమును గ్రహించుట సులభసాధ్యముగాదు. యోగాభ్యాసపరులకుఁ గాని తత్త్వముబో

ధపడదు. తదభిమానులుఁ దదాసక్తులు దీనింజదివి కృష్ణారావు పంతులుగారి శ్రమకుఁ దగినఫల మొసంగుదురుగాక. ఆంధ్రీకరణమును శైలియుఁ జిత్తగింపుఁడు. విషయ మెంతవఱకు మనకుఁ దెలియునో—

"యోగమనఁగా స్వభావవృద్ధిచే నావరణబలాత్కారముచే వ్యక్తితో నుపయోగింపఁబడు నవకాశములచే నెమ్మదిగా వృద్ధిపొందుచున్న మందగమన విధానమును విడిచి, గమ్యస్థానమును సరాసరి పొందించు వ్యక్తిగల స్వతంత్ర మగు తీవ్రవృద్ధి విధానమును స్వీకరించుట. అనంతమగు క్రమవృద్ధిని చెప్పుచు గమ్యస్థాన మనుట తప్పు కావచ్చును కాని సమీపగమ్యస్థానము కల దని, తత్ప్రాప్తికై మనుజుఁడు వృద్ధిపొందు చున్నాఁ డని, నూతనజన్మ యదే యని, విపులప్రకాశజ్ఞానమదే యని, దివ్యమానుషత్వ మదే యని మనము గ్రహించవలెను. మనము కోరునది పూర్ణమైనమార్పు. జీవునకు మాత్రమే కాదు. మన స్వభావము యొక్క యన్ని భాగములకు"—79 పుట.

---

6. సర్వేగణితచంద్రిక—గ్రంథకర్త చదలువాడ కోటినరసింహముగారు. క్షేత్రగణితము దీనియందలి విషయము. పాశ్చాత్యులూరిమల్లనవలె నింగ్లీషుపద్ధతిని భూములు కొలుచు నిప్పటి విధానము పద్యములలోఁ జెప్పి దానిక్రింద వివరణము వ్రాసి గ్రామోద్యోగులు మొదలగువారి కుపయోగపడునట్లు కోటి నరసింహముగారు లోకోపకార మొనర్చినారు.

" అవధరింపుము బాలురకైనఁ దెలియు, రీతిఁ బద్యంబులందు ధాత్రీగణితము విపులవిషయాన్వితంబయి వెలయుచుండు,నట్లొనర్చెదఁ గొను భవదంకితముగ. పద్యములయందుఁ జేరిగుప్తముగనుండు,విషయములు గద్యశైలిలో విశదపఱతు నన్న పూర్ణేశ్వరా త్వత్కృపాతిశయము, నంది సర్వేగణితచంద్రి కాఖ్యకృతిని.

అని ప్రతిజ్ఞగావించియున్నారు.'సర్వే' కొలతలలోఁ గొంతప్రవేశమున్న వారీపుస్తకమును జదివి పూర్ణజ్ఞానమును సంపాదింపవచ్చును. ప్రతివిషయమునకుఁ దగినట్లు ప్రతిమలు గలవు. లెక్కలు చేసి చూపింపఁబడినది. చిట్టచివరఁ బ్రత్యుత్తరములు గలవు. 60 సాధకములలోఁ గావలసిన సర్వేవిషయము సర్వమును గలదు. కొన్నిపద్యములు :—

సీ. తలవెంట్రుకలను వెడలుపుగా నెన్మిది నిలుపఁగా విషువగుఁ గొలతకొఱకు
నట్టి విష్వష్టకం బైనఁ గాష్ఠంబగుఁ గాష్ఠాష్టకము యవగర్భమగును

యవగర్భములు దచ్చిమైన నంగుళ మగు నంగుళాల్ ద్వాదశం బైనడుగు
అడుగులు మూఁడైన నగుగజం బట్టి యిర్వది రెండుగజములఁబరఁగుగొలుసు
గొలుసు లీరైదు ఫర్లాంగగుం దలంప, నట్టిఫర్లాంగు లెనిమిదైన మైలు
గా నెఱుంగఁగఁదగును దైర్ఘ్యంపుఁగొలత, వినుతఖగరాజతురగపృథ్వీశతాంగ.
గీ. ఎనిమిదంగుళముల కిసుమంత తగ్గలిం,కగును నూఱులింకులైన గొలుసు
గొలుసు లెనుబదింటఁ గలుప మైలగు భవా, నీహృదబ్జమిత్ర నిటలనేత్ర.
గీ. పొలముగొలుచుచున్నపుడె కాగితంబున, స్కేలు బిట్టులేక చేతితోడ
గణికుఁ డించుమించుగా గీయ స్కెచ్చియా, మదనభంగ యఘతమఃపతంగ.
గీ. స్కేలు కంపాసు బిట్టులచేత నెన్ని, కునులు పొలమునునైనఁ ద్రికోణములుగఁ
జేసి వరసగఁగూర్చి సంక్షిప్తముగను,వ్రాయుపటమును ప్లానండ్రు వామదేవ.

ఈకోటి నరసింహముగారే కవిత్వచింతామణియను పుస్తకమును వ్రాసియున్నారు. దానిసహాయమున స్వయంకృషిచేఁ బాలురు వ్యాసలేఖనమును గవిత్వమును జెప్పననువగును.

పై రెండుగ్రంథములును- కవిగారియొద్ద గుంటూరుజిల్లా సత్తెనపల్లితాలూకా అచ్చమ్మపేట పోస్టు, ఊటుకూరులో దొరకును. సర్వేగణితచంద్రిక వెల రు 1. కవిత్వచింతామణి రు 0-12-0.

---

(7) విదుల- కీర్తిశేషులగు ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రిగారి భారతనవనీతములోనిది. విదులాపుత్రసంవాదము 'రాజ్యభంగానంతరముఁ దన్నుఁ జూడ వచ్చిన కృష్ణునితోఁ గుంతినాకొడుకుల కియ్యది వినిపించి పౌరుషము గలిగి జీవింపుఁడని తెలుపుమా' యని చెప్పినకథ. వీరవనిత యగు విదుల శత్రుపరాభూతుఁ డయి డాగియున్న తనసుతుని సంజయుఁ డనువానిని బ్రేరేపించి శత్రువులపైకి యుద్ధమునకంపుట యిందువిషయము. తిక్కన సోమయాజి సూచించెను గాని విపులముచేయలేదు. దానిని శాస్త్రిగారు పూర్తిగఁ దెనిఁగించిరి. భారతనవనీతములోని ద్రౌపదీచరిత్రమును బాఠకులు పరిషత్పత్రికాముఖమునఁ దెలిసికొనియున్నారు. ఈవిదులయు నట్టిదే. హిందూసుందరినుండి పునర్ముద్రితము.

దీనికి విద్వాన్ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు టిప్పణికూడ వ్రాసినారు. అది కడపటఁ గలదు. వ్యాసభారత నవనీతము యుద్ధపంచకము తప్పతక్కినపర్వములు సిద్ధముగానున్నవి. ధనికులు దీనిముద్రణమునకై శాస్త్రిగారి పుత్రులకుఁ దోడ్పడఁదగును—

శ్రీరస్తు.

హంససందేశము

—మహామహోపాధ్యాయ కల్లూరి వేంకటరామశాస్త్రి—

—ప్రథమాశ్వాసము—

శా. శ్రీమంతుం డగుదేవుఁ డాతఁడు పవిత్రీభూతమార్తాండవం
శామోదం బలరన్ జనించి భువి మాయామానుషుం డౌచు సీ
తామార్గాదృతిఁ బావనిం బనిచి జ్ఞాతస్వార్థుఁ డై కోమలాం
గీమోహాంబున రేయి కల్పముగ వేగించె న్మహాధీరతన్. ౧

మ. అతఁ డంతం గపినాథు సేన నడపన్ యత్నించుచో వేగ భూ
సుతకున్ దూరనివాసి యాటకు మనస్తుందీభవద్వేదనా
గతుఁడై యప్పు డుషస్సునందును దటాకక్రీడితంబుం బరా
జితరాకాదివసామృతాంశుకరరాజిన్ రాజహంసం గనెన్. ౨

చ. అవనిసుతాసమానగతి యామెదుకూలపటంబు వోలుచు
న్నవపువు నామెనూపురపునాదము గల్గినహంస నెంతొ క
న్గవఁ దిలకించి వీరుఁ డణుకాలము మూర్ఛిలెఁ దన్మయాత్ముఁ డై
యవసరమందుఁ బూవిలుతు నాజ్ఞ దురంత మటంచు నెంచెదన్. ౩

మ. అతియత్నంబున లక్ష్మణాగ్రజుఁడు లబ్ధాశ్వాసుఁ డై యప్పు డా
సతిప్రాణంబులు నిల్పఁ గోరి తమితో సందేశ మంపింప నా
దృతిఁ బూజించె సరోజరాజిని బతత్రిన్ దూతలాభంబు దా
నతివం గౌఁగిటఁ గూర్చుకంటె బహుమోదాపాది యాఁ గామికిన్. ౪

మ. హనుమాను న్బహుమానిఁ జేయు టణువం తైతోఁచ నెంతేసప
ర్య నుపాసించుచుఁ గోరె భ్రాంతమతి దాత్యానర్హచక్రాంగమున్
ఘనశైలద్రులతాదుల న్విరహదుఃఖాయన్మనోయుక్తుల
ర్థనసేయన్ సుఖదుఃఖవేది నొకటిం బ్రార్థించు టేమబ్రమే. ౫

శా. వేదాంభోధివిభాగవేది యగునావిశ్వాత్ము సద్వంశ్యమున్
వేధోవాహన మంచు సిద్ధు లనఁగా విందు న్మను న్నిన్ను వా
ణీదేశస్థితిచే గతిప్రగుణమౌ నీకు న్లభించెన్ శ్రుతి
స్వాదార్థామృతమాధురీగుణముఁ దత్సావర్ణ్యముం బొందుటన్. ౬

ఉ. ఈయిహమం దాకానాకర మేము మనుష్యులలోనఁ గేవలం
బోయి సఖా! మహాజగ మహా యనఁగా ఖగరాజ వీవు గా
దే? యయినన్ త్రిలోద్ధరణహేతుపుసం దగు దీప్ర దూత్యముం
జేయఁగ ధాతయు న్సకలసృష్టిసమర్థుఁడు సూతుఁ డయ్యెఁగా. ౭
మ. జగ మన్యంబుగ స్వీయమా మహిమ నిచ్ఛామాత్ర నిర్మింపఁగాఁ
దగు నిక్ష్వాకులయిట్టిదుర్దశను సందర్శించి యంభోధిను
ద్యగరిష్ఠోర్మ్ములచేఁ ద్రికూటగిరి దృశ్యాదృశ్య మాచోఁ దదం
శగతన్ రాక్షసరాజధాని యగులంకం జూడఁబోవం దగున్. ౮
చ. చెలువుఁడ! దివ్యతీర్థముల సీమయుఁ జందనకాననాప్తమున్
మలయసమీరమాతయును మౌక్తికసూతికి మందిరంబు నై
నలువగు దక్షిణాదిశకు నాప్రమదంబును సీతజీవముం
దలఁచుచు రాక్షసార్వి యను తల్లవదోషము నోర్చి యేగుమీ. ౯
మ. ఘనవార్ధికవి దూరమం దమరఁ బ్రజ్ఞాహీనులుం బోలె నీ
వును గైలాసమునందు నుండుతఱిఁ గ్రొవ్వం గొంచుఁ గేక ల్సెలం
గ నటింపం గని వన్యకేకులు శరత్కాలంబునం గన్నవో
యినవై మూకత నొంద మార్గమున నీకెంతేని సమ్మోదమా. ౧౦
ఉ. క్రోలి సరాగపద్మినుల క్రొత్తమధు న్నెలమెల్ల లీలతోఁ
గాలమునందు మేలుకొను కల్వలపఙ్క్తిఁ బరిభ్రమించి స
చ్ఛీల! వనేభదానముల స్విన్నుఁడు గంధవహుండు సేవచే
లాలనఁజేయు నిన్ బరిమళంబుల స్వాతిశయంబు దెల్పుచున్. ౧౧
మ. సమకాలోదయ బంధుజీవములు యుష్మద్బంధు లౌటం బరా
గము లచ్చోఁ బవమానుచేఁ బనిచి నీగాత్రంబుపై నంగరా
గము నెంతో యలఁద న్నివాచరణలాక్షాసంగతున్ గాంగఫే
నమహాబింబు గిరీశశేఖరనిశానాథున్ స్మరింపింపవే. ౧౨
ఉ. సారకరంబు లంతరపుసన్నశలాకల నెన్నఁగా సునా
సీరుని కార్ముకార్థమనుచిత్రపటంబున నంచు మించఁగా
మారుత మానుకూల్యగతి మై వెనువెంట వహింప మింటిపై
శారదవారివాహములు ఛత్త్రము లయ్యెడు రాజహంసమా. ౧౩
చ. జనకుని యజ్ఞవాటికను సాగినసీత జనించినట్టి సీ
తను సఖిఁ జూచె దీగతి ముదంబున నచ్చట కేగి మిత్రమా

తనతను వామె నాళీకాక్షుఁ దానెటులో ధరియించుచుండి ధా
త్రిని బరిపూర్తిఁగాంచిన పతివ్రతయన్నయశంబు నొందెడిన్. ౧౪

మ. తనలో ఖేదము మోదమూనుఁ గద నీద వ్యంతికం బొందు ప
ద్మిని స్వాదూక్తుల నేఁడె వత్తు నని యా మె న్నెల్ల లాలింపు మ
వ్వనితా మైత్రిని వీణమించు మధుకృద్వాఙ్మాధురి న్నీకు నీ
పసలో మంచిది యన్న సమ్మతిని దెల్పం జూచునం చెంచెదన్. ౧౫

మ. అనురక్తి న్నబరాంగన ల్పతులతో నద్రి న్నికుంజంబు లం
దును గూర్చుండి క్షణంబు నిన్నసమయోందముగా వితర్కింప నా
వనజశ్రేణినుండి నీ వెగురుమిరా ప్రాపింప యామ్యాశ ద
వ్వున నే పక్షబలాతిశాయులు ఖగంబు ల్గప్పుడా దొల్గుచున్. ౧౬

చ. అనుపమలీల నీ వెగిరినప్పుడు కమ్రసుధారసంబుతో
నెనయగు నీదుఛాయ మెయి నీమణిమాల్యవదద్రి మించుచో
మనసుననుండి చందురుని మండలమున్ సృజియించు నాదిదే
వుని సుమనూతిరేకమును బూనెనునో రజనీకరాకృతిన్. ౧౭

చ. పడమర తూర్పుమార్గములు పావని నాకు వచించె వానిలోఁ
బడమర త్రోవ చేరువు నపాయము నయ్యెడు నిత్యవృష్టి నో
చెలువుఁడ యెల్లవీడుల విచిత్రములం గనుచుండి లీనమా
నెడ నెటులే మఱల్పుసుమి దృష్టి మదర్థము ప్రాక్పథంబునన్. ౧౮

మ. నికటంబొందిన నీసుధార్ద్రరవము న్విన్యస్తభ్రూవృత్త్యశూ
న్యకటాక్షంబుల కృత్రిమాదరణ రమ్యంబై ప్రకాశింప స్వీ
యకుటీనిర్గతముగ్ధభామినులు నీవంచున్నది న్నిశ్చయిం
చికనన్ దాఁటుమి శైలకాననదీసీమంబు లీదేశమున్. ౧౯

మ. సుమధన్యాకులముగ్ధభావమున నిక్షుచ్ఛాయలందుం బ్రవా
శమయి న్నయ్యును శాలిగోపికలు సల్లాపంబు లేవేవొ సం
భ్రమతోఁ జల్పుచు గీతిభేదములఁ గర్ణాటాంధ్రదేశీయమి
శ్రములం బాడుచు మోహమొందు తఱి నాస్వాదింపు తన్మాధ్వ్యమున్. ౨౦

మ. దనుజద్వేషినివాసము న్మణిమూర్ధంబున్ ధరాధారి యా
టను సాక్షాత్కృతశేషుఁడే యి దని చూడ న్నానవు ల్లాఘవం

బున నభ్రంబులు సంచరింపఁ గుబుసంబున్వీడుఁ దాఁ దక్షిణం
బునఁగా ముందట వేంకటాద్రి బహునేత్రానందమౌఁ బిమ్మటన్. ౨౧

చ. అలగిరి మర్త్యలక్ష్మి త్రిదివౌకసులుం దిగి శుద్ధసాత్త్వికా
త్ములఁ దమ రొండొరు ల్భరతమత్త్వము వీడుచు సర్వసామ్యస
త్ఫలపరిపాకభూతిమహితం బగు నచ్చట గుంపుఁగూడి పూ
జలు సలుపన్ యథేచ్ఛముగ శక్తిని మాధవు సత్కరింపుమా. ౨౨

మ. స్తిమితం బొందుమి యన్నటు ల్పులినవేదిం దీర్చి నీకు న్సువ
ర్ణముఖర్యాపగ గోచరించు నట గోత్రప్రాంతయామ్యాశ వ
న్యమహీజంబులు చెంత భాసిలఁ బ్రసూనంబు ల్సపర్యానిమి
త్త మసన్ ధూర్జటి కూర్మి హస్తములచేతం దెచ్చి యర్పించుచో. ౨౩

శా. నీమంజుధ్వని మాని గాఢముగ దీనిం గూడి వానీరవృ
క్షామోదాతిమృదూద్భవత్పులినవాతాధూతిచేత న్మహా
వ్యామోహుండవు గాక పొమ్మి యపు డవ్యాగమ్యవీథిం దటీ
సీమావాసకిరాతు లెల్లఁ దమచేఁ జక్కింపకుండ న్నినున్. ౨౪

మ. చని తుండీరసుమండలంబునకుఁ బశ్చాత్త్రాల మీక్షించి యం
దున సత్యవ్రత మన్న క్షేత్రమునకుం బొమ్మా కృతాఘక్షయం
బున కచ్చోఁ బతి యజ్ఞహానికి నదీభూతాంగియౌ వాణి నో
ర్చెను విశ్వైకనియామసేతు వగు నా శ్రీనాథుఁడే సేతువై. ౨౫

మ. అచట న్సంతతగీతనాదబహురత్నాంచద్గుణా న్యూభిదే
వ్యచితాలంకృతిఁ గాంచిఁ గాంచె దట నేత్రోత్సాహియౌఁ జుమ్మి హ
స్త్యచలావాసియు సత్యకాముఁ డలద్వంద్వాతీతుఁ డౌ పూరుషుం
డచలం బాతనదృష్టిఁ గన్గొనినవాఁడై కాంచి నెల్లప్పుడున్. ౨౬

శా. ఆపీఠిం బ్రణమిల్లుమీ కృతయుగాద్యన్ బ్రహ్మసంకల్పమా
త్రావిర్భూతను జేరి భక్తి వినతంబౌ మూర్ధ మేపారఁ గాం
చీవీథీరజము ల్గజాచలపతి శ్రీవాహవేగోత్థముల్
దేవాగ్రేసరులు న్శిరంబులను బొందింతు ర్మహాధన్యులై. ౨౭

మ. ఒకచో నప్పురిఁ గంపితామ్రవనలీలోద్గామియై ముందుఁ ద్ర్యం
బకమౌళీందుహిమాంబు పూనికొని కంపానీరనీరేజమా
లికకుం గాముకుఁడైనగంధవహుఁ డాలింగించు లోకోపకా
రకుఁడై పిమ్మట నిన్ను నాప్తుఁ డగు దూరాదాప్తమిత్రుం బలెన్. ౨౮

మ. మిముఁ బోలెం గవుల న్భరించు నల బ్రాహ్మీదేవి యానీటి మ
ధ్యమునం బార్శ్వయుగంబునం గొలువ విష్ణ్వాదు ల్శుచిస్వాదునీ
రము వాఱం బొగడొందుచుండుఁ దనవర్ణస్తోమము ల్సత్త్వభే
దమహాస్రోతములై జనించి యమరం దావేగవత్యాఖ్యతోన్. ౨౯

— కోడూరి దక్షిణామూర్తిశాస్త్రి —

చ. పురుషులపాపము ల్దొలఁచు పుణ్యసరస్వతి నీట సన్మునీ
శ్వరులను గూడి క్రుంకు లిడ స్వచ్ఛతరాంగుఁడవై రజోగుణా
వరణము లేని చిత్తమున భాసిలఁ జేయుచు సర్వలోకముం
బరఁగెడి దుర్నివారసితభావము నొందెదు లోన బైటయున్. 30

ఉ. ఆనదిగట్టున న్సరసిజాసను నుత్తరవేదిరూపమై
జానగు హస్తిశైలము ప్రశస్త మొనర్చుచు ద్రామిడంబునన్
ఏనదిసజ్జనుండుఘను లీతను వ్రాడ్చిన నిస్తమస్తముం
బూనినవాసుదేవు పదముం గని యుందురొ సౌమ్య! నిచ్చలున్. 3౧

మ తులసీదామములన్ స్వకీయతనుకాంతుల్ వృద్ధిగావించి శీ
తలవైశ్వానరుఁ బోలి వేదికపయిం దానుండి సద్భక్తిము
క్తుల నీఁగల్గు రమాకటాక్షముల నెంతో శ్యామ మైనట్టి యా
జలజాతాభిధలోకకారణము నీసద్దృష్టిపాత్రంబగున్. 3౨

శా. శ్రీవిద్యున్మృతదేహము న్మరకతశ్రీమేచకంబుం గృపా
భావాంబూదరమేఘ ముందుఁ గని కంపం బింత గైకోకుమా
యేవార్ధంబు భవాదృశోత్తమసుపర్వేడ్ఢంససంపూజ్యమీ
మీవంశంబున మున్ను పుట్టినది యామేఘంబు మేల్ హంసమై. 33

ఉ. నీవిభుయజ్ఞభాగముల నిర్మలసారముఁ గ్రోలువాఁడు వే
దావళిశుద్ధనేత్రము మహాశ్రితలోచనభాగధేయమా
దేవుఁడు మ్రొక్కునిన్నుఁ గను దివ్యరసాంచితమోదయుక్తస
ద్భావహితప్రదప్రవణభవ్యకటాక్షనిరీక్షణంబులన్. 3౪

చ. మధుయుతపద్మముం బలె రమాసతి స్విన్నకరంబుఁ బట్టి స
ద్విధిహితహస్తమందు నొకదివ్యసరోజముఁ బూనుచు న్మనో
వ్యధ చన దేవుఁ డవ్వనవిహారము సల్పినయేని యాహరిన్
బుధనుత వీచుమా వ్యజనముం బలెఁ బక్షముతోడఁ గన్పడన్. 3౫

చ. ఎదురుగఁ బ్రాఁకుమత్స్యముల నెంతయు స్తంభితమైన సహ్యజా
మృదులఘురంబు నల్దెసల నేగఁ దదంతరభూమి చోల మ
య్యది క్రముకావనీజనివహంబుల నల్లనయై కనందగున్
ముదితుఁడవై చనంగదవె ముందుగ దాటుచు మధ్యరాష్ట్రమున్. ౩౬

చ. సురభిహరిద్రతో నెనయుఁ జూర్ణపుఁబూఁతల సాంధ్యరాగముం
బరువపుఁజోఁకపుష్పముల బర్వినకొప్పున ధ్వాంతకౌముదీ
వరకలహంబుఁ బూను నవవారిజనేత్రలు చాటుసూక్తులం
బరఁగుచు దోలపై నయనపర్వ మొనర్తురు నీకు హంసమా. ౩౭

శా. భూదేవీతిలకంబు చోలమున నపూర్వాన్యభాగంబు స
మ్మోదం బైచను వర్ష దేశము నదీపోష్యం బటం జేరి యెం
తోదూరంబున శ్వేతపర్వతముఁ గన్గో హంస! యగ్న్యత్రినే
త్రోదారాద్రి సముంబు భూమిబిలమార్గోద్యత్సర్పరాజంబునాన్. ౩౮

శా. ఆశైలస్థితమానవావళితమం బల్లార్చుచున్ స్వప్రభా
వేశత్వంబున జ్ఞానరూపుఁడు బుధేంద్రేష్టుండు సద్భాగ్యుఁడున్
శ్రీశేషాద్రిరతుండు సాగరసుతాస్నేహానుషక్తుండు స
త్కౌశల్యం బొడఁగూర్చు నీకొగి నమస్కారం బొనర్పంగనే. ౩౯

మ. అలదేవోత్తముకాంతిభంగి నసితం బై మూర్ధపచ్ఛాయమై
లలి నీలీసుమమంజరీలలితమై లావొప్పు నక్కాననం
బలఘూత్తంసమ! చూడుమా యది గనన్ హా నీమనం బప్పరో
జలజాప్యాసుఖయోగ్యనందనమహైశ్వర్యంబుఁ బోఁద్రోసెడిన్. ౪౦

మ. పవనుం డేక్రమము గాటపిన్ సకలపుష్పవ్రాతసద్ధూళిచే
నవవైతానముఁ జేసి చామరములం గావించి పుష్పంబులం
బుపుసెజ్జ ల్పచరించి పాదములిడన్ భూమిప్రదేశంబులన్
ధవుఁడౌ యస్మకభూమిపాలునకుఁ బా దాస్యంబులం జల్పెడిన్. ౪౧

శా. కావేరీనది రాష్ట్రమున్ ఘురముచేఁ గావించుచున్ రెండుగా
దేవద్వీపవతి న్మహామహిమచే ధిక్కారముం జేయుచుం
బ్రోవై పండినయిక్షుపర్వహతి సంభూతస్వముక్తావళుల్
త్రోవం గ్రాలఁగ నిమ్న మున్నతమునై తోషంబునం బాఱెడిన్. ౪౨

మ. అలసహ్యాంకమునుండి స్వర్ణముఖ పారావారముం గూర్పఁగాఁ
కలభద్రోక్తులఁ ద్వాదశద్విజవరుల్ గావింపఁగా దీవనల్
జలజాప్తోదయవేళఁ బూఁగసుమహాసంబుల్ దరు త్సేర్పఁగా
విలసత్పుష్పరసానులిప్త యనఁ గావేరీనదిస్త్రీ చనున్. ౪౩

చ. వరశుచికై నదు ల్గలియవచ్చి చరింపఁగ నెల్లెడన్ దృఢా
దరణము మానసంబు పయిఁ దగ్గఁగఁ జేయుచు నీమదిన్ సదా
సురవనితాశిరఃస్థలసుశోభితమాల్యసుగంధయుక్తయై
పరఁగెడి చంద్రపుష్కరిణి భర్జితచంద్రగతాఘుఁ గాంచువొ. ౪౪

శా. ఎత్తీరంబున మత్తులాప్యధనమై యుంపొందు శ్రీరంగధా
మోత్తంసుండు వసించు నుం దనుచు సద్యోగుల్ ప్రశంసించిరో
య తీరంబున సాధుసేవ్య మగు శేషాహీశపీఠంబు నీ
చిత్తంబందు విశేషశ్రద్ధగొనుచు న్సేవింపుమా నమ్రతన్. ౪౫

మ. విలసద్దివ్యవిమానమధ్యమున నావిర్భావముం జెంది డం
బుల నొప్పారఁగఁ బేటికాసురకతంబుంబోలి శేషాహిభో
గలసత్తల్పమునందుఁ బండి కరముం గావించి మేల్దిండు దీ
ర్ఘలసద్దృష్టులఁ జూచు శ్రీపతిఁ గనంగా నామనం బేగెడిన్. ౪౬

మ. చెలికాఁడా! వెస దాఁటు చోరయుతమై ఝిల్లీరవాభీలమా
నలఘూద్యద్విపినంబుఁ జోలయుతపాండ్యాఖ్యప్రదేశస్థమున్;
అలదేశంబునతిక్రమింపఁగ నె చేయంజూడు సద్భావమున్
ఖలసాన్నిధ్యమునం గవీశ్వరులు కల్లంబోరు సచ్ఛబ్దముల్. ౪౭

చ. అలకలు కంపమంద శిరమందలి గుచ్ఛము జాఱఁ గమ్మలం
గలరతనంబు రాజిల ముఖంబున ముత్తెపుబొట్టునొప్పఁ బాం
డ్యలలన లెంతయుం గుతుక మందుచు నాస్యము లెత్తి ముద్దులం
గులుకఁగఁ గూయు చిన్నఁగనుఁగొందురు దీర్ఘకటాక్షపంక్తులన్. ౪౮

ఉ. ఏవృషభాచలంబున బలీంద్రు నడంచినవిష్ణుదేవు స
త్పావనపాదతీర్థము విభాసిలు ముట్టక రుద్రు నొందలన్
ఆవృషభాచలంబునకు నంచితసుందరనామవిష్ణుసం
భావితవాసభూమికి నమస్కృతిచేయుము భాగ్యరాశికిన్. ౪౯

మ. హరుమెప్పించి మహాస్త్రముల్గొనినపా ర్థక్షత్రియుం, ల్బంధనో
దరముం దుంతు రటంచు భీతిని బయోదంబు ల్సకాలంబునం
గురియ స్సస్యము లొప్పు; యక్షనగరిం గ్రోధించు సత్పత్తనా
మరగేహంబుల నొప్పుపాండ్యములఁ బొమ్మా వే విలోకింపుచున్. ౯౦

శా. తారల్గల్గినయాకసంబుగతి ముక్తాసైకతోపేత మై
వేరుం గాంచిన తామ్రపర్ణినది సేవింపంగఁ బొమ్మా; యకూ
పారంబుం దిగఁ ద్రావినట్టిముని యచ్చోటి న్వసింప న్సదా
తారం బైనజలంబు నీకిడును ముక్తవ్యాధిసాద్గుణ్యమున్. ౯౧

ఉ. వ్యోమముఁ దారకాయుతముఁ బోలినదానిని శుభ్రమౌక్తిక
స్తోమను దామ్రపర్ణినదిఁ జూచి భజింపుము పీతసాగర
శ్రీమదగస్త్యసంయమియుఁ జెంత వసించుట స్వచ్ఛమౌచు ము
క్తామయతన్ జలంబు లొసఁగంగల వచ్చుట నీకు హంసమా. ౯౨

ఉ. ఆనదివారిజం బనెడి యాననముం గడుఁ గ్రోలి తోషివై
యానదియూర్మిబాహువుల యగ్గపుఁగౌఁగిట శీతలుండవై
యానదిసైకతంబున విహారముఁ జల్పి సుచందనానిలం
బాని శ్రమంబుఁ బోనడువు మంబుధిఁదాఁటఁ దలంచి యచ్చటన్. ౯౩

ఉ. ఆనదివామదేశమున కల్లన పోయిన శ్యామతాళికా
నూనతమాలమైనదియు నూత్నభవాదృశ పక్షిజాతికి
స్నానసమోదమిచ్చునది నవ్యతరంగగలత్సుమౌక్తిక
శ్రీని నెసంగు వేలఁ గను చెంతను గేతకిచూర్ణసైకతన్. ౯౪

శా. శైలాగ్రంబున రెండుచాయలను విస్తారధ్వనిన్ జాఱుగం
గాలోలోరుఝురంబు నారిఁగ నభగ్నశ్రీప్రభావోచ్చ్వల
ద్వేలం జాపముగాఁగ బాణముగఁ బత్రిశ్రేష్ఠమా నీవుపా
మ్మాలంకాపురిఁ జేసి లక్ష్యమును సామ్యా వేగ ముప్పొంగఁగాన్. ౯౫

మ. దవముం గూడినకాననంబు గతి సంధ్యంజేరు వ్యోమంబునా
నవసిందూరము గల్గు నేనుఁగువిధానం బట్టుపుట్టంబుఁ బూ
ను విధన్ భాతిఁ దటిత్తుగూడు జలదుంబోలం బ్రవాళాటవుల్
గవియ న్వార్ధినిజూతు వాక్షతనువుం గానున్నద్వంద్వంబునాన్. ౯౬

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౧. | ఆంగీరసనామసంవత్సరము. మాఘఫాల్గునమాసములు. | సంచిక ౬.

ఎదురుకోలు.

శ్రీ. తి. ప. నారాయణస్వామిగారు, రుసింగి అగ్రహారము.

శా. పంప న్బాసి తలఁపువిప్రతన పున్బాపన్గన న్గ్రొల్లుదాఁ
టింపం జాలుపు తేర్లమన్నియని బొట్టె ల్వచ్చుట ల్గాంచి యా
సొంపున్గుత్తుకకొమ్మ టెంకిమగఁ డచ్చో వచ్చునవ్వారి గు
ర్తింప న్దెమ్మెరకూన మేటియని యర్తిం బిల్చి తానిట్లనున్. ౧

క. అనుమఁడ వినుమనుమఁడ ని, న్ననయఁగలదంట పుడమినెసఁగున కడిమిన్
గొనమునఁదెలివిడిచే వి, న్ననువున నెనరునను మెలపునను మాలిమిచేన్. ౨

చ. మనమలపొంతల న్దిరుగు మానిసుల న్గనుఁ గొంటి వారలే
వనిఁగొని వాల్తెకంబులకుఁ బట్టగుకానకు రాఁగతంబొ మా
యునికి యెఱింగి వేగనులయుక్కరిబొట్టియఁ డంపఁ డెంపునన్
మనలను ప్రేల్మిడిం గలన మార్కొనరారుగదా తలంపుమా. ౩

ఉ. నిక్కపుజోగు లన్నకరణి న్దలపోయుద మన్నఁ దూపులు
న్జక్కనిసింగిణు ల్దరకసంబులు నూనఁగనేల నేలతేం
డ్లక్కట పీరలంచనఁ గటా వలిపమ్ముల నేది యొండకుం
డక్కుచు నేల నారలు జడ ల్లడుదాల్చుచుఁ గానుండఁగన్. ౪

క. ఏకతమున నేకతమున, నీకానకు రాఁగతంబా? యేడ్తెఱ నెవనిం
జీకాకునొందఁజేయుదు, రో కాకెవ్వానిమనుతురో కనుఁగొనదే? ౫

ఉ. మారుతురైనచోఁ బిలుకుమార్పుము నెయ్యురకాఁ దలంచుచోఁ
గూరిమిమీఱ మన్ననలకు న్గుఱిగా నొనరించి వారలన్
గారవమొప్ప బందుగులుగా మనకీమును జేర్పు దాయమం
దారపుగాడ్పవౌదువు కదా! యసదా నిను గెల్వ నేరికిన్. ౬

క. వారలపూన్కియుఁ గర్జము, నేరుపును న్లావు నెఱిఁగి నేటుగ మమ్ముం
జేరుదురో సూడుగమిం, జేరుదురో తెలియు నుపముచేయుదె? యనఁగన్. ౭

సీ. మంటకంటనెసంగు దంటకన్నేరింటి సరు లెదఁ దఱచుగా నిరవుకొల్పి
నలువబాబాలవెన్నెలనెన్నఁదగు వన్నెనలరుమేనను బూది కలపమలఁది
కెంపువన్నియ నింపు నింపుపెన్నెరుల నాజడఁజొళ్ళెముగ నెత్తినడుమఁ జుట్టి
బలుకాన నలరు జోగులబాగు గనుపట్ట మొలనిండ జేగురు వలువఁ జుట్టి

గీ. వలుదసారబుఱ్ఱ నొకకేల నలువుమెఱయ
లాఁతమొకకేలఁ జేకొని లాఁతినెఱుఁగ
నట్టి నిక్కపుబాసవాల్దిట్ట యనఁగ
దనరు వేసమ్ముఁగొనె నీటితాతకూన. ౮

మ. తనదా వాలక మిట్టులేర్పఱిచి వాఁతన్పాఁతపల్కుల్పెరల్
వినఁగాఁ బల్కుచు గట్టుడిగ్గి యఱవన్ వేవచ్చి చెంగల్వరా
యనిసంగాతికొలంపుదివ్వియలచాయన్జేరి కేల్మోడ్చి వి
న్ననువున్దీమగు నీదచూలి కడునెయ్యంబొప్పఁ దా నిట్లనున్. ౯

శా. సామీ! మూఁడుజగమ్ము లేడ్తెఱ గడించంజాలి యేపాదు మీ
రేమన్నీనికడిందిపున్నెముల నెంతేవేడ్కఁ బండింపఁగా
నీమాడ్కి న్నిడిమాసులై పుడమిపై నింపొందుచున్నారొకో?
మీమీతల్లియుఁ దండ్రి యెవ్వరకొ? నెమ్మిన్నాకు విన్పింతురే? ౧౦

ఉ. చెందొవసూడుజేదొలర చెల్వన నల్వన మీఱు మీరతే
కందువనుందు రేదొసఁగు గల్గుటనో వినుచెంకిఁబాసి యీ
చందపుబొందుల న్మలలచక్కి మెలంగెడు వేల్పులొక్కొ? మీ
చందము ఏషదోయి కరుసంబుగ నింబుగ నానతిత్తురే. ౧౧

ఉ. ఆగడ మెద్దియేని గని యాఱనియీరసమొప్ప సిల్గులన్
దోఁగఁగ నిట్లు కానలకుఁ ద్రోచెనొ మీయెకిమీఁడు; లేక నే
యీగడపైకె మెకంబులకు నిల్లయి పెల్లుగ బీతుగొల్పుచున్
జేగయడంచు కానలకుఁ జేరఁగఁ రాఁగతనుయ్యెఁ దెల్పుఁడా. ౧౨

క. ఒడిమెలకునొడిమెలగుమీ, యొడళులురవణములఁబాసి యుండియుఁదేజున్
విడువవదేకతమున మీ, రొడళులఁ గైసేయఁ దలఁపరో దొరలారా. ౧౩

క. వినువెజ్జు లనఁగఁ దగు మీ, మ్మనవచ్చునె యన్నదమ్ము లని; మీయెడలం
గనవచ్చు పోఁడుముల తెం, డ్లనవచ్చునొ బాసవాలు లని యనఁ దగునో.

క. నడబెడఁగు నొడలియొఁపును, నుడికారపుసొరు తొడల నూల్కొనుతీరున్
వడిఁ దోఁపఁజేయు మీరీ, పుడమి మనుఁగల్గు రాచప్రోడ లనంగన్. ౧౫

ఉ. ముత్తిగఱా నెరాపనుల మోపలల న్బలితంపుఁ దమ్మితా
మొత్తపుఁ గూర్పు మాడువుల ముద్దగు నిద్దపు మూలఱాలచే
నెత్తగు మేడల న్దిరుగ నిమ్మగు మీనును మెట్టుఁదమ్ము లీ
కత్తులవంటి ఱాలు కడుఁ గాఁడఁగ వాడఁగఁ జేయఁ బాడియే. ౧౬

మ. జడలు న్నారలుఁ దాల్చి కానలనె నిచ్చల్ గ్రుమ్మరంగోరు మీ
యెడల న్జానగు విండ్లుఁ బత్తలిక లెన్నో తూపులు న్గాంచి నా
యెడఁద న్సందియమాట మీకత లొకింతే సుబ్బుదాఁక న్మిముం
నుడివాలుంబడవాలు లంచనెద నన్నుం గూర్మిచున్నింపరే. ౧౭

ఉ. దాయలలోనఁ జేరఁడు గదా తొవదాయయనుంగుపట్టి యీ
చాయల రక్కెసల్దిరుగు జాడలఁ గన్గొని వారినొంప నీ
తోయమున న్దొన ల్బలుకుఁ దూపులు సింగిణు లొప్పఁగానలన్
డాయఁ దలంచి రొక్కొ చెపుడా కలరూపున నున్నమీకతల్. ౧౮

క. ఈనెలవున మీబందుగు, లేని కడుంగూర్చువార లేని యుఁ గలరే
పూనినకర్జమునకునై, జానగు బాసటను వెనుకఁ జనువారలొకో. ౧౯

క. నిక్కమిది యేని మీకుం, జక్కనిసంగాతినిందె సమకూర్చెద మా
చక్కికి విచ్చేయుదురే, జక్కులకవఁ దెగడు జోగిచందురులారా. ౨౦

మ. కలఁడీగట్టునఁ జెట్టునట్టుగమి లెంకల్గాఁ జొకా యర్తిచే
నలువొ వాఁడను కోతిరాయఁడు దురానన్మబ్బు రాకూన యిల్
వెలలింప న్నెల విందుఁ జేసికొని యోలిన్వాలిపై యొంటమిం
దొలఁగ న్దోరియఁగ బాసపై నిలుచు జోదున్గోరి యేకారుచున్. ౨౧

చ. గొనములతావు కయ్యముల కున్దగులావరి తాల్మియిక్క నే
టునకుఁ గలంకు దాయలకు డొంకెన నెయ్యురపాలి వేల్పుమ్రా
నన నలరారు జక్కవలయంటుకొమారునితోడి చెల్మి మీ
కెనసిన మేల్మిబంగరున కింపగుతావి యొసంగినట్లగున్. ౨౨

మ. జగముం గంటినిసుంగుతోఁ జెలిమి కిచ్చం జేయువారేని య
జ్జగజెట్టీఁ డొకలెంకయై తనరి నిచ్చల్దోడునీడౌచు మీ
వగల న్దీర్పఁగలాఁడు నిక్కమని తేల్పంబూన నేలన్నఁ గ్రో
లగనౌ పానకమెట్టిదంచు నననేలా? యారగింపౌ నెడన్. ౨౩

క. తెమ్మెరకం దీవకువున, నమ్మికతోఁ బక్కి నెనరు నను నిల్చిన డెం
దమ్ముల నలరారిరి చెం, దమ్ములరాకొలపుజింకతాల్పులుమిగులన్. ౨౪

మ. అనుచుం బయ్యెరబొట్టెఁ డాడఁగ బెడంగైనట్టి యామాటలన్
వినుచుం దమ్మిబొజంగువంగసపు రేవెగ్గైన యాలక్ష్మణుం
డనెఁ దానిట్లని జోగివెన్నెలలరాయా! నీదుపల్కుల్లుడు
న్వినవిందై మదికించె జక్కవలకున్ వెల్గురాకన్బలెన్. ౨౫

అభిజ్ఞానశాకుంతలము.

సాహిత్యవిద్యాప్రవీణ, బులుసు వేంకటరమణయ్యగారు-రామతీర్థము.

క్రిందటిపరిషత్సంచికలో బ్ర. శ్రీ. అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రులు గారు కాళిదాసుశాకుంతలమునందలి దుర్వాసశ్శాపవృత్తాంతము తక్కినయంకముల స్థితికొఱకును, నిర్వహణమునందు నిరూపింపవలసిన యద్భుతప్రతిపాదనము కొఱకును, షష్ఠాంకమునందలి ప్రవాసవిప్రలంభవర్ణనము కొఱకును మాత్ర మగుచున్న దనియు, స్వభావవిషయమున భారతమునందలి శకుంతలాదుష్యంతులే బాగుగఁ జిత్రింపఁబడి రనియు నొకవిషయమును బ్రతిపాదించియున్నారు. దుర్వాసశ్శాపవృత్తాంతాదికము తక్కినయంకములస్థితికి, నద్భుతమునకు, విప్రలంభవర్ణనమునకు నుపకరించుటలో సందేహము లేదు; కాని దానికి ముఖ్యములగు ప్రయోజనము లయ్యవియే కావనియు రసమును నాయకస్వభావమును బరిపోషించుటయే కవ్యుద్దిష్టము లై యుండవచ్చునేమోయనియు నాయాశయము.

మహాభారతమునందలి శకుంతల కొడుకుం గొని పతికడ కేగి తొల్లింటివృత్తాంతము నెఱుకపఱిచినను దుష్యంతుఁ డది యెఱిఁగియు నెఱుఁగనివాఁడు పోలె "ఏ నెఱుఁగ నిన్ను నెక్కడిదానవు? మిన్నక యి యనుచితంబులు పలుకంగా నేల? యరుగు మంబురుహానన యెందుండి వచ్చి తందులకు వడిన్" అని యనుట యుచితము కాఁగలదా ? "అన్యు లెఱుఁగమిఁ జేసి లోకాపవాదభీతి నెఱిఁగియు నిత్తన్విఁ బ్రీతి దప్పి యెఱుఁగనంటిని'' అనువచనమును బట్టి రాజు కోరియే యసత్యమాడినట్లు వ్యక్తము కాకుండునా? దృశ్యకావ్యమున నట్లు నిబంధించినచో సహృదయు లగుసామాజికులకు రసాస్వాద మేరీతిని గలుగఁ గలదో చదువరు లూహింపకపోరు. శ్రవ్యవిషయమునఁ గూడ నిట్టియెడ రాజు సభ్యులకెల్లఁ గలతెఱం గెఱింగించి వారుచెప్పినట్లు నడుచుటను వివరింపవలసి యున్నది. రాజు స్వభావము నెఱింగిన సభ్యులు తద్వాక్యములను విశ్వసింపకుందురా? సులభము లగుమార్గాంతరము లుండఁగా వానిని విడిచి లోకమున నపవాదము కలుగునేమో యని యనుమానించి దానిని సిద్ధాంతీకరించి తన్మూలముగ నసత్యము లాడి (పిదప) మఱలఁ దనదే తప్పని యొప్పుకొనుట కూడ రాజుస్వభావమును బరిపోషింపఁజాలదేమో! అప్పటికి గౌరవించినను, సత్య

దూరుఁడును, భీరువు నగు రాజు తనయెడఁ బరిపూర్ణ మగు ననురాగము చూపు నని శకుంతలమాత్రము నమ్ము టెట్లు?

తపోవనమున వైఖానసవ్రతమున నున్న మునికన్యకలు తక్కిన ప్రసంగములను మాని శృంగారప్రసంగములనే దొరకొనుట యనుచిత మని శ్రీశాస్త్రులుగారి యభిప్రాయమైనట్లు తేలుచున్నది. కాని శాకుంతలమును శృంగారరస ప్రధాననాట్యముగఁ జేయఁదలఁచిన కవి శ్రృంగారమును వర్ణింపక తక్కినవాసిని వర్ణించి యంతటితో నంకమును లేవనెత్తినచో రసాస్వాదము కాని ప్రథమాంక ప్రయోజనము గాని, బీజముగాని వ్యంగ్యములగునేమో యని నాసందేహము. వనితలకు శృంగారచేష్ట లొకరు మప్పనక్కఱ లేదు. యౌవనమే యాపని జేయఁగలదు. మఱియు నుచితజ్ఞుఁ డగుకవి యౌవనమదోద్రిక్తములగు భావములను జాలవఱకును గప్పిపుచ్చి యొంతటికిని సాధ్యము కాకుండునపుడు "కింపున రిమం ప్రేక్ష్య తపోవన విరోధినో వికారస్యగమనీయా౾స్మిసంవృత్తా" అని శకుంతలచేఁ బల్కించియున్నాఁడు. అదియు స్వగతముగనే, కావుననే యచట భావము లేమియు నుద్రిక్తములు కాలేదు.

మహాభారతమునందలి శకుంతలను గనుఁడు. ఆమె దుష్యంతుఁడు చక్రవర్తియని యెఱిఁగియు, నించుకంతయు లజ్జను గాని సంకోచము గాని ప్రకటింపక దుష్యంత! అని సంబోధించి యడిగినదే తడవుగఁ దనజన్మవృత్తాంతమును తూ, చా, లు తప్పకుండ నేకరువుపెట్టినది. తొలుత రాజు "కణ్వదర్శనార్థినై వచ్చితి; నాతఁ డెక్కడ?" అని యడుగ నామె "ఫలములఁ దేఁబోయె, నొకింత తాళుఁ" డని నిల్పి యకారణముగనే మందహాసము సేసెను. ౧. అయ్యది మునికన్యకకే కాదు; సామాన్యముగఁ గన్యకకుఁగాని సతియగు నామెకుఁ గాని యుచితమై యున్నదేమో కనుఁడు. మఱియొక సంగతి. శకుంతల తన జన్మవృత్తాంతమును రాజున కెఱింగించుచుఁ దండ్రియగు విశ్వామిత్రుని తపస్సు చెఱచుటకుఁ దనతల్లి యగు మేనక యింద్రలోకమునుండి వెడలునపుడు దేవేం

౧ అపశ్యమాన స్తమృషిం తథాచోక్త స్తయా చ సః।
తాం దృష్ట్వాచ వరారోహాం శ్రీమతీం చారుహాసినీమ్॥ ౧౦
దర్శనా దేవహి శుభే త్వయా మే౾పహృతం మనః॥ ౧౩
ఏవ ముక్తాతుసా కన్యా తేన రాజ్ఞా తదాశ్రమే।
ఉవాచ హాసతీ వాక్య మిదం సుమధురాక్షరమ్॥ ౧౪
[మహాభారతే ఏకసప్తతితమో౾ధ్యాయః॥]

త్రుని గోరినకోరికలను సిగ్గుమాలి వివరించినది. [మేనక విశ్వామిత్రుని జేరనరుగునపుడు వాయుదేవుఁడు వస్త్రము నెగురఁగొట్టవలె ననియు, మన్మథుఁ డాసమయమున సాయపడవలె ననియు మేనక కోరినకోరికలు] ౨. అట్లు వివరించుట వనితాలోకమున కెంతటిలజ్జాకరమో పాఠకు లూహింపక పోరు.

శకుంతల యంతటితో విరమించెనా ? లేదు. తనజనయిత్రి యగు మేనక తపోవనమును జేరి విశ్వామిత్రునికిఁ బ్రణమిల్లి యెట్లు నాట్యము నొనర్చిన గాలిచేఁ దనకట్టు వలువ యెగిరిపోవునో యారీతిని నృత్య మొనర్చె ననియు, నంత నావస్త్ర మెగిరిపోయిన దనియు నెగిరినదానిని నెమకునెపమున వివస్త్రయై మునిసమీపస్థానమున కరుదెంచె ననియు, నపుడు ముని యామె రూపసౌందర్యసంపదకు ముగ్ధుఁడై మోహించి యామెం గూడెననియు, నంతట వారికిఁ దాఁబుట్టితి ననియుఁ జెప్పెను. ౩. ఇట్లు నిర్లజ్జయగు మహాభారతశకుంతలకంటె, కాళిదాసుని శకుంతలయే యుచితరీతిని జిత్రింపఁబడిన దని తేలకమానదు. ఇట్టియెడ మహాభారతపఙ్క్తికంటె నాటకపఙ్క్తియే స్వభావపరిపోషకముగను సహృదయావర్జకముగను గలదేమో యని నాసందేహము.

---

౨ కామం తు మే మారుత స్తత్ర వాసః । ప్రక్రీడితాయా వివృణోతు దేవః॥
భవేచ్చ మే మన్మథ స్తత్ర కార్యే । సహాయభూత స్తు తవ ప్రసాదాత్॥ ౪
[మహాభారతే వనపర్వణి ఏకసప్తతితమోఽధ్యాయః.]

౩ అభివాద్య తత స్తం ప్రాక్రీడదృషిసన్నిధౌ ।
అథోవాహ చ వాసోఽస్యా మారుతః శశిసన్నిభమ్ ॥
సాఽగచ్ఛత్ త్వరితా భూమిం వాస స్తదభిలిప్సతీ ।
స్మయమానేవ సవ్రీడం మారుతం వరవర్ణినీ ॥
పశ్యత స్తత్ర తస్యర్షే రప్యగ్నిసమచేతసః ।
విశ్వామిత్ర స్తత స్తాం తు విషమస్థా మనిన్దితామ్ ॥
...వాసనిసంభ్రాన్తాం మేనకాం మునిసత్తమః ।
అనిర్దేశ్యవయోరూపా మపశ్యత్ వివృతాం తదా ।
తస్యా రూపగుణాన్ దృష్ట్వా స తు విప్రర్షభ స్తదా ।
చకార భావం సంసర్గే తయా కామవశం గతః ।
న్యమన్త్రయత చాప్యేనాం సా చాప్యైచ్ఛ దనిన్దితా ।
తౌ తత్ర సుచిరం కాలం వనే వ్యహరతా ముభౌ ।
రమమాణౌ యథాకామం యథైకదివసం తథా ॥
జనయామాస స ముని ర్మేనకాయాం శకున్తలామ్ ॥
[మహాభారతే వనపర్వణి ద్విసప్తతితమోఽధ్యాయః॥]

·7

కొన్ని గ్రంథాంతపద్యములు.

క. గుడికొమ్ము ఏత్వ మైత్వము, వడి నొత్వౌత్వములు సున్న లొనరఁగ రేఫల్
దిడిదప్పి వ్రాయకున్నను, గడుసరులవి యెఱిఁగి వ్రాసి కరుణింపవలెన్.

క. వ్రాలాశ్వ భ్రలు తప్పులు, చాలంగల వేను శబ్దసంగతు లెఱుఁగన్
గేలింబెట్టక నవ్వక, పోలంగా దిద్దరయ్య బుధజనులారా.

ఉ. తప్పనిచోటఁ దప్పనుచుఁ దప్పని యారస మూనఁ బోకుఁడీ
తప్పినఁ దప్పు గల్గెనని తప్పని సత్కృప మీరుదిద్దుఁడీ
యొప్పు టొకింత గల్గ మది నుబ్బుఁడు పండితులార మీకు నేఁ
దప్పని శిష్యుఁడన్ గురులఁ దప్పు నె శిష్యునికీర్త్యకీర్తియున్.

గీ. వ్రాఁతతప్పువలన వాచకులగువారు, తప్పుగలిగెనేని తగినయెడల
వలయునక్షరములు వెలయంగ దిద్దుఁడీ, సుకవులైనవారు సుస్థిరముగ.

క. లక్షణమెఱుఁగను బ్రతిఁదగ, వీక్షించి లిఖించినాఁడ నిందులతప్పుల్
అక్షరలోపము లొదవిన, లక్షణవిదులార సైచి లలి దిద్దుఁ డొగిన్.

క. ప్రతిఁ జూచి వ్రాసినాఁడను, అతిశ్వభ్రలువ్రాలుఁ జూడ నన్నియుఁ దప్పుల్
యతిగణప్రాసము లెఱుఁగను, మతిమంతులు తప్పుదిద్ది మన్నింపరయా.

క. సందియమువలదు నిదె మీ, కందఱకును వేడ్కతోడ నంజలిచేతున్
ఇందునఁ దప్పులు గలిగినఁ, బొందుగ దిద్దుటకు నేను భూసురులారా.

క, ప్రతినున్నరీతివ్రాసితి, నతిశయ కవితా ప్రచార మది యెఱుఁగను శ్రీ
సతిపతికరుణను దప్పులు, మతిమంతులు చూచి దిద్ది మన్నింపవలెన్.

శ్లో. సరభసకరవేగా ద్భ్రష్టవర్ణాదిదోషో
యదిహ భవతు వా చాపుస్తకే హా స్తదోషః
అవిదితపరదోషజ్ఞానపీయూషపూర్ణాః
కరకృతమపరాధం క్షన్తుమర్హన్తి సన్తః.

శ్లో. తైలాద్రక్షే జలాద్రక్షే చ్చోరా దగ్నిభయాత్తథా
మూర్ఖహస్తేననోపేయా దేవం వదతి పుస్తకమ్.

శ్లో. బద్ధహస్తకటిగ్రీవ స్తబ్ధచక్షు రధోముఖమ్
కష్టేనలిఖితం గ్రంథం పుత్రవత్పరిపాలయేత్.

శ్లో. భీమస్యాపి రణేభంగో మునేరపి మతిభ్రమః
యదిశుద్ధం తదన్యత్ స్యాత్ మమదోషో నవిద్యతే.

శ్లో. యాదృశం పుస్తకందృష్టం తాదృశం లిఖితంమయా
అబద్ధోవా సుబద్ధోవా మమదోషో నవిద్యతే.

శాంత యెవరికూఁతురు ?

—(తులసి లక్ష్మీనారాయణమూర్తిగారు-ఇంజరం.)—

జగన్నాటకసూత్రధారుఁడును శేషశాయియు శ్రీవల్లభుఁడు నైన శ్రీమన్నారాయణుఁడు మునులచేతను, నింద్రాది బృందారకులచేతను బ్రార్థితుఁడై రాక్షసనాశము చేయుటకొఱకు భువిని రామావతారము నెత్తెను. చాలకాలమునుండి సంతానశూన్యుఁడై పరితపించుచున్న దశరథున కీతఁడు పుత్రుఁడై జన్మించెను. రాముఁడు పుట్టుటకుముందు దశరథుఁడు మునుల యాజ్ఞ నశ్వమేధయాగముఁ జేసెను. అయ్యశ్వమేధయాగమునకు శాంత భర్త యైనఋష్యశృంగుని రావించినఁ గాని యాగఫలము సంప్రాప్తము కాదని తెలిసి యాతని రావించి సఫలమనోరథుఁడై దశరథుఁడు సుఖముండె నని పురాణములు చెప్పుచున్నవి. అట్టి దశరథుని మనోరథప్రాప్తికి హేతు వైన ఋష్యశృంగునిజాయ యగుశాంతవృత్తాంతమును దెలిసికొనుట యావశ్యకమై యున్నది. ఈమె యెవరికొమారితయో విచారించుటయే యీవ్యాసముయొక్క ముఖ్యోద్దేశ్యము.

చాలమంది యభిప్రాయము శాంత దశరథునికొమార్త యనియే; ఆమె నాతఁడు రోమపాదుఁ డనురాజునకు దత్తతగా నిచ్చెననియు రోమపాదుఁ డీమెను స్వీకరించి కన్నపుత్రికకంటె నెక్కువ మక్కువతోఁ బెంచె ననియు లోకమున నొక ప్రతీతి కలదు. ఆవిషయమునే భవభూతికూడఁ దనయుత్తరరామచరితనాటకములో నిట్లు చెప్పియున్నాఁడు.

శ్లో. కన్యాం దశరథో రాజా శాన్తాం నామ వ్యజీజనత్
అపత్యకృతికాం రాజ్ఞే రోమపాదాయ తాం దదౌ.

దేని నాధారముగఁ జేసికొని యిట్లు చెప్పెనో తెలియదు. వాల్మీకిరామాయణమునం దెక్కడను గూడ నీవిషయమై యిట్లు వ్రాసియుండలేదు.

ఈమె దశరథునికొమార్తయే యైనపక్షమున రామాదుల జననమువలెనే యీమెజననప్రకారముకూడ రామాయణమునఁ జెప్పఁబడియుండును. రామాయణమున నెచ్చటను శాన్తాజననక్రమము చెప్పఁబడియుండలేదు.

మఱియు దశరథునకుఁ గౌసల్యాదులు ముగ్గురుమాత్రమే భార్యలున్నట్లు రామాయణమునఁ బ్రసిద్ధముగ నున్నది. ఈముగ్గురికంటె నితరభార్యలు దశరథునకు లేరు. వీరిలో నెవరికిని శాంత యనుకొమార్త లేదు.

మఱియు నాఁడుబిడ్డ నత్తవారింటికిఁ బంపి యప్పు డప్పుడు మఱలఁ బుట్టినింటికిఁ దీసికొనివచ్చుట లోకప్రసిద్ధవ్యవహారమైయున్నది. కడుబీదవారైనను నాఁడుబిడ్డ నత్తవారింటికిఁ బంపి మఱలఁ దీసికొని రాకుండ నుండరు. అట్టివిషయములో శ్రీరామునివివాహము మొదలగుశుభముహూర్తములకుఁ గూడ దేనికిని శాంత వచ్చి యున్నట్లు కనుపట్టదు. తీసికొని రాకపోవుటకుఁ గారణము దశరథునకుఁ గూఁతునందుఁ బ్రేమాభావమా? లేకధనాభావమా? కూఁతురున్న నట్లెన్నటికిని జేయఁజాలఁడు.

మఱియు శాంతను దశరథుఁడు రోమపాదునకు దత్తతగా నిచ్చె ననుట యసంభవము. ఏలయన- లేక లేక వార్ధక్యమున జన్మించిన యొక్క కూఁతు నన్యుని కెట్లుదత్తతగా నివ్వఁగలఁడు. చాలమంది సంతానముఁ గలవాఁడైనను నీయఁజాలఁడు. లోకమున నెట్టిబీదవాఁడైనను దుదకు బిచ్చ మెత్తుకొనువాఁడు కూడ నొక్కకూఁతు నన్యులకుఁ బెంచుకొనుట కీఁజాలఁడు. అట్టితఱి సకలభూమండలము నేకచ్ఛత్రముగఁ బరిపాలించుచు, రఘుకులాన్వయచంద్రుఁడై పాకశాసనాది బృందారకులచే నెన్నఁబడిన ప్రతాపముఁ గల దశరథుఁడేడ! లేక లేకఁ కలిగినయనుంగుఁగూఁతు నితరులకు దత్తతగా నిచ్చుటేడ! ఎన్నటికి నట్లు సంభవింపదు.

“దశపూర్వేషాం దశాపరేషాం మద్వంశ్యానాం సర్వేషాం పితౄణాం నరకాదుత్తీర్య త్వై స్నాకం విష్ణులోకే నివాససిద్ధ్యర్థం శ్రీలక్ష్మీనారాయణప్రీతయే సాలంకృతకన్యాదాన మహం కరిష్యే” అని మహాసంకల్పముతోఁ గన్యాదానము స్వయముగఁ జేసికొనక యిరువదితరములవారిని దరింపఁ జేసి స్వర్గలోకనివాసము నిచ్చు కన్యాదానమును విడనాడి దశరథుఁ డేకపుత్రికయైనశాంతను దత్తతగా నిచ్చునా? ఎన్నటికి నీయఁడు.

కావున శాంత దశరథుని కొమరిత యెన్నటికిని గానేరదు. రోమపాదుని కుమారి యని యే చెప్పవలయును.

వాల్మీకిరామాయణమునందుఁ గూడ నిట్లు చెప్పఁబడియున్నది. దశరథుఁడు పెద్దకాలము సంతానశూన్యుఁడై పరితపించుచు నొకనాఁడు వసిష్ఠాదిమునీశ్వరులను మంత్రిసామంతాదులను రావించి సభఁజేసి “మహాత్ములారా! నరుని బుత్రుఁడే నరకమునుండి ముక్తి నొందించును. కావుననే యార్యులు, “పున్నామ్నో నరకాత్త్రాయత ఇతి పుత్రః” అని చెప్పియున్నారు. అట్టిపుత్ర

శూన్యుఁడ నై "అపుత్రస్య గతిర్నాస్తి" యనునట్లు గతి లేక నరకకూపమునఁ బడవలయునా? లేక పుత్రప్రాప్తికేమేని సాధనమున్నదా యని వారలనడిగెను.

అప్పుడు వసిష్ఠాదులు "మహారాజా పుత్రకామేష్టిని జేసిన నీకుఁ దప్పక పుత్రప్రాప్తి కలుఁగు నని చెప్పిరి. దానికి సంతసించి దశరథుఁడు వారల నడిగి యాగమునకుఁ గావలసిన సంభారముల నన్నిటిని సిద్ధముచేయ నారంభించెను. ఇంతలో నొకనాఁడు సూతుఁడు రహస్యముగ దశరథునితో "మహారాజా! నీవు పుత్రులు లేక దుఃఖించుచుండఁగా నాకాలముననే రోమపాదుఁ డనురాజుండుననియు, నొకప్పు డాతని దేశ మనావృష్టిచేఁ బీడింపఁబడు ననియు, నట్టితఱి నాతనికి శాంతయను కుమారిక యుండు ననియు, నామెను విభాండకసుతుఁ డైనఋష్యశృంగున కిచ్చి వివాహము చేయఁగా ననావృష్టి నివారణమగు ననియు నప్పు డారోమపాదుని యల్లుండైన ఋష్యశృంగునిఁ దోడ్తెచ్చి పుత్రకామేష్టిఁ జేసిన దశరథునకు సంతానము కలుఁగు ననియు సనత్కుమారులవారు చెప్పియున్నారు. కావున ఋష్యశృంగుని యాగమునకు రావింపుఁడు. అప్పుడు మీకు సంతానము కలుగు"నని సూతుఁడు చెప్పఁగా విని దశరథుఁడు సంతసించి వెంటనే రోమపాదుని రావించి యంతయుఁ జెప్పి యాతనిచే శాంతను ఋష్యశృంగున కిప్పించి వివాహముచేయించి యాతనియల్లుఁడైన ఋష్యశృంగుని రావించి యాగముఁ బూర్తిచేసెను. ఇట్లుండఁగా శాంత దశరథుని కుమారిక యనుట యెట్లు?

మఱియు నీవిషయమే భాస్కరరామాయణములోఁ గూడ నిట్లున్నది. ఈయర్థము కలపద్యమును గ్రింద నుదాహరించుచున్నాను.

సీ. ఏకాంతమున సూతుఁ డిట్లను దశరథుఁ గనుఁగొని భూమీశ కశ్యపునకుఁ
దగ విభండకమునితనయుఁ డై పుట్టెడి నామునీశ్వరునకు ననఘమూర్తి
చిరపుణ్యుఁడగు ఋష్యశృంగుఁడు పుట్టెడు రోమపాదుండను భూమివిభుఁడు
జనియించికూఁతు నామునికిచ్చి నెమ్మదిఁ దనయింటనిడుకొనితనరఁగలఁడు
నీవతనితోడఁ బొత్తును నెఱయఁ జేసి, యతనిఁ బ్రార్థించి యారాజునల్లుఁడైన
ఋష్యశృంగునిఁదోడ్తెచ్చిఋషులు మెచ్చ, బుత్రకామేష్టిఁ జేయించిపుణ్యమహిమ.

ఇట్లుండుటచేతను శాంత జన్మవృత్తాంతము రామాయణమునం దెచ్చటను గానఁబడకుండుటచేతను, రోమపాదునిఁ బ్రార్థించి యతనియల్లుఁ డైన ఋష్యశృంగునిఁ దోడ్తెమ్మని చెప్పుటచేతను దశరథునికి శాంతయను పుత్రిక లేదని చెప్పుటయే యుక్తము. ఎటులైనను శాంత జన్మవృత్తాంతము ప్రమాణగ్రంథములం దెచ్చటను విపులముగ వ్రాయఁబడియుండలేదు. నేనీవ్యాసమును జిజ్ఞాసచే వ్రాయుచున్నాఁడను.

———

గ్రంథస్వీకారము.

నీతిచంద్రిక:— శ్రీపరవస్తు చిన్నయసూరిగారు రచియించినది- చిన్నయ్యసూరిగారు 1853 సంవత్సరమున మొదటికూర్పుగాను 1856 వ సంవత్సరమున రెండవకూర్పుగాను ముద్రించి ప్రకటించిన మూలగ్రంథమునుబట్టి యీ రెండుకూర్పులలో నున్నట్లుగా నిపుడు బ్ర॥ రావుసాహేబు గిడుగు వేంకట రామమూర్తి పంతులుగారిచేఁ బ్రకటింపబడినది 16 పుటల ప్రస్తావనలో నీపుస్తకమును గుఱించి విశేషములు వ్రాయఁబడియున్నవి. వెల రు 0-8-0 పర్లాకిమిడిలో శ్రీ రామమూర్తి పంతులుగారియొద్ద దొరకును.

(2) లేమొగ్గ—కందుకూరి రామభద్రరావుగారు రచించినది. అర్చన, హిమవంతము, భాస్కరోదయము- ఈరీతిగా 18 ఖండకావ్యములు గలవు. అన్నియు గీతపద్యములు- ఇందుఁ గొన్ని గృహలక్ష్మి పత్రికలోఁ బ్రకటింపఁబడినవి. అందం దచ్చుపొరపాటులును చేతిపొరపాటులును గలవు. వెల తెల్పఁబడియుండలేదు. రాజవరములోఁ గవిగారియొద్ద దొరకును.

(3) సుమవల్లి—కవిమిత్రులు రచించినది- 35 పుటలలోఁ దెనుఁగున నింగ్లీషున ఖండకావ్యములు గలవు. ఈకావ్యకర్త లగుకవిమిత్రు లందఱును కాకినాడ కళాశాలలోనివిద్యార్థులే. మంచిదళసరికాగితములు, చక్కని యచ్చు, అపూర్వకల్పనలు, నిర్దుష్టరచన-యీపుస్తకమునఁగలదు. కళాశాలలోని యాంధ్రోపాధ్యాయులును నాంగ్లోపాధ్యాయులును దమశిష్యులను బ్రోత్సహించుటచే తనే యీచిన్నిపొత్తము వెలువడినది. కవితాప్రసూనము, వెన్నెలరేయి, రాధ పిలుపు, నెలపొడుపు-ఇత్యాది, యనేకఖండకావ్యము లిందున్నవి. వెల0-6-0.

(4) శ్రీమదాంధకార్తికమాహాత్మ్యము- (పురాణము) పడమటిగోదావరిజిల్లా కొవ్వూరుబోర్డుహైస్కూలునం దాంధ్రపండితు లగు బ్ర॥ అనిపెద్ది జగన్నాథశాస్త్రిగారియాంధ్రీకరణము. 169 పుటలు, నాలుగాశ్వాసములు. ఆంగ్రగీర్వాణముల రెంటను జాల నిర్దుష్ట మగుపక్కిని శాస్త్రిగారు రచియించిరి. ఈపురాణము కార్తికమాసములో మోక్షపరులు చదువఁదగినది. రెండుపద్యములు మచ్చుచూడుఁడు—

మ. హతకామాద్యరివర్గుఁడై విపులభక్త్యన్వితుఁడై సర్వవ
స్తుతతిన్ శ్రీహరిగాఁ దలంచుచు సముద్భూతప్రమోదాశ్రు పూ

రితనేత్రుండయి నృత్యము సలుపుచుఁ శ్రీవల్లభుం బాడు న
య్యతికిఁ బోనము వెట్టె నయ్యమ నమస్కృత్సెక్కు గావించుచుఁ - 72పుట

చ. అతఁ డొక బ్రాహ్మణోత్తమున కప్పిడెఁ జాలధనంబు వత్సర
త్రితయ మతిక్రమించెను తఱిఁ ధనమిప్పుడ తెమ్మటంచు భూ
క్రతుభుజు నన్యదేశమునఁ గాంచి నిరోధమొనర్ప విప్రుఁ డు
న్నతిఁ దలపోసి యిట్లని తా మంజులవాక్చతురత్వ మేర్పడఁ. 80 పుట.

పుటలమీఁద నాశ్వాసచిహ్నములును బద్యములకు సంఖ్యయును లేకుండుటచేఁ గొంచెము చదువు వారికి సౌకర్యము తక్కువగా నుండవచ్చును. వెల రు 1-0-0.

(5) నిర్వచనభారతగర్భరామాయణము — గ్రంథకర్త - గుంటూరుజిల్లా గురజాలనివాసులు మ॥ రావిపాటి లక్ష్మీనారాయణకవిగారు. ప్రతిపద్యమునందును భారతకథయు రామాయణకథయు వచ్చునట్లు చెప్పుటలోఁ బింగళి సూరనార్యుని రాఘవపాండవీయాదులు మన మెఱింగినవియే- ఇది యట్టిది కాదు. ఇందు రామాయణార్థమిచ్చు న్యాక్తపద్యగర్భమందు భారతార్థమిచ్చు గీతమో కందమో బైలువెడలుచుండును. "ఇట్టి కష్టతరమగురచనకుఁ బూనుకొన్న యీకవిరచనలో నావిన్నయంతలో వ్యాకరణాదిదోషములు లేశమును గానవచ్చుటలే" దని శతావధాని చెళ్ళపిళ్ళవేంకటశాస్త్రిగారును—"ఈప్రయత్నము మున్నెవ్వరును జేసియున్నట్లు నాయెఱింగినంతదనుక గనఁబడదు. ఇది విశ్వామిత్రసృష్టివలెఁ గాక శతానందసృష్టివలె 'సకలజనానందకరము" అని జనమంచి శేషాద్రిశర్మగారును సదభిప్రాయముల నిచ్చియున్నారు. ఒక్కమచ్చుపద్యము.

సీ. మందరబోధ రామవనవాసము పదునాలుగేండ్లు భరతపాలనమును
ధవు వేఁడి తాటకా(ధర్మరాజుసిరిఁబదపడిహరించెఁజూ)తసుమగాత్ర
తరుణికై కవిభుదత్తద్వివరముల మో(దమున; రహిసుయోధనమహితకృతి)
ప్రభుమంత్రిసిద్ధంబు (పాయనిధృతితోడఁ జేయించెఁగృష్ణాంశు) శిష్టురాము
శ్రీకి; రప్పించి వానిచే సీతమగని, సర్వముం జెప్పెఁ గైక; కౌసల్యగోడు
గనెవినిస్వసుతరాజ్యాధి(కహరణముఁనుమా న్పెఘనుఁడగుహరి)వంశమఁడనుండు
ఇందలి గర్భగీతములో భారతార్థ ()మిట్టి గుఱుతులనడుమ నిమిడినది.

గీ. ధర్మరాజుసిరిఁ బదపడిహరించె జూ, దమున రహి సుయోధనమహితకృతి
పాయనిధృతితోడఁ జేయించెఁగృష్ణాంశు,కహరణము;మా న్పెఘనుఁడగుహరి.

అందందు లఘుటీకయుం జేర్పఁబడినది. ఈకవిగారిశ్రమకు భాషాభిమానులుసాయపడి తగినఫలితము నొసంగఁదగును. వెల రు 0-8-0.

(6) ముద్రారాక్షసము—నాటకము. మహాకవి విశాఖదత్తుని సంస్కృతనాటకమునకు బ్ర॥ పాలెపు వేంకటసూర్యగోపాలప్రధానుల యాంధ్రానువాదము- సులభముగా ననువాదమునందలి మార్గము గనిపెట్టుటకై మొట్టమొదటఁ బ్రత్యంకమున మూలమునం గల శ్లోకముల నిచ్చియున్నారు. అనువాదము చాలస్వతంత్రముగ నున్నది. ప్రథమశ్లోకముఁజూడుఁడు:-

శ్లో. ధన్యా కేయం స్థితా తే శిరసి శశికలా కిం ను నామైతదస్యా
నామైవాస్యా స్తదేత త్పరిచిత మపి తే విస్మృతం కస్య హేతోః
నారీం పృచ్ఛామి నేన్దుం కథయతు విజయా న ప్రమాణం యదీన్దు
ర్దేవ్యా నిహ్నోతు మిచ్ఛో రితి సురసరితం శాఠ్య మవ్యాద్విభోర్వః ॥

సీ. భవదుత్తమాంగంబుపయి నెక్కి ధన్యత వెలయు వీరెవరు జాబిల్లిగారు
వీరిపేరిదియొకో వీరిపే రిదియె కా యెఱిఁగినదానవు మఱచితేల
చందురుఁ గాదు నేసుందరి నడిగెద మఱిచందురుం డప్రమాణ మేని
యాబాల్యముగ భక్తి ననుసరించెడుచేటి విజయయే దేవికి విన్నవించు
నిట్టి వక్రోత్తరంబుల నిచ్చుచుండి, పర్వతతనూజనుండి దివ్యస్రవంతి
మఱుఁగువడఁజేయుటకును నెమ్మదిఁదలంచు, శివునిశాఠ్యం బుమిమ్ము రక్షించుఁగాక

దీనివెల అణాలు ౧౨. కవిగారియొద్ద అమలాపురములో దొరకును.

(7) వేమభూపాలవిజయము:—గ్రంథకర్త బ్ర॥ రావాడ వేంకటరామశాస్త్రిగారు. బళ్ళారి శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల, 5 వ పుష్పము.

అద్దంకిని రాజధానిగఁ జేసికొని కొండవీడుదుర్గమును బాలించిన ప్రోలయవేమభూపాలునియన్న యగు మాచమహీపాలునికిఁ బౌత్త్రుఁడును, పెదకోమటి భూపతికిఁ బుత్త్రుఁడును నగు పెదకోమటి వేమభూపాలుఁ డీకావ్యమునకు నాయకుఁడు, అభినవభట్టబాణుఁడు రచించిన వేమభూపాలచరిత మను గీర్వాణగద్యకావ్యమును బట్టి శ్రీమాన్ ఆర్. వి. కృష్ణమాచార్యులుగా రాంధ్రమున వచనముగ సంగ్రహించివ్రాసిన దాని కిది పద్యరూపగ్రంథము. మూఁడుల్లాసములు, సుమారు రెండువందలపద్యములు, కవనముమృదుమధురముగనున్నది.

గీ. లలితకళలక్కిక్క లావణ్యశేవధి, శాంతిసీమ తావు సత్యమునకు
దయకుఁ బుట్టినిల్లు తగినమారటపుట్టు, వలయరుంధతిసతికనఁగఁజాలి. 2-3

క. నృపతిదయాంచితమతియై, వ్యపగతభీతులను జేసి వారల నెల్లన్
స్వపదముల నుండఁబనిచెను, విపులకృపయతోడవుగా దెవీరవరులకున్. 2-47

మూల్యము 0-6.0. బళ్ళారిలో దొరకును.

చ. సురపతి గొన్నయశ్వమునుఁ జూడఁదలంచి మదీయబంధువుల్
ధరణిని ద్రవ్వి సాగరముఁ దారు ప్రతిష్ఠ యొనర్చి రిప్డు సా
గర మిట గుప్తపక్షముల గ్రావముల న్నినుఁగూడఁ బంచినన్
సరసుఁడ ద్రోసివేయకు ప్రశస్తసపర్యను శ్రాంతిలేమినిన్. ౫౭

శా. మైనాకంబున నున్నపద్మసరసిన్ మార్గశ్రమం బేగ నా
సీనుండై మకరందధారలను బ్రాశింపన్ బలంబొంది నీ
వానీరాకరశేషముం జన సువేలాద్రిం గనుంగొందువౌ
పానీయాహతిమార్దవాన్వితశిలాప్రాచుర్యసత్స్థాలమున్. ౫౮

ఉ. ఏగిరిపజ్జ నీటఁ బడు నీ ప్రతిబింబమె చంద్రునట్లుగా
బాగగు ముత్తెముల్ వెలుఁగుభంబులుగా సురుచిప్రవాళముల్
ప్రేగగు తెక్కలం దనుమ వెల్వడు రక్తపుఁబ్రోవులుంగ భూ
భాగమునందుఁ బశ్చిమపుభాగపుసంధ్య దనర్చుచుండెడిన్. ౫౯

శా. ఏయద్రిం గలకాననం బుదధిబంహిష్ఠోర్మిసంక్రామితా
మేయప్రాథవరత్నవిద్రుమములన్ మేల్పల్లవాఢ్యంబుదై
తేయార్తిన్ సుర లొప్పఁదెచ్చి యటఁ బాఁతింపంగ మందారముల్
బూయుం బుష్పమరందవాసనల నెప్డుం గ్రాలు నాగోత్రమే. ౬౦

మ. మహితం బౌపులినంబునం జెలఁగు శ్రీమద్రాజహంసింబలెన్
మహి లంకాపురి శ్వేతసౌధసితసమ్మానంబునం గాంచె దా
బహువాతోచ్చలదుత్పతాకకర యేవాల్గంటి నిన్నుంగనన్
బహుమానించెడునట్లు నిల్చు నెదుటన్ భవ్యప్రణాదంబులన్. ౬౧

శ్రీరస్తు.

హంససందేశము.

ద్వితీయాశ్వాసము.

ఉ. ఆకృతిసుందరుల్ శుభవిహారులు చారురవుల్ నశింజలుల్
స్వీకృతశుద్ధగాత్రు సితవేషలు సన్నయనుల్ సుదృష్టులుం
ప్రాకృతవాక్య సన్మధురవాక్యలు మానసగు స్మనోజ్ఞలుల్
ఏకడ దేవభామలు రహిం జెలఁగింతురు నిన్ను సామ్యతన్. ౧
శా. శాపం బిచ్చినఁ జత్తునన్న వెఱచే శాలానిబద్ధాత్మలం
గోపానన్ దనుజుం డొనర్పఁగ లతాంగుల్ నిప్పుఁగాల్పంగ దా
మోపంగాఁ దగువారలయ్యు సితవర్ణోత్పృష్టలై భూసుతా
కోపంబే తమరక్షఁగాఁగ నెటనెక్కొంద్రో దివౌకస్సతుల్. ౨
చ. మణిమయతుంగశృంగముల మాంసలమైన సువేల మొంది స
ద్గుణ, సురవర్యులందెగడు కోణపనాథుఁడు ప్రోవ నేపురీ
మణి కనకాద్రిపైఁ గలయ మర్త్యపురిం బిలువంగఁ గేతన
ప్రణుతకరాగ్రభావముల ప్రాల్చెననం దగు మండనస్థితిన్. 3
ఉ. వానలువో భవద్విహృతి వైభవయుక్త శరత్తునందు నె
చ్చో నిశ గర్వభావమునఁ జూపిననవ్వ లనంగఁ జంద్రికల్
మానసముల్ హరింప సురమానిను లోడ్చినయశ్రు లెచ్చఁగా
నూని శశాంకకాంతములనుండి జలంబులు పాఱుచుండెడిన్. ౪
శా. సీతాశోకహుతాశనప్రభలచే శ్రీవాతపుత్రామితో
ద్భూతంబైనమహాగ్నిచే భసితమై పోల్పెదు నాలంక నా
దైతేయాధిపభీతి నిశ్చితమతిన్ దైత్యేంద్రతక్షోత్తముల్
స్ఫీతంబై యలరన్ సృజింతురు పురాసృష్టిన్ హసింపం గడున్. ౫
శా. ఆలంకాపురిమధ్యభాగమున దేవారాతిసద్మంబు నా
నాలంకారయుతంబుఁ గాంచి ముదము న్నాకామరద్వంద్వముం
గూలంగ్రుక్కిన వ్యోమయానముల త్రొక్కుళ్లందు కారాలయం
బాలోకించి దురంతదుఃఖమును నాహా కాంతు వాక్రుమ్మడిన్. ౬
చ. కనుబొమమోడ్పుచేఁ గదలు, గాలిని దేజన సీతభానుఁ డో
యనఁదగు భానునిం గలిగి యన్నిబుతు ల్వలయంగ న్కొటన్

జనకజశోకవహ్ని కనుజత్వమునొందు నశోకము ల్వెలుం
గ ననిలజప్రచారమునఁ గందిననిష్ఠురముల్ భజింపుమా. ౭

ఉ. ఆతరువాటి నాకసమునందు ముదంబున నున్నయండజ
వ్రాతముతోడ మండలము వాఱుచు నట్టిటుఁ గాంచిన న్మహీ
జాతకు దుర్దశ న్నఖ మొసంగెడి బంధువు స్తంబసక్తభూ
పాతతి శింశుపాతరువుఁ జయ్యనఁ గాంచెను సౌమ్య యచ్చటన్. ౮

మ. చెలికాఁడా, తరుమూలమందు సవనక్షేత్రంబునంబుట్టి యే
స్థలమం దున్నను హ్రాసహీన మగుచున్ సామర్థ్యసంపత్తిచే
నలకాలంబున వీర్యశుల్కమున స్వాయత్తంబు నైయొప్పు ద్యో
తలరత్నంబు దినేశవంశగతరత్నం బప్పు దృశ్యంబగున్. ౯

శా. ఆమీనాక్షియు నానతభ్రువయు నాయత్యంతసత్కేశి యా
హేమస్వచ్ఛవరాంగి యాసుకుచభారేషన్నమత్తన్వి యా
భామారత్నము వేదిమధ్యయు భవత్ప్రాగల్భ్యసంచార నా
ప్రేమస్థానపుఁగన్నుఁ జక్కఁదనపు స్వీడేలు వేల్పుం బలెన్. ౧౦

మ. అతిమోహంబున బాధనొందుచునొ క్షేమాయత్తవార్తం బత
త్రతికిం జెప్పుచునో మదర్థముగ భద్రప్రాప్తి దవ్వంచు సం
తతముం దెల్పునిమిత్తము ల్గలుగ నేత్రవ్యాప్తబాష్పంబుతో
సతి యీదిక్కును జూచుచుండఁ గనొ హంసా నీకుకంటం బడున్. ౧౧

శా. భావింపంబడునో రఘూద్వహుని శుంభద్గాత్రసంస్పృష్టి లే
దో వాక్రువ్వఁగ భూషణవ్రజము నెంతోపల్కుచుం గాని యా
భావోద్భూతసుఖంబు మానసమున న్భావించుచుం గాని యం
దావర్తించును సీత కీదృశగతిన్ దైవంబె కల్గించెఁగా. ౧౨

ఉ. మాలనియింటఁ గాయుసుకుమారమనోహరకౌముదిం బలె
న్నీలవిషావనీజవన నీతసురద్రుమశాఖయుం బలెన్
బాలిశుసన్నిధి న్నుడువుపండితసత్కవిసూక్తియుంబలెన్
బాలను మైథిలిం దలఁతు బాధితఁగా నసురాలయంబునన్. ౧౩

శా. వానం గుందినపద్మినీలతవలెన్ వ్యర్థంపుఁబల్కుంబలెన్
హీనానేకపమైనధేనుకవలెన్ హీనార్థమాకీర్తినా
గానం బంకిలమౌమృణాల మన మేఘచ్ఛన్నచాంద్రింబలెన్
దానిర్లజ్జ ద్వితీయమార్గి హరినద్ధన్యంకువ ట్లొప్పెడిన్. ౧౪

చ. స్మరశరభీతిబోవ మును మామకదేహముఁ గౌఁగిలించుచే
వెరవని మెంచి భూషణముఁ బెట్టిన దస్సియు నంగరాగముం
జెరచెరఁ బూయ ఖేదమును జెందుచుఁ గష్టము సంస్మరింపదు
ర్భర మగునంగకంబుల ధరాజనయిత్రిని గౌఁగిలించెడిన్. ౧౫

చ. కరమున మాటిమాటికి నిగారపుటుంగర మస్మదీయమున్
ధరణము సేయఁగాఁ బులకితం బగునంగముఁ దాల్చి మానికం
బరయఁగ లేనియాఁదలను నంగజుకాఁకల వేఁగు సత్తుచో
పరితలమంచు నద్దికొని పల్మఱుఁ గన్నులు మోడ్చుచుండెడిన్ ౧౬

మ. అనసూయాసతి మాతృతుల్య మును పే. యత్యంతపుణ్యార్జితం
బనఁగా నొప్పిన దివ్యగంధమును దేహంబందుఁ బూసెన్ స్థిరం
బనుకూలంబుగ సీత కాయువతి ధారాకారనేత్రాంబువుల్
స్తనయుగ్మంబుపయిం బడం బిదప నాసాగంధ్యముం బాసెడిన్. ౧౭

శా. చేతిస్నించుట మున్ను జిక్కుఁగను నాచే బద్ధమా స్తచ
వ్రాతంబు న్సతిదేహగంధరతి నూర్ధ్వం బెత్త భూమిన్ రమా
సూతిం బూజయొనర్ప బంభరముల నోసంపారుచున్ దేవతా
వ్రాతప్రేషిత మైనమంజరివలెన్ భాసిల్లు వీక్షింపఁగాన్. ౧౮

ఉ. వానరు లద్రినుండి సజవంబునఁ దెచ్చిన యుత్తరీయపున్
జానున నొప్పుదాని నినుసంగతిఁ జేసిన హంసిరూపులం
బూనినదాని బాలరవిపొల్పున నొప్పినవస్త్రరాజముం
బూనిన సీత సంజయెఱుపుం గనుచంద్రుని లేఖఁ బోలెడిన్. ౧౯

మ. చనుమార్గంబును దెల్పనో యనఁ బదాబ్జాతంబునందుండి భూ
మిని గ్రస్తంబయి హంసరావ మగునామేల్దక్షిణోన్నూపురం
బునకుం దుల్యము నూరులం బదముఁ బెంపుంగూర్చి నాహస్తమం
దెనయం గూడెడి వామనూపురము నెంతేఁ జూచుఁ గొమ్మన్ వ్యర్థన్. ౨౦

ఉ. వాడినవృక్షపల్లవనిభంబులు నుజ్ఝితభూషణప్రసూ
నేడితముల్ ప్రతీకముల నెంతయు నొప్పి శరీరకాంతిలో
నీడలుగా లతల్బెరయ నెట్టనఁ గాఁకలఁ గించిదూనమై
పాడఱు సీత దానవనిబద్ధసునందనలక్ష్మికై వడిన్. ౨౧

ఉ. మానసబాహ్యవృత్తులను మాన్పఁగ నింద్రియసన్నిరోధముం
బూని మనీష నాపయిని బొందఁగఁజేసి యనన్యలభ్యమా
ధ్యానని రూఢి సంచలతనందని యోగము మన్మథాగమా
ధీనత నభ్యసించు నతితీవ్రత జానకి యంచు నెంచెదన్. ౨౨

ఉ. కాటుక లేనికన్నులు వికాసము లేని ముఖాంబుజంబు నా
రాటముసేయు శ్వాసము భరంబగుబాష్పము భర్తృసంగతిన్
గాటపుఁబల్వరింత గలుగ న్విధిచే నియమింపఁగాఁబడెన్
బోటి కృశాంగి నాచెలిమిఁబొందుటచే మదిఁ దత్తఱించెదన్. ౨౩

మ. అలసీతాసతి దుర్భరంబయిన దీనావస్థనుం గాంచి లో
న లలింబుట్టిన శోకవేగమును బూనన్శక్యమే నీకు నా
పలభుగ్జాతిని రావణుం బలెను దుర్భావంబుఁ గ్రైకోక ని
ర్మలధర్మంబునఁ గూడువారు దయతోఁ రాణింపకుంద్రే భువిన్. ౨౪

మ. నికటస్థం బగుదీర్ఘికన్ స్మిగులఁ బానీయంబులం ద్రావి నీ
సకలాయాసము పాయ నచ్చట నివాసంబుం దగంజేసి మా
మకవాక్యంబులఁ దెల్లవాఱ వినిపింపంజేయుచున్ రాత్రి నీ
వకలంకస్థితిఁ బుచ్చు రాక్షసులు నిద్రాసక్తులై యుండఁగాన్. ౨౫

శా. మార్గాయాసముఁ బాపుగంధవహముల్ మన్నించి పీవ న్నభో
మార్గంబందలి వెన్నెల ల్పులినసీమం గ్రాల నిద్రించుచున్
దార్గత్యస్థితపద్మకోరకమిళిందధ్వానముల్ లేఁగ నై
రర్గళ్యంబుగ మేలుకాంచి యటఁ గార్యంబు న్విచారింపుమా. ౨౬

చ. కదళెడిపల్లవంబులను గ్రాలెడిశింశుప నెక్కి సీతకు
న్ముదమలరంగఁ గంటఁబడి పుష్పధనుర్ధ్వని తీవ్ర మైననీ
రొద యుడుగంగఁ జేయసి నిరూఢతమోవృతచిత్త లేపుమా
మొదల రఘూద్వహున్ జనకభూపతివర్ణన నొప్పఁజేయుచున్. ౨౭

శా. వీరశ్రీవరులైన శూరులకు నుర్వీభ్యార్చ్చ తచ్ఛారదన్
స్వారావంబునఁ దెల్పుయుద్ధసమయం బంచేమహాహంసమో
యారాద్ధంసను నీపతిప్రియుఁడ దీర్ఘాయుస్సమేతుండు నీ
గారాబుంబతి క్షేమవార్త యనుపంగాఁ గాంత నేవచ్చితిన్. ౨౮

ఉ. నాకథఁ జెప్పు నిన్ను నిమినాథతనూజ ముఖాంబుజాతమున్
శోకయుతంబు నెత్తి గడుసుందనమేది మనోముదామృత

స్తోకము సాహచర్యమున శోభిలి రక్తములైన తమ్మిపూ
రేకుల మైత్రిచే వెలయుదృష్టులతోఁ గడుగారవించెడిన్. ౨౯

చ. దశరథుముద్దుఁగోడ లవదాతగుణంబున నొప్పు నిన్నుఁ గాం
చి శమితచిత్తయాచు సురుచిం గని శుక్లపుఁజంద్రలేఖనా
విశదముఖంబున న్వినఁగ వేడుకఁజెందెడి నాదువార్తల
న్వశగత కాంతవార్తయును భామలకు న్ముదమొప్పఁ గూర్పదే. ౩౦

ఉ. చెప్పుము యిట్టు లాపయి సజీవుఁడు నీదగుభాగ్యరేఖచే
నిప్పుడు కోసలేంద్రుఁడు వచించెను క్షేమము నిన్ను మంగళం
జెప్పను రార్యు లేపగిది చిహ్నముల న్నియతంబు శ్రేయమా
యొప్పెడిలక్షణంబుల మహోన్నతలక్ష్మివిగాను నీవిగాన్. ౩౧

శా. ఏరామామణిమండనక్రియయు మున్నెవ్వాని కాలస్యమై
భారంబయ్యెను దైవ మాయబల ద్వీపస్థాలయం జేయ నే
త్రారోపం బొనరించి దగ్గఱనె యున్నట్టు ల్విచారించునో
యారాముం డిటువల్లుచుండె సుఖియై యంబా మహాస్యంబునన్. ౩౨

మ. ఘనమైత్రీవివశత్వభావమును జక్కంబూని భోగింపఁగా
మనకాలింగనచుంబనాదికముల న్మార్జెన్ క్షణంబుం బలెన్
మునుపాశర్వరి యిప్పుడో మననసంభూతాధికక్రీడలన్
ఘనదీర్ఘంబయి క్షీణతం గనక యో కాంతామణీ క్రాలెడిన్. ౩౩

చ. స్తనకలశోత్థటోష్ణములఁ దద్దయు నిర్జితమై వియోగమం
దున నవకాశమొంది కడుదుండగ మప్పుడ పూనునట్టిదై
యనయము కుందవాసనల నన్నిదెసల్ సురళించునట్టిదై
యనిలము త్వన్ముఖాప్తమగు నబ్జముతో నను దీనుఁజేసెడిన్. ౩౪

ఉ. తేనెలఁగూడి ప్రోషితలతిండిఁ జెలంగి యమోఘవర్తనం
బూను మనోజబాణముల నొప్పఁగ దిక్కుల నావరింపఁగాఁ
బూను వసంతు సీతకడఁ బోకుమటంచు వచించె రాముఁ డెం
తో నతిఁగన్న మూర్ధమున నొత్తుభయంబునఁ ద్యక్తచాపుఁడై. ౩౫

మ. కెలనం బర్విడుకోకిలారవములం గీపెట్టు శబ్దంబుతో
నలకవ్వంపుమలం బొకాలి మెయిపై హత్తించి మల్లీసుమం
బులధూళిన్ భ్రమరంపుసంకెలలతోఁ బొల్పారునా తెమ్మెరల్
మలయన్ లక్ష్మణుఁ డార్తుఁడై తిరుగ నన్నాన్చె న్నభస్స్వత్స్మృతీ. ౩౬

మ. అతివా ? నీకడ మంజులప్రసవ ముద్యద్దీప్తి నొప్పం గరం
జతరుల్ లాజమనోహర ప్రసవముల్ సల్లంగ నీపెండ్లి దా
వితముం దోఁచిన మందబుద్ధినగు నేఁ బృథ్వీశు నేమందు నా
క్షితిపుం డేమను నంచు ఖేదము మనస్సీనుం జనింపింప వే. ౩౭

శా. గాలిన్ రాలినయద్రి మల్లికల సద్గంధావృతం బైన యా
శైలాగ్రంబున దైత్యభీతితొలఁగన్ జాయాసమాశ్లిష్టమై
మేలుంగన్న మయూర మాచపలయ న్మేల్కోణము న్రాయ గ
ర్జాలోలుండగు మేఘుచే నటనమారంభించు హృద్యంబదే. ౩౮

చ. అచలగుహాంతరధ్వనులె యాత్తరవంబుగఁ దాపసంగతిం
బ్రచలితమైన నీజనని బాష్పసమేత నొనర్చి నీటుచేఁ
బ్రచురసుమేషుతాపమున బాధితు నన్గని మేఘపంక్తులాఁ
గిచదలఁ జేయురోదన మొగిం గడునబ్బురమై ప్రవర్తిలున్. ౩౯

మ. తనుసంస్పర్శము వాయువందు శశిపై త్వద్దృష్టి సంస్పృష్టి భూ
మిని నేకాలయవాస మీజగతిపై మేలాక్రశయ్యాస్థితిన్
మినుకుం జుక్కలనొప్పు నాకసమునన్ మేల్చట్టుధర్మంబు నేఁ
గనుచున్ దుర్విధిచేత దవ్వయిన ని న్గాంతా సమీపించితిన్. ౪౦

శా. నీనేత్రంబులచెల్మిఁ గాంచి జలజానీకంబు సంఫుల్లమై
జానుం గూర్పఁగఁ గాలయోగ్య మగుసత్సన్నాహముం గూర్చుచు
న్నేనలోఁదగుత్రోవఁ జూపుచు శరచ్ఛ్రీ నన్ను శుభ్రాశయై
యోనాతీ పురికొల్పుచున్నది భవద్వ్యక్తస్థలిం జేరఁగన్. ౪౧

శా. తాతాదేశముచే స్వసోదరునిపైఁ దద్రాజ్యమర్పించి నేఁ
బూతారణ్యముఁ జేర నే సతి పురంబుం బాసి నన్జేరె నా
స్ఫీతోరస్థలిఁ బవ్వళించి స్వభుజాశ్లేషంబునంగ్రాలు నా
సీతన్నిన్నుఁ ద్యజించి దూరమున నాజీవంబు దుఃఖించెడిన్. ౪౨

మ. జలధిన్ బర్వతపంక్తితో నా విశిఖాసారంబుతో నేన్ ఘటిం
చిలలిన్ సేతువుదాఁటి వానరులు విచ్ఛేదింప లంక న్నుమం
బులయ ట్లల్పదినంబులన్ దనుజులం బోకార్చుచున్ లక్ష్మణుం
డెలనాఁగా కడునించు నీచెవులలో నింపౌధనుర్ఘోషమున్. ౪౩

ఉ. రావణుమాళిమంజరుల రాల్పఁగఁ దద్గత వైరబంధముం
బోవఁగ నాకసంబునను బోయెడిపుష్పకమెక్కి భూమికి

న్నీవును నేను బోయి యట నిర్మలమానికృతాభిషేకమున్
దేవి వహించి మున్ను మదినించినకోర్కులఁ దీర్చికొందమో. ౪౪

మ. ఖరునిం ద్రొట్టి సమస్తరాక్షసుల లంకానాథసంకాశులం
దరలం జేసి జయంబు గైకొని జనస్థానంబు నేవీడి రా
వరశస్త్రక్షతముల్ భవత్కుచయుగవ్యాప్తోష్మమునోఁక సా
దరసంశ్లేష మొనర్చి కప్పితివి కాంతా ? దాని లోనెంచుమా. ౪౫

చ. మును శచి పడ్డపాటుల నపూర్వములం దలపోసి శూలపా
ణిని నెడఁబాసి దుఃఖముల నివ్వెఱపడ్డ గిరీంద్రపుత్రికన్
మనమున నెంచి దేహము శమంబునఁ బ్రోవు మదీయజీవితం
బునకును భర్తకై వ్యసనముం గను టాండ్రకు శ్లాఘ్యమే కదా? ౪౬

మ. సహజస్నేహము గల్గుబంధుఁడవు నీసాహాయ్యంబు మత్కార్యముం
బ్రహరింపందగు సల్లొనర్పక ఫలవ్యాసక్తమై యొప్పెడిన్
సుహృదుం డైనన లేంద్రువార్తఁ గనియు న్సూరుల్ ఫలోపేతఁగా
బహుశుద్ధాత్ముల కార్తరక్షణమె భవ్యంబౌ వ్రతం బం డ్రిలన్. ౪౭

చ. జనకతనూజ నిప్పగిదిఁ జల్లనిపల్కుల జీవయుక్తఁగా
నొనరిచి భానువంశజుల యొప్పగు స్నేహము వృద్ధిసేయుచున్
వనజనివాసినిం గలిసి వర్తిలు విష్ణునిమ్రాడ్కి లోకముల్
పనివడి సంచరింపు మనవద్యమరాళినిఁగూడి సౌమ్యుఁడా. ౪౮

ఉ. వాచిక మిట్టులంపి రఘువంశజుఁ డబ్ధినిఁగట్టి తత్స్మృతిన్
గోచరమైనలంకఁగని కోఁతులతో దశకంఠుఁ గూల్చి సీ
తాచపలాక్షిఁగూడి స్వగతంబుగఁ జేయుచుఁ బాదుకాప్రభు
త్వోచితరాజ్యలక్ష్మిని నయోధ్య సనాథను జేసె వేడ్కతో. ౪౯

ఉ. విద్దెలశిల్పి నాఁబరఁగు వేంకటసత్త్వవిచేతఁ గ్లిష్టమై
పెద్దయు శ్రేయమిచ్చునది వింతవిచారపుసానరాపిడిన్
గ్రద్దన వెల్గురామునుడిరత్నము హంస మహీజమిత్రముం
బెద్దలు జ్ఞాననేత్రమును విచ్చి చెవిం బరికింత్రుగావుతన్. ౫౦

సంపూర్ణము.

ప్రార్థన.

శా. శ్రీరాముండు మనోజ్ఞవేషుఁడు బుధాశీర్వాదపాత్రుండు దు
ర్వారామేయపరాక్రముండు వినుతవ్యాపారుఁ డంభోధిగం
భీరుం డార్తజనావనవ్రతుఁడు పృథ్వీనాథరత్నంబు సం
సారాంభోనిధిపోత మెల్లపుడు మోక్షంబిచ్చి మమ్మేలుతన్. ౧

మ. ఉరుకౌండిన్యసగోత్రసంభవునిఁ గల్లూర్యన్వయాబ్ధిక్షపా
కరునిన్ వాదవినిర్జితాఖిలబుధున్ గంగాధరాభ్యర్చనా
భరణున్ శిష్యవితీర్ణసత్ఫలుని దుర్వారాంధ్రగీర్వాణవా
గ్ధురునిన్ వేంకటరామశాస్త్రిగురు హృత్స్థానంబునందుంచెదన్. ౨

సీ. కరము గుప్తార్థప్రకాశిక యొనరించి సూరిసూరిత్వంబుఁ జూపె జగతిఁ
బత్రికావాద మొప్పఁగఁ జేసి పండిత దిగ్వారణంబులఁ దెరలఁజేసె
నవ్యభాషాస్థపదాళి కర్థముసెప్పి వైయాకరణతను బాదుకొల్పె
బహుపూర్వవిశ్రుతభవపత్రములఁ దెల్పి తనకున్న మేధావితనముఁ జూపె,
ఆంధ్రసారస్వతపుసభయందు వెలయు,మహదుపాధ్యాయబిరుదసమ్మానమందె
నతులగౌరవభాజనమై జగమునఁ,గ్రాలెఁ గల్లూరి వేంకటరామశాస్త్రి. 3

సీ. ఆయన కడనేను నమరభాషాభ్యాసమొనరించుటకుఁ బోకమునుపె యతఁడు
తెలిఁగించె మేఘసందేశంబు గవులన దానికీడగునట్టిదాని రుచుల
హంససందేశంబు నాంధ్రీకరించుచుఁ బద్యంబులను నన్ను వ్రాయుమనియె
నిరువదితొమ్మిది విరచించి పద్యముల్ మానెను గారణం బేనెఱుంగ
నంత గురుఁడ స్తమింపఁదదాత్మజుండు,రామచంద్రుండు గైకొని గ్రంథసమితి
వచ్చినాకిచ్చియిట్లువాక్రుచ్చెనీదు,గురుకృతగ్రంథ శేషంబుగూర్చుమనుచు. ౪

చ. అనినఁ దదాజ్ఞ మద్గురునియాజ్ఞగ నెంచుచుఁ దత్కృతంబుగాఁ
బొనరిచి పొత్తమంతయును బూర్తి యొనర్చితి గాని తద్రసం
బును బదసౌష్ఠవంబుఁ బలువుందన మిందు లభింపఁగల్గునే
ప్రణుతసరోజమూషమును వ్రాసిన సౌరభ మెట్టు లబ్బెడిన్. ౫

సీ. పశ్చిమగౌతమీభాగంబునందున్న నిడదవోల్గ్రామంబునికటమునను
భాసిల్లుచుండిన పాఁవనగూడెంబు గాఁపురంబుగనున్న భూసురుండ

శుక్లయజుర్వేదశోభితచిత్తుండఁ గౌండిన్యమునిగోత్రమండితుండఁ
గోడూరి యచ్చన్నకును వేంకమాంబకుఁ బుత్త్రద్వితీయుండ భూరియశుఁడు
పల్లయార్యుండు గణపతి భ్రాతలుగను, బుట్టినాఁడను దక్షిణామూర్తిశాస్త్రి
యనెడివాఁడను బాండిత్యమల్పమైనఁ, దెలుఁగుఁ జేసితిహంససందేశమభవ ౬

క. గురుకృతపరిశిష్టంబును, గురుతనుజనియోగమునను గూర్చితి దీనిం
గరుణించి విలోకింపఁగ, గురుకవిబుధపుంగవులను గోరెద నతితోన్. ౭

క. కానబుధోత్తములారా?, దీనం గలదోషములను దిగవిడిచి గుణా
ధానముఁగావింపుం డని, నే నతులొనరించువాఁడ నిరతము మీకున్. ౮

బుధవిధేయుఁడు,
కోడూరి దక్షిణామూర్తిశాస్త్రి.

శ్రీవేదాంతదేశికులు.

ఈ హంససందేశకావ్యమును రచియించినకవి శ్రీ వేదాంతదేశికులు. ఈయనకే వేంకటనాథుఁ డనియుఁ బేరు. శ్రీమద్రామానుజాచార్యుల యనంతరము సంస్కృతమునందును, తమిళమునందును బెక్కు గ్రంథముల రచియించి విశిష్టాద్వైతమతమును బోషించెను. కేవలము మతగ్రంథములే గాక కావ్యాదుల రచియించుటచే నీతఁడు సర్వతంత్రస్వతంత్ర, కవితార్కికసింహేత్యాది పెక్కు బిరుదనామముల వహించెను. చరిత్రకారులీతనికాలము, క్రీస్తుశకము, **1268-1369** యని నిర్ణయించియున్నారు. అందుచే విద్యానాథాదులకు సమకాలికుఁ డని మనమూహింపవలసియున్నది. మఱియు రసార్ణవసుధాకరకర్తయు వేంకటగిరిసంస్థానాధీశుఁడు నగుసర్వజ్ఞసింగమనాయకుని తాతయగు సింగభూపునికొఱకు సుభాషితనీవి యను నీతిగ్రంథమును, తత్త్వసందేశము మున్నగు వేదాంతగ్రంథములను రచియించె నని యైతిహ్యము కలదు. ఈతనిగ్రంథములు సుమారు నూటయిరువది గలవు. అందు ముఖ్యము లయినవి యాదవాభ్యుదయ, హంససందేశకావ్యములు, సంకల్పసూర్యోదయ మను నాటకము, సుభాషితనీవియను నీతిగ్రంథము, దశావతారస్తోత్రము, పాదుకాసహస్రము, హయగ్రీవస్తోత్రము, దయాశతకము మున్నగుస్తోత్రములు, శిల్పార్థసారము, భూగోళనిర్ణయము, మున్నగు శాస్త్రగ్రంథములు, సేశ్వరమీమాంసా మీమాంసాపాదుక మొదలగు మీమాంసాగ్రంథములు, గీతాతాత్పర్యచంద్రిక, రహస్యరక్ష, శతదూషణి మున్నగువేదాంతగ్రంథములు. వీనిలో మహాకవి కాళిదాసు రచియించినమేఘసందేశము ననుసరించి హంససందేశకావ్యమును, కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయము ననుసరించి సంకల్పసూర్యోదయమును వ్రాయఁబడినవి. జగద్విఖ్యాతయశస్కుఁ డగు అప్పయదీక్షితులు యాదవాభ్యుదయమును బ్రశంసించి వ్యాఖ్యాన మొనర్చియున్నారు.

పాఠకమహాశయులారా !

ఈసంచికతో ఆంగీరసనామ సంవత్సరము ముగిసినది. ఇరువది రెండవ సంపుటము శ్రీముఖతోఁ బ్రారంభించుచున్నది. దయతోఁ దమరు తమ రీయవలసిన చందాలను వెంటనే పంపఁగోరుచున్నారము. ఇదివఱకుఁ జందాలిచ్చివేసినవారు శ్రీముఖసంవత్సరమునకై పంపఁగోరెదము. అందఱు గ్రాహకులును శ్రీముఖ ప్రారంభమున కొక్కొక్క సంవత్సరము చందా పంపి శ్రీముఖను సార్థకపఱుపఁ గోరుచున్నారము.

ప. అ.

శ్రీరస్తు.

ఆర్తరక్షామణి.

వడ్డాది సుబ్బారాయఁడుగారు-రాజమహేంద్రము.

శా. శ్రీసీతాజలజేక్షణాహృదయరాజీవస్ఫురద్ద్యోమణీ!
కౌసల్యోదరశుక్తిమౌక్తికమణీ! కల్యాణచింతామణీ!
వ్యాసాదిస్తుతిపాత్రపాలకమణీ! వాల్మీకిసత్కృత్యుప
న్యాసాకల్పమణీ! తమస్తరణి! రామా! యార్తరక్షామణీ. ౧

మ. అవివంశంబున భారతక్షితి నయోధ్యన్ మర్త్యతన్ ద్రేత ను
ద్భవమై, పంక్తిరథుండు తండ్రిగఁ దత్కౌసల్య తల్లింగ గా
రవమారంగఁ బెరింగి, సీత సతిగా రాజై, చిరం బేలి తీ
వవనిన్, భక్తి భజింపనేఁడుఁ బ్రజ; రామా! యార్తరక్షామణీ. ౨

మ. జనసందోహ మయూపుఁ గన్గొన నదక్షుంబౌచు విశ్వంభరుం
డనువొందం దను భక్తిఁగొల్చి ప్రజ నైకాపత్తరంబుం దరిం
పను సంసారము ధారిణిన్ వెలసె భాస్వద్వంశరాణ్మౌళివై
యనుచుం బ్రార్యులు; నీవ తత్ప్రభువు; రామా! యార్తరక్షామణీ. 3

శా. శ్రీనాథుం డని, చిన్మయుం డని, ఋషిశ్రేష్ఠుల్ ప్రశంసించి రే
లా నిన్నొక్కని? సూర్యచంద్రకులజుల్ లాఁతుల్ నృపుల్ లేరె? యం
దేనింగాని తలంచిరే యటు? మహోత్కృష్టక్రియల్ సల్పరే
యానాఁ డాప్రభు? లీవు శ్రీహరివె; రామా! యార్తరక్షామణీ. ౪

మ. బిరుదుం బొందెను దారకం బనుచు నీపే; రద్రిరాట్కన్యకీ
శ్వరుఁ డద్దాని మహాప్రభావ ముపదేశం బిచ్చుఁ గాశీపురిన్
మరణంబప్పుడు ద్రిప్పు దేహి కుడికర్ణం బందుఁ దద్వర్ణముల్
హరుఁ డూఁదుం; బరమాత్మ వీవరయ; రామా! యార్తరక్షామణీ. ౫

మ. తనయుల్ సల్పినతప్పు లెప్పగిది విన్ దండ్రుల్ దయన్ దిద్దుకొం
డ్రనిశంబున్ క్షమియించి; నీవ గుఱి యిం; దారావణబ్రహ్మకున్
వనజాతాసనుఁ డిడ్డ చెడ్డవరముల్ పాటించి, లోకంబు లో
మ నరుండైతి, వికుంఠధాముఁడవు; రామా! యార్తరక్షామణీ. ౬

మ. నరు లాహారమె కాన వారివలనన్ నాశంబు రాదన్నతిన్
వరవారంబున వారి రావణుఁడు చేర్పండయ్యె; వాదించినన్
నరులే కావున, నల్లె వానరుల; దానన్, దత్సురుల్ వానరుల్,
హరివీవౌట ఘటిల్లెఁ దద్వధకు; రామా! యార్తరక్షామణీ. ౭

మ. భువనక్షోభము రావణాదిదనుజుల్ పూర్వంబు గావించి; ర
ట్లప్పుటన్ వారల దూషణంబుఁ బొనరిం; త్రేఁగాని, నీయట్టి సా
ధ్వవనుం డౌనవతారమూర్తి భువియం దావిర్భవింపంగతం
బవుటన్, వారలకొప్పు భూషణము; రామా! యార్తరక్షామణీ. ౮

మ. అవతారంబులఁ దర్జనీప్రభృతులౌ హస్తాంగుళంబుల్ బలెన్
హవణిల్లున్ వరుసన్ మనోహరపురామాభిఖ్య మూఁడున్నతిన్;
మిపులన్ మూఁడిట మధ్యమంబు వలెనే మించున్ ద్వదీయంబు హా
ర్యవతారంబు, మహోత్తమం బగుచు; రామా! యార్తరక్షామణీ. ౯

మ. కాంతారాంతరవాసులౌ ఋషులు స్వర్గస్థాదు లస్వప్ను ల
శ్రాంతంబున్ బహుభంగులం దమకు దుష్టవ్యాదసంతాన మ
త్యంతంబున్ బొనరించుబాధ లుడుపం బ్రార్థింప, మర్త్యుండవై;
తం తేగాని, నిజానకున్ హరివి; రామా! యార్తరక్షామణీ. ౧౦

మ. సీతన్ సృష్టికి మూలమౌ ప్రకృతిగాఁ, జిత్సత్సుఖాత్మున్ బరం
జ్యోతింగా నినునెంచి, జ్ఞాననిధులౌ యోగుల్, దశాస్యాదిదు
ర్దైతేయోద్ధతులం బొకార్చి, బుధబాధం బాపఁ, బృథ్విన్ నరుం
డైతం, ద్రాత్మనెఱింగి నీమహిమ; రామా! యార్తరక్షామణీ. ౧౧

శా. నీవాపుట్టినచైత్రశుద్ధనవమిన్, సీతాంబకల్యాణమున్
గావిం త్రెల్లరు భారతక్షితిఁ, బురగ్రామంబులం బల్లెలన్;
భావింపన్ నిను, నుంత్రు బిడ్డలకు నీనామంబుఁ బ్రేమించి; భ
క్త్యావేశావహదైవరత్నమవు; రామా! యార్తరక్షామణీ. ౧౨

మ. స్త్రీలోకంబున కొజ్జబంతియగదా సీతాచరిత్రం; బటే
బాలప్రాయమునుండి పూరుషులకుం ద్వత్పూతచారిత్రమున్;
భూలోకంబు తరింపఁ, బుట్టితిరి నీవున్ నీకళత్రంబు; మీ
రా లక్ష్మీకమలేక్షణుల్ నిజము; రామా! యార్తరక్షామణీ. ౧౩

మ. తమకే నన్యులకేని, కష్టములు ప్రాప్తంబౌతఱిన్, గ్రూరకృ
త్యము నేఁ, బాపపుఁగర్మమేని కనిన న్దాలించినన్, మహా
యమబాధం బశుప్రాణిఁగన్నపుడు, నైకాపత్తులన్, నీదునా
మమె కా మానవు లుచ్చరించెదరు; రామా! యార్తరక్షామణీ. ౧౪

మ. హృదయస్థం బగు సర్వకల్మషము పై కేఁగంగ నాద్యక్షరం
బు దెలిన్ మున్ దలవాకిటిన్, సరగునన్ మాయున్ ద్వితీయంబు లో
నది పెండిం జొరకుండఁ; దారకమునా నాఖ్యం ద్వదీయంబునే
నదియే కారణ మంచు నెంచెదను; రామా! యార్తరక్షామణీ. ౧౫

మ. కలుషప్రాయపుజీవనంబును ద్రుటిం గావించెదున్ స్వచ్ఛమున్
దలఁపం గాఁ గతకంబువోలెను భవన్నామంబు భవ్యంబు; మ
ర్త్యులకున్ మన్గడ నక్కటా సకలమున్ దోర్ద్రోల్తఁ గల్పించితీ;
వలసుల్ కానరు దాని వాడుకొన; రామా! యార్తరక్షామణీ. ౧౬

శా. మీవంశంబున కాద్యుఁడౌరవి, పవల్ మింటం గనన్ వచ్చుచున్
గావించుం దనవేయిచేతులను సంతానంబు లోకాళి; కిం
కీవో, గానఁగ రాకయుం, బగలు రేయిన్ ధాత్రిఁ జంద్రాంకితం
బై వెల్గొందెడు పేరఁ, గూర్తెలమి; రామా! యార్తరక్షామణీ. ౧౭

శా. మాలల్, మాదిగ బోయవాండ్రు మొదలౌ మర్త్యాధమవ్రాతముల్
మైలంబాసి తరింప వేఱుగలదే మార్గంబు? నీనామమే
మేలౌమంత్రము వాండ్ర; కిందు గుఱి వాల్మీకుండె; హేమంబుగా
దా లోహంబును స్పర్శవేధి? రఘురామా! యార్తరక్షామణీ. ౧౮

మ. తలక్రిందైనను మంచివిత్తు, ఫలవంతంబైన నేలన్ మహా
ఫలమీఁజాలు; "మరామరా" యనుచు నవ్వాల్మీకి, నీనామమున్
దలపైఁ బుట్టలు వెట్టునట్టు జపముం దాఁజల్పి, కల్పించెఁ గా
వ్యలలామంబు భవచ్చరిత్రమును; రామా! యార్తరక్షామణీ. ౧౯

మ. అమరించెం గవి వేయికొక్కటిగ గాయత్రీమహామంత్రరా
జము వర్ణంబులు; నాలుగిర్వదిసహస్రంబుల్ ఋషిప్రోక్తముల్
విమలత్వచ్చరితంపు శ్లోకములు; తద్విఖ్యాత సత్కావ్యమా
ద్యము చాటున్ జగతిన్ భవన్మహిమ; రామా! యార్తరక్షామణీ. ౨౦

మ. చెదపుర్వుల్ మెయిఁ బుట్టవెట్టఁ దపముల్ సిద్ధింపఁగావించి, శా
రద నాల్కన్నిల, నూఁద నారదుఁడు కర్ణంబందు, వాల్మీకి, బ్ర
హ్మాదయుల్ సర్వమెఱింగి, నీచరితఁ గావ్యంబల్లి తా మోక్షసం
పదఁ జూఱాడె; మనుష్యమాత్రుఁడవె; రామా! యార్తరక్షామణీ. ౨౧

శా. *నీవత్త్రోల్లవి కర్థమే నవనియేనిం దానముం జేసి యుం
దో, విష్ణుం డనిపించుకో ననినఁ, దద్యోగీంద్రుఁ డాద్యం గృతిన్
గావింపండు భవద్భవంబునకు వెన్నల్; జ్ఞాననేత్రంబునం
భావిం గాంచి రచించె నందు రది; రామా! యార్తరక్షామణీ. ౨౨

శా. కౌపీనంబును నారగట్టఁ, గసురుల్ గాయల్ దినన్ బందుకోఁ
జాఁపల్ పూరిని, యుండ నాకు గుడిసెల్; సన్యాసి కొండేల? మో
క్షాపేక్షన్ రచియించెఁ ద్వచ్చరితఁ గావ్యం బాడి వాల్మీకి, ని
న్నాపద్మాపతిఁగా నెఱింగి మది; రామా! యార్తరక్షామణీ. ౨౩

మ. కవులందుం గనుపట్టుఁ గొందఱయెడం గక్కుర్తి; వారల్ ప్రశం
సవిశేషంబుగ మర్త్యనర్వాతకు మించన్ జేయుచుం; ద్రుందునన్
రవకున్ రాతికి భేదమేమిఁ దెలియన్ రామిన్, మహర్షీడ్యకా
వ్యవిభుల్ నిన్ నరుఁడందు రొక్కొక్కరు; రామా! యార్తరక్షామణీ. ౨౪

మ. మునినిన్ శ్రీశుఁగఁ గాంచి, నీదుచరితంబుం బల్కె వాల్మీకి మున్;
గనె సీతం గపి కంధిదాఁటి చులుకం గైఁదాల్చి నీముద్రికన్
మనుజుం డుల్లమునందు నిన్నిడి తరింపంగాంచి సంసార, మొ
య్యన ముక్తింగను నిశ్చయంబుగను; రామా! యార్తరక్షామణీ. ౨౫

* నీవత్త్రోల్లవి కర్థమే నవనిరోసిన్ దానముం జేసియుం
దో విష్ణుండనిపించుకో ననినఁ, గన్గొంకే నినున్, దత్కృతిన్
గావించెం గథ దెల్పనారదుఁడు, ప్రజ్ఞన్ బ్రహ్మయీఁగా, నతం
డావాగ్దేవి వసింప నాల్కకొన; రామా! యార్తరక్షామణీ.